
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 181
శనివారం 16-3-2024
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగుపడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'


భళా బెంగళూరు..
డబ్ల్యూపీఎల్‌లో టైటిల్ పోరుకు అర్హత.. ఎలిమినేటర్‌లో ముంబైపై గెలుపు -13లో


కొత్త ఈవీ పాలసీ
ఆమోదించిన కేంద్రం.. కనీస పెట్టుబడి విలువ రూ.4,150 కోట్లు - 13లో


పూర్తి వివరాలు ఎందుకివ్వలేదు?
ఎలక్టోరల్ బాండ్ల పూర్తి సమాచారం ఎన్నికల సంఘానికి ఎందుకు ఇవ్వలేదని ఎస్‌బీఐపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.
వివరాలు 6లో ▸


యడియూరప్పపై పోక్సో కేసు
బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై కర్ణాటక మాజీ సీఎం బీఎస్ యడియూరప్పపై పోక్సో కేసు నమోదైంది.
వివరాలు 6లో ▸


స్టే విధించలేం
ఇద్దరు నూతన ఈసీల నియామకంపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొంది.
వివరాలు 6లో ▸


హైదరాబాద్‌లో మోదీ రోడ్‌షో
హైదరాబాద్‌లోని మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ప్రధాని మోదీ శుక్రవారం రోడ్‌షో నిర్వహించారు.
వివరాలు 5లో ▸

మళ్లీ అవే ఫేక్ సర్వేలు.. పాత జిత్తులతో వచ్చాడు

జాదూగాడు

జాతీయ మీడియాలో మేనేజ్ చేసిన సంస్థలతో చంద్రబాబు ఫేక్ సర్వేలు

జెండా సభకు జనం ముఖం చాటేయడం, కేసుల భయంతో బెంబేలు

- మొన్న సీ-ఓటర్.. నేడు న్యూస్-18 పేరుతో నకిలీ సర్వేలు
- మూడు పార్టీలూ పొత్తు పెట్టుకున్న మూడో రోజే ప్రజాభిప్రాయం మారుతుందా?
- ఆదరాబాదరాగా విడుదలైన సర్వేలపై రాజకీయ విశ్లేషకుల విస్మయం
- 2019లోనూ అన్ని సర్వేలకు విరుద్ధంగా సీ-ఓటర్, న్యూస్-18 అంచనాలు
- బాబు ఎన్ని నకిలీ వేషాలు వేసినా విజయం వైఎస్సార్‌సీపీదే
- 50 శాతానికిపైగా ఓట్లతో మళ్లీ 'ఫ్యాన్' ప్రభంజనం ఖాయం
- తేల్చేసిన టౌమ్స్‌నౌ-ఈటీజీ, జీన్యూస్-మారిటైజ్, చాణక్య, పొలిటికల్ క్రిటిక్ తదితర సర్వేలు



సాక్షి, అమరావతి: నక్క జిత్తులు, నకిలీ వేషాలకు ప్రతిరూపం తానేనని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మరోసారి నిరూపించుకున్నారు! జనసేనతో జత కట్టి ఎన్ని మారీచ వేషాలు వేసినా గత ఎన్నికలకు మించి ఘోర పరాజయం తప్పదని తాడేపల్లి గూడెం సభ సాక్షిగా గ్రహించిన చంద్రబాబు కనీసం అవినీతి కేసుల నుంచైనా బయటపడాలనే వ్యూహంతో ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దల కాళ్లావేళ్లా పడి పొత్తు కుదుర్చుకున్నారు. జాతీయ పార్టీతో పొత్తు కుదిరిన వెంటనే వ్యవస్థలను జయప్రదంగా మేనేజ్ చేయడంలో తనకున్న అద్వితీయమైన ప్రతిభను జాతీయ మీడియాలో కొన్ని సంస్థల ముందు ప్రదర్శించారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయం సాధించే అవకాశాలున్నాయంటూ మొన్న సీ-ఓటర్ సంస్థ ఓ నకిలీ సర్వేను వెల్లడించగా న్యూస్-18 నిన్న మరో ఫేక్ సర్వేను వదిలింది. రానున్న రోజుల్లో మరిన్ని నకిలీ సర్వేలు ఇదే రీతిలో వెల్లడి కానున్నాయి. నకిలీ సర్వేల ద్వారా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పుంజుకున్నట్లు కృత్రిమ బలాన్ని చూపించి

మిగతా 2వ పేజీలో ▶

ఇది టీడీపీ మరో వెన్నుపోటు

పొత్తులు, సీట్ల కేటాయింపు, అభ్యర్థులపై మోదీ, నడ్డా, అమిత్‌షాలకు తొమ్మిది మంది ఏపీ బీజేపీ నేతలు లేఖాస్త్రం

ప్రస్తుతం ఈ లేఖ సోషల్ మీడియాలో వైరల్
తాము కూటమికి వ్యతిరేకం కాదంటూ స్పష్టీకరణ
కానీ, టీడీపీ గెలవని సీట్లే పొత్తులో మనకిచ్చారంటూ వెల్లడి
ఆ స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక సైతం పూర్తిగా టీడీపీకి అనుకూలంగా ఉండేలా ఉంది.. ఈ చర్యలు పార్టీని బలోపేతం చేసుకునేలా లేవు
లేఖ రాసిన వారంతా ప్రస్తుతం రాష్ట్ర కార్యవర్గంలో సీనియర్ నేతలే

సాక్షి, అమరావతి: పొత్తుల పేరుతో తెలుగుదేశం పార్టీ మరోసారి బీజేపీకి వెన్నుపోటు పొడుస్తోందని ఏపీ బీజేపీలోని పలువురు సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తంచేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఖచ్చితంగా ఓడిపోయే సీట్లనే పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించిందని వారు ఈ సందర్భంగా ఉదహరిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర కమల దళంలో చాలా కాలంగా కొనసాగుతూ, ప్రస్తుతం రాష్ట్ర కార్యవర్గంలో ఉన్న సీనియర్లు కొందరు రెండ్రోజుల క్రితం పార్టీ జాతీయ నాయకత్వానికి లేఖ రాసి అందులో వివిధ అంశాలను వివరించారు. పొత్తులో భాగంగా ఎక్కువచోట్ల మొదట నుంచి పార్టీలో

మిగతా 2వ పేజీలో ▶





ఎన్నికల షెడ్యూల్ నేడే

మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికల సంఘం మీడియా సమావేశం
ఈసారి నాలుగు లేక ఐదు దశల్లో సార్వత్రిక ఎన్నికలు
లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్
ఏప్రిల్ రెండు లేదా మూడో వారంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలు!
6లో

న్యూస్‌రీల్

అలాగైతే తప్పుకోండి



భీమిలి సీటు విషయంలో హామీ లభించక పోగా చీపురుపల్లి నుంచి పోటీ చేయాల్సిందేనని చంద్రబాబు తేల్చిచెప్పడంతో.. టీడీపీ సీనియర్ నేత గంటా శ్రీనివాసరావు పార్టీ మార్పుపై తన అనుచరులతో చర్చించినట్లు సమాచారం. ఎన్నికల బరి నుంచి తప్పుకుంటే మేలని ఆయన అనుచరులు చెప్పినట్లు తెలిసింది.
వివరాలు 5లో ▸

బీజేపీకి ఇస్తే ఓడిస్తామని 'పరిటాల' హెచ్చరిక




శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం అసెంబ్లీ టీడీపీ టికెట్ పరిటాల శ్రీరామ్‌కు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆయన వర్గీయులు శుక్రవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి నివాసాన్ని ముట్టడించి ఆందోళన నిర్వహించారు. బీజేపీకి ఇస్తే ఓడిస్తామని హెచ్చరించారు.
వివరాలు 5లో ▸

తగ్గేదే లే.. తాడోపేడో!



పొత్తుల కత్తులు టీడీపీ, జనసేను రోడ్డున పడేశాయి. పార్టీ కష్ట కాలంలో నమ్మకంగా పనిచేసిన వారికి వెన్నుపోటు పొడిచారని చంద్రబాబు, లోకేశ్‌పై తమ్ముళ్లు నిప్పులు చెరిగారు. డబ్బు సంచులతో వచ్చిన వారికి, పక్క పార్టీలు చెత్త అని పక్కన పెట్టిన వారిని తీసుకొచ్చి టికెట్లు కట్టబెడతారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.
వివరాలు 5లో ▸

సీఎం జగన్‌తో కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, ఆయన కుమారుడు గిరి



వైఎస్సార్‌సీపీలో చేరిన ముద్రగడ పద్మనాభం

2లో

మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులురెడ్డి, జనసేన నేత వెంకటరమణ కూడా చేరిక
సాదరంగా ఆహ్వానించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డీఏలు

- మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- గతేడాది జనవరి 1 నుంచి ఇవ్వాల్సిన డీఏ 3.64 శాతం..
- ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వేతనాలతో నగదు రూపంలో చెల్లింపు
- అలాగే గతేడాది జూలై 1 నుంచి ఇవ్వాల్సిన మరో డీఏ 3.64 శాతం..
- ఈ ఏడాది జూలై నుంచి వేతనాలతో నగదు రూపంలో చెల్లింపు
- జీపీఎఫ్‌కు సమాన వాయిదాల్లో బకాయిలు జమ

14లో

ఎమ్మెల్సీ కవిత అరెస్టు



ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో మనీలాండరింగ్ ఆరోపణలతో అరెస్టు చేసిన ఈడీ
శుక్రవారం మధ్యాహ్నం నుంచే కవిత నివాసంలో తనిఖీలు
సా.5.20 గంటలకు అదుపులోకి తీసుకుంటున్నట్లు ప్రకటన
అరెస్టు అక్రమమంటూ ఈడీ అధికారులతో కేటీఆర్ వాగ్వాదం
ఆధారాలతోనే అరెస్టు చేసినట్టు పేర్కొన్న ఈడీ అధికారులు
విమానంలో ఢిల్లీకి తరలింపు.. నేడు ఈడీ కోర్టులో హాజరుపర్చే అవకాశం
2లో



నేడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రకటన

2లో

175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలను వెల్లడించనున్న సీఎం వైఎస్ జగన్
ఇడుపులపాయలో దివంగత సీఎం వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రకటన
మరోవైపు తుది దశకు చేరుకున్న ఎన్నికల మేనిఫెస్టో
18 నుంచి ప్రచారం ప్రారంభించే చాన్స్
వేర్వేరు ప్రాంతాల్లో రోజుకు రెండు లేదా మూడు బహిరంగ సభలు, రోడ్‌షోలు



తొలగిన పచ్చ ముసుగు

వివేకా వర్ధంతి సాక్షిగా బట్టబయలైన రాజకీయ కుట్ర
సౌభాగ్యమ్మ, సునీత, షర్మిల...అంతా పచ్చ తానులో ముక్కలే
చంద్రబాబు స్క్రిప్ట్ చదువుతూ ప్రజల్ని తప్పుదారి పట్టించే యత్నం
మొదటి నుంచి సౌభాగ్యమ్మ, సునీతది రాజకీయ ఆకాంక్షే
అదే ఆరాటంతో చంద్రబాబు బృందంతో కుమ్మక్కు
వివేకా ప్రత్యర్థులు, హంతకుల ముఠాతో జట్టు కట్టిన వైనం
వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో తీవ్ర విభేదాలు
10లో

ఇదండీ వరస



పొత్తులో భాగంగా తన నియోజక వర్గంలో ప్రచారం చేయించుకొని ఇప్పుడు ఇతని నియోజకవర్గంలో చేయనంటున్నాడట!

క్లుప్తంగా

46 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లో ప్రోగ్రాం అసిస్టెంట్, డేటా అనలిస్ట్, సిస్టం అడ్మినిస్ట్రేటర్... ఇలా 7 విభాగాల్లో 46 పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. నోటిఫికేషన్‌ను http://-apmsrb.ap.gov.in/msrb/లో అందుబాటులో ఉంచామని ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ మెంబర్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25వ తేదీ వరకు గడువు ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు వేరుగా శుక్రవారం నోటిఫికేషన్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ జారీ చేసింది. http://apm-srb.ap.gov.in/msrb/లో పూర్తి నోటిఫికేషన్ అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు సంబంధిత వైద్య కళాశాలల్లో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులను అందజేయాల్సి ఉంటుందన్నారు.

సీఐఐ ఉమెన్ నెట్‌వర్క్ రాష్ట్ర చైర్‌ఉమెన్‌గా రమాదేవి


రమాదేవి


చాందినీ చందన

సాక్షి, అమరావతి: కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ ఏపీ చాప్టర్ చైర్‌ఉమెన్‌గా డాక్టర్ జి.రమాదేవి, వైస్ చైర్‌ఉమెన్‌గా చాందినీ చందన ఎన్నికయ్యారు. విజయవాడలో శుక్రవారం జరిగిన సీఐఐ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ ఏపీ చాప్టర్ వార్షిక సర్వసభ్య సమావేశంలో 2024-25 సంవత్సరానికి ఐడీబ్ల్యూఎన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్ ఉమెన్‌గా అమర హాస్పిటల్స్ ఎండీ గొరిపేని రమాదేవి, వైస్ చైర్ ఉమెన్‌గా అవెరా ఎలక్ట్రిక్ స్కూటర్స్ కో ఫౌండర్ చాందినీ చందనలను ఎన్నుకున్నారు.

రేపు చిలకలూరిపేటలో ప్రధాని మోదీ పర్యటన
ఎన్‌డీఏ బహిరంగ సభకు హాజరు



సాక్షి, నరసరావుపేట: ప్రధాని మోదీ ఈ నెల 17న పల్నాడు జిల్లాలో పర్యటించనున్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడిగా చిలకలూరిపేట మండలం పరిధిలోని బొప్పూడి వద్ద నిర్వహిస్తున్న ఎన్‌డీఏ బహిరంగ సభలో మోదీ పాల్గొననున్నారు. ఢిల్లీ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు ఆదివారం సాయంత్రం 4.10 గంటలకు చేరుకోనున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో చిలకలూరిపేట మండలం బొప్పూడి వద్దకు సాయంత్రం 4.55 గంటలకు చేరుకోనున్నారు. ఎన్‌డీఏ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు పాల్గొంటారు. సభ ముగిసిన తరువాత హెలికాప్టర్‌లో గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి రాత్రి 7.45 గంటలకు హైదరాబాద్ వెళతారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఎస్పీజీ అధికారులు భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. వీరితో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర పోలీసు శాఖ అవసరమైన చర్యలు తీసుకుంటోంది.

క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇవ్వాలి
శాప్ ఎండీగా పనిచేసి బదిలీపై వెళ్తున్న ధ్యాన్‌చంద్ర


ధ్యాన్‌చంద్రను సత్కరిస్తున్న శాప్ సిబ్బంది

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందిస్తూ జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించేలా తీర్చిదిద్దాలని శాప్ ఎండీగా పని చేసిన ధ్యాన్‌చంద్ర కోచ్‌లకు సూచించారు. ఇటీవల ప్రభుత్వం ఆయన్ని తిరుపతి జిల్లా జేసీగా బదిలీ చేసిన నేపథ్యంలో శుక్రవారం శాప్ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ర మాట్లాడుతూ.. ఏపీలో క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తు దిశగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' టోర్నీని సమర్థంగా నిర్వహించడంలో శాప్ సిబ్బంది విశేష కృషి చేశారన్నారు. భవిష్యత్తులో క్రీడా టోర్నీల నిర్వహణలో శాప్ తన మార్క్ చూపించాలని ఆకాంక్షించారు. అనంతరం శాప్ పరిపాలనాధికారి పి.రామకృష్ణ మాట్లాడుతూ.. అనతికాలంలోనే ధ్యాన్‌చంద్ర సారథ్యంలో శాప్‌లో డీఎస్‌డీవో వ్యవస్థ పునరుద్ధరణ, కారుణ్య నియామకాలు, పొరుగు సేవల సిబ్బందికి ప్రభుత్వ ధ్రువీకరణతో ఉద్యోగులకు ఎంతో మేలు చేకూర్చారన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ అధికారులు వెంకటరమణ, సుశీల, సిద్ధయ్య, 26 జిల్లాల డీఎస్‌డీవోలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ముద్రగడ పద్మనాభం

- మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులురెడ్డి, జనసేన నేత వెంకటరమణ కూడా చేరిక
- సాదరంగా ఆహ్వానించిన సీఎం వైఎస్ జగన్


నవుడు వెంకటరమణకు పార్టీ కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న సీఎం జగన్


మాజీ ఎమ్మెల్సీ యండపల్లిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం జగన్


సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన ముద్రగడ. చిత్రంలో ఎమ్మెల్యేలు కన్నబాబు, ద్వారంపూడి

సాక్షి, అమరావతి: కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ముద్రగడ పద్మనాభం, ఆయన కుమారుడు గిరి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి సీఎం జగన్ వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు (వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు), ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి ఉంగుటూరు జనసేన నేత నవుడు వెంకటరమణ

ఏలూరు జిల్లా ఉంగుటూరుకు చెందిన జనసేన పార్టీ నాయకుడు నవుడు వెంకటరమణ శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వెంకటరమణ 2019 ఎన్నికల్లో ఉంగుటూరు నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ సందర్భంగా నవుడు వెంకటరమణ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో బీసీ సంక్షేమ సంఘానికి చాలాకాలం గౌరవాధ్యక్షునిగా, అన్ని బీసీ సంఘాలకు చైర్మన్‌గా పని చేశానని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రారంభం నుంచి పార్టీలో ఉన్నానని, అయితే మధ్యలో అనుకోని పరిస్థితుల్లో పార్టీ మారాల్సి వచ్చిందని చెప్పారు. ఇప్పుడు తిరిగి సొంత ఇంటికి వచ్చినట్లయ్యిందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌పై తనకు అచంచలమైన విశ్వాసం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పీవీ మిథున్ రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి

చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. యండపల్లి శ్రీనివాసులురెడ్డి 2011, 2017లో తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు మురళీధర్, రఘునాథరెడ్డి, బాలకృష్ణారెడ్డి, డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఇది టీడీపీ మరో వెన్నుపోటు

▶ మొదటి పేజీ తరువాయి

కొనసాగుతున్న వ్యక్తులకు కాకుండా 2019 ఎన్నికల తర్వాత టీడీపీ నుంచి బీజేపీలోకి వలస వచ్చిన వారికే టికెట్లు దక్కేలా పార్టీ రాష్ట్ర నాయకత్వం అధిష్టానానికి నివేదికలు సమర్పించడాన్ని వ్యతిరేకిస్తూ వీరు విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సమావేశమయ్యారు. అనంతరం వీరు పొత్తు సందర్భంగా తమ దృష్టికొచ్చిన అంశాలను పేర్కొంటూ గురువారం జాతీయ నాయకత్వానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ లేఖ ప్రతులు శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్. దయాకర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేటుకూరి సూర్యనారాయణ రాజు, రాష్ట్ర కార్యదర్శి కె. సురేంద్రమోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస వర్మ, బీజేపీ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యురాలు కె. శాంతారెడ్డి, బీజేపీ సీనియర్ నేత జూపూడి రంగరాజు, మహిళా మోర్చా జాతీయ మాజీ కార్యదర్శి మాలతీరాణి ఆ లేఖలో సంతకాలు చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాను ఉద్దేశిస్తూ రాసిన ఆ లేఖ నకళ్లను ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు బీజేపీ జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, జాతీయ సహ సంఘటనా కార్యదర్శి శివప్రకాష్, కేంద్ర పార్లమెంటరీ పార్టీ బోర్డు సభ్యులు లక్ష్మణ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, రాష్ట్ర పార్టీ సంస్థాగత వ్యవహారాలు పర్యవేక్షించే సంఘటనా కార్యదర్శి మధుకర్, జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజుకు కూడా పంపారు.

పొత్తులకు వ్యతిరేకం కాదు, కానీ..

నిజానికి.. కేంద్ర నాయకత్వంపై తమకు చాలా నమ్మకం ఉందని.. పొత్తు నిర్ణయాన్ని తామేమీ వ్యతిరేకించడంలేదని వారు ఆ లేఖలో స్పష్టంచేశారు. అందులో వారు ఇంకా ఏం పేర్కొన్నారంటే..

- తాము కూటమి ఏర్పాటుకు వ్యతిరేకం కాదు. కానీ, పొత్తుల పేరుతో జరుగుతున్న పరిణామాలతో మేం విభేదిస్తున్నాం.
- పొత్తులో బీజేపీకి కేటాయించిన ఆరు లోక్‌సభ, పది అసెంబ్లీ స్థానాలను బీజేపీనే కాదు టీడీపీ కూడా గెలిచే అవకాశంలేదు.
- బీజేపీకి కేటాయించిన సీట్లలో గతంలో టీడీపీ గెలవలేదు. అంత బలహీనమైన అసెంబ్లీ సీట్లు మన పార్టీకి ఇచ్చారు.
- బీజేపీకి కేటాయించిన ఈ సీట్లు పరిశీలిస్తే టీడీపీ మరో విడత మన పార్టీకి వెన్నుపోటు పొడుస్తోందన్న అభిప్రాయమే కనిపిస్తోంది.
- పొత్తులో పార్టీకి కేటాయించిన సీట్లలోనూ అనేక దశాబ్దాలుగా పార్టీ భావజాలంతో పనిచేసి, గెలిచే అవకాశాలున్న అభ్యర్థుల పేర్లను రాష్ట్ర నాయకత్వం పరిగణనలోకి తీసుకోలేదు.
- బీజేపీ సీట్లకు అభ్యర్థుల పరిశీలనలో సైతం టీడీపీ ప్రభావమే ఎక్కువగా ఉందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి.
- టీడీపీ మన పార్టీతో పొత్తు పెట్టుకోవాలని ముందస్తు ఎజెండాతోనే ఆ పార్టీ నేతలను మన బీజేపీలోకి బదలాయించింది. తద్వారా ఇప్పుడు ఆ పార్టీ తమ నాయకులను సంతృప్తపరచడంతో పాటు మొదట నుంచి బీజేపీలో కొనసాగే నేతలను కూడా దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తూ ఉండొచ్చు.
- కాబట్టి పార్టీ ప్రయోజనాల దృష్ట్యా మా విజ్ఞప్తిని దయతో పరిశీలించాల్సిందిగా కోరుతున్నాం.

పార్టీ అసలైన నేతలకే సీట్లు దక్కేలా చూడాలి..

బాధ్యతాయుతమైన పార్టీ నాయకులుగా పార్టీ నిర్ణయాన్ని మేం వ్యతిరేకించడంలేదు. అయితే, గతంలో మనకున్న చేదు అనుభవాల దృష్ట్యా.. భవిష్యత్తులో మన పార్టీని పటిష్టం చేసేందుకు సుదీర్ఘ కాలంగా పార్టీలో కొనసాగుతున్న హార్డ్‌కోర్ నాయకులకే అత్యధిక సీట్లు దక్కేలా చూడాలని మేం అభ్యర్థిస్తున్నాం. రాష్ట్రంలో లక్షలాది మంది పార్టీ అభిమానులు ఇదే అభిప్రాయంతో ఉన్నారన్న విషయం అధిష్టానానికి తెలపాలన్న ఉద్దేశంతోనే ఈ లేఖ రాసినట్లు ఆ నాయకులు పేర్కొన్నారు.

మొర విన్నాడు.. వరమిచ్చాడు...

- సీఎం జగన్ ఎదుట కష్టాలు ఏకరువు పెట్టిన పలువురు బాధితులు
- సీఎం ఆదేశాల మేరకు వెంటనే ఆర్థిక సాయం అందించిన కలెక్టర్


అబ్దుల్ హజీమ్ కష్టాలు వింటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


అబ్దుల్ హజీమ్‌కు రూ.2 లక్షల చెక్కు అందిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

సాక్షి, నంద్యాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి తన మంచి మనసును చాటుకున్నారు. గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లెకి వైఎస్సార్ ఈబీసీ నేస్తం మూడో విడత నిధులు విడుదల చేయడానికి వచ్చిన సందర్భంగా.. అనారోగ్యంతో బాధపడుతున్న వారు, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న వారు సీఎం జగన్‌ను కలిసి తమ కష్టాలు చెప్పుకొన్నారు. ఆపదలో ఉన్నామని, ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన సీఎం.. వారికి ఆర్థిక సాయం అందజేయాలని కలెక్టర్ కె.శ్రీనివాసులును ఆదేశించారు. సీఎం ఆదేశాలతో వెంటనే కలెక్టర్ బాధితుల వివరాలు తెలుసుకుని మొత్తం 16 మందికి రూ.16 లక్షల 30 వేలను సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి అందించారు.

వచ్చాడు జాదూగాడు

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీ శ్రేణులను కాపాడుకోవాలన్నది చంద్రబాబు ఎత్తుగడ. అయితే వైఎస్సార్‌సీపీ 50 శాతానికిపైగా ఓట్లతో 24–25 లోక్‌సభ స్థానాల్లో ఘనవిజయం సాధిస్తుందని, టీడీపీ–జనసేన కూటమి 0–1 లోక్‌సభ స్థానాలకే పరిమితం కానుందని టౌమ్స్ నౌ, చాణక్య లాంటి ప్రముఖ సంస్థల సర్వేల్లో వెల్లడైంది. డజనుకుపైగా జాతీయ మీడియా సంస్థల సర్వేల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించడం ఖాయమని తేలింది. బీజేపీతో టీడీపీ–జనసేన పొత్తు కుదిరిన రెండు మూడు రోజుల్లోనే ఆ కూటమి గెలుస్తుందంటూ సీ–ఓటర్, న్యూస్–18 ఒపీనియన్ సర్వేలు ఆదరాబాదరగా ప్రకటించడంపై రాజకీయ పరిశీలకులు విస్తుపోతున్నారు. రెండు మూడు రోజుల్లోనే ప్రజాభిప్రాయం ఎలా తారుమారు అవుతుందని సర్వేలను ఉద్దేశించి ప్రశ్నిస్తున్నారు. దీన్ని బట్టి అవి నకిలీ సర్వేలన్నది స్పష్టమవుతోందని తేల్చి చెబుతున్నారు. 2019లోనే అన్ని సర్వేలకు విరుద్ధంగా సీ–ఓటర్, న్యూస్–18 అంచనాలు ఉండటాన్ని గుర్తు చేస్తున్నారు. సర్వేల పేరుతో చంద్రబాబు ఎన్ని మాయ వేషాలు వేసినా సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి చరిత్రాత్మక విజయం సాధించడం ఖాయమని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని పేర్కొంటున్నారు.



సుపరిపాలనతో విప్లవాత్మక మార్పులు..

2019 ఎన్నికల్లో 50 శాతం ఓట్లతో 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక తొలి ఏడాదిలోనే 95 శాతం హామీలను అమలు చేసి మేనిఫెస్టోకు సిసలైన నిర్వచనం చెప్పారు. గత 58 నెలల్లో 99 శాతం హామీలను నెరవేర్చి సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో రూ.2.65 లక్షల కోట్లను పేదల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. డీబీటీ, నాన్ డీబీటీ కలిపి మొత్తం రూ.4.44 లక్షల కోట్ల మేర ప్రయోజనం చేకూర్చారు. కరోనా కష్టకాలంలోనూ ఆర్థిక ఇబ్బందుల్లోనూ ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా నిర్విఘ్నంగా కొనసాగించారు. ప్రభుత్వ ఆర్థిక చేయూతను వినియోగించుకున్న పేదలు పేదరికాన్ని అధిగమించడమే ఇందుకు నిదర్శనం. 2015–16లో రాష్ట్రంలో పేదరికం 11.77% ఉండగా 2022–23 నాటికి 4.19 శాతానికి తగ్గడమే అందుకు తార్కాణం. గ్రామ వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ, జిల్లాల పునర్ వ్యవస్థీకరణ ద్వారా గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ రాష్ట్రంలో నాలుగు లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉంటే.. అందులో గత 58 నెలల్లో 2.13 లక్షల నియామకాలు చేపట్టడం గమనార్హం.

రోజురోజుకు పెరుగుతున్న వైఎస్సార్‌సీపీ గ్రాఫ్..

సంక్షేమ పథకాలు, సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ పట్ల ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోంది. 2019 ఎన్నికల తర్వాత జరిగిన పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, కార్పొరేషన్, తిరుపతి లోక్‌సభ, బద్వేలు, ఆత్మకూరు శాసనసభ స్థానాల ఉప ఎన్నికల్లో ఇది నిరూపితమైంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేస్తూ భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో నిర్వహించిన నాలుగు సిద్ధం సభలు వైఎస్సార్‌సీపీ మరోసారి ప్రభంజనం సృష్టించడం ఖాయమని చాటి చెప్పాయి. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైఎస్సార్‌సీపీ 50 శాతం ఓట్లతో 24–25 లోక్‌సభ స్థానాల్లో ఘనవిజయం సాధించడం తథ్యమని, టీడీపీ 0–1 లోక్‌సభ స్థానాల్లో మాత్రమే ఉనికి చాటుకునే అవకాశం ఉందని, జనసేన, బీజేపీ, కాంగ్రెస్‌లు ఉనికి కూడా చాటుకోలేవని మూడు నెలల క్రితం టౌమ్స్‌నౌ సర్వే వెల్లడించింది. జీన్యూస్ మాట్రిజ్, జీవనాధర్ ఇండియా, జన్‌మత్ పోల్స్, పీపుల్స్ పల్స్, చాణక్య లాంటి డజనుకుపైగా ప్రతిష్టాత్మక సంస్థలు నిర్వహించిన సర్వేల్లోనూ వైఎస్సార్‌సీపీ మరోసారి ఘనవిజయం సాధిస్తుందని వెల్లడైంది.

కేసుల భయంతో కాళ్ల బేరం..

ఎన్నికల్లో ఒంటరిగా వైఎస్సార్‌సీపీని, సీఎం జగన్‌ను ఎదుర్కోలేమని గ్రహించిన చంద్రబాబు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌తో జత కలిశారు. టీడీపీ–జనసేన పొత్తు కుదిరాక తాడేపల్లిగూడెంలో ఉమ్మడిగా నిర్వహించిన జెండా సభకు జనం మొహం చాటేశారు. జెండా సభ అట్టర్ ఫ్లాప్ కావడంతో మళ్లీ ఘోర పరాజయం తప్పదని ఆందోళన చెందిన చంద్రబాబు స్కిల్ స్కామ్, ఫైబర్ గ్రిడ్ స్కాం, అమరావతి భూకుంభకోణం నుంచి ఉమ్మడి రాష్ట్రంలో పాల్పడిన ఐఎంజీ భారత్ కుంభకోణం వరకూ అవినీతి కేసుల నుంచి బయటపడేందుకు బీజేపీ పొత్తు కోసం పాకులాడారు. ఢిల్లీ వెళ్లి మూడు రోజులు పడిగాపులు కాసి బీజేపీ పెద్దల కాళ్లావేళ్లా పడి పొత్తుకు ఒప్పించుకున్నారు.

బీజేపీతో జతకట్టినా డజను సర్వేలది ఒకే మాట

- బీజేపీతో టీడీపీ–జనసేన పొత్తు కుదిరాక టైమ్స్ నౌ–ఈటీజీ సంస్థ భారీ సర్వే చేసింది. ఏపీలో 25 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో పలు వర్గాలకు చెందిన 3,23,257 మంది చెప్పిన అభిప్రాయాలను క్రోడీకరించింది. 49 శాతం ఓట్లతో 21–22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని, 45% ఓట్లతో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి 3–4 సీట్లకే పరిమితం కానుందని తేల్చింది.
- 48 శాతం ఓట్లతో 19 లోక్‌సభ, 133 శాసనసభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధిస్తుందని, టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి 44 శాతం ఓట్లతో 6 లోక్‌సభ, 42 శాసనసభ స్థానాలకు పరిమితం అవుతుందని జీన్యూస్–మాట్రిజ్ సర్వే వెల్లడించింది.
- 49.5 శాతం ఓట్లతో 121 శాసనసభ (ఐదు అటూఇటుగా) స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని, టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి 43 శాతం ఓట్లతో 54 (ఐదు అటూఇటుగా) శాసనసభ స్థానాలతో సరిపెట్టుకుంటుందని పొలిటికల్ క్రిటిక్ సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది.
- రాష్ట్రంలో 49 శాతం ఓట్లతో 17 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ సత్తా చాటుకుంటుందని, 44 శాతం ఓట్లతో 8 లోక్‌సభ స్థానాలకు టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి పరిమితం అవుతుందని చాణక్య సర్వే తేల్చింది. జనాధార్ ఇండియా, జన్‌మత్ పోల్స్, పీపుల్స్ పల్స్ తదితర డజనుకుపైగా ప్రతిష్టాత్మక సంస్థల సర్వేలదీ అదే మాట.

ఎమ్మెల్సీ కవిత అరెస్టు

- ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో మనీలాండరింగ్ ఆరోపణలతో అరెస్టు చేసిన ఈడీ
- సా.5.20 గంటలకు అదుపులోకి తీసుకుంటున్నట్లు ప్రకటన
- అరెస్టు అక్రమమంటూ ఈడీ అధికారులతో కేటీఆర్ వాగ్వాదం

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఢిల్లీ ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) అధికారుల బృందం శుక్రవారం సాయంత్రం అరెస్టు చేసింది. బీఆర్‌ఎస్ శ్రేణుల ఆందోళన, పోలీసుల స్వల్ప లాఠీచార్జి, మధ్య ఈడీ అధికారులు రాత్రి 8.45 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో ఢిల్లీకి తరలించారు. ఈడీ జాయింట్ డైరెక్టర్ జోగిందర్ నేతృత్వంలోని 12 మంది ఢిల్లీ అధికారుల బృందం హైదరాబాద్ ఈడీ అధికారుల సహకారంతో శుక్రవారం మధ్యాహ్నమే ఎమ్మెల్సీ కవిత నివాసానికి చేరుకుంది. సుమారు 1.45 గంటల సమయంలో సోదాలు ప్రారంభించారు. సోదాల్లో పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కవిత మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఆధారాలు లభించినందున అరెస్టు చేస్తున్నట్లు కవితకు, ఆమె కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. తర్వాత సా.5.20 గంటల సమయంలో కవితను ఈడీ బృందం అరెస్టుచేసింది.

తీవ్ర ఉద్రిక్తత మధ్య తరలింపు..

ఈడీ సోదాల విషయం తెలుసుకుని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో కవిత నివాసం వద్దకు చేరుకుని ఆందోళనకు


కవితను ఢిల్లీకి తీసుకెళ్తున్న ఈడీ అధికారులు

దిగారు. ఈ సమయంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, హరీశ్‌రావు, ఇతర నేతలు, న్యాయవాదులు కవిత నివాసం వద్దకు చేరుకున్నారు. వారు లోనికి వెళ్లకుండా ఈడీ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. కొంతసేపటి తర్వాత కేటీఆర్, ఇతర నేతలు కవిత నివాసంలోకి వెళ్లారు. కవిత అరెస్టు అక్రమం, చట్టవ్యతిరేకమని ఈడీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. మరోవైపు కవితను రాత్రి 8.58 గంటలకు ఢిల్లీకి తరలించారు. శనివారం మధ్యాహ్నం ఆమెను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చనున్నట్లు సమాచారం. కవిత అరెస్టు నేపథ్యంలో కేసీఆర్, కేటీఆర్‌తోపాటు మరికొందరు శనివారం ఉదయం ఢిల్లీ వెళ్లనున్నారు. ఇదిలా ఉంటే.. కవిత ఇంట్లో తనిఖీలు ప్రశాంతంగా సాగాయని, ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేశామని ఈడీ అధికారులు వెల్లడించారు.

నేడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రకటన

- 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలను వెల్లడించనున్న సీఎం వైఎస్ జగన్
- ఇడుపులపాయలో దివంగత సీఎం వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రకటన
- మరోవైపు తుది దశకు చేరుకున్న ఎన్నికల మేనిఫెస్టో
- 18 నుంచి ఎన్నికల ప్రచారం ఉండే అవకాశం
- వేర్వేరు ప్రాంతాల్లో రోజుకు రెండు లేదా మూడు బహిరంగ సభలు, రోడ్ షోలు

సాక్షి, అమరావతి: వచ్చే శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శనివారం ప్రకటించనున్నారు. ఈ మేరకు సీఎం ఉదయం 10.45 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ చేరుకుంటారు. అక్కడ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం మధ్యాహ్నం ఒకేసారి 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తారు. అనంతరం ఇడుపులపాయ నుంచి బయలుదేరి తాడేపల్లి చేరుకుంటారు. మరోవైపు గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశ్వసనీయతను చాటుకున్నారు. వచ్చే ఎన్నికల మేనిఫెస్టో ప్రక్రియ తుది దశకు చేరుకుంది. మేనిఫెస్టోను ప్రకటించాక.. ఆ వెంటనే పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చేందుకు మరోసారి చారిత్రక విజయంతో అధికారంలోకి రావడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ ప్రచార భేరి మోగించనున్నారు. ఈ నెల 18 నుంచి ప్రచారాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. వేర్వేరు ప్రాంతాల్లో రోజుకు రెండు లేదా మూడు బహిరంగసభలు, రోడ్ షోలు నిర్వహించేలా ప్రచార ప్రణాళికను రూపొందించారని తెలుస్తోంది. ఓవైపు సీట్ల పంపకాలు, అభ్యర్థుల ఎంపికపై టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిలో అసంతృప్తి జ్వాలలు చెలరేగుతున్నాయి. మరోవైపు వైఎస్సార్‌సీపీ రెట్టించిన ఉత్సాహంతో ప్రచారంలో దూసుకెళ్లే దిశగా అడుగులేస్తోంది.

ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా వెంకటలక్ష్మి

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ప్రస్తుతం ఆమె కమిషన్ సభ్యురాలు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా గజ్జల వెంకటలక్ష్మిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 4న వాసిరెడ్డి పద్మ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దీంతో కమిషన్ సభ్యురాలిగా ఉన్న వెంకటలక్ష్మిని చైర్‌పర్సన్‌గా ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అంగన్‌వాడీలకు మార్గదర్శకాల కోసం సబ్ కమిటీ

రాష్ట్రంలో అంగన్‌వాడీలకు మార్గదర్శకాలను రూపొందించేందుకు ప్రభుత్వం సబ్ కమిటీని నియమించింది. ఈ మేరకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జి ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేసే వర్కర్లు, హెల్పర్ల నియామకం, పదోన్నతులు, బదిలీలు, క్రమశిక్షణ చర్యలు వంటి అంశాలను ఈ సబ్ కమిటీ పర్యవేక్షిస్తుంది. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్(కమిషనర్) చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో ఐసీడీఎస్ జాయింట్ డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల నుంచి ఇద్దరేసి చొప్పున, పలువురు జాయింట్ డైరెక్టర్లు, రీజినల్ డైరెక్టర్లు సభ్యులుగా ఉంటారు. ఈ సబ్ కమిటీ మార్గదర్శకాలను మంత్రివర్గ బృందానికి నివేదిస్తుంది. పోషకాహారమైన బాలామృతాన్ని సిఫారసు చేసేలా నలుగురితో సాంకేతిక కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్, జిల్లా కార్యాలయాలకు ప్రింటర్‌తో కూడిన కంప్యూటర్ల కొనుగోలుకు రూ.2.60 కోట్ల నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

మహిళా సహకార ఆర్థిక సంస్థకు నూతన డైరెక్టర్

రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ డైరెక్టర్‌గా వెంకటరత్నంను ప్రభుత్వం శుక్రవారం నియమించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆమె ఈ పదవిలో ఉంటారని పేర్కొంది.

కోర్టు ఉత్తర్వులకూ తప్పుడు భాష్యం

ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులను వక్రీకరించి ప్రచురించిన 'ఈనాడు'

సర్క్యులేషన్ వివరాలు సీల్డ్ కవర్లో ఇవ్వాలంటూ ఏబీసీకి కోర్టు నోటీసులు

ఈ నెల 27 వరకూ ఏ తెలుగు దినపత్రిక సర్క్యులేషన్‌నూ వెల్లడించవద్దని ఆదేశం

తెలుగు దినపత్రికలన్నిటికీ ఈ ఆదేశాలు వర్తిస్తాయని స్పష్టంగా ఉత్తర్వులు

కానీ 'సాక్షి' వివరాలను మాత్రమే వెల్లడించవద్దన్నట్టుగా 'ఈనాడు' కథనం

'ఈనాడు' తప్పుడు కథనంపై నివ్వెరపోతున్న న్యాయ నిపుణులు



సాక్షి- అమరావతి

రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అప్రతిష్ట పాలు చేయడమే లక్ష్యంగా ప్రతీ రోజూ తప్పుడు కథనాలు వండి వారుస్తున్న ఈనాడు దినపత్రిక, తాజాగా కోర్టు ఉత్తర్వుల విషయంలోనూ అదే వైఖరిని బయటపెట్టుకుంది. కోర్టు ఇవ్వని ఆదేశాలను ఇచ్చినట్లు ప్రచురించి, 'సాక్షి'పై తన అక్కసును మరోసారి వెళ్లగక్కింది. 'సాక్షి' దినపత్రిక సర్క్యులేషన్ వివరాలను వెల్లడించవద్దంటూ ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్‌ను (ఏబీసీ) ఢిల్లీ హైకోర్టు ఆదేశించినట్లుగా తప్పుడు కథనాన్ని ప్రముఖంగా ప్రచురించింది. వాస్తవానికి సర్క్యులేషన్ వివరాలను తనకు సీల్డ్ కవర్లో సమర్పించాలని ఏబీసీని ఆదేశించిన ఢిల్లీ హైకోర్టు... ఈ నెల 27వరకూ ఏ తెలుగు దినపత్రిక సర్క్యులేషన్ వివరాలనూ వెల్లడి చేయవద్దని స్పష్టంగా తన మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వులు 'ఈనాడు'తో సహా తెలుగు దినపత్రికలన్నింటికీ వర్తిస్తాయి. కానీ 'ఈనాడు' మాత్రం... ఒక్క సాక్షి పత్రిక సర్క్యులేషన్ వివరాలను మాత్రమే వెల్లడించవద్దని ఏబీసీని ఢిల్లీ హైకోర్టు ఆదేశించినట్లుగా కథనాన్ని ప్రచురించటంపై న్యాయ నిపుణులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీని వివరాలు చూస్తే...

విస్తృత సర్క్యులేషన్ ఉన్న ఏదైనా పత్రికను కొనుగోలు చేసుకోవటానికి గ్రామ, వార్డు వలంటీర్లకు, సచివాలయాలకు నెలకు రూ.200 ఆర్థిక సాయం అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఉత్తర్వులిచ్చింది. ఆ మేర బడ్జెట్ కేటాయింపులు కూడా చేసింది. ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో ఎక్కడా కూడా ఏ పత్రికను కొనాలన్నది చెప్పలేదు. విస్తృత సర్క్యులేషన్ ఉన్న ఏ పత్రికనైనా కొనుగోలు చేసుకోవచ్చునని వలంటీర్లకు ఛాయిస్ ఇచ్చింది. అయితే ఈ ఉత్తర్వులను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించి, వాటిని రద్దు చేయాలని కోరుతూ ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఈనాడు) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అలాగే వలంటీర్లు, సచివాలయాలు ఒకవేళ 'సాక్షి' దినపత్రికను కొనుగోలు చేస్తే ఆ సంఖ్యను పరిగణనలోకి తీసుకోకుండా ఆడిట్ బ్యూరో సర్క్యులేషన్‌ను (ఏబీసీ) ఆదేశించడంతో పాటు నిర్దిష్ట కాలాల్లో సాక్షి పత్రికు ఇచ్చిన సర్క్యులేషన్ సర్టిఫికేషన్‌ను పునస్సమీక్ష చేయాలని కూడా ఏబీసీని ఆదేశించాలంటూ ఉషోదయ డైరెక్టర్ ఐ.వెంకట్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. అంతేకాక ప్రభుత్వ జీవోల అమలును నిలిపేయడంతో పాటు, 2022 జూలై- డిసెంబర్, ఆ తరువాత కాలానికి సాక్షి సర్క్యులేషన్‌ను ఆడిట్ చేయకుండా ఏబీసీని నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలంటూ అనుబంధ వ్యాజ్యాలు దాఖలు చేశారు. సీజే ధర్మాసనం మొదట ఈ అనుబంధ వ్యాజ్యాలపై విచారణ జరిపింది. అటు ఈనాడు, ఇటు రాష్ట్ర ప్రభుత్వం వాదనలు విన్నది. అనంతరం ఉషోదయ దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యాలను కొట్టేసింది. దీనిపై ఉషోదయ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. హైకోర్టు ఉత్తర్వులపై స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేసింది. వీటిపై గత ఏడాది ఏప్రిల్ 17న సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఉషోదయ దాఖలు చేసిన వ్యాజ్యాలను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేస్తూ ఆదేశాలిచ్చింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఉషోదయ వ్యాజ్యంపై ఢిల్లీ హైకోర్టు గత ఏడాది జూలై నుంచి విచారణ జరుపుతూ వస్తోంది. ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. లిఖితపూర్వక వాదనల సమర్పణకు సైతం ఆదేశాలిచ్చింది. అయితే సర్క్యులేషన్ వివరాలను వెల్లడి చేయకుండా ఏబీసీని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలని బుధవారం (మార్చి 13) ఉషోదయ మరో పిటిషన్ వేసింది. దీనిపై ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఏబీసీ తరఫు న్యాయవాది ఎవరూ విచారణకు హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో తాజా సర్క్యులేషన్ వివరాలను సీల్డ్ కవర్‌లో తమ ముందుంచాలంటూ ఏబీసీకి నోటీసులిచ్చింది. అంతేకాక ఈ నెల 27 వరకూ తెలుగు దినపత్రికలన్నింటి సర్క్యులేషన్ వివరాలను వెల్లడి చేయవద్దని కూడా ఏబీసీని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ మన్‌మోహన్, న్యాయమూర్తి జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరా ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ఇంత స్పష్టంగా ఉంటే, ఈనాడు మాత్రం ఆ ఉత్తర్వులను దురుద్దేశాలతో తప్పుగా ప్రచురించింది. ఢిల్లీ హైకోర్టు 'సాక్షి' సర్క్యులేషన్ వివరాలను, గణాంకాలు ప్రచురించవద్దంటూ ఏబీసీని ఆదేశించినట్లు తప్పుడు కథనాన్ని ప్రచురించి తన నైజాన్ని చాటుకుంది.

రూ.1.47 కోట్ల నకిలీ ఆర్గానిక్ ఉత్పత్తులు స్వాధీనం

పేరేచర్లలోని తయారీ కేంద్రంపై విజిలెన్స్ దాడులు



గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

మేడికొండూరు: నకిలీ ఆర్గానిక్ ఉత్పత్తుల తయారీ కేంద్రంపై శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపుదాడులు చేశారు. రూ.1.47 కోట్ల నకిలీ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో విజిలెన్స్ అధికారులు స్థానిక రెవెన్యూ, వ్యవసాయశాఖల అధికారులతో కలిసి మేడికొండూరు మండలం, పేరేచర్ల గ్రామంలోని నిఖిత కిసాన్ సేవా కేంద్రంలో తనిఖీ నిర్వహించారు. ఎలాంటి ఇన్వాయిస్‌లు, బిల్లులు లేని సేంద్రియ ఉత్పత్తులను గుర్తించారు. గోడౌన్ తనిఖీ చేసి, లైసెన్సలను పరిశీలించారు. బిల్లులు, ఇన్వాయిస్‌లు లేకుండా ఆర్గానిక్ ప్రొడక్ట్స్ ముసుగులో రసాయనాలు కలిపి నకిలీ మందులు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. గోడౌన్ నుంచి ఐదురకాల ముడిపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. అట్టపెట్టెలు, ఖాళీ సీసాలు, ప్యాకింగ్‌కు కావాల్సిన లేబుల్స్ మొదలైన మెటీరియల్స్ తనిఖీల్లో బయటపడ్డాయి. గోడౌన్‌లో రూ.1.47 కోట్ల విలువగల ముడిపదార్థాలు, రూ.41వేల విలువచేసే సేంద్రియ పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. మొత్తంగా రూ.1.47 కోట్ల విలువ చేసే సరుకును అధికారులు సీజ్ చేశారు. నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. దాడుల్లో వ్యవసాయ శాఖ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.రమణకుమార్, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య, మేడికొండూరు వ్యవసాయశాఖ అధికారి ఎం.నాగరాజు పాల్గొన్నారు.

కనీస వేతన సలహా మండలి సభ్యుడిగా కొండలరావు

ఉత్తర్వులు జారీ చేసిన కార్మిక శాఖ కార్యదర్శి



సాక్షి, అమరావతి: రాష్ట్ర కనీస వేతన సలహా మండలి స్వతంత్ర సభ్యుడిగా పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన కాపు నాయకుడు రామిశెట్టి కొండలరావును శుక్రవారం ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు కార్మిక శాఖ కార్యదర్శి డాక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల పాటు కొండలరావు సలహా మండలి సభ్యుడిగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, సలహా మండలి సభ్యుడిగా శుక్రవారమే బాధ్యతలు స్వీకరించిన కొండలరావు.. తనకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా దేవభక్తుని చక్రవర్తి



పెనమలూరు: ఏపీ కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరుకు చెందిన దేవభక్తుని చక్రవర్తిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు జీవో 37తో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా దేవభక్తుని చక్రవర్తి మాట్లాడుతూ జగనన్న తనపై ఎంతో నమ్మకంతో కమ్మ కార్పొరేషన్ చైర్మన్ పదవి అప్పగించారన్నారు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి జోగి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కమిటీ ఏర్పాటు

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర కమిటీని నియమించారు. దీనికి అధ్యక్షులుగా జూపూడి ప్రభాకరరావు(అడ్వైజర్), నందిగం సురేష్ (ఎంపీ), కైలే అనిల్ కుమార్ (ఎమ్మెల్యే), డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ (ఎమ్మెల్సీ)లను నియమించారు. 8 మంది జోనల్ ఇన్‌చార్జ్‌లను, ఇద్దరు అధికార ప్రతినిధులను, 20 మంది ప్రధాన కార్యదర్శులను, 11 మంది కార్యదర్శులను, 9 మంది సహాయ కార్యదర్శులను నియమిస్తూ శుక్రవారం పార్టీ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

ఏపీలో 'ఐబీ' అమలుపై ప్రశంస

సమగ్ర విద్యపై యునెస్కోలో ప్రత్యేక సదస్సు



ఏపీ విద్యా సంస్కరణల ప్లకార్డులు చూపుతున్న యునెస్కో, ఐబీ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబీ) సిలబస్ అమలు చేయడాన్ని అంతర్జాతీయ వేదికపై విద్యావేత్తలు ప్రశంసించారు. ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లోని యునెస్కో ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న మూడు రోజుల 'గ్లోబల్ ఇంక్లూజివ్ స్కూల్స్ ఫోరమ్' సదస్సు శుక్రవారం ముగిసింది. చివరిరోజు అసమానతలు లేని సమాజం కోసం సమగ్ర సమీకృత విద్యా బోధన ప్రతి ఒక్కరికీ అందించాలన్న అంశంపై చర్చ జరిగినట్టు యూఎన్‌వో స్పెషల్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఏపీలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి దాదాపు 38 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఐబీ సిలబస్ అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్టు అంతర్జాతీయ వేదికపై చెప్పామన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మారిన పరిస్థితులు, విద్యార్థి-ఉపాధ్యాయుల మధ్య బలపడిన సత్సంబంధాలపై ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల్లో కెపాసిటీ బిల్డింగ్, అవసరమైన సాంకేతిక సహకారం అందించేందుకు సహకరిస్తామని యునెస్కో ఇన్‌క్లూజన్ ఇన్ జెండర్ ఈక్వాలిటీ అండ్ ఎడ్యుకేషన్ హెడ్ తమరా మార్టి కసాడో హామీ ఇచ్చినట్టు షకిన్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియన్ ఎడ్యుకేషనల్ అవార్డు గ్రహీత డోనా రైట్ ఆంధ్రప్రదేశ్ విద్యా సంస్కరణలను ప్రశంసించారన్నారు. ప్రాథమిక విద్యపై ఎన్నో పరిశోధనలు చేసిన రైట్... ప్రభుత్వ పాఠశాలల్లో ఐబీ సిలబస్ అమలుకు ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం గొప్పదని అభినందించినట్లు ఆయన పేర్కొన్నారు. స్విట్జర్లాండ్‌లోని ఐబీ సంస్థ ఈక్విటీ అండ్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ విభాగం సీనియర్ మేనేజర్ డాక్టర్ కళా పరశురామ్ ×పాఠశాలల్లో స్థిరమైన సమ్మిళిత పద్ధతులు×పై పాన్ ఆసియా కమిటీ చర్చలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఐబీ సిలబస్ అమలుకు సంబంధించిన అవసరాలు, విశ్లేషణలో భాగంగా తాము ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించామని, ప్రభుత్వం గొప్ప చారిత్రక నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

టీడీపీ, బీజేపీలకు బుద్ధి చెబుతాం

కాపుసేన గౌరవాధ్యక్షుడు నారాయణమూర్తి

సీతంపేట (విశాఖ జిల్లా): టీడీపీ, బీజేపీలు కాపులను విస్మరించాయని, రానున్న ఎన్నికల్లో వాటికి బుద్ధి చెబుతామని కాపుసేన గౌరవాధ్యక్షుడు బండారు నారాయణమూర్తి స్పష్టం చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి విశాఖలో ఆ రెండు పార్టీలు కాపులకు ఒక్క సీటు కూడా కేటాయించలేదని మండిపడ్డారు. 10 లక్షల జనాభా ఉన్న కాపులకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. కాపులను అణగతొక్కాలనే ధోరణిలో వ్యవహరించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సంఖ్యాపరంగా బలంగా ఉన్న కాపులకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పొత్తుల నెపంతో కాపులను విస్మరిస్తే రానున్న ఎన్నికల్లో మూల్యం చెల్లించక తప్పదన్నారు. గతంలో విశాఖ మూడు నియోజకవర్గాలుగా ఉన్నప్పుడు రెండు సీట్లు కాపులకు కేటాయించారని, ఇప్పుడు ఏడు నియోజకవర్గాలుగా ఉన్నప్పటికీ ఎక్కడా కాపులకు కేటాయించలేదన్నారు. టీడీపీ, బీజేపీలకు కాపుల ఓట్లు అక్కర్లేదా అని ప్రశ్నించారు. టీడీపీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రకటించిన 120 స్థానాల్లో కమ్మ కులస్తులకు 26 స్థానాలు కేటాయించారని, 26 శాతం ఉన్న కాపులకు కేవలం ఎనిమిది సీట్లు ఇవ్వడం అన్యాయమన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో భీమిలి, విశాఖ ఉత్తరం, పశ్చిమం, గాజువాక, అనకాపల్లి టౌన్, చోడవరం, యలమంచిలి నియోజకవర్గాల్లో కాపుల ప్రాబల్యం ఎక్కువగా ఉందని, ఆయా నియోజకవర్గాలను కాపులకు కేటాయించేలా అన్ని రాజకీయ పార్టీలు పునరాలోచన చెయ్యాలన్నారు. ప్రొఫెసర్ కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ ఉత్తర సీటు కాపులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు టి.చంద్రమౌళి, దాసరి రాధాకృష్ణ, లంకా భాస్కరరావు, మద్దింశెట్టి సురేష్, ఎర్రంశెట్టి సురేష్ పాల్గొన్నారు.

చంద్రబాబును తిట్టినోళ్లకు టికెట్లా?

- ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి
- రెండుమూడ్రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని ప్రకటన



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు : గతంలో ఎవరైతే టీడీపీ జెండాలు కాల్చి, చంద్రబాబుతో పాటు ఆయన కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా దూషించారో అలాంటి వారికే ప్రస్తుతం టికెట్ ఇచ్చారని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కంటతడి పెట్టారు. మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి టికెట్ ఇచ్చిన నేపథ్యంలో తన స్వగృహంలో శుక్రవారం పార్టీ ముఖ్య నేతలతో ప్రవీణ్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో పార్టీ ద్వారా లబ్ధి పొంది డబ్బు సంపాదించుకుని అన్ని రకాలుగా బాగు పడ్డారో అలాంటి వారు గతంలో పార్టీని విడిచిపెట్టి వెళ్లారని చెప్పారు. ఎవ్వరూ ముందుకు రాని సమయంలో తాను చంద్రబాబు, లోకేశ్ కోరిక మేరకు నాలుగేళ్ల కిందట పార్టీ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించినట్టు తెలిపారు. టికెట్ తనకు రాలేదని బాధపడటం లేదని, అయితే చంద్రబాబును తిట్టిన వారికి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోవర్టులకు టికెట్ ఇచ్చారన్నదే తన ఆవేదనగా చెప్పారు. పార్టీ కోసం పనిచేసిన తనపై 17 కేసులు నమోదయ్యాయని, ఎవ్వరు లేని సమయంలో పార్టీ కోసం ధర్నాలు, ఆందోళనలు నిర్వహించినట్టు తెలిపారు. రెండు మూడు రోజుల్లో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తానన్నారు. పార్టీ సీనియర్లలో ఎవరికి టికెట్ ఇచ్చినా తాను రూ.20 కోట్లు ఇచ్చి వారి విజయానికి పాటుపడతానని ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కమలాపురం మాజీ ఎమ్మెల్యే జి.వీరశివారెడ్డి పాల్గొన్నారు.

స్క్రైబ్ అవసరం లేకుండా సొంతంగా పరీక్షలు

- ఎవరి సహాయం లేకుండానే పదో తరగతి పరీక్షలు రాయనున్న దివ్యాంగులు
- గతేడాది ఆరుగురు.. ఈసారి పెరిగిన సంఖ్య
- ప్రత్యేక శిక్షణ ఇచ్చిన సమగ్ర శిక్ష విభాగం
- సాధారణ విద్యార్థులతో సమానంగా తర్ఫీదు
- ప్రత్యేక అవసరాలు ఉన్నవారికి 'విజన్ 2025 ఇన్‌క్లూజివ్ ఆంధ్ర'



పరీక్షకు హాజరు కానున్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు

సాక్షి, అమరావతి: దృష్టి లోపంతోపాటు ఇతర దివ్యాంగ విద్యార్థులు పరీక్షలు రాయాలంటే ఇన్నాళ్లూ ప్రత్యేక సహాయకులు (స్క్రైబ్)పైన ఆధారపడేవారు. విద్యార్థులు సమాధానాలు చెబుతుంటే స్క్రైబ్‌లు పరీక్షలు రాసేవారు. అయితే ఇప్పుడు ఆ అవసరం లేకుండానే దివ్యాంగ విద్యార్థులు సొంతంగా పరీక్షలు రాయనున్నారు. ఈ మేరకు సమగ్ర శిక్ష విభాగం విద్యార్థులకు శిక్షణనిచ్చింది. దీంతో స్క్రైబ్‌ల అవసరం లేకుండానే విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయబోతున్నారు. గతేడాది పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక శిక్షణతో ఆరుగురు దివ్యాంగ విద్యార్థులు కంప్యూటర్ సాయంతో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించారు. దేశంలో స్క్రైబ్ సహాయం లేకుండా కంప్యూటర్ ద్వారా పరీక్షలు రాసి విజయం సాధించడం అదే తొలిసారి కావడం విశేషం. ఈ విజయంతో 2023-24 విద్యా సంవత్సరంలో అనంతపురం జిల్లా ఆర్డీటీ హైస్కూల్ ఫర్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ విద్యార్థులు 13 మంది స్వయంగా పరీక్షలు రాయనున్నారు. కాగా గతేడాది పదో తరగతి ఉత్తీర్ణులైన ప్రత్యేక విద్యార్థులు ఇప్పుడు ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలను సైతం కంప్యూటర్ సాయంతో రాయడం విశేషం. ఈనెల 18 నుంచి 24 వరకు జరిగే పదో తరగతి పరీక్షలకు దృష్టిలోపం ఉన్న 11 మంది విద్యార్థులు, ఆర్థోపెడిక్ చాలెంజ్డ్ కేటగిరీ నుంచి ఇద్దరు హాజరవుతున్నారు. వీరు ప్రశ్నపత్రాన్ని కంప్యూటర్‌లో 'రీడర్ సపోర్ట్ సిస్టమ్' ద్వారా విని సమాధానాలు టైప్ చేస్తారు.

ప్రత్యేక శిక్షణతో ముందుకు..

'విజన్ 2025–ఇన్‌క్లూజివ్ ఆంధ్ర' ప్రాజెక్టులో భాగంగా ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు ఎవరి సహాయం లేకుండా స్వయంగా చదువుకునే డిజిటల్ విధానాన్ని సమగ్ర శిక్ష అందుబాటులోకి తెచ్చింది. సాధారణ పిల్లలతో పోలిస్తే వీరేమీ తక్కువ కాదంటూ స్వశక్తితో కొత్త జీవనానికి అలవాటు పడాలనే లక్ష్యంతో శిక్షణ ఇస్తోంది. ఈ విభాగంలో పూర్తి అంధత్వం, తక్కువ దృష్టి, వినికిడి లోపం వంటి ప్రత్యేక అవసరాలు గలవారు, డైస్లెక్సియా, ఆటిజం వంటి న్యూరో, ఆర్థోపెడిక్ సమస్యల వారు ఉన్నారు. సాధారణంగా ఈ విద్యార్థులు స్వయంగా ఏదీ చేయలేరు. కానీ మారిన సాంకేతిక పరిజ్ఞానం, ఆత్మవిశ్వాసం పెంచడం ద్వారా వారిని సాధారణ విద్యార్థులతో సమానంగా తీర్చిదిద్దారు. ప్రాజెక్టులో భాగంగా దాదాపు 1,000 మంది విద్యార్థులకు అభ్యసన సవాళ్లు ఎదుర్కొనేలా శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం 'విజన్ 2025 ఇన్‌క్లూజివ్ ఆంధ్ర' మాస్టర్ ప్లాన్ ప్రాజెక్ట్‌ను చేపట్టామన్నారు. వీరికి టెక్నాలజీ సాయంతో సమర్థంగా తర్ఫీదునిస్తున్నామని చెప్పారు. దీంతో ఇప్పుడు స్వయంగా బోర్డు పరీక్షలు రాసే ప్రత్యేక విద్యార్థుల సంఖ్య పెరిగిందని వివరించారు.

రూ.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ మార్కెట్ నిర్మాణం

నంద్యాల జిల్లా ప్యాపిలిలో భూమి పూజ చేసిన మంత్రి రాజేంద్రనాథ్



భూమిపూజ చేస్తున్న మంత్రి బుగ్గన

ప్యాపిలి: రాష్ట్రానికే తలమానికంగా నంద్యాల జిల్లా ప్యాపిలి సమీపంలో రూ.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ మార్కెట్‌ను నిర్మిస్తున్నట్లు ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తెలిపారు. జాతీయ రహదారికి ఆనుకుని 25 ఎకరాల్లో నిర్మిస్తున్న మార్కెట్ నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో దాదాపు 45 వేల హెక్టార్లలో, డోన్ డివిజన్‌లో 27 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయన్నారు. సరైన మార్కెటింగ్, సరుకు నిల్వ చేసుకునే సౌకర్యం, రవాణా సౌకర్యం, గిట్టుబాటు ధర లేక ఉద్యాన రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. ఉద్యాన రైతుల కష్టాలను తొలగించాలనే ఉద్దేశంతోనే ప్యాపిలిలో టెర్మినల్ మార్కెట్‌కు శ్రీకారం చుట్టామన్నారు. మార్కెట్‌లో బ్యాంకు, పోస్టాఫీసు, పార్కింగ్ సౌకర్యం, వే బ్రిడ్జి, ఓవర్ హెడ్ ట్యాంకు, వాటర్ ప్లాంట్ తదితర అన్ని సౌకర్యాలు ఉంటాయన్నారు. పండ్లు, కూరగాయలు, పూలు నిల్వ ఉంచేందుకు అవసరమైన కోల్డ్ స్టోరేజ్‌లు కూడా నిర్మిస్తున్నామన్నారు. మార్కెట్ ప్రాంగణంలో 86 రిటైల్ షాపులు, 36 హోల్‌సేల్ దుకాణాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జిల్లా ఉద్యాన అధికారి నాగరాజు, హెచ్‌వో కళ్యాణి పాల్గొన్నారు.

వచ్చేనెల్లో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు

గన్నవరం: ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్, బెంగళూరు నుంచి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం గన్నవరానికి కొత్త సర్వీస్‌లను ఏప్రిల్‌లో ప్రారంభించనున్నది. ప్రస్తుతం ఈ సంస్థ షార్జా నుంచి వారానికి రెండు అంతర్జాతీయ విమాన సర్వీస్‌లను నడుపుతోంది. ఈ ఎయిర్‌పోర్ట్‌కు పెరుగుతున్న ప్రయాణికుల ఆదరణను దృష్టిలో పెట్టుకుని దేశీయ విమాన సర్వీస్‌లను నడిపేందుకు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ముందుకు వచ్చింది. తొలుత హైదరాబాద్ నుంచి విజయవాడకు ఏప్రిల్ 16 నుంచి సర్వీస్‌లను ప్రారంభించనుంది.

పేదల కోసం మళ్లీ జగన్ రావాలి

- రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి
- విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయం ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రులు బొత్స దంపతులు, అమర్‌నాథ్

ఎంవీపీకాలనీ (విశాఖ జిల్లా): రాష్ట్రంలో పేదల సంక్షేమం కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. విశాఖలోని లాసన్స్ బే కాలనీలో పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయాన్ని రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి బొత్సా ఝాన్సీతో కలిసి ఆయన ప్రారంభించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రజారంజక పాలన అందించిందన్నారు. ఇలాంటి పాలన మరోసారి రాష్ట్రానికి కావాలని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. 2014లో వందల హామీలిచ్చి అధికారంలోకొచ్చిన చంద్రబాబు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేకపోయాడన్నారు. చంద్రబాబు అభివృద్ధి కేవలం శిలాఫలకాలకే పరిమితం అయ్యిందని ఎద్దేవా చేశారు. విశాఖ అభివృద్ధిపై సీఎం జగన్‌కు ప్రత్యేక విజన్ ఉందన్న ఆయన నగర పరిధిలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ విశాఖ ప్రజలు ఎంపీగా తనకో అవకాశం ఇవ్వాలని కోరారు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాస్, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పలనాగిరెడ్డి, పార్టీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో కేంద్ర సహాయ మంత్రి, హైకోర్టు న్యాయమూర్తి





కేంద్ర సహాయ మంత్రి కైలాష్ చౌదరి, జస్టిస్ చక్రవర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి కైలాస చౌదరి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామిని కూడా దర్శించుకున్నారు.

తిరుమలలో ఆక్టోపస్ మాక్ డ్రిల్



శ్రీవారి ఆలయం వద్ద మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్, ఎస్ఎస్ బృందాలు

తిరుమల: తిరుమలలో శ్రీవారి ఆలయం వద్ద ఆక్టోపస్ సిబ్బంది గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. శ్రీవారి ఆలయం పరిసర ప్రాంతాల్లో భక్తుల భద్రత, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్న సమయంలో స్పందించాల్సిన విధానంపై మాక్ డ్రిల్ జరిగింది. ఇందులో ఎస్ఎస్, టీటీడీ నిఘా, భద్రతా విభాగం, పోలీస్ శాఖ పాల్గొంది. ఈ మాక్ డ్రిల్‌లో 40 మంది ఏపీ ఆక్టోపస్, 140 మంది ఎస్ఎస్ కమాండో సిబ్బంది ఉన్నారు. శ్రీవారి ఆలయంలో ఏకాంతసేవ పూర్తైన తర్వాత భక్తులు లేని సమయంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అనుకోని సంఘటన జరిగితే ఆలయం వెలుపల, లోపల ప్రతిఘటించాల్సిన విధానంపై మాక్ డ్రిల్ జరిగింది.

వలంటీర్‌పై టీడీపీ నేతల దాడి

పెండ్లిమర్రి: వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి మండలంలోని గోపరాజుపల్లె గ్రామానికి చెందిన నంద్యాల శ్రీనివాసులు అనే వలంటీర్‌పై గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నేతలు దాడి చేశారు. గాయపడ్డ వలంటీర్ కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. స్థానికుల కథనం మేరకు..రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి అందించిన సంక్షేమ పథకాల ద్వారా ఎంత మేరకు లబ్ధి చేకూరుతుందోనని ఇంటింటికి పత్రాలు ఇస్తుండగా టీడీపీ నేతలు 'మా కుటుంబానికి ఈ ప్రభుత్వం ఏమి చేయలేదు. మాకు ఎందుకు పత్రాలు ఇస్తున్నావు' అంటూ గొడవకు దిగి దాడి చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓ దేవగణాల్లారా! మేము భగవంతుడిని ఆరాధిస్తూ
మా చెవులతో కల్యాణ కారక విషయాలే వినేట్లు చేయండి.
కళ్లతో కల్యాణదాయకమైన దృశ్యాలే చూచేట్లు చేయండి.
– ప్రశ్నోపనిషత్తు

సాక్షి
శనివారం, 16 మార్చి 2024

రష్యాలో ఎన్నికల తంతు!

ఆపద్ధర్మ ఏలుబడితో కలుపుకొని ప్రధానిగా, దేశాధ్యక్షుడిగా పాతికేళ్లనుంచి అవిచ్ఛిన్నంగా రష్యా అధికార పీఠాన్ని అంటిపెట్టుకునివున్న వ్లాదిమిర్ పుతిన్ మరోసారి సార్వత్రిక ఎన్నికల తంతుకు తెరలేపారు. మూడురోజులపాటు జరిగే ఈ ఎన్నికలు శుక్రవారం మొదలయ్యాయి. 14 కోట్ల 30 లక్షలమంది జనాభాగల రష్యాతోపాటు 2014లో అది దురాక్రమించిన క్రిమియా... 2022 నుంచీ దాని ఆక్రమణలోవున్న ఉక్రెయిన్‌లోని కొన్ని ప్రాంతాల్లో కూడా ఈ ఎన్నికలు జరుగుతాయి. ప్రభుత్వ మీడియా మినహా మరి దేనికీ చోటీయని రష్యాలో చిన్నపాటి అసమ్మతి వినిపించే ప్రయత్నం చేసినా పెద్ద నేరమవుతుంది. అందుకే ఎన్నికల ముందు నిర్వహించిన సర్వేలన్నీ పుతిన్‌కు 80 శాతం ప్రజల ఆమోదం వున్నదని చాటాయి. కనుక 71 యేళ్ల పుతిన్ మరోసారి విజయం సాధించి అయిదోసారి అధ్యక్షుడవుతారనీ, 2030 వరకూ ఆయనే పాలిస్తారనీ అందరికీ తెలుసు. ఈ ఎన్నికలు సక్రమంగా జరుగుతున్నాయని చెప్పటానికి నామమాత్రంగా ప్రత్యర్థులు కనబడతారు. కానీ వారెవరికీ ప్రజల్లో విశ్వసనీయత లేదు. ఒకప్పుడు దశాబ్దాలపాటు దేశాన్నేలిన కమ్యూనిస్టు పార్టీ ఏనాడో నామ మాత్రావశిష్టమైంది. ఆ పార్టీ తరఫున 75 యేళ్ల నికొలాయ్ ఖరిటోనోవ్ పోటీచేస్తున్నారు. 2004లో పుతిన్‌పై మొదటిసారి ఓడిన ఆయన్నే ఈసారి కూడా ఆ పార్టీ నిలబెట్టింది. ఎటూ గెలవని ఎన్నికల కోసం మరొకరిని ముందుకు తోయటం అనవసరమని ఆ పార్టీ భావించివుండొచ్చు. లిబరల్ డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి లియోనెడ్ స్లట్‌స్కీ... పుతిన్ మాదిరే జాతీయవాది. ఆయన గెలుపే తన గెలుపని స్లట్‌స్కీ ఇప్పటికే ప్రకటించారు. ఉదారవాదిగా ముద్రపడి ఉక్రెయిన్‌లో 'శాంతి' నెలకొనాలని తరచు చెప్పే న్యూ పీపుల్ పార్టీ అధినేత వ్లాడిస్లావ్ దవాన్‌కోవ్‌ది కూడా అదే తీరు. ఇక ఉక్రెయిన్‌తో తలపడటాన్ని తప్పుబట్టిన చరిత్రగల ఇద్దరు అభ్యర్థులను అధికారులు 'అనర్హులుగా' తేల్చారు.

చాలా దేశాలకు ఇది ఎన్నికల నామ సంవత్సరం. ఇప్పటికే బంగ్లాదేశ్, తైవాన్ ఎన్నికలు పూర్తయ్యాయి. మన దేశంతోపాటు అమెరికా, బ్రిటన్, దక్షిణాఫ్రికా, ఇండొనేసియా తదితర 60 దేశాల్లో ఈ ఏడాదంతా వేర్వేరు నెలల్లో ఎన్నికలుంటాయి. ఈ ఎన్నికల్లో దాదాపు 200 కోట్లమంది ఓటు హక్కు వినియోగించుకుంటారు. అంటే ప్రపంచ జనాభాలో నాలుగోవంతన్నమాట! అయితే విజేతలై గద్దెనెక్కేవారు ప్రజాస్వామ్యబద్ధంగానే పాలిస్తారా అన్నది వేరే సంగతి. ఎందుకంటే ప్రజాస్వామ్యం ముసుగేసుకున్న నియంతలూ, సమాజంలో పరస్పర వైషమ్యాలు రెచ్చగొట్టే నేతలూ, గాలి కబుర్లతో గద్దెనెక్కాలనుకునేవారూ ఈ దేశాలన్నిటా వున్నారు. కానీ పుతిన్ మాదిరి బరితెగించిన నేత ఎక్కడా కనబడరు. క్రితంసారి ఎన్నికలకన్నా ఎక్కువ పోలింగ్ అయిందనీ, పుతిన్‌కు అధిక శాతం మద్దతు లభించిందనీ 'నిరూపించటానికి' అధికారగణం ఎక్కడలేని పాట్లూ పడుతూ వుంటుంది. 2018 ఎన్నికల సమయంలో పోలైన ఓట్లలో పుతిన్‌కు 5 కోట్ల 60 లక్షల ఓట్లు లభించాయి. కనుక ఈసారి అది ఆరు కోట్లు దాటాలన్నది వారి పట్టుదల. తమ అధీనంలోని ఉక్రెయిన్ భూభాగంలో 45 లక్షలమంది ఓటర్లున్నారని అధికారులు చెబుతున్నారు. కానీ నిత్యం బాంబుల వర్షం కురిసేచోట నిజానిజాలు నిర్ధారించేదెవరు? వారందరికీ ఆన్‌లైన్ వోటింగ్‌కు అవకాశం ఇచ్చామని అధికారులు ప్రకటించారు. కనుక రిగ్గింగ్ ఈసారి పాత రికార్డులు బద్దలుకొడుతుందని నిర్ధారణగా చెప్పవచ్చు. వారం పదిరోజుల్లో ఉక్రెయిన్ లెక్క తేల్చి, యుద్ధ విజేతగా చాటుకుని అధ్యక్ష ఎన్నికలకు వెళ్లాలని పుతిన్ తపించారు. కానీ 2022 ఫిబ్రవరిలో యుద్ధం మొదలైన నాటి నుంచీ రష్యాకు అడుగడుగునా అవరోధాలే. అమెరికా ఉక్రెయిన్‌కు భారీయెత్తున సైనిక, ఆర్థిక సాయం అందించటమే కాదు...'ఉక్రెయిన్ తర్వాత మీవంతే' అని నాటో కూటమి దేశాలను బెదరగొట్టి ఆ దేశం పక్షాన నిలబడేలా చేసింది. కనుక యుద్ధం రెండేళ్లుదాటి మూడో సంవత్సరంలోకి ప్రవేశించినా పుతిన్‌కు అక్కడ దారీ తెన్నూ కనబడటం లేదు. పైపెచ్చు ఆ యుద్ధంలో రష్యా సైనికులు భారీ యెత్తున మరణిస్తుండటం, అత్యాధునిక ఆయుధాలు అక్కరకు రాకుండా పోవటం, ఉక్రెయిన్ డ్రోన్ దాడులను నిలువరించటంలో వైఫల్యం వంటివి ఆయనకు నిరాశ కలిగిస్తున్నాయి. కానీ ఆ యుద్ధం వల్ల పుతిన్‌కు జనాల్లో ఆమోదనీయత పెరిగిందని ప్రభుత్వ మీడియా ఊదరగొడుతోంది.

అయితే పుతిన్ ఏలుబడి నల్లేరు మీద నడక కాదు. 2006–08 మొదలుకొని రెండేళ్లనాడు మొదలైన ఉక్రెయిన్ దురాక్రమణ యుద్ధం వరకూ ఏదో పేరిట చెలరేగే నిరసనలు తలనొప్పిగానే వున్నాయి. అవినీతికి వ్యతిరేకంగా, హక్కుల ఉల్లంఘన, దురాక్రమణ యుద్ధాలను నిరసిస్తూ ఈ ఉద్యమాలు సాగాయి. అయితే పుతిన్ వాటన్నిటినీ అణిచేసి, జైళ్లు నింపారు. ప్రస్తుతం రాజకీయ ఖైదీల సంఖ్య 1,16,000 పైమాటే. దేశ పౌరుల్లో పుతిన్ పాలనపై తీవ్ర అసంతృప్తి వుంది. ప్రభుత్వ వ్యయంలో 40 శాతం యుద్ధానికే కేటాయించాల్సివస్తోంది. అయినా ఫలితం నాస్తి. నిరుడు జీడీపీ 3.6 శాతంగా నమోదై జీ–7 దేశాలను అధిగమించింది. రక్షణరంగ పరిశ్రమలు మాత్రమే పచ్చగా వర్ధిల్లుతున్నాయి. అమెరికా ఆంక్షల పర్యవసానంగా దేశంలో అనేక వ్యాపార సంస్థలు కుప్పకూలి మూతబడ్డాయి. వాస్తవాదాయాలు పడిపోయి, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటి పౌరులు సతమతమవుతున్నారు. దానికితోడు అంతర్జాతీయంగా ఏకాకులమయ్యామన్న అసంతృప్తి అదనం. కానీ అధ్యక్ష ఎన్నికల్లో వీటి ప్రభావం కనబడనీయకపోవటం పుతిన్ ప్రత్యేకత. ఈ రీతి, రివాజు ఎన్నాళ్లు కొనసాగుతుందో, నిజమైన ప్రజాస్వామ్యం రష్యాలో ఎప్పుడు చిగురిస్తుందో చూడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** శు.సప్తమి తె.2.38 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి అష్టమి, **నక్షత్రం:** రోహిణి రా.9.03 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** ప.1.10 నుండి 2.42 వరకు, తదుపరి తె.2.42 నుండి 4.18 వరకు (తెల్లవారితే ఆదివారం), **దుర్ముహూర్తం:** ఉ.6.11 నుండి 7.45 వరకు, **అమృతఘడియలు:** సా.5.57 నుండి 7.37 వరకు.

సూర్యోదయం : 6.10
సూర్యాస్తమయం: 6.06
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

రైతు బాగే దేశ స్వావలంబన

విశ్లేషణ



డా॥ దొంతి నరసింహా రెడ్డి

పంటల ఉత్పత్తి ఖర్చు నిర్ధారణలో అనేక లోపాలు ఉన్నాయి. ఉత్పత్తి ఖర్చును రాష్ట్రాల వారీగా సేకరించి, దానిని దేశ 'సగటు'గా మార్చడం వల్ల రైతులకు నష్టం జరుగుతున్నది. ఒకే పంటకు దేశ వ్యాప్తంగా సాగు ఖర్చులో తేడా ఉంటుంది. ప్రతి పంటలో అనేక వెరైటీలు ఉన్నా ఒకే మద్దతు ధర ఉంటుంది. వరిలో కొన్ని వందల రకాలున్నా, కనీస మద్దతు ధర అన్నింటికీ ఒకటే. ఈ తేడాలను కనీస మద్దతు ధర నిర్ణాయక వ్యవస్థ పరిగణనలోనికి తీసుకునే పరిస్థితి లేదు. ధరలు రాని పంటలను రైతులు వేయడం మానేస్తారు. ఆ పంటలు వేయడం మానేస్తే, పంట పండించే జ్ఞానం, నైపుణ్యం కోల్పోతాము. క్రమంగా, స్వావలంబన కోల్పోతే ఇతర దేశాల పెత్తనానికి దాసోహం కావాల్సి వస్తుంది.

వ్యవసాయ ఖర్చులు ధరల కమిషన్ (సీఏసీపీ) కేవలం మద్దతు ధరను సిఫారసు చేస్తుంది. సిఫారసు చేసిందే కేంద్ర ప్రభుత్వం నిర్ణయించాలని లేదు. ఉదా: 2023–24 రబీ సీజన్లో గోధుమలకు వారు క్వింటాలుకు రూ. 2,300 సిఫారసు చేస్తే, క్యాబినెట్ ఆమోదించింది రూ. 2,125 మాత్రమే. కనీస మద్దతు ధర నిర్ణయంలో కనీసం 12 అంశాలను పరిశీలిస్తారు. అయితే 12 అంశాలలో ఉత్పత్తి ఖర్చు తప్పితే, మిగతా అంశాలు కనీస మద్దతు ధర నిర్ణయంలో ఎటువంటి పాత్ర పోషిస్తాయో స్పష్టత లేదు. పంటల ఉత్పత్తి ఖర్చు నిర్ధారణలో కూడా అనేక లోపాలు ఉన్నాయి. ఉత్పత్తి ఖర్చు రాష్ట్రాల వారీగా సేకరించి, దానిని దేశ 'సగటు'గా మార్చడం వల్ల కూడా రైతులకు నష్టం జరుగుతున్నది. ఒకే పంటకు దేశ వ్యాప్తంగా సాగు ఖర్చులలో తేడా ఉంటుంది. దీనిని సగటు చేస్తే, ఖర్చు ఎక్కువ అవుతున్న రైతులకు నష్టం అవుతున్నది.

సాగు ఖర్చు ఎందుకు పెరుగుతున్నదనే విషయం మీద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సమీక్ష ఎన్నడూ చేయలేదు. రైతు ఆత్మహత్యల తదనంతరం జరిపిన అధ్యయనాలు రైతుల మీద పెరుగుతున్న ఖర్చు, మార్కెట్లో గిట్టుబాటు ధర పరిస్థితి గురించి ప్రధానంగా ప్రస్తావించాయి. రైతు కొనే విత్తనాలు, ఎరువులు, కీటకనాశకాలు అన్ని కంపెనీల లాభాలు అవుతున్నాయి. కృత్రిమ ఎరువులు, రసాయన కీటక నాశకాలు సారవంతమైన మట్టిని విషతుల్యం చేస్తూ, రైతును 'బానిసను' చేస్తున్నాయి.

రాష్ట్రాల వారీగా జరిపే ఉత్పత్తి ఖర్చు నిర్ధారణ కూడా సరిగా, పారదర్శకంగా లేదు. చిన్న రైతు ఎదుర్కొనే అన్ని రకాల ఖర్చులను సేకరించే వ్యవస్థ లేదు. రాష్ట్రాలు అందించే రాష్ట్ర స్థాయి 'సగటు' లెక్కలను సీఏసీపీ తన స్వీయ ఆలోచన మేరకు తగ్గిస్తూ ఉంటుంది. స్థూలంగా, పంటల మీద ఖర్చును దశల వారీగా, వివిధ స్థాయిలలో 'తరుగు' చేస్తున్నది. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చుని శాస్త్రీయంగా, పారదర్శకంగా నిర్ధారించే వ్యవస్థ అవసరం. రైతులు కోరుతున్నట్లుగా ధరలకు చట్టబద్ధత కల్పిస్తే, ఈ వ్యవస్థ లోపాలు బయటకు వస్తాయని కూడా విధాన నిర్ణేతల ఆందోళన కావచ్చు. ప్రపంచ వాణిజ్య సంస్థ పరిధిలో విధించిన షరతులు కూడా ఒక కారణం.

కనీస మద్దతు ధర అన్ని పంటలకు ఇవ్వరు. 1964–65లో వరి, గోధుమలకు మాత్రమే కనీస మద్దతు ధరను నిర్ణయించేవారు. కాలక్రమేనా 23 పంటలకు చేరింది. పసుపు, జొన్నలు, తృణధాన్యాలు వంటి పంటలకు లేవు. భారత దేశంలో దాదాపు 600 పంటలు పండించేవారు. అనేక పంటలు కనుమరుగు అయినాయి, అవుతున్నాయి. ఖర్చులు ఎక్కువ, రాబడి తక్కువ, సారవంతమైన మట్టి కనుమరుగు అవ్వడం, కలుషిత నీళ్ళు, నీటి కొరత, పురుగుల బెడద, వన్యప్రాణుల దాడులు, నాణ్యమైన విత్తనాల కొరత, కూలీల కొరత, ఇంకా ఇతర ఆర్థిక, సామాజిక, పర్యావరణ అంశాల నేపథ్యంలో రైతులు క్రమేణా



కొన్ని పంటలకే పరిమితం అవుతున్నారు. ఈ నిర్ణయంలో కనీస మద్దతు ధర పాత్ర కూడా ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి.

కనీస మద్దతు ధరల వ్యవస్థ మీద నాలుగు కమిటీలు అనేక సూచనలు ఇచ్చాయి – ఝా కమిటీ (1965), సేన్ కమిటీ (1979), హనుమంతరావు కమిటీ (1990), వై.కే.అలఘ్ కమిటీ (2005). 2007లో ప్రణాళిక సంఘం, 2017లో నీతి ఆయోగ్ నివేదికలు కూడా ఉన్నాయి. ఈ సూచనలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. 2005 కమిటీ వ్యవసాయ ధరల కమిషన్‌కు చట్టబద్ధత కల్పించాలని సిఫారసు చేసింది. అంటే, కనీస మద్దతు ధర చట్టబద్ధతను అది ఆమోదించింది. ధర నిర్ణయంలో నాణ్యత కూడా కీలకం అని ఈ కమిటీ భావించింది.

వివిధ పంటలకు మార్కెట్ కాలం రెండు లేక మూడు నెలలు మాత్రమే ఉంటుంది. రబీ పంటల మార్కెటింగ్ కాలం ఏప్రిల్ నుంచి జూన్ వరకు మాత్రమే. ఆయా పంటల సరఫరా డిమాండ్లతో సంబంధం లేకుండా మద్దతు ధరలు మాత్రం సంవత్సరం పాటు స్థిరంగా ఉంటాయి. ప్రతి పంటలో అనేక రకాల వెరైటీలు ఉన్నా ఒకే మద్దతు ధర ఉంటుంది. వరిలో కొన్ని వందల రకాల విత్తనాలు ఉన్నా, కనీస మద్దతు ధర అన్నింటికీ ఒకటే. వరి రకం బట్టి పంట కాలం ఉంటుంది. ఆ మేరకు ఖర్చులలో కూడా తేడా ఉంటుంది. కొన్ని 80 రోజుల పంట అయితే, ఇంకొన్ని 160 రోజులు ఉంటాయి. ఈ తేడాను కనీస మద్దతు ధర నిర్ణాయక వ్యవస్థ పరిగణనలోనికి తీసుకునే పరిస్థితి లేదు. అంతా స్థిరమైన సగటు.

ధర రాక రైతులు రాబోయే సంవత్సరంలో ఈ పంట వేయడం ఆపేస్తే ఆ పంట సరఫరాపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. దాని మీద ఆధారపడ్డ వినియోగదారులకు, పరిశ్రమలకు (పంట ముడిసరుకుగా వాడే వాటికి) ధర పెరుగుతుంది. ఏదైనా పంట దిగుబడి తగ్గి, సరఫరా తగ్గి, ధర పెరిగితే వెంటనే దిగుమతులకు అనుమతులు ఇస్తుంది ప్రభుత్వం. అయితే ఆ యేడు వరకే దిగుమతులను 'నల్లా తిప్పి బంజేసినట్లు' చేసే పరిస్థితి ఉండదు. సాధారణంగా అంతర్జాతీయ వాణిజ్యంలో సరఫరా ఒప్పందాలు గిట్టుబాటుగా కొన్ని సంవత్సరాల కొరకు చేసుకుంటారు. దిగుమతులు కొనసాగితే దేశీయంగా ధర మళ్లీ పెరిగే అవకాశం లేక రైతులు ఆ పంట వేయడం పూర్తిగా మానేస్తారు. పప్పుల విషయంలో అదే అయ్యింది. 2015లో కొరత ఉందని అనుమతిస్తే సరఫరా ఒప్పందాలు 7 సంవత్సరాలకు చేసుకుని దిగుమతులు పెంచారు. రైతులకు ధర వచ్చే ఆశ లేక పూర్తిగా వేయడం మానేశారు. దరిమిలా పప్పుల ఉత్పత్తిలో అగ్రగామి అయిన భారత్ ఇప్పుడు దిగుమతుల మీద ఆధారపడే పరిస్థితి వచ్చింది. అటు వినియోగదారులకు పప్పుల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. పప్పులకు కనీస మద్దతు ధర (ఖర్చుకు అనుగుణంగా) ఇస్తేనే రైతులు మళ్లీ వేస్తారు. అధిక ధరలకు దిగుమతి చేసుకుంటున్న ప్రభుత్వం కనీస మద్దతు పెంచడానికి ఇష్టపడటం లేదు.

వంట నూనె విషయంలో ఇంకో విధంగా మన స్వావలంబన కోల్పోయాం. ముడి పామాయిల్ దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటు చేసిన వ్యవస్థ వల్ల ఏర్పడింది. తక్కువ ధరకు పామాయిల్ రావడంతో, తక్కువ ధరకు వినియోగదారులకు అందిస్తే రాజకీయ ప్రయోజనం అని చూసుకుని ప్రభుత్వం ఆయా సంవత్సరాలలో పెరుగుతున్న పామాయిల్ దిగుమతులను పట్టించుకోలేదు. పైగా దిగుమతి సుంకాలను సున్నా చేసింది. ఫలితంగా, మనం పండించే వేరుశనగ, నువ్వులు, ఆముదాలు, ఆవాలు వంటి 9 రకాల వంట నూనె గింజల పంటల విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది. వంట నూనె నిత్య అవసరం కాబట్టి ఇప్పుడు ఆ దిగుమతి మానలేము. అది మానకుంటే రైతులకు ధర రాక ఇక్కడ నూనె గింజల ఉత్పత్తి పెరిగే పరిస్థితి లేదు.

డిమాండ్ ఉన్న రకాల పంటలు వేసే ప్రోత్సాహక పరిస్థితి రైతులకు లేకుండా పోయింది. ప్రభుత్వం జోక్యం వల్ల మార్కెట్లకు నష్టం అని భావించేవారు, ఈ పరిస్థితిని ప్రభుత్వ జోక్యం లేకుండా ఎట్లా మారుస్తారో చెప్పాలి. రైతులు ఆ యా పంటలు వేయడం మానేస్తే, పంట పండించే జ్ఞానం, నైపుణ్యం, సామర్థ్యం కోల్పోతాము. ఇప్పుడు చెరుకు కోసే నైపుణ్యం ఉన్న కూలీలు దొరకడం లేదు. తిరిగి ఆ పంట కావాలంటే ప్రభుత్వం పెట్టుబడులు పెట్టాల్సిందే. అప్పుడు పెట్టుబడులు పెట్టే బదులు, ప్రభుత్వం ఇప్పుడే మార్కెట్లో జోక్యం చేసుకుని, రైతులకు గిట్టుబాటు ధర ఇస్తే అందరూ సంతోషంగా ఉంటారు కదా! లేకుంటే మనం కొన్ని ఆఫ్రికన్ దేశాల మాదిరి అయిపోతాం. నిరంతరం సముద్ర తీరాల వైపు చూడాల్సి వస్తుంది. క్రమంగా, స్వావలంబన కోల్పోతే ఇతర దేశాల పెత్తనానికి దాసోహం కావాల్సి వస్తుంది.

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఏమనగలం?



మలప్పురం (కేరళ) సంఘటనలో హైలైట్ అక్కడ జరిగిన హింస కాదు. ఆఫ్రికన్లను మల్లులు 'నల్ల పిల్లి' అని పిలవడం.

– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

అమ్మడమైతే సంతోషమే!



మొత్తానికి హైదరాబాద్ ట్రాఫిక్ జంక్షన్లలో కూడా పుస్తకాలు అమ్ముతున్నారు. కచ్చితంగా అవి పైరేటెడ్ పుస్తకాలే అయివుంటాయి. ఏమైనా పరస్పర విరుద్ధమైన భావోద్వేగాలు.

– శ్రీరామ్ కర్రి, జర్నలిస్ట్

మెరుగైన రంగు



ఎన్నికల బాండ్ల పథకం పరిపూర్ణమైనది కాదనీ, అంతకుముందు ఉన్నదానికన్నా మెరుగైనదనీ 'ఇండియా టుడే కాన్‌క్లేవ్'లో కేంద్ర ఆర్థిక మంత్రి చెబుతున్నారు. నిజమే. గతంలో అది పూర్తిగా నల్లధనం. కాకపోతే ఇప్పుడు దాని రంగు కొద్దిగా నెరిసింది.

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

రొటీన్



భారత ప్రధానో, ఇంకెవరైనా మంత్రో అరుణాచల్ ప్రదేశ్‌లో పర్యటిస్తూనే ఉంటారు. దీనికి చైనా అభ్యంతరం చెబుతూనే ఉంటుంది. మళ్లీ ఆ అభ్యంతరాన్ని ఇండియా తిరస్కరిస్తూనే ఉంటుంది. ఇదేం కొత్త విషయం కాదు.

– తన్వీ మదన్, సీనియర్ ఫెలో

దేశభక్తుడు



అసాధారణ దేశభక్తుడు నేవీ మాజీ చీఫ్ అడ్మిరల్ రాందాస్. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, స్వేచ్ఛ, సమానత్వం లాంటి భారత రాజ్యాంగంలోని మూల సూత్రాల పరిరక్షణలో సాహసోపేత గొంతుక ఆయన. భారత్, పొరుగు దేశాల మధ్య శాంతి, స్నేహాలను సమర్థించారు. ఓం శాంతి! (మార్చ్ 15న మరణించారు.)

– సుధీంద్ర కులకర్ణి, పొలిటికల్ యాక్టివిస్ట్

బాధ్యత ఉండాలిగా!



అపార్ట్‌మెంట్ల లిఫ్టుల్లో పిల్లలను పెంపుడు కుక్కలు కరుస్తున్న ఘటనలను చూస్తున్నాం (ఒక వీడియో వైరల్ అయింది). నిజానికి చాలా రకాల కుక్కలను సరైన శిక్షణతో సౌమ్యంగా ప్రవర్తించేలా చేయవచ్చు. ఇండియాలో చాలామంది పెట్ ఓనర్లు ఫ్యాన్సీ బ్రీడ్లను కొంటారుగానీ, శిక్షకుల కోసం నయాపైసా చెల్లించరు.

– శరణ్ షణ్ముగం, ఆంట్రప్రెన్యూర్

తల్లులూ చదివేలా...



పవిత్ర మాసం రమదాన్ స్ఫూర్తిని ప్రతిఫలించేలా, విద్యకు మద్దతు ఇవ్వడానికి 'మదర్స్ ఎండోమెంట్' ప్రోత్సాహం ప్రకటించారు (దుబాయ్ పాలకుడు) షేక్ మొహమ్మద్ (బిన్ రషీద్ అల్ మఖ్తూమ్). ఇది అందరు తల్లుల పైచదువుల కోసం ఉపకరిస్తుంది. కరుణ, సంఘీభావాలను కలిగివున్న 'ఎమిరాటీ' విలువలకు మనం మద్దతు ఇద్దాం.

– హమ్దాన్ బిన్ మహమ్మద్, దుబాయ్ యువరాజు

ఇన్ బాక్స్

నకిలీ పరిశోధకులను శిక్షించాలి

మన దేశంలో ఇటీవలి కాలంలో శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రచురించే పరిశోధనా పత్రాల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది. 'సైనాల్' లెక్కల ప్రకారం 2017–22 మధ్య ఈ పెరుగుదల 55 శాతంగా వుంది. అయితే మన దేశంతో పాటు ప్రపంచంలో అనేక చోట్ల పరిశోధకులు సమర్పించే పరిశోధనా వ్యాసాలు నకిలీవని తేలుతోంది. అందుకే చాలామంది వాటిని ఉపసంహరించుకుంటున్నారు. మనదేశం నుండి ప్రచు రించిన పరిశోధనా పత్రాలను రాసినవారు వెనక్కి తీసుకొంటున్నారు. దానికి కారణం శాస్త్ర విజ్ఞాన చౌర్యమే. 2010 నుండి ఈ ఉపసంహరణలు జరుగుతున్నా, ఇటీవలి కాలంలో ఇవి మరీ ఎక్కువవుతున్నాయి. 2017–19 కాలంలో 595 పత్రాలను శాస్త్ర వేత్తలు ఉపసంహరించుకోగా, 2020 –22 కాలంలో దాదాపు ఇవి రెండున్నర రెట్లు పెరిగాయి (1,550 పత్రాలు). ఈ ఉపసంహరణల్లో మన దేశం 3వ స్థానంలో వుంది. దేశంలోని అత్యున్నత సంస్థలైన ఐఐటీల నుండి కూడా పరిశోధనా పత్రాల ఉపసంహరణలు ఎక్కువగా వుండటం విచారకరం.

ప్రపంచంలోనే మన దేశం అతి పెద్దనకిలీ పరిశోధనా పత్రాల ప్రచురణా నిలయంగా మారింది. దేశంలోపల చూస్తే... మధ్యప్రదేశ్ మిగిలిన రాష్ట్రాల కన్నా ముందంజలో వుంది. ఇది ఒక కుటీర పరిశ్రమలా రూపు దిద్దుకుని, మాఫియా చేతుల్లో నడుస్తోంది అంటే నమ్మ శక్యం కాదు. ఇక్కడ ఎడిటర్లు, ఎడిటోరియల్ బోర్డులు, పరిశీలకులు, పర్య వేక్షకులు ఎవ్వరూ ఉండరు. కేవలం ప్రచురణ కర్తలే ఉంటారు. డబ్బు కోసం ఏ చెత్తనైనా ప్రచురించి దేశం మీదకు వదులుతారు.

అంతర్జాతీయ స్థాయిలో ఇదొక పెద్ద కుంభకోణంగా మారుతోంది. ప్రముఖ ప్రచురణ సంస్థ 'నేచర్' లెక్కల ప్రకారం 2023లో పదివేలకు పైగా పత్రాలు ఉపసంహరణకు గురియ్యాయి. పరిశోధన పత్రాలు సమర్పించిన తరువాత సమీక్షకులు, నిపుణులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోవటం, పరిశోధనా ఫలితాలు ఆలోచనలు, పద్ధతులు నమ్మశక్యంగా లేకపోవటం వంటి 109 కారణాల వల్ల పరిశోధనా పత్రాలు ఉపసంహరణకు గురి అవుతున్నాయి. నకిలీ పత్రాలను ప్రచురించే వారిని పరిశోధనల్లో పాల్గొనకుండా జీవితం కాలం పాటు నిషేధం విధించాలి. అటువంటి పత్రాలను ప్రచురించే జర్నళ్ళ సంపాదకులను కూడా కఠినంగా శిక్షించాలి. అప్పుడే పరిశోధనల నాణ్యత పెరుగడానికి అవకాశం ఉంది.

– ఈదర శ్రీనివాసరెడ్డి, గుంటూరు

సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా ఎన్నికలకు వైసీపీ

అభిప్రాయం



కన్నోజు శ్రీహర్ష

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరికొన్ని రోజుల్లో ఎన్నికలు జరగబోతున్నాయ్. ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలు, అనుసరించే విధానాలను బట్టే ప్రజలు ఆ ప్రభుత్వాలను నడిపే పార్టీలను మళ్లీ ఎన్నుకోవాలా, వద్దా అని నిర్ణయించుకుంటారు. గడిచిన 5 ఏండ్లలో వైసీపీ ప్రభుత్వం అనేక కొత్త పథకాలను, విధానాలను ప్రవేశపెట్టింది. ఇటీవల కాగ్ రిపోర్టులో సామాజిక పెట్టుబడిలో మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉంది. 'నవరత్నాలు' అనే కొత్త భావనతో 2019 నుండి 2024 వరకు జగనన్న ప్రభుత్వం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకునే విధంగా పథకాలను, విధానాలను రూపొందించి ముందుకుపోతున్నది. జగన్ ప్రవేశపెట్టిన వాలంటీర్ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, నాడు – నేడు లాంటి విధానాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి.

2019లో వైసీపీ ప్రభుత్వం మొట్టమొదటగా రైతులు, ఆరోగ్యం, విద్యపై దృష్టి కేంద్రీకరించింది. రాష్ట్రంలో మొదటిసారి 'వైఎస్సార్ రైతు భరోసా' పేరుతో 13,500 రూపాయలను నేరుగా రైతుల ఖాతాలోకి పంపుతోంది జగన్ ప్రభుత్వం. 'పొలం బడి' పేరు మీద రైతులకు అధునాతన సాగు విధానాలను వివరిస్తున్నారు. రైతు అకస్మాత్తుగా చనిపోతే బీమా సహాయాన్ని 7 లక్షల రూపాయల వరకు పొందుతున్నారు.

విద్యా రంగంలో భారీ సంస్కరణలను ప్రభుత్వం తీసుకువచ్చింది. మొదటిగా విద్యార్థులందరికీ మంచి దుస్తులు, బ్యాగులు అందించే 'జగనన్న విద్య కానుక' పథకం ఆదర్శనీయం. ఇంగ్లీష్ మీడియంను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టింది. విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేసే విధంగా బైజూస్ తదితర సంస్థలతో ఒప్పందం చేసుకొని విద్యార్థులకు అధునాతన



విద్యను అందిస్తున్నది. జాతీయ స్థాయిలో సైతం 'జగనన్న గోరుముద్ద' పథకం ప్రశంసలు పొందింది. జగన్ ప్రభుత్వ 'నాడు – నేడు' కార్యక్రమం ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలిచింది.

మన రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఆరోగ్య రంగంలో విప్లవాన్ని తీసుకువచ్చింది. 'ఆరోగ్య శ్రీ' పరిమితిని 25 లక్షల వరకు పెంచి, మరిన్ని జబ్బులకు ఈ పథకాన్ని విస్తరించారు. కొత్త మెడికల్ కళాశాలలు ఏర్పాటయ్యాయి. 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం ఆరోగ్య రంగంలో విప్లవాన్ని తెచ్చింది.

గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందినట్లే. 2019 వైసీపీ ప్రభుత్వం సంచలనాత్మకంగా 'వాలంటీర్' వ్యవస్థను స్థాపించింది. వాలంటీర్ విధానం ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజల ఇంటి వద్దకు చేరవేస్తున్నారు. మహిళలకు ఉపాధి కల్పించే విధంగా 'వైఎస్సార్ చేయూత' పథకం ఉపకరిస్తోంది. 'చేదోడు పథకం' క్రింద బడుగు బలహీన వర్గాలకు పనిముట్లు అందించడం, 'అమ్మఒడి' పథకం క్రింద 15 వేల రూపాయల సహాయాన్ని మహిళలు పొందుతున్నారు. ఈ విధంగా సామాజిక విప్లవానికి వైసీపీ ప్రభుత్వం బాటలు వేసింది

సోలార్, పవన విద్యుత్తులకు భారీగా ప్రోత్సాహకాలు అందించడం లక్ష్యంగా పర్యావరణ హిత విధానాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోంది ప్రభుత్వం. విశాఖ – చెన్నై పారిశ్రామిక కారిడార్, చెన్నై– బెంగళూరు పారిశ్రామిక కారిడార్లో పవన విద్యుత్తు హబ్బులను ఏర్పాటు చేస్తోంది.

ఇలా సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న వైసీపీ ప్రభుత్వం మరోసారి వస్తేనే లక్ష్యాలు సంపూర్ణంగా నెరవేరడానికి అవకాశముంటుంది. ఆ దిశలో రాబోయే ఎన్నికల్లో ప్రజలు నిర్ణయం తీసుకుంటారని పరిశీలకులు అంటున్నారు.

వ్యాసకర్త జేఎన్‌టీయూ ఎంటెక్ విద్యార్థి
మొబైల్ : 89851 3003

విశ్వ మానవ ప్రేమ తత్త్వం

సర్వమానవాళి గురించి ఆలోచించి పవిత్రత, శాంతి, సమత, న్యాయము అన్న వాటి గురించి అభిప్రాయాలు వ్యక్తీకరించడంలో తిరువళ్ళువర్ అగ్రగణ్యుడు. ఆయన రాసిన 'తిరుక్కురల్' వంటిది మరొకటి లేదనవచ్చు. ఆయన జీవించిన కాలంలో తమవే తిరుగులేని సిద్ధాంతాలని చాటుకుంటున్న వివిధ మతస్థుల మధ్య ఆయన సమన్వయము సాధించాడు. అలనాటి అతి బలీయమైన దురాచారాలను అసమానమైన కవితా శక్తితో ఎదుర్కొన్నాడు.

జ్యోతిర్మయం

'జన్మ చేత అందరూ సమానులే. వారు ఆచరించే కర్మలలోని భేదాలే వారికి విలువను, అసమానతను కల్పిస్తున్నాయి' (972) అని చెప్పే ధైర్యం ఆయనది. ఆయనకి జీవితం పట్ల ఎంతటి దృఢమైన వైఖరి ఉందంటే జీవితం భ్రమ కాదు, వాస్తవం అని బలంగా వాదించగలిగాడు. 'కరుణ, దయ, జాలి వంటి వాస్తవ లక్షణాలు ఈ భూమిపై మానవ జీవితంలో అంతర్భాగాలు' అని ప్రవచించాడు.

ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపించే అంశం ప్రేమ. 'మానవుని ఉనికి యొక్క మూలం /ప్రేమ అనే లక్షణం లోనే ఉన్నది /ప్రేమ ఏమిటో ఎరుగని వారు/ తోలుకప్పిన అస్థిపంజరాలు' (80). ఇలాంటి పరిపూర్ణ సత్యాలను తమిళుల ఆధ్యాత్మిక నైతిక జీవనంలో ప్రవేశపెట్టిన మహనీయుడు తిరువళ్ళువర్.

'సుగుణం' అనే దానికి గందరగోళం లేని నిర్వచనాన్ని తిరువళ్ళువర్ ఇచ్చాడు. 'మనసులో ఏ విధమైన మలినం లేకపోవడమే సుగుణం, మిగిలినదంతా కేవలం పటాటోప ప్రదర్శనం' (34) అంటారాయన. మరి మన మనస్సులలో మాలిన్యం లేకుండా చేసుకోవడం ఎలా? 35వ కురుల్ ఇందుకు జవాబు ఇస్తుంది. అసూయ, లోభం, క్రోధం, దుర్భాషణం అనే నాలుగు లక్షణాలను మనసు నుండి తుడిచివేయగలగాలి. వీటిని తొలగించుకోకుండా ఆనందాన్ని కానీ, కీర్తిని కానీ పొందటం సాధ్యం కాదు అంటాడు. 2000 ఏళ్ల నాటి తమిళ తిరుక్కురల్ కావ్యం అనేక భాషల్లోకి అనువదితమయ్యింది. అందుకే జి.ఎస్. పోప్ ఆయనను 'విశ్వమానవ వైతాళికుడు' అని ప్రస్తుతించాడు.

– సాక్షి

తగ్గేదేలే.. తాడోపేడో!

డబ్బు సంచులు తెచ్చిన వారికి, పక్క పార్టీలు వద్దన్న చెత్తకు టికెట్లిస్తారా?

రాష్ట్రవ్యాప్తంగా రగిలిపోతున్న టికెట్లు దక్కని టీడీపీ సీనియర్లు

- రెబల్‌గా పోటీకి సిద్ధం
- చంద్రబాబు నచ్చజెప్పినా ఒప్పుకోని అసమ్మతి నేతలు
- బీఫాం ఇవ్వకపోతే స్వతంత్రంగా పోటీ చేస్తానన్న బోడె ప్రసాద్
- ఉండవల్లి రావాలన్నా పట్టించుకోని టీడీపీ పిఠాపురం ఇన్‌చార్జి వర్మ
- కోనేటి ఆదిమూలాన్ని ఓడించి తీరుతా: జేడీ రాజశేఖర్ రెడ్డి
- దళితులకు టికెట్ లేదని పీతల సుజాత ఆవేదన
- పైరవీలకే ప్రాధాన్యం: జవహర్


శ్రీకాకుళం ఎంపీ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

సాక్షి నెట్‌వర్క్: పొత్తుల కత్తులు తెలుగుదేశం పార్టీని రోడ్డున పడేసింది. చంద్రబాబు, లోకేశ్ డబ్బుకు అమ్ముడు పోయారని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నమ్మకంగా పనిచేసిన వారికి వెన్నుపోటు పొడిచారని చంద్రబాబు, లోకేశ్‌పై తమ్ముళ్లు నిప్పులు చెరిగారు. తన స్వలాభం కోసం పొత్తు అంటూ తమను నట్టేట ముంచారని, డబ్బు సంచులతో వచ్చిన వారికి, పక్క పార్టీలు చెత్త అని పక్కన పెట్టిన వారిని తీసుకొచ్చి టికెట్లు కట్టబెడతారా? అంటూ ఆగ్రహ జ్వాలలు వ్యక్తం చేశారు. దీనికి ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరికలు జారీ చేశారు. నమ్మించి గొంతుకోసిన బాబుకు బుద్ధి చెబుతామని, రెబల్‌గా పోటీ చేసి తమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం తెలుగు తమ్ముళ్లు రోడ్డెక్కి పార్టీ జెండాలు పీకేసి నిరసన తెలిపారు. దీంతో చంద్రబాబు పరిస్థితి కొరివితో తలగొక్కున్నట్లయ్యింది. బుజ్జగింపుల పర్వానికి పిలుపునిచ్చినా.. అసమ్మతి నాయకులు వెనక్కి తగ్గేది లేదనడంతో బాబుకు గుబులు పట్టుకుంది. స్వయంగా చంద్రబాబు రమ్మని పిలిచినా చాలా మంది ముఖం చాటేశారు. వచ్చినవారు ఎంత బతిమిలాడినా తగ్గేదే లేదని.. తాడోపేడో తేల్చుకుంటామని తెగేసి చెప్పారు.

నేను పోటీ చేయడం ఖాయం!

తాను కచ్చితంగా పోటీలో ఉంటానని టీడీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కేఎస్ జవహర్ ప్రకటించారు. కొవ్వూరులో శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. కొంతమంది మాటలు విని చంద్రబాబు తనను పక్కన పెట్టారని, పైరవీలు చేసిన వారికి ప్రాధాన్యం కల్పించారని ఆరోపించారు. ప్రజలను, నాయకులను నమ్ముకున్నానని, క్యాడర్‌తో మాట్లాడిన తర్వాత నిర్ణయం వెల్లడిస్తానని చెప్పారు. రాజకీయాల్లోకి వచ్చాక ఇల్లు అమ్ముకున్నానని, పార్టీ వేలానికి వెళ్లిందని, అన్ని రకాలుగా ఆర్థికంగా దెబ్బతిన్నానని చెప్పారు. టీడీపీలో పెత్తందారులదే రాజ్యమని.. జిల్లా నాయకులు కుట్రలు చేసి తప్పు చేయకపోయినా తనను మంత్రి పదవి నుంచి తొలగించారని టీడీపీ నాయకురాలు పీతల సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. తనకు టిక్కెట్ ఇవ్వకపోవడం చాలా బాధగా ఉందంటూ శుక్రవారం వీడియో విడుదల చేశారు. ఎన్నారైలు, పక్క రాష్ట్రాల నుంచి వచ్చిన వారు ఎన్నికలయ్యాక వెళ్లిపోతారని చెప్పారు.

చంద్రబాబు చుట్టూ బ్రోకర్లే..

కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా ఎస్.రాఘవేంద్రరెడ్డిని ప్రకటించడంతో నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి అనుచరులు ఆందోళన బాట పట్టారు. శుక్రవారం మంత్రాలయంలో అనుచరులతో భారీ ర్యాలీ, రాస్తారోకో నిర్వహించి టైర్లను తగలబెట్టారు. ఈ సందర్భంగా పాలకుర్తి మాట్లాడుతూ చంద్రబాబు చుట్టూ బ్రోకర్లు ఉన్నారని.. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానన్నారు.

కృష్ణాలో ఆరని మంటలు

విజయవాడ వెస్ట్ సీటు తనకే ఖరారయ్యిందని జనసేన నేత పోతిన మహేష్ ఇంటింటికి ప్రచారం చేశారు. పోతినకు టికెట్ ఇవ్వలేకపోతున్నట్లు ప్రకటించి పవన్ హైదరాబాద్ వెళ్లిపోయారు. దీంతో మహేష్ డివిజన్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలు బోరున విలపించారు. పవన్ తీరుపై పోతిన మహేష్, జనసేన కార్యకర్తలు మండిపడ్డారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని మహేష్ హెచ్చరించారు. పెనమలూరు టికెట్ ఇవ్వడం లేదని బోడే ప్రసాద్‌కు అధిష్టానం చెప్పగా.. చంద్రబాబు పిలుపు మేరకు ఆయన శుక్రవారం మధ్యాహ్నం వెళ్లి కలిశారు. బాబు ఆయనకు స్పష్టమైన హామీ ఇవ్వలేదు. చంద్రబాబు ఎంత నచ్చజెప్పినా బోడె ప్రసాద్ వెనక్కితగ్గలేదు. నమ్ముకున్న వారికి ద్రోహం చేసి పార్టీని ఎలా గెలిపించుకుంటారని చంద్రబాబును ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం. సీటు లేదు.. ఓటు వేయండంటూ యనమలకుదురు నుంచి ఆయన పాదయాత్ర చేపట్టారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మైలవరం టీడీపీ ఇన్‌చార్జి దేవినేని ఉమాను గురువారం రాత్రి కూడ బాబు పిలిపించినట్లు సమాచారం. వసంతకు సహకరించాలని చెప్పినట్లు తెలిసింది. దీంతో ఆయన రగిలిపోతూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వంతలకు భంగపాటు

రంపచోడవరం టీడీపీ టికెట్ ఆశించి భంగపడ్డ వంతల రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం చంద్రబాబును కలిసేందుకు వెళ్లారు. వారికి భంగపాటు ఎదురైంది. బాబును కలిసేందుకు ప్రయత్నించిన వారిని పోలీసులు అడ్డుకోవడంతో మధ్యాహ్నం వరకు ఆందోళన చేశారు. పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు లేదని ధ్వజమెత్తారు. నలుగురికి చంద్రబాబును కలిసే అవకాశం రాగా.. శిరీష భర్త మఠం భాస్కర్‌పై వారు ఫిర్యాదు చేశారు.


చంద్రబాబు నివాసం ముందు ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, నాయకులు

బాబు పిలుపునకు పలకని వర్మ

పిఠాపురం సీటులో పవన్ కళ్యాణ్ పోటీకి సిద్ధమయ్యారు. దీంతో అక్కడి టీడీపీ ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ఎన్ వర్మ అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. చంద్రబాబు స్వయంగా ఫోన్ చేసి తన నివాసానికి రావాలని పిలిచినా ముఖం చాటేశారు. తనను బుజ్జగించే కంటే సీటు ఇస్తేనే పరిస్థితి సద్దుమణుగుతుందని వర్మ గట్టిగా చెప్పారు. సీటు దక్కక పోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేసి తన సత్తా చూపిస్తానని సవాల్ విసిరారు.

ఎంపీ ఇంటి ముందు అర్ధనగ్న ప్రదర్శన

శ్రీకాకుళం అసెంబ్లీ టికెట్ మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవికి ఇవ్వాలంటూ టీడీపీ నాయకులు ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఇంటి ముందు శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీ ఇంటి గేటు ముందు బైఠాయించడంతో పాటు కార్యాలయం లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. లక్ష్మీదేవి అభ్యర్థిత్వం ఖరారు కాకపోతే ఎంపీ రామ్మోహన్‌నాయుడు గెలవరంటూ నినాదాలు చేశారు. విజయవాడ వెళ్లి పరిస్థితులను చంద్రబాబుకు వివరిస్తానని రామ్మోహన్‌నాయుడు తెలిపారు.

పెదకూరపాడులో గెలుపు ఎలా సాధ్యం?

పెదకూరపాడు అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌కు కేటాయించగా.. అక్కడ టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ను ఎలాగైన ఒప్పించి, ప్రవీణ్‌కు సహకరించేలా ఆయనను చంద్రబాబు దగ్గర తీసుకొచ్చారు. పార్టీ అధికారంలోకి రాగానే తగిన ప్రాధాన్యం ఇస్తామని చంద్రబాబు చెప్పినా.. అసలు గెలుపు ఎలా సాధ్యమని శ్రీధర్ ప్రశ్నించినట్లు సమాచారం. ఎచ్చెర్ల టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న కళా వెంకట్రావు పేరుకూడా రెండో జాబితాలో లేకపోవడంతో ఆయన వర్గం ఆందోళనకు దిగింది. చంద్రబాబు బుజ్జగించి..చీపురుపల్లి వెళ్లాలని సూచించినప్పటికీ అంగీకరించలేదని సమాచారం.

నమ్మించి గొంతు కోశారు

కష్టకాలంలో పార్టీని, కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చానని, అయినా తనకు టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేశారని కోవూరు నియోజకవర్గ టీడీపీ నేత పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. కొడవలూరులో ఆత్మీయులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. పలుమార్లు ఎమ్మెల్యే అభ్యర్థి అని ప్రకటించి చివరికి నడిబజారులో గొంతు కోశారని ఆవేదన వ్యక్తం చేశారు. దినేష్‌రెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీచేయాలని కార్యకర్తలు కోరారు.

యాదవులపై చిన్నచూపు

పుంగనూరు నుంచి తానే పోటీలో ఉంటానని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ ఆశించగా.. టీడీపీ నాయకుడు చల్లా రామచంద్రారెడ్డినే ఖరారు చేయటంతో యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంకటగిరి టికెట్ ఈ సారి బీసీలకు కేటాయించాలని మస్తాన్ యాదవ్, మరి కొందరు చేనేత కార్మికులు గట్టిగా ప్రయత్నాలు చేశారు. చివరకు చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రెండో భార్య కుమార్తె లక్ష్మీసాయి ప్రియ పేరును ప్రకటించటంతో బీసీ సామాజికవర్గానికి చెందిన వారంతా రగిలిపోతున్నారు. డాలర్ దివాకర్‌రెడ్డి చంద్రగిరి నుంచి పోటీ చేయాలని కొంత కాలంగా బ్యానర్లు, ఫ్లెక్సీలతో హంగామా చేస్తూ వచ్చారు. చివరకు చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన పులివర్తి నానికి కేటాయించటంతో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారంతా తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

ఏలూరు బీజేపీలో ముసలం

ఏలూరు ఎంపీ సీటు ఆశిస్తున్న గారపాటి సీతారామాంజనేయ చౌదరికి షాకివ్వడంతో ఆయన అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇక్కడ నుంచి సుజనా చౌదరి, సీఎం రమేష్ తదితరులు పోటీకి ఆసక్తి చూపుతున్నారు. శుక్రవారం ఏలూరు మినీ బైపాస్‌లోని క్రాంతి కళ్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం పేరుతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో వలస పక్షుల మాదిరిగా రాబందులు డబ్బు సంచులతో వాలిపోతారని, గెలిస్తే ఢిల్లీలో ఉంటారని, లేకపోతే అడ్రస్ ఉండరని ఘాటుగా విమర్శించారు. ఆరు నూరైనా పోటీ చేసి తీరుతానని స్పష్టం చేశారు.

చోడవరంలో జనసేన ఆగ్రహ జ్వాల

చోడవరం టికెట్ టీడీపీకి ఇవ్వడంపై జనసేన కార్యకర్తలు మండిపడుతున్నారు. జనసేన సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఐదేళ్లుగా అనేక ఉద్యమాలు చేశామని, తమకు కాకుండా టీడీపీకి ఎలా కేటాయిస్తారని సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ సరైన నిర్ణయం తీసుకోకపోతే టీడీపీ అభ్యర్థికి పనిచేయడానికి జనసేన సిద్ధంగా లేదని స్పష్టం చేశారు.

జనసేన నేతలకు అవమానం

చిత్తూరుకు చెందిన ఆరణి శ్రీనివాసులు అనుచరులు తిరుపతి జనసేన నేతలను తీవ్రంగా అవమానించారు. జనసేనకు తిరుపతి అసెంబ్లీని కేటాయించినా.. పోటీ చేసేందుకు బలమైన నాయకులు లేరని, అందుకే చిత్తూరు నుంచి చీరలు, గాజులు పంపిస్తున్నామంటూ అవమానించారని జనసేన నేత కిరణ్‌రాయల్ పార్టీ అంతర్గత సమావేశంలో వెల్లడించారు. ఆరణికి టికెట్ ఇస్తే పనిచేసేది లేదంటూ తీర్మానం చేసి ఆ లేఖను అమరావతికి పంపారు.

పార్టీ పదవులకు పరుచూరి రాజీనామా

జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు పరుచూరి భాస్కరరావు చెప్పారు. ఐదేళ్లుగా పార్టీ కోసం కష్టపడితే పవన్‌కళ్యాణ్ కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదన్నారు. కొత్తగా వచ్చిన కొణతాలకు టికెట్ ఇవ్వడం అన్యాయమన్నారు.


అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ఆందోళన చేస్తున్న జనసేన నేతలు, కార్యకర్తలు

అమలాపురంలో నువ్వా.. నేనా

అమలాపురం అసెంబ్లీ స్థానంపై సర్వేలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అభ్యర్థిత్వంపై అభిప్రాయ సేకరణ చేశారు. మధ్యాహ్నం నుంచి సీన్ మారింది. మాజీ ఎంపీ ఏజేవీబీ మహేశ్వరావు కుమార్తె పాము సత్యశ్రీ అభ్యర్థిత్వంపై ఐవీఆర్ఎస్ సర్వే మొదలైంది. ఒకే రోజు ఇద్దరి పేర్లపై సర్వేతో పార్టీ క్యాడర్‌లో గందరగోళం నెలకొంది. మరోవైపు జనసేన పార్టీ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు, పార్లమెంటరీ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్‌లు తమకే టికెట్ దక్కుతుందనే ఆశతో ఉన్నారు. ఈ సమయంలో టీడీపీ ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టడం జనసేనలో ఆగ్రహాన్ని కలిగించింది. దీంతో వారు అమలాపురం గడియారస్తంభం సెంటర్‌లో ఆందోళనకు దిగారు. అమలాపురం సీటు జనసేనకు కేటాయించాల్సిందేనని, లేకుంటే పొత్తు పక్కన పెట్టి టీడీపీని ఓడిస్తామని హెచ్చరించారు.

రెబల్‌గా పోటీ చేస్తా!

'చంద్రబాబు గారు.. మేం చేసిన పాపం ఏమిటి? భార్య బిడ్డలను వదిలి పార్టీ కోసం కష్టపడి పనిచేశా. సత్యవేడు సీటు ఎందుకు ఇవ్వలేదు. ఆదిమూలం చెత్త అని వైఎస్సార్‌సీపీ టికెట్ ఇవ్వలేదు. ఆ చెత్తను మనం ఎందుకు నెత్తిన వేసుకోవాలి. నేను రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తాను. కోనేటి ఆదిమూలాన్ని ఓడించి తీరుతాను' అని సత్యవేడు టీడీపీ మాజీ ఇన్‌చార్జి జేడీ రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. జేడీ రాజశేఖరరెడ్డి గురువారం కుటుంబ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. 2019 నుంచి పార్టీ కోసం ఎంతో కష్టపడ్డానని, ఆదిమూలం ఎమ్మెల్యేగా గెలుపొందాక.. కేసులు పెట్టి వేధించారని గుర్తుచేశారు. తాను వ్యాపారం చేసుకునేదానిని, టీడీపీ గెలుపు కోసం అన్నీ వదిలేసి కష్టపడి పనిచేశాని జేడీఆర్ కుమార్తె మౌనిక కన్నీరు మున్నీరైంది. సత్యవేడు సీటు కోసం నాలుగేళ్లుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్ మనస్తాపంతో నివాసానికే పరిమితమయ్యారు.


సత్యవేడు ప్రెస్‌మీట్‌లో కన్నీరు మున్నీరవుతున్న జేడీఆర్, కుమార్తె, భార్య

బీజేపీకి ఇస్తే ఓడించి తీరతాం


- పరిటాల శ్రీరామ్ వర్గీయుల హెచ్చరిక
- టీడీపీ జిల్లా అధ్యక్షుడి ఇల్లు ముట్టడి


పార్థసారథి ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న పరిటాల శ్రీరామ్ వర్గీయులు

అనంతపురం క్రైం: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం అసెంబ్లీ టీడీపీ టికెట్ పరిటాల శ్రీరామ్‌కు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆయన వర్గీయులు ఆందోళన నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం అనంతపురం నగరంలోని శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీకే పార్థసారథి నివాసాన్ని ముట్టడించారు. పరిటాల శ్రీరామ్‌తో ఇంతకాలం పార్టీ కోసం పని చేయించుకుని, టికెట్ ఇస్తామని ఆశచూపి ఇప్పుడు నిరాకరిస్తే ఎలా అని పార్థసారథిని ప్రశ్నించారు. శ్రీరామ్‌ను కాదని బీజేపీకి ఇస్తే ఓడించి తీరతామని హెచ్చరించారు. 2019 ఎన్నికల్లో ధర్మవరంలో టీడీపీ ఓడిపోయిన వెంటనే వరదాపురం సూరి బీజేపీలోకి వెళ్లిపోయారని, పార్టీకి దిక్కులేని సమయంలో పరిటాల శ్రీరామ్ ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకున్నారని గుర్తు చేశారు. ఇన్నాళ్లూ పని చేయించుకుని ఇప్పుడు పక్కన పెట్టడం ద్వారా పార్టీ పెద్దలు తప్పు చేస్తున్నారన్నారు. పరిటాల కుటుంబానికి అన్యాయం చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. బీకే పార్థసారథి స్పందిస్తూ జిల్లా అధ్యక్షుడినైన తనకే సీటు లేదని చెప్పబోగా.. శ్రీరామ్ వర్గీయులు వాగ్వాదానికి దిగారు. తమ ఆందోళన విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. వారికి సమాధానం చెప్పలేక పార్థసారథి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

'హోదా' తప్ప అన్ని పనులూ జరిగాయి

- అమరావతికి రూ.2,500 కోట్లు ఇచ్చారు..
- పోలవరంతోపాటు రోడ్లు వేశారు
- విశాఖ స్టీల్ ప్లాంట్ అంశం మేమున్నప్పుడు రాలేదు
- టీడీపీ అధినేత చంద్రబాబు



సాక్షి, అమరావతి: తాము అధికారంలో ఉండగా 2014–19 మధ్య కేంద్రం నుండి రాష్ట్రానికి ప్రత్యేక హోదా తప్ప అన్ని పనులు జరిగాయని టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఉండవల్లిలోని తన నివాసంలో గురువారం ఆయన పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కేంద్రం అమరావతికి రూ.2,500 కోట్ల నిధులు ఇచ్చిందని, పోలవరంతోపాటు రోడ్లు వేశారన్నారు. నరేగా నిధులను బ్రహ్మాండంగా వినియోగించుకున్నామన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అంశం తామున్నప్పుడు రాలేదని.. విశాఖ జోన్‌కు ఈ ప్రభుత్వం ఐదేళ్లలో ఏం చేసిందని ప్రశ్నించారు. దేశం ముందుకెళ్తుంటే.. రాష్ట్రాన్ని వెనక్కి తీసుకెళ్తున్నారని ఆరోపించారు. కేంద్రం రాష్ట్రానికి సాయం అందిస్తోందని, 2014–19 కంటే మెరుగ్గానే అభివృద్ధి చేస్తామని, నిధులు తీసుకొస్తామని, తమ కూటమికి అనుకూలంగా జాతీయ మీడియాలో సర్వేలు కూడా వస్తున్నాయని చంద్రబాబు వివరించారు.

ఏపీపీఎస్సీ అక్రమాల్లో జగనే ముద్దాయి

ఏపీపీఎస్సీలో చోటుచేసుకున్న అక్రమాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డే ప్రధాన ముద్దాయి అని చంద్రబాబు ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిందే కాక హైకోర్టుకు తప్పుడు అఫిడవిట్ ఇచ్చిన అధికారులను ఏమనాలని ప్రశ్నించారు. ఐపీఎస్‌లు గౌతమ్ సవాంగ్, సీతారామాంజనేయులుతోపాటు ధనుంజయ్‌రెడ్డిపైనా విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐ విచారణ చేయాలన్నారు. ఇక పిన్నమ్మ తాళిబొట్టును తెంచిన జగన్‌కు ప్రజలు ఓటేయాలా? అని బాబు ప్రశ్నించారు. రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్‌లు జరుగుతున్నాయని, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాకైనా అవి ఆగుతాయని అనుకుంటున్నానని అన్నారు.

సిటిజన్‌షిప్ తీసుకోవాల్సిందే..

ఇక ఏ దేశానికి వెళ్లినా సిటిజన్‌షిప్ అవసరమేనని, ఎప్పుడో ఒకసారి పౌరసత్వం తీసుకోవాల్సిందేనని చంద్రబాబు అన్నారు. దొంగతనంగా వచ్చేవారికే అభద్రతాభావం ఉంటుందని చెప్పారు. ఇక తాము పొత్తులు పెట్టుకున్నాక పార్టీలో చిన్నచిన్న సమస్యలు వస్తాయని, వాటిని పరిష్కరించుకుంటామని అన్నారు. బీజేపీతో పొత్తు ప్రకటన అనంతరం వైఎస్సార్‌సీపీ తప్పుడు ప్రచారానికి దిగుతోందని, దాన్ని తిప్పికొట్టాలని పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు సూచించారు.

ఏపీపీఎస్సీ కార్యాలయం ముట్టడి అడ్డగింత..

ఏపీపీఎస్సీలో గ్రూప్–1 ఉద్యోగాల్లో జరిగిన అక్రమాలను బయటపెట్టాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్ గోపాల్, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు డిమాండ్ చేశారు. విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడిని పోలీసులు అడ్డుకుని అరెస్టుచేశారు.

అలాగైతే తప్పుకోండి

- చీపురుపల్లిలో పోటీ చేయొద్దు అంటున్న గంటా అనుచరులు
- గౌరవంగా ఎన్నికల బరి నుంచి తప్పుకుంటే మేలని వెల్లడి
- పార్టీ మారే వ్యవహారంపైనా చర్చ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగిన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఇప్పుడు తన సీటు కోసం వెంపర్లాడే పరిస్థితి ఏర్పడింది. చీపురుపల్లి నుంచి పోటీ చేసే ప్రసక్తే లేదని, భీమిలి నుంచి పోటీ చేస్తానని ఇప్పటికే స్వయంగా చంద్రబాబుకు గంటా స్పష్టం చేశారు. అయినప్పటికీ భీమిలి సీటు విషయంలో గంటాకు ఎటువంటి హామీ లభించకపోగా చీపురుపల్లి నుంచి పోటీ చేయాల్సిందేనని చంద్రబాబు కుండబద్దలు కొట్టారు. చీపురుపల్లిలో పోటీ చేస్తే కనీసం డిపాజిట్లు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని గంటా స్వయంగా చేసుకున్న సర్వేలో తేలింది. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో భీమిలి సీటు ఇస్తే పోటీ చేయాలని, లేనిపక్షంలో పోటీ నుంచి తప్పుకోవాలని అనుచరులు పేర్కొన్నట్టు తెలుస్తోంది.

గౌరవంగా తప్పుకుందాం...

వాస్తవానికి ప్రతి ఎన్నికల్లో నియోజకవర్గాలను మారుస్తూ.. ప్రతీసారీ నెగ్గడం గంటా శ్రీనివాసరావుకు అలవాటుగా మారింది. ఈ ఎన్నికల్లో కూడా విశాఖ ఉత్తరం నుంచి కాకుండా భీమిలి నుంచి పోటీ చేయాలని ఆయన భావించారు. అప్పటికే గంటా వ్యవహారంపై కినుకువహించిన చంద్రబాబు సమయం చూసి గంటాకు దెబ్బకొట్టే ప్రయత్నం చేశారు. విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని, బలమైన బొత్సను ఢీకొట్టే సత్తా నీకే ఉందంటూ రాబిన్ శర్మ ద్వారా గంటాకు చెప్పించారు. తనను ఓడించేందుకు ఈ పరిణామాలు జరుగుతున్నాయని గ్రహించిన గంటా భీమిలి సీటు కావాలంటూ చంద్రబాబును ఇప్పటికే రెండుసార్లు కలిశారు. అయినప్పటికీ ఉపయోగంలేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో జరిగిన పరిణామాలన్నింటినీ 14న జరిగిన సమావేశంలో గంటా వివరించారు. ఒకవేళ భీమిలి ఇవ్వకపోతే గౌరవంగా పోటీ నుంచి తప్పుకోవడమే మంచిదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్టు సమాచారం. మరోవైపు కొద్ది మంది నేతలు పార్టీ మారి సీటు పొందే విషయాన్ని లేవనెత్తారు. ఈ పరిస్థితుల్లో పార్టీ మారితే అంత సులువుగా సీటు దక్కే అవకాశాలు లేవని అభిప్రాయపడినట్టు తెలుస్తోంది.

భరత్ కోసమే భీమిలి...

పొత్తు నేపథ్యంలో ఇప్పటికే తుది కసరత్తు పూర్తయింది. విశాఖ ఎంపీ సీటు విషయంలో బీజేపీ నేతలు పట్టుబడుతున్నారు. 2014 పొత్తు సమయంలో కూడా విశాఖ ఎంపీ సీటు తమకిచ్చారని, ఇప్పుడు ఎందుకివ్వరంటూ మెలికపెట్టినట్టు తెలుస్తోంది. విశాఖ ఎంపీ సీటు కోసం ఇప్పటికే జీవీఎల్ నరసింహారావు గట్టిపట్టుపడుతున్నారు. పార్టీ ఆదేశిస్తేనే ఇక్కడ పనిచేస్తున్నాని ఆయన చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో విశాఖ ఎంపీ సీటు బీజేపీకి ఇవ్వాల్సిన పక్షంలో భీమిలి సీటును భరత్‌కు కేటాయించే అవకాశం ఉందని టీడీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. అందువల్లే గంటాకు భీమిలి ఇచ్చే అవకాశం లేదని ఆ పార్టీలో ఓ వర్గం గట్టిగా చెబుతోంది. సొంత కుటుంబాన్ని కాదని గంటాకు చంద్రబాబు ప్రాధాన్యత ఇచ్చే అవకాశం లేదని పార్టీ నేతలు చెబుతున్నారు.

చంద్రబాబుకి బుద్ధొచ్చింది

అందుకే తిరిగి మా వద్దకు వచ్చారు

- ఎన్డీయేలో కలుస్తానని అడిగారు.. దీంతో కలుపుకున్నాం
- ఇండియా టుడే కాంక్లేవ్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా



సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబుపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయనకు బుద్ధి రావడం వల్లే మళ్లీ బీజేపీ దగ్గరకు వచ్చారని తెలిపారు. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్‌లో.. 'ప్రధాని మోదీని చంద్రబాబు గతంలో టెర్రరిస్ట్ అన్నారు.. అలాంటి వ్యక్తితో మీరెలా పొత్తు పెట్టుకున్నారు' అని అమిత్‌షాను యాంకర్ ప్రశ్నించారు. దానికి అమిత్‌షా జవాబిస్తూ.. 'ప్రధాని మోదీని చంద్రబాబు టెర్రరిస్ట్ అని ఎన్డీయే నుంచి వెళ్లిపోయారు. మేం ఆయనను వెళ్లమనలేదు.. ఆయనే వెళ్లిపోయారు.. ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ తర్వాత బాబుకు బుద్ధొచ్చింది. మళ్లీ మా వద్దకు వచ్చారు. తిరిగి ఎన్డీయేలో కలుస్తానన్నారు. దీంతో ఆయనను కలుపుకున్నాం' అంటూ అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలతో ఇన్ని రోజులుగా బీజేపీయే తమను పిలిచిందని, ఎన్డీయేలో చేరాలని ఆహ్వానం పంపిందంటూ టీడీపీ నేతలు చెప్పిన మాటలు, బీజేపీకి చంద్రబాబు పలు షరతులు పెట్టారని పచ్చ మీడియా చేసిన ప్రచారం అంతా బూటకమని తేలిపోయింది. ఓటమి భయంతోనే చంద్రబాబు బీజేపీ పెద్దల కాళ్లు పట్టుకుని ఎన్డీయేలో చేర్చుకోవాలని ప్రాధేయపడ్డారని స్పష్టమైంది.

కొన్ని బిల్లులకే వైఎస్సార్‌సీపీ మద్దతు

అమిత్ షాకు యాంకర్ మరో ప్రశ్న వేస్తూ.. 'పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ కొన్ని బిల్లులకు మద్దతిచ్చింది కదా..మరి అలాంటప్పుడు ఆ పార్టీతో ఎందుకు పొత్తు పెట్టుకోలేదు. చంద్రబాబుతో ఎందుకు పెట్టుకున్నారు' అని అడిగారు. దీనికి అమిత్ షా సమాధానం చెబుతూ..'బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని బిల్లులకు వైఎస్సార్‌సీపీ మద్దతు ఇవ్వలేదు. కొన్నిటికి మాత్రమే మద్దతు ఇచ్చింది. అది కూడా ఆ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉండటం వల్లే తప్ప బీజేపీ కోసం కాదు. పార్లమెంట్‌లో పార్టీల పరంగా నిర్ణయాలు ఉండవు. ఆయా పార్టీలకు సొంత అజెండాలు, సిద్ధాంతాలు ఉంటాయి. వాటికి తగ్గట్టుగానే అంశాన్ని బట్టి అవి నడుచుకుంటాయి' అని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో మోదీ రోడ్‌షో

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ప్రధాని మోదీ నిర్వహించిన రోడ్‌షోకు వివిధ వర్గాల ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఏర్పాటు చేసిన ఈ రోడ్‌షో పార్టీ నాయకులు, కేడర్‌లో జోష్ నింపింది. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, ఇతర వర్గాల వారు రోడ్డుకు ఇరువైపులా, ఇళ్లపై, షాపింగ్, కమర్షియల్ కాంప్లెక్స్‌లపై నుంచి ప్లకార్డులు ప్రదర్శిస్తూ మోదీకి అభివాదం తెలిపారు. అబ్‌కీబార్ 400 పార్... (ఈసారి 400 సీట్లు దాటాలి) ఇతర నినాదాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రధానిని ప్రత్యక్షంగా చూసే అవకాశం లభించడంపై పలువురు ఆనందం వ్యక్తం చేశారు. రోడ్‌షో సాగిన మార్గమంతా రెండువైపులా ఉన్న ప్రజలను, మోదీ రెండుచేతులు ఊపుతూ పలకరించారు. అంతకుముందు శుక్రవారం సాయంత్రం ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్టులో దిగిన ప్రధానికి కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఇతర నేతలు స్వాగతం పలికారు. మోదీ నేరుగా మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని మీర్జాలగూడకు చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక ఓపెన్‌టాప్ వాహనంలో మల్కాజిగిరి దాకా దాదాపు 1.3 కి.మీ దూరం రోడ్‌షో నిర్వహించారు. ఆయన వెంట జీప్‌లో ఓ వైపు కిషన్‌రెడ్డి మరోవైపు బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ మాత్రమే (ఇద్దరు భద్రతా సిబ్బంది మినహా) రోడ్‌షోలో పాల్గొన్నారు. రోడ్‌షో ముగియగానే మోదీ రాజ్‌భవన్ బసకు చేరుకున్నారు. ప్రధాని శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి నాగర్‌కర్నూల్‌కు చేరుకుంటారు.

బాండ్లపై పూర్తి వివరాలు ఎందుకివ్వలేదు

ఎస్‌బీఐపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్ల విషయంలో పూర్తి సమాచారం ఎన్నికల సంఘానికి ఎందుకు ఇవ్వలేదని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దాతల నుంచి రాజకీయ పార్టీలు స్వీకరించిన బాండ్లపై ఉన్న విశిష్ట అల్ఫా న్యూమరిక్ నెంబర్లను ఎందుకు బహిర్గతం చేయలేదని నిలదీసింది. బాండ్ల రూపంలో ఏ పార్టీకి ఎవరెవరు ఎంతెంత సొమ్ము ఇచ్చారో స్పష్టంగా తెలియడం లేదని పేర్కొంది. దీనిపై వివరణ ఇవ్వాలని ఎస్‌బీఐకి నోటీసు జారీ చేసింది. ఎలక్టోరల్ బాండ్ల అంశంపై ఎన్నికల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. బాండ్లపై ఈ నెల 11న ఇచ్చిన తీర్పులో కొంత సవరణ చేయాలని కోరుతూ ఎన్నికల సంఘం ఈ పిటిషన్ దాఖలు చేసింది. ఎలక్టోరల్ బాండ్ల కొనుగోలుదారులు, వాటి విలువ, కొనుగోలు చేసిన తేదీ, బాండ్ల నెంబర్ వంటి అన్ని వివరాలు ఎన్నికల సంఘానికి అందజేయాలని తాము ఆదేశించినప్పటికీ ఎందుకు ఇవ్వలేదంటూ ధర్మాసనం ఎస్‌బీఐపై ఆగ్రహం వ్యక్తం చేసింది. విధి నిర్వహణకు కట్టుబడి ఉండాలని, ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది.

ఈసీల నియామకంపై స్టే విధించలేం

సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ఇద్దరు నూతన ఎన్నికల కమిషనర్ల(ఈసీలు) నియామకంపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఒక చట్టంపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని స్పష్టం చేసింది. 2023 నాటి చట్టం ప్రకారం ఇద్దరు ఎన్నికల కమిషనర్లను కేంద్ర ప్రభుత్వం నియమించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టీన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఇద్దరు ఈసీల నియామకాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని, స్టే విధించాలని పిటిషనర్లు విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా లేని కమిటీ చేపట్టిన ఈ నియామకం సరైంది కాదని పేర్కొన్నారు. ఇందుకు ధర్మాసనం అంగీకరించలేదు. తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది. 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్, అదర్ ఎలక్షన్ కమిషనర్స్ (అపాయింట్‌మెంట్, కండీషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టర్మ్ ఆఫ్ ఆఫీసు) యాక్ట్–2023'ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లన్నింటినీ కలిపి విచారిస్తామని ప్రకటించింది. కేంద్ర ఎన్నికల సంఘంలో ఖాళీగా ఉన్న రెండు కమిషనర్ పోస్టులను ప్రభుత్వం గురువారం భర్తీ చేసిన సంగతి తెలిసిందే. జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సంధూను ఎన్నికల కమిషనర్లుగా నియమించింది.

ఎన్నికల షెడ్యూల్ నేడే

మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికల సంఘం మీడియా సమావేశం

- ఈసారి నాలుగు లేక ఐదు దశల్లో సార్వత్రిక ఎన్నికలు
- లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్
- ఏప్రిల్ రెండు లేక మూడో వారంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలు!

సాక్షి, న్యూఢిల్లీ: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ శనివారం వెలువడనుంది. ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించనుంది. లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం శాసనసభ ఎన్నికల షెడ్యూల్‌ను సైతం ప్రకటిస్తారు. అలాగే తెలంగాణలో ఖాళీగా ఉన్న ఒక అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది. ఈ మేరకు ఎన్నికల సంఘం శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఏప్రిల్ రెండు లేక మూడో వారంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్ వెలువడిన వెంటనే దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎలక్షన్ కోడ్) అమల్లోకి వస్తుంది. ప్రస్తుత లోక్‌సభ పదవీకాలం జూన్ 16వ తేదీతో ముగుస్తుండగా, అంతకంటే ముందు కొత్త సభను ఏర్పాటు చేయాల్సి ఉంది. గత లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను 2019 మార్చి 10న ప్రకటించారు. ఏప్రిల్ 11 నుంచి ఏడు దశల్లో ఎన్నికలు జరిగాయి. మే 23న ఫలితాలు వెలువడ్డాయి. ఈసారి నాలుగు నుంచి ఐదు దశల్లోనే లోక్‌సభ ఎన్నికలను పూర్తి చేయాలని భావిస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం వర్గాలు తెలియజేశాయి. దేశవ్యాప్తంగా 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల కోసం 12 లక్షలకు పైగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నారు.

బాధ్యతలు చేపట్టిన కొత్త ఎన్నికల కమిషనర్లు

నూతన ఎన్నికల కమిషనర్లుగా నియమితులైన సుఖ్‌బీర్ సింగ్ సంధూ, జ్ఞానేశ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ సమక్షంలో వీరు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించి అధికారులతో కీలక భేటీ జరిగింది. ఎన్నికల సన్నద్ధత, కేంద్ర బలగాల మోహరింపు, వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలతో సమన్వయం, ఆయా రాష్ట్రాల్లో ప్రస్తుత పరిస్థితులపై సమీక్షించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే ఈ నెల 16న జరిగే మీడియా సమావేశం, ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించిన ప్రకటన వెలువడింది.

నేర ముఠాల గుప్పిట్లో హైతీ!

ఒక నేర ముఠా ఒక ప్రాంతాన్ని తన అధీనంలోకి తీసుకుని అరాచకం సృష్టిస్తే భద్రతాబలగాలు రంగంలోకి దిగి ఉక్కుపాదంతో అణచేయడం చాలా దేశాల్లో చూశాం. కానీ ఒక దేశం మొత్తమే నేర ముఠాల గుప్పెట్లోకి జారిపోతే ఎలా? హైతీ దేశ దుస్థితి చూస్తుంటే యావత్ ప్రపంచమే అయ్యో పాపం అంటోంది. పోర్ట్ ఎ ప్రిన్స్ రాజధానిసహా దేశాన్నే గడగడలాడిస్తున్న గ్యాంగ్‌లకు అసలేం కావాలి?. కెన్యా సాయం కోసం వెళ్లి రాజధాని ఎయిర్‌పోర్ట్ నేరముఠాలవశం కావడంతో స్వదేశం తిరిగిరాలేక అమెరికాలో చిక్కుకుపోయిన దేశ ప్రధాని ఏరియల్ హెన్రీ చివరకు పదవికి రాజీనామా చేశారు. దీంతో దేశ ప్రజల పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది. ఇళ్ల నుంచి బయటకురావడానికే జనం భయపడుతున్నారు.



జీ9 ఫ్యామిలీ గ్యాంగ్ సభ్యులు.(ఇన్‌సెట్లో) బార్బెక్యూ జిమ్మీ

హైతీలో ప్రధాన గ్యాంగ్‌లు ఎన్ని?

హైతీలో దాదాపు 200 వరకు నేరముఠాలు ఉన్నాయి. అయితే మాజీ పోలీస్ అధికారి జిమ్మీ 'బార్బెక్యూ' చెరీజియర్ నేతృత్వంలోని జీ9 ఫ్యామిలీ అండ్ అలీస్ అలయన్స్, గేబ్రియల్ జీన్ పెర్రీ నేతృత్వంలోని జీపెప్ నేరముఠాలు ప్రధానమైనవి. ఇవి ప్రజలను హింసిస్తూ దేశాన్ని నరకానికి నకళ్లుగా మార్చేశాయి. రాజధాని సమీప ప్రాంతాలపై పట్టుకోసం చాన్నాళ్లుగా ఈ రెండు వైరి వర్గముఠాలు ప్రయత్నిస్తున్నాయి. ఎంతో మందిని సజీవ దహనం చేశాడని జిమ్మీని స్థానికంగా బార్బెక్యూ అని పిలుస్తుంటారు. నరమేధం, దోపిడీ, ఆస్తుల ధ్వంసం, లైంగిక హింసకు జీ9, జీపెప్ నేరముఠాలు పాల్పడ్డాయి. దీంతో ఈ ముఠా లీడర్ల లావాదేవీలు, కార్యకలాపాలపై ఐరాస, అమెరికా ఆంక్షలు విధించాయి. దీంతో రెండు గ్యాంగ్‌లు ఉమ్మడిగా ఒక ఒప్పందం చేసుకున్నాయి. కలిసి పనిచేసి ప్రధానిని గద్దెదింపేందుకు కుట్ర పన్నాయి.

అసలు ఇవి ఎలా పుట్టుకొచ్చాయి?

మురికివాడల్లో దారుణాలు చేశాడన్న ఆరోపణలపై జిమ్మీని పోలీస్ ఉద్యోగం నుంచి తీసేశాక నేరసామ్రాజ్యంలో అడుగు పెట్టాడు. దేశంలోని రాజకీయ పార్టీలు, నేతలు, పారిశ్రామికవేత్తలు తమ అనైతిక పనులకు అండగా ఉంటారని ఇలాంటి చిన్న చిన్న నేరగాళ్లను అక్కున చేర్చుకుని పెద్ద ముఠా స్థాయికి ఎదిగేలా చేశారు. 2021 జులైలో హత్యకు గురైన హైతీ మాజీ అధ్యక్షుడు జొవెనెల్ మొయిసెకు చెందిన పార్టీ హైతియన్ టెట్ కాలే(పీహెచ్‌టీకే)తో జిమ్మీకి చాలా దగ్గరి సంబంధాలు ఉన్నాయి. ఒకానొక దశలో జిమ్మీని ప్రధాని పీఠంపై కూర్చోబెట్టాలని మొయిసె భావించారు. జీపెప్ ముఠా సైతం విపక్ష పార్టీలతో అంటకాగింది. దీంతో ఆర్థికంగా, ఆయుధపరంగా రెండు ముఠాలు బలీయమయ్యాయి.

హింస ఎప్పుడు మొదలైంది?

హైతీ మాజీ అధ్యక్షుడు ఫ్రాంకోయిస్ 'పాపా డాక్' డ్యువేలియర్, అతని కుమారుడు జీన్‌క్లాడ్ డ్యువేలియర్‌ల 29 ఏళ్ల నియంతృత్వ పాలనాకాలంలోనే ఈ గ్యాంగ్‌లు పురుడుపోసుకున్నాయి. డ్యువేలియర్లు ఒక సమాంతర మిలటరీ(టోంటోన్స్ మకౌటీస్)ని ఏర్పాటు చేసి వైరి పార్టీల నేతలు, వేలాది మంది సామాన్య ప్రజానీకాన్ని అంతమొందించారు. 'హైతీలో నేరముఠాలకు దశాబ్దాల చరిత్ర ఉంది. కానీ ఇప్పుడున్న నేరముఠాల వైఖరి గతంతో పోలిస్తే దారుణం' అని వర్జీనియా విశ్వవిద్యాలయ అధ్యాపకుడు, హైతీ వ్యవహారాల నిపుణుడు రాబర్ట్ ఫాటన్ విశ్లేషించారు.

నేతలనూ శాసిస్తారు

బెదిరింపులు, కిడ్నాప్‌లు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాలతో నేరముఠాలు ఆర్థికంగా బలపడ్డాయి. ఆయుధాలను సమకూర్చుకున్నారు. గత వారం రాజధానిలోని రెండు జైళ్లపై అధునాతన డ్రోన్లతో దాడికి తెగబడ్డాయి. శిక్ష అనుభవిస్తున్న వేలాది మంది కరడుగట్టిన నేరగాళ్లను విడిపించుకు పోయారు. సాయుధముఠాలు ఇప్పుడు ఏకంగా రాజకీయపార్టీలు, నేతలనే శాసిస్తున్నాయి.

పరిపాలన వాంఛ

అక్రమ మార్గాల్లో సంపదను మూటగట్టుకున్న నేర ముఠాలు ఇప్పుడు రాజ్యాధికారంపై కన్నేశాయి. 2021లో దేశాధ్యక్షుడు మొయిసె హత్యానంతరం వీటి రాజకీయ డిమాండ్లు ఎక్కువయ్యాయి. ముఠాలు ప్రధాని హెన్రీని గద్దె దింపాయి. దేశాన్ని పాలిస్తానని బార్బెక్యూ జిమ్మీ పరోక్షంగా చెప్పాడు. అంతర్జాతీయంగా తన పేరు మార్మోగాలని విదేశీ మీడియాకు ఇంటర్వ్యూలిచ్చాడు. విదేశీ జోక్యం వద్దని, విదేశీ బలగాలు రావద్దని హుకుం జారీచేశాడు. ప్రస్తుత సంక్షోభాన్ని ఒంటిచేత్తో పరిష్కరిస్తానని ప్రకటించాడు. రాజకీయ శక్తులుగా ఎదిగితేనే తమ మనుగడ సాధ్యమని ముఠాలు భావిస్తున్నాయి.

సంకీర్ణ బలగాలు వస్తున్నాయా?

కెన్యా నేతృత్వంలోని సంకీర్ణ బలగాలను హైతీకి పంపించి సంక్షోభానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని అమెరికాసహా పలుదేశాలు నిర్ణయించాయి. ఐరాస ఇందుకు అంగీకారం తెలిపింది. అయితే కెన్యా కోర్టుల జోక్యంతో ప్రస్తుతానికి ఆ బలగాల ఆగమనం ఆగింది. హైతీ ప్రధాని రాజీనామా నేపథ్యంలో నూతన ప్రభుత్వ కొలువు కోసం కౌన్సిల్ ఏర్పాటు, అన్ని భాగస్వామ్యపక్షాల సంప్రతింపుల ప్రక్రియ ముగిసేదాకా వేచిచూసే ధోరణిని అవలంబిస్తామని కెన్యా అధ్యక్షుడు విలియం రూటో చెప్పారు. మరి కొద్దిరోజుల్లోనే ఎన్నికల కోసం కౌన్సిల్ ఏర్పాటు ప్రక్రియ మొదలవుతుందని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ చెప్పారు.

మన వాళ్లను వెనక్కి రప్పిస్తాం: భారత విదేశాంగ శాఖ

హైతీలో దాదాపు 90 మంది భారతీయులు ఉన్నట్లు సమాచారం. వీరిలో డాక్టర్లు, ఇంజనీర్లు, టెక్నీషియన్లు ఉన్నారు. 60 మంది ఇప్పటికే హైతీకి వచ్చేందుకు సిద్ధమయ్యారు. హైతీలో భారతీయ రాయబార కార్యాలయం, కాన్సులేట్ లేవు. దీంతో సమీపాన ఉన్న డొమినికన్ రిపబ్లిక్ రాజధాని శాంటో డొమినిగోలోని ఇండియన్ మిషన్ ద్వారా హైతీలోని భారతీయులతో మోదీ సర్కార్ సంప్రతింపులు జరుపుతోంది. వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకొస్తామని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ శుక్రవారం ఢిల్లీలో చెప్పారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

బీజేపీలోకి ఇద్దరు టీఎంసీ ఎంపీలు

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లోని అధికార తృణమూల్‌కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలు అర్జున్ సింగ్, దివ్యేందు అధికారి బీజేపీలో చేరారు. వీరు బారక్‌పూర్, తామ్లుక్ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. శుక్రవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వీరు బీజేపీ కండువా కప్పుకున్నారు. అర్జున్ సింగ్ 2019లో టీఎంసీని వీడి బీజేపీలో చేరారు. అప్పటి ఎన్నికల్లో బారక్‌పూర్‌లో టీఎంసీ అభ్యర్థిని ఓడించారు. ఆ తర్వాత తిరిగి టీఎంసీ గూటికి చేరారు. టీఎంసీ విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో పేరు లేకపోవడంతో మళ్లీ బీజేపీ పక్షాన చేరారు.

మంత్రి వర్గాన్ని విస్తరించిన సీఎం నితీశ్

పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ శుక్రవారం తన మంత్రి వర్గంలోకి మరో 21 మందిని చేర్చుకున్నారు. దీంతో, మొత్తం మంత్రుల సంఖ్య 30కి చేరుకుంది. కొత్తగా చేర్చుకున్న వారిలో బీజేపీ సీనియర్ నేత, మాజీ డిప్యూటీ సీఎం రేణు దేవి ఉన్నారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ వీరతో ప్రమాణం చేయించారు.

సాయం కోసం ఎదురు చూస్తుండగా దాడి.. 20 మంది పాలస్తీనియన్ల మృతి

డెయిర్–అల్–బలాహ్: గాజా నగరంలోని ఆహార పంపిణీ కేంద్రం సమీపంలో ఇజ్రాయెల్ బలగాలు జరిపిన దాడిలో 20 మంది చనిపోగా మరో 155 మంది గాయపడినట్లు పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలిపింది. గాజా ఉత్తర ప్రాంతంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకున్నట్లు వెల్లడించింది. సాయం కోసం ఎదురు చూస్తున్న వారిపై ఇజ్రాయెల్ దాడికి పాల్పడిందని పేర్కొంది. అయితే, అదంతా అబద్ధమంటూ ఇజ్రాయెల్ ఆర్మీ కొట్టిపారేసింది.

కోర్టులో కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలకు సంబంధించి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు సెషన్స్ కోర్టులో ఊరట లభించలేదు. ఈడీ పలుమార్లు జారీ చేసిన సమన్లను పట్టించుకోలేదనే కారణంతో తనపై చర్యలు తీసుకోకుండా స్టే విధించాలంటూ ఆయన వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. సమన్లపై కేజ్రీవాల్ స్పందించకపోవడంతో ఈడీ మెట్రోపాలిటన్ కోర్టులో పిటిషన్ వేసింది. విచారించిన అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దివ్యా మల్హోత్రా మార్చి 16వ తేదీన కోర్టులో హాజరు కావాలని ఆదేశించారు. దీనిని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సెషన్స్ కోర్టులో పిటిషన్ వేశారు. శుక్రవారం విచారించిన అదనపు సెషన్స్ జడ్జి రాకేశ్.. చర్యలపై స్టే ఇచ్చేందుకు నిరాకరించడంతోపాటు ప్రత్యక్ష హాజరు నుంచి మినహాయింపు కోసం తిరిగి మెట్రోపాలిటన్ కోర్టుకే వెళ్లాలని సూచించారు.

అది కేవలం ఊహ మాత్రమే: సీతారామన్

న్యూఢిల్లీ: విచారణలో భాగంగా కేంద్ర దర్యాప్తు సంస్థలు చేసే సోదాలకు ఎలక్టోరల్ బాండ్ల కొనుగోలుదార్లకు మధ్య సంబంధం ఉందనడం ఊహ మాత్రమేనని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఈడీ సోదాల తర్వాత బాండ్ల రూపంలో పార్టీలకు నిధులు వచ్చి ఉంటే అది కాకతాళీయమే తప్ప మరో ఉద్దేశం ఉండే అవకాశం లేదని తేల్చిచెప్పారు. గతంలో రాజకీయా పార్టీలకు విరాళాల రూపంలో నిధులు అందేవని గుర్తుచేశారు. అందులో లోపాలు ఉండడంతో పారదర్శకత కోసం కేంద్రం ఎలక్టోరల్ బాండ్లను తీసుకొచ్చిందని వెల్లడించారు. 2013లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ప్రారంభించిన ఎలక్టోరల్ ట్రస్టుల స్కీమ్‌లో ఎన్నో లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు.

రష్యాలో మొదలైన అధ్యక్ష ఎన్నికల పోలింగ్

మాస్కో: రష్యాను అప్రతిహతంగా పాలిస్తున్న పుతిన్ మరో ఆరేళ్లపాటు అధికారంలో ఉంటారా లేదా అని తేల్చే దేశాధ్యక్ష ఎన్నికలు శుక్రవారం మొదలయ్యాయి. సుదూర ప్రాంతాలు, 11 అంతర్జాతీయ కాలామానాల్లో రష్యా ఉన్న కారణంగా 1,00,000 పోలింగ్ స్టేషన్లలో మూడ్రోజులపాటు పోలింగ్ కొనసాగనుంది. రష్యా దురాక్రమణ తర్వాత తమ పరమైన ఉక్రెయిన్ ప్రాంతాల్లోనూ అధ్యక్ష ఎన్నికలు నిర్వహిస్తోంది. ఈ ఎన్నికల్లో తొలిసారిగా ఆన్‌లైన్ ఓటింగ్ ప్రవేశపెట్టడంతో మాస్కోలో 2,00,000కుపైగా పౌరులు ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఓటేశారు. ఏళ్ల పుతిన్‌కు పోటీగా లిబరల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ రష్యా(ఎల్‌డీపీఆర్) తరఫున లియోనిడ్ స్లట్‌స్కీ, న్యూ పీపుల్ పార్టీ తరఫున వ్లాదిస్లేవ్ దవాన్‌కోవ్, కమ్యూనిస్ట్ పార్టీ తరఫున నికోలే ఎన్నికల బరిలో నిలిచారు.

కెనడాలో భారత సంతతికి చెందిన ముగ్గురు అనుమానాస్పద మృతి

ఒటావా: కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్‌లో భారత సంతతికి చెందిన దంపతులు, వారి కుమార్తె అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈ నెల 7వ తేదీ రాత్రి బ్రాంప్టన్‌లోని వారి నివాసంలో మంటలు చెలరేగి సజీవ దహనమయ్యారు. గుర్తు పట్టలేనంతగా కాలిపోయిన మృతదేహాలకు పోలీసులు పరీక్షలు జరిపి మృతులను ఆ ఇంట్లో నివాసం ఉండే రాజీవ్ వరికూ(51), భార్య శిల్పా కొత్త(47), వారి కుమార్తె మహెక్ వరికూ(16)గా నిర్ధారించారు. మంటలు చెలరేగటానికి ముందుగా ఆ ఇంట్లో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించినట్లు చుట్టుపక్కల వారు తెలిపారు. ఘటనను అనుకోకుండా జరిగిన అగ్ని ప్రమాదంగా భావించడం లేదని ఫైర్ అధికారులు తెలిపారు.



కన్యాకుమారిలో సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

కేరళలో కమలం వికసిస్తుంది

పథనంతిట్ట: కేరళలో బీజేపీ క్షేత్రస్థాయిలో మరింత బలపడి ఈసారి ఎక్కువ సీట్లు కైవసం చేసుకోగలదని ప్రధాని మోదీ అభిలషించారు. గత కొద్దిరోజులుగా దక్షిణ భారత రాష్ట్రాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్న ప్రధాని మోదీ శుక్రవారం సైతం తమిళనాడు, తెలంగాణ, కేరళలో పర్యటించారు. కేరళలోని క్రైస్తవుల మెజారిటీ ఎక్కువగా ఉండే పథనంతిట్ట జిల్లాలో మోదీ పర్యటించి అక్కడ క్రైస్తవులను కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చిన మాజీ కేంద్ర మంత్రి ఏకే ఆంటోనీ తనయుడు అనిల్ కె.ఆంటోనీని యువతకు ప్రతిరూపంగా మోదీ కొనియాడారు. కేరళ రాజకీయాలకు ఇలాంటి యువ రాజకీయ ప్రతిభావంతులే కావాలని అన్నారు. పథనంతిట్ట ఎంపీ స్థానం నుంచి బీజేపీ తరఫున ఈసారి అనిల్‌ను బీజేపీ బరిలో నిలిపింది. తర్వాత ఎన్‌డీఏ కార్యకర్తలతో సమావేశంలో మోదీ మాట్లాడారు. ' 2019 లోక్‌సభ ఎన్నికల్లో కేరళలో బీజేపీ రెండంకెల స్థాయిలో ఓట్ల శాతం సాధించింది. ఈసారి రెండెంకల స్థాయిలో సీట్లనూ గెల్చుకోనుంది. కేరళలో ఈసారి కమలం వికసించడం ఖాయం'' అని మోదీ వ్యాఖ్యానించారు.

ఈ ప్రభుత్వాలు పోతేనే అభివృద్ధి వస్తుంది

సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ కూటమి, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటములను విమర్శించారు. '' ఈ రెండు కూటముల అవినీతి, అసమర్థ ప్రభుత్వాల హయాంలో కేరళ ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు'అంటూ ఎల్‌డీఎఫ్ హయాంలో దౌత్యమార్గాల్లో బంగారం స్మగ్లింగ్, యూడీఎఫ్ హయాంలో సోలార్ ప్యానెల్ కుంభకోణాలు జరిగాయని విమర్శలు ఎక్కుపెట్టారు. 'ఎల్‌డీఎఫ్ ఆ తర్వాత యూడీఎఫ్. మళ్లీ ఎల్‌డీఎఫ్. ఇలా కూటమి ప్రభుత్వాలు కొలువుతీరడం ఆగిపోతే రాష్ట్రంలో అభివృద్ధి మొదలవుతుంది. ఈ కూటములు ఓటు బ్యాంక్ రాజకీయాలకు కేంద్రస్థానాలు. ఈ కూటములు కాలం చెల్లిన సిద్ధాంతాలను పట్టుకుని వేలాడుతున్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. కమ్యూనిస్ట్ గూండాలకు అడ్డాలుగా కళాశాలలు విరాజిల్లుతున్నాయి' అని తూర్పారబట్టారు.

ప్రధాని మోదీ ధీమా

ఆశయాలు నెరవేరుస్తాం

'లోక్‌సభ ఎన్నికల్లో గత రికార్డులను తిరగరాస్తూ మూడోసారి అధికారంలోకి వస్తాం. అలాగే కేరళలో ఈసారి బీజేపీని ఆశీర్వదించండి. మీ మద్దతును ఓట్లుగా మార్చి ఎక్కువ స్థానాల్లో గెలిపించండి. పూర్తి మద్దతు పలికితే రాష్ట్రాభివృద్ధికి ఎదురవుతున్న అవరోధాలను అధిగమించి మీ ఆశయాలను నెరవేరుస్తాం. ఇది మోదీ గ్యారెంటీ. ప్రపంచంలో ఎక్కడ భారతీయుడు ఇబ్బందిపడినా మోదీ సర్కార్ వెంటనే ఆపన్నహస్తం అందించింది' అని మోదీ అన్నారు.

తమిళనాడు భవిష్యత్తుకు డీఎంకేనే పెద్ద శత్రువు

తమిళనాడు రాష్ట్ర భవిష్యత్తుకు అధికారంలోని ద్రవిడ పార్టీయే అతిపెద్ద అవరోధమని ప్రధాని మోదీ విమర్శలు ఎక్కుపెట్టారు. శుక్రవారం తమిళనాడులోని కన్యాకుమారిలో జరిగిన బీజేపీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. ' భారత దేశ సంస్కృతి, ఘన వారసత్వం అంటే డీఎంకేకు అస్సలు గిట్టదు. అయోధ్యలో భవ్యరామమందిర ప్రాణప్రతిష్ఠ క్రతువును రాష్ట్రంలో బహిరంగ ప్రదేశాల్లో స్క్రీన్‌లపై చూడకుండా నిషేధించాలని డీఎంకే ప్రయత్నించింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టింది. తమిళ పవిత్ర సెంగోల్‌కు మా ప్రభుత్వం పార్లమెంట్‌లో స్థానం కల్పించింది. కానీ, దేశం, దేశ చరిత్ర, వారసత్వం, మహానుభావుల పట్ల డీఎంకే నేతలకు ఉన్న ద్వేషం ఎలాంటిదో ఇట్టే తెల్సిపోతుంది. అన్నాడీఎంకే చీఫ్, దివంగత జె.జయలలితను డీఎంకే పార్టీ నేతలు ఎంతగా అవమానించారో మీకందరికీ తెలుసు. అదే సంస్కృతి ఇప్పుడూ కొనసాగుతోంది. తమిళనాట మహిళలపై నేరాలు ఎక్కువయ్యాయి. నాడు జల్లికట్టును నిషేధించినపుడు డీఎంకే, కాంగ్రెస్ ఎందుకు మౌనం వహించాయి?. మహిళా రిజర్వేషన్ బిల్లు తెస్తే ఈ పార్టీలు మద్దతివ్వలేదు. మహిళా వ్యతిరేక పార్టీలు ఇవి' అని విమర్శించారు.

కోయంబత్తూర్ రోడ్ షోకు హైకోర్టు ఓకే

చెన్నై: ఈ నెల 18వ తేదీన తమిళనాడులోని కోయంబత్తూర్ నగరంలో నాలుగు కిలోమీటర్ల మేర సాగాల్సిన ప్రధాని మోదీ రోడ్ షోకు మద్రాస్ హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. మతపరంగా సున్నితమైన ప్రాంతం అనే కారణంతో కోయంబత్తూర్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ రోడ్ షోకు అనుమతి నిరాకరించడం సహేతుకంగా లేదని హైకోర్టు పేర్కొంది. ప్రధానమంత్రికి నిరంతరం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ భద్రత ఉంటుందని గుర్తు చేసింది. 'ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి వంటి ఉన్నత హోదా కలిగిన నాయకులను ప్రజలు ఎన్నుకున్నారు. కాబట్టి, తమను ఎన్నుకున్న వారిని కలవకుండా నేతలను ఆపడం సరికాదు'అని అభిప్రాయపడింది. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం 5 గంటల తర్వాత రోడ్ షో జరగనున్నందున పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందీ ఉండదన్నారు. రోడ్ షోకు అనుమతి నిరాకరిస్తూ పోలీస్ కమిషనర్ పురమ్ రంగే తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రమేశ్ కుమార్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎన్.ఆనంద్ వెంకటేశ్ శుక్రవారం విచారణ జరిపారు. రోడ్ షోకు షరతులతో కూడిన అనుమతి ఇవ్వాలని కమిషనర్‌ను ఆదేశించారు.

యడియూరప్పపై పోక్సో కేసు

ఆరోపణలను ఖండించిన కర్ణాటక మాజీ సీఎం



సాక్షి, బెంగళూరు: బీజేపీ సీనియర్ నేత, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప(81)పై పోక్సో కేసు నమోదైంది. బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు అందిన ఫిర్యాదు మేరకు యడియూరప్పపై పోక్సో చట్టంతోపాటు ఐపీసీ 354ఏ కింద కేసులు నమోదయ్యాయి. ఫిబ్రవరి 2వ తేదీన 17 ఏళ్ల తన కుమార్తెపై యడ్యూరప్ప అత్యాచారానికి పాల్పడ్డారంటూ ఆమె తల్లి గురువారం రాత్రి ఫిర్యాదు చేసిందని బెంగళూరు పోలీసులు తెలిపారు. ఈ ఆరోపణలను యడియూరప్ప తీవ్రంగా ఖండించారు. చట్టపరంగా ముందుకు వెళతానన్నారు. పోలీసులు డాలర్స్ కాలనీలోని యడియూరప్ప నివాసానికి వెళ్లి ఆయన నుంచి లిఖిత పూర్వక వివరణ తీసుకున్నారని డీజీపీ అలోక్ మోహన్ శుక్రవారం చెప్పారు. తదుపరి దర్యాప్తు కోసం వెంటనే కేసును సీఐడీకి అప్పగించామన్నారు. ఈ పరిణామంపై హోం మంత్రి జి.పరమేశ్వర మాట్లాడారు. బాధితురాలి తల్లి మానసిక పరిస్థితి సరిగా లేదని కొందరు చెప్పారన్నారు. ఫిబ్రవరి 2వ తేదీన తల్లితో కలిసి యడియూరప్పను ఆయన నివాసంలో కలవడానికి వెళ్లినప్పుడు బాలిక చిత్రీకరించిన రెండు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయ్యాయి.

ఆమె ఏడుస్తూ సాయం అర్థించింది

కేసు నమోదు కావడంపై యడియూరప్ప స్పందించారు. ఈ కేసుకు సంబంధించి చట్టపరంగా ముందుకెళతానన్నారు. 'ఆ మహిళ ఏడుస్తూ నా దగ్గరికి వచ్చింది. ఆమెను లోపలికి రమ్మని చెప్పి, సమస్య తెలుసుకున్నా. ఆ వెంటనే పోలీస్ కమిషనర్ దయానందతో ఫోన్‌లో మాట్లాడి, ఆమెకు న్యాయం చేయాలని కోరా. ఆ వెంటనే ఆమె నన్ను విమర్శించడం మొదలుపెట్టింది. దీంతో, ఏదో తేడాగా ఉందని అనుమానం వచ్చింది'అని చెప్పారు. ఆమె పోలీస్ కమిషనర్‌ను కలిశాక, వ్యవహారం మలుపు తిరిగిందని పేర్కొన్నారు.

సీఏఏ అంతర్గత వ్యవహారం

అమెరికా వ్యాఖ్యలను తిప్పికొట్టిన భారత్

న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)పై అమెరికా స్టేట్ డిపార్టుమెంట్ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ చేసిన వ్యాఖ్యలను భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ గట్టిగా బదులిచ్చారు. భారత దేశ బహుళ సంప్రదాయాలను, దేశ విభజన తర్వాత ఇక్కడి చరిత్రను అర్థం చేసుకోలేని వారు తమకు పాఠాలు చెప్పొద్దని చురక అంటించారు. పౌరసత్వ సవరణ చట్టం తమ దేశ అంతర్గత వ్యవహారమని హితవు పలికారు. ఇక్కడ మైనార్టీలపై ఎలాంటి వివక్ష లేదన్నారు. పొరుగుదేశాల్లో మతహింసకు, వేధింపులకు గురై, వలస వచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వం కల్పించేందుకు సీఏఏ తెచ్చామన్నారు. సీఏఏపై మాథ్యూ చేసిన వ్యాఖ్యలపై ఇండియాలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ''ఇండియాలో సీఏఏను ఎలా అమలు చేయబోతున్నారన్నది గమనిస్తున్నాం. అన్ని మతాల స్వేచ్ఛను గౌరవించాలి. చట్ట ప్రకారం అన్ని మతాలను సమానంగా చూడడం అనేది ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రం' అని మిల్లర్ వ్యాఖ్యానించారు.

ఎలక్టోరల్ బాండ్లు.. అతిపెద్ద కుంభకోణం

- సమగ్ర దర్యాప్తు జరిపించాలి
- కాంగ్రెస్ పార్టీ డిమాండ్

బెంగళూరు: మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకం స్వతంత్ర భారతదేశంలో అతిపెద్ద కుంభకోణమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేసింది. దర్యాప్తు పూర్తయ్యేదాకా అధికార బీజేపీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయాలని స్పష్టం చేసింది. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీ వేల కోట్ల రూపాయలు నొక్కేసిందని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే మండిపడ్డారు. నేను తినను, ఇతరులను తిననివ్వనంటూ ప్రగల్భాలు పలికిన మోదీ ఇప్పుడేం సమాధానం చెబుతారని నిలదీశారు. పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు బీజేపీకి ఇంత సొమ్ము ఎందుకిచ్చారు? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన కాంట్రాక్టర్లు, అవినీతికి పాల్పడిన బడా వ్యక్తులు ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసి, బీజేపీకి సమర్పించుకున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ శుక్రవారం ఆరోపించారు. దర్యాప్తు సంస్థల భయంతో బీజేపీకి లొంగిపోయారని అన్నారు. ఎలక్టోరల్ బాండ్ల కుంభకోణంపై ప్రజాక్షేత్రంలో వెళ్లి పోరాటం సాగిస్తామని తెలిపారు. ఎలక్టోరల్ బాండ్ల స్కామ్‌పై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ డిమాండ్ చేశారు. ఈ బాండ్ల వ్యవహారంలో క్విడ్ ప్రో కో చోటుచేసుకుందని, అవకతవకలు జరిగాయని అన్నారు.

ఇదొక వసూళ్ల రాకెట్: రాహుల్

ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్ ప్రపంచంలోనే అతి పెద్ద బలవంతపు వసూళ్ల రాకెట్ అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ పథకం కింద వసూలు చేసిన సొమ్మును వివిధ రాష్ట్రాల్లో పార్టీలను చీల్చడానికి, ప్రభుత్వాలను పడగొట్టడానికి బీజేపీ దుర్వినియోగం చేసిందని రాహుల్ ఆరోపించారు. ఆయన శుక్రవారం మహారాష్ట్రలోని థానేలో మీడియాతో మాట్లాడారు. బీజేపీ మినహా ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఇచ్చిన కాంట్రాక్టులకు, ఎలక్టోరల్ బాండ్లకు మధ్య ఎలాంటి సంబంధం లేదన్నారు.

• భూమి పూజ



సేలం సమీపంలోని కేజల్‌నాయకన్ పట్టిలో 19వ తేదీ జరగనున్న బీజేపీ భారీ బహిరంగ సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్నారు. ఇందుకోసం బ్రహ్మాండ వేదిక, హెలిప్యాడ్ నిర్మాణ పనులను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.పి.రామలింగం శుక్రవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. -సేలం

న్యూస్‌రీల్

లోక్‌సభ రేసులో ఉన్నాం!

• పన్నీరుసెల్వం



సాక్షి, చెన్నై: లోక్‌సభ ఎన్నికల రేసులో తాము ఉన్నామని, బీజేపీతో చర్చలు కొనసాగుతున్నట్టు మాజీ సీఎం పన్నీరు సెల్వం తెలిపారు. పన్నీరుసెల్వం నేతృత్వంలోని శిబిరం లోక్‌సభ ఎన్నికలను బీజేపీ కూటమితో కలిసి ఎదుర్కొనేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే, తమ పార్టీలోకి శిబిరాన్ని విలీనం చేయాలన్న ఒత్తిడిని బీజేపీ పెద్దలు చేసినట్టుగా సంకేతాలు వచ్చాయి. అదే సమయంలో లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించి, భవిష్యత్తులో తమ రాజకీయ ఉనికి రక్షించుకునే దిశగా పన్నీరు కార్యాచరణలో ఉన్నట్టు శుక్రవారం చర్చ జోరందుకుంది. అదేసమయంలో గ్రీన్ వేస్ రోడ్డులోని ఆయన నివాసంలో ఆ శిబిరం ముఖ్య నేతలందరూ సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. మోదీ పర్యటనకు సైతం పన్నీరు శిబిరం దూరంగా ఉండడంతో ఎన్నికలను ఆ శిబిరం బహిష్కరించబోతోందన్న చర్చ జోరందుకుంది. దీంతో పన్నీరు మేల్కొన్నారు. మీడియా ముందుకొచ్చారు. తాము లోక్‌సభ ఎన్నికల రేసులో ఉన్నామని స్పష్టం చేశారు. బీజేపీతో సీట్ల చర్చలు జరుగుతున్నాయని వివరించారు. అన్ని ప్రక్రియలు ముగిసినానంతరం ప్రధాని మోదీ సభలకు హాజరవుతామని, ప్రస్తుతం చర్చలు జరుగుతున్న దృష్ట్యా కన్యాకుమారి సభకు వెళ్లలేక పోయామని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలను బీజేపీ కూటమితో కలిసి ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

విద్యార్థుల ఓటరు జాబితా రచ్చ

• గవర్నర్ ఆదేశించారా?

సాక్షి, చెన్నై: విశ్వవిద్యాలయాలు, కళాశాలలో విద్యార్థుల ఓటరు జాబితా నంబర్ల సేకరణ ఆదేశాలు రచ్చకెక్కాయి. ఈ ఆదేశాలను రాజ్‌భవన్ నోటి మాటగా జారీచేసినట్టుగా వచ్చిన సమాచారంపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, ఉన్నత విద్యా సంస్థల్లోని తమిళనాడు ఓటరు జాబితాలో పేరు కలిగిన విద్యార్థుల వివరాలను సేకరించే విధంగా ఓ ఉత్తర్వు జారీ అయినట్టుగా సమాచారం వెలువడింది. రాజ్‌భవన్ ఆదేశాల మేరకు వర్సిటీల రిజిస్ట్రార్ ఈ ఉత్తర్వులు ఇచ్చినట్టుగా వెలువడ్డ సమాచారం రచ్చకెక్కింది. విద్యార్థుల ఓట్లను గురిపెట్టి రాజ్‌భవన్ వ్యూహాలు రచిస్తున్నట్టు ఆరోపణలు బయలుదేరాయి. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ విచారణ చేపట్టాలని విద్యార్థుల సంఘాలు, కొన్ని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే, ఈ వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించినట్టు విచారణకు సన్నద్ధమవుతున్నట్టు సమాచారం.

తమిళ జాలర్ల అరెస్ట్

కొరుక్కుపేట: ఫిషింగ్ పరికరాలతో సరిహద్దు దాటి చేపలు పట్టినందుకు 15 మంది కారైకాల్ మత్స్యకారులను శ్రీలంక నౌకాదళం అరెస్టు చేసింది. కారైకల్ క్లించల్ 15 మ్యాట్‌కు చెందిన మురుగానందం (47), అదే ప్రాంతానికి చెందిన 14 మంది గిల్ కారైకల్ ఫిషింగ్ పోర్టు నుంచి ఈనెల 13వ తేదీ తెల్లవారుజామున చేపలు పట్టేందుకు సముద్రంలోకి వెళ్లారు. అక్కడ శ్రీలంక నౌకాదళం గస్తీ నిర్వహించింది. సరిహద్దు దాటి చేపలు పట్టుకుంటున్నారనే ఆరోపణలతో మురుగానందం సహా 14 మందిని అరెస్టు చేసి బోటు, రూ.5 లక్షల విలువైన చేపలు, మత్స్యకారుల సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. 15 మంది మత్స్యకారులను శ్రీలంక కాటన్ ఫిషింగ్ పోర్ట్‌కు తీసుకెళ్లారు.

రూ.25 కోట్లతో కలైంజర్ సెంటినరీ పార్క్

కొరుక్కుపేట: చెన్నైలో రూ.25 కోట్ల వ్యయంతో కలైంజర్ కరుణానిధి సెంటినరీ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ పార్క్ నిర్మాణ పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం శుక్రవారం పరిశీలించారు. చెన్నై రాధాకృష్ణ రోడ్డులో ప్రపంచ స్థాయి పార్కును నిర్మించేందుకు 6.09 ఎకరాల స్థలాన్ని గుర్తించి, నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. అలాగే ఆర్టిస్ట్ సెంటినరీ పార్కులో 12 మీటర్ల వెడల్పు, 2.4 మీటర్ల ఎత్తులో గ్రానైట్ స్లాబ్‌లను ఏర్పాటు చేసి కరుణానిధి విజయాలను వివరిస్తారు. దీనికి సంబంధించి చెన్నైలోని డా.రాధాకృష్ణన్ రోడ్డులో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పలు ప్రత్యేకతలతో నిర్మిస్తున్న కలైంజర్ సెంటినరీ పార్కుకు గత నెల 24న శంకుస్థాపన చేశారు. సూపర్ ట్రీ టవర్, గ్లాస్ హౌస్, ఇతర ప్రత్యేకతలు మంత్రి ఎం. ఆర్కే పన్నీర్‌సెల్వం సందర్శించి, అధ్యయనం చేశారు. కరుణానిధి సెంటినరీ పార్కులో నిర్మించనున్న గ్లాస్‌హౌస్ 40 మీటర్ల పొడవు, 13 మీటర్ల వెడల్పు, 12 మీటర్ల ఎత్తు ఉంటుంది. ఈ గ్లాస్‌హౌస్‌లో రంగురంగుల పువ్వులు, అందమైన మొక్కలతో ఆకుపచ్చ గుడిసె ఉంటుందని మంత్రి తెలిపారు. ఇది సందర్శకులను అందమైన పచ్చని పరిసరాలను చూడడానికి దారితీస్తుందని ఈ సందర్భంగా మంత్రి పన్నీరుసెల్వం అన్నారు.

ఆ ఇద్దరూ తమిళ ద్రోహులు

డీఎంకే, కాంగ్రెస్ తమిళ ద్రోహులు అని, వారి రూపంలో తమిళ ప్రజలు అష్టకష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. ఈ రెండు పార్టీలకు తెలిసిందల్లా ఏ రూపంలో స్కాంలు చేయాలో అన్నది మాత్రమేనని ధ్వజమెత్తారు. తమిళనాడు సమగ్ర ప్రగతికి అవరోధాలను సృష్టిస్తున్న డీఎంకేకు గుణపాఠం చెప్పాలని, కుటుంబ పాలనకు చరమ గీతం పాడాలని తమిళ ఓటర్లకు పిలుపునిచ్చారు. తన ప్రసంగాన్ని తమిళంలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ద్వారా ఇక్కడి ప్రజలు వినేందుకు నమో తమిళ యాప్‌ను సిద్ధం చేశామని ప్రకటించారు.

- డీఎంకే, కాంగ్రెస్‌లపై విరుచుకుపడ్డ ప్రధాని మోదీ
- కుటుంబపాలనకు చరమ గీతం పాడాలని పిలుపు
- బీజేపీకి పట్టం కట్టాలని విజ్ఞప్తి
- కన్యాకుమారిలో ప్రధానికి బ్రహ్మరథం



ప్రధాని మోదీని గజమాలతో సత్కరిస్తున్న మహిళా నేతలు



మోదీకి జ్ఞాపికను అందజేస్తున్న పొన్‌రాధాకృష్ణన్

సాక్షి, చెన్నై: తమిళనాడులో పాగా లక్ష్యంగా వ్యూహాలకు బీజేపీ పదును పెట్టిన విషయం తెలిసిందే. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై చేస్తున్న ప్రయత్నాలకు మరింత బలం, ప్రోత్సాహం కల్పించే దిశగా ప్రధాని మోదీ దృష్టి పెట్టారు. మూడు నెలల కాలంలో తమిళనాడులో నాలుగు సార్లు పర్యటించిన మోదీ, మూడు చోట్ల బీజేపీ బహిరంగ సభలలో ప్రసంగించారు. ఐదోసారి పర్యటనగా శుక్రవారం కన్యాకుమారీలో మోదీ బహిరంగసభ జరిగింది.

తిరువనంతపురం నుంచి రాక..

కేరళ రాష్ట్రం తిరువనంతపురం నుంచి కన్యాకుమారి జిల్లా అగస్తీశ్వరం వివేకానంద కళాశాల మైదానానికి హెలికాప్టర్‌లో మోదీ పర్యటించారు. హెలిపాడ్ నుంచి బహిరంగ సభ వేదికకు చేరుకున్న ప్రధానికి బీజేపీ వర్గాలు బ్రహ్మరథం పట్టాయి. మహిళా నేతలు ప్రధానిని నిలువెత్తు పూలమాలతో సత్కరించారు.

టార్గెట్ డీఎంకే..

సభలో బీజేపీ నేతలు పొన్‌రాధాకృష్ణన్, అన్నామలై, కేంద్రమాజీ మంత్రి ఎల్ మురుగన్ డీఎంకేపై విరుచుకు పడ్డారు. తర్వాత ప్రసంగించిన మోదీ సైతం డీఎంకే, కాంగ్రెస్ ఇండియా కూటమిని టార్గెట్ చేశారు. డీఎంకే కుటుంబ పాలనను గుర్తుచేస్తూ, తమిళనాడుకు గతంలో ఈ రెండు పార్టీలు చేసిన ద్రోహాలు, అవినీతి స్కాంలను వివరించారు. గతంలో తాను ఏక్తాయాత్రను కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నిర్వహించానని గుర్తు చేస్తూ, ప్రస్తుతం ఈ సభ కోసం కశ్మీర్ నుంచి తాను కన్యాకుమారికి వచ్చినట్టు పేర్కొన్నారు. దేశాన్ని చీల్చాలన్న కాంక్షతో ఉన్న శక్తులను కశ్మీరి ప్రజలు ఏ విధంగా తరిమి కొట్టారో, అదే తరహాలో తమిళనాడు సమగ్ర ప్రగతికి అవరోధంగా ఉన్న డీఎంకే కుటుంబ పాలనకు చరమ గీతం పాడేందుకు ఇక్కడి ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

తమిళ ద్రోహులు ..

డీఎంకే, కాంగ్రెస్‌లు తమిళ ద్రోహులు అని, గతంలో వీరు తీసుకున్న నిర్ణయాలతో మత్స్యకారులు సముద్రంలో అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి వచ్చిందని ధ్వజమెత్తారు. కేంద్రం తమిళనాడు సమగ్రాభివృద్ధిని కాంక్షించే పథకాలకు రూపకల్పన చేస్తుంటే, వాటిని అడ్డుకునే విధంగా డీఎంకే పాలకులు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎంకే, కాంగ్రెస్‌ల చరిత్ర అంతా అవినీతి అక్రమాలు, కుంభకోణాల మయం అని, ఈ పార్టీలకు తమిళ ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. దేశ రక్షణలోనూ చెలగాటం ఆడే స్కాంలకు పాల్పడిన ఘనత కాంగ్రెస్, డీఎంకే కూటమిది అని ధ్వజమెత్తారు. రామాలయం ప్రారంభోత్సవానికి కనీసం ఒక్క ప్రతినిధిని కూడా పంపించక పోగా, కార్యక్రమాన్ని వీక్షించకుండా ఇక్కడి ప్రజలను అడ్డుకునే ప్రయత్నాలు చేశారని, చివరకు కోర్టు అక్షింతలు వేయడంతో కంగు తిన్నారని విమర్శలు చేశారు. చివరకు తమిళ సాహస, సంప్రదాయ క్రీడ జల్లికట్టుకు నిషేధం కూడా కాంగ్రెస్, డీఎంకేల రూపంలోనే పడిందని, చివరకు తాము సాహసోపేత నిర్ణయాలతో ఈ క్రీడను మళ్లీ తమిళులకు దరిచేర్చామని ధీమా వ్యక్తం చేశారు. ఇకనైనా బీజేపీకి పట్టం కట్టే నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు. తూత్తుకుడిలో కంటైనర్ హార్బర్ టెర్మినల్‌కు శంకుస్థాపన చేశామని గుర్తుచేస్తూ, తమిళనాడులోని హార్బర్‌లను బలోపేతం చేస్తామని, జాలర్ల సంక్షేమం, భద్రత లక్ష్యంగా చర్యలు విస్తృతం చేస్తామని ప్రకటించారు.

నమో తమిళ యాప్..

తమిళం అంటే తనకు ఎనలేని మక్కువ అని, ఎక్కడకు వెళ్లినా తమిళ రచనలు, సూక్తులను తన ప్రసంగం ద్వారా ఏదో ఒక సందర్భంలో గుర్తుచేస్తుంటానని పేర్కొన్నారు. తమిళం నేర్చుకోవాలి, తమిళంలో మాట్లాడాలన్న ఆశ తనకు ఉందన్నారు. అయితే, తమిళం నేర్చుకోలేక పోతున్నానని, ఇందుకోసం తాను అత్యాధునిక సాంకేతికతను అస్త్రంగా చేసుకున్నట్టు వివరించారు. ఇక మీదట తన ప్రసంగాలన్ని తమిళంలో వినేందుకు అవకాశం కల్పిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఇందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సాంకేతికతను వాడుకుంటున్నట్టు ప్రకటించారు. నమో ఇన్ తమిళ యాప్ ద్వారా తన ప్రసంగాలను తమిళంలోనే అందిస్తామని, వీటిని తమిళనాడు వ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.



నమో తమిళ యాప్‌ను చూపిస్తున్న అన్నామలై

శరత్, రాధికకు అభినందన

బీజేపీలోకి ఎస్ఎంకేను విలీనం చేసిన విషయం తెలిసిందే. ఆ పార్టీ నేతలు, సినీ నటులు శరత్‌కుమార్, రాధిక కన్యాకుమారి బహిరంగ సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ ఇద్దరిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రధాని నరేంద్ర మోదీకి పరిచయం చేశారు. ఆ ఇద్దరిని ప్రధాని అభినందించారు. ఇదే వేదికపై బీజేపీ కూటమి పార్టీకి చెందిన జాన్ పాండియన్, బీజేపీ శాసనసభా పక్ష నేత నయనార్ నాగేంద్రన్, ఎమ్మెల్యేలు వానతీ శ్రీనివాసన్, ఎంఆర్ గాంధీ, మాజీ ఎమ్మెల్యే విజయధరణి, బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అరవింద్ మీనన్, కోఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, బీజేపీ నేతలు శశికళ పుష్ప, కర్పు మురుగానందం, బాల గణపతి పాల్గొన్నారు. అయితే, బీజేపీ కూటమిలోని ఇతర పార్టీల నేతలు ఈ సభకు హాజరు కాలేదు. బీజేపీ కూటమిలో చేరిన అమ్మమక్కల్ మున్నేట్ర కళగం నేత దినకరన్, మాజీ సీఎం పళణిస్వామి శిబిరానికి చెందిన ఏ ఒక్కరూ హాజరు కాలేదు.



ప్రధాని మోదీకి అభివాదం చేస్తున్న శరత్‌కుమార్, రాధిక



తరలి వచ్చిన బీజేపీ శ్రేణులు

ఫోరెన్సిక్ సైన్స్ విభాగానికి సైంటిఫిక్ ఆఫీసర్లు

- 29 మంది నియామకం
- ఉత్తర్వులను అందజేసిన సీఎం

సాక్షి, చెన్నై : ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్లుగా 29 మందిని నియమించారు. వీరికి శుక్రవారం సచివాలయంలో సీఎం స్టాలిన్ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఇటీవల కాలంగా కొత్త రకం నేరాలు పుట్టుకొస్తున్న విషయం తెలిసిందే. ఇందులో క్రిమినల్ కేసుల ఛేదన సవాలుగా మారుతోంది. సాక్ష్యాల సేకరణ, కోర్టుకు ఆధారాల సమర్పణ, ప్రతి క్లూను కీలకంగా పరిగణించి నివేదికల రూపకల్పన చేయడం మరింత భారంగా మారుతోంది. ఇందుకోసం ఫోరెన్సిక్ సైన్స్ విభాగాన్ని రాష్ట్ర హోమ్ శాఖ పరిధిలో 2021లో 62 మంది సిబ్బందితో ఏర్పాటు చేశారు. రూ.24 కోట్లతో అత్యాధునిక వసతులతో భవనం సైతం ఈ విభాగానికి కేటాయించారు. ఇందులో డీఎన్ఏ యూనిట్, కంప్యూటర్ ఫోరెన్సిక్ సైన్స్, మొబైల్ ఫోరెన్సిక్ సైన్స్, ఐఎస్ఓ, ఐఈసీ క్వాలిటీతో కూడిన సౌకర్యాలు కల్పించారు. మైనర్లపై లైంగిక నేరాలకు పాల్పడే నిందితులను గుర్తించడం పోక్సో చట్టంలో అరెస్టు చేయడంలో ఈ విభాగం విజ్ఞాన పరంగా సహకారం పూర్తి స్థాయిలో అందిస్తోంది. కోయంబత్తూరు, సేలం, తిరునల్వేలి, విల్లుపురంలో ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌ల అప్‌గ్రేడ్‌తో పాటు మరిన్ని సౌకర్యాల కోసం ఇటీవల రూ. 25 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఈ పరిస్థితుల్లో ఈ విభాగానికి అదనంగా సిబ్బంది నియామకంలో భాగంగా 29 మంది జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్లను నియమించారు. కార్యక్రమంలో సీఎస్ శివదాసన్ మీన, హోమ్‌శాఖ కార్యదర్శి పి.అముదా, ఫోరెన్సిక్ సైన్స్ విభాగం డైరెక్టర్ విజయలత తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, గత ఏడాది చివరిలో తూత్తుకుడి, తిరునల్వేలి, తెన్‌కాశి, కన్యాకుమారిలలో వరద విలయం గురించి తెలిసిందే. వరదలతో ఉమ్మడి తాగునీటి పథకాల ప్రాజెక్టులు అనేకం దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరణ, మరమ్మత్తుల కోసం రూ. 148 కోట్లను కేటాయిస్తూ సీఎం స్టాలిన్ ఉత్తర్వులు జారీ చేశారు.



సైంటిఫిక్ ఆఫీసర్లకు నియామక ఉత్తర్వులను అందజేస్తున్న సీఎం స్టాలిన్

ప్రధాని ర్యాలీకి పోలీసుల బ్రేక్

- కోయంబత్తూరులో టెన్షన్
- కోర్టుకు బీజేపీ

సాక్షి, చెన్నై: ప్రధాని నరేంద్ర మోదీ ర్యాలీకి కోయంబత్తూరు పోలీసులు బ్రేక్ వేశారు. ఈ అంశాన్ని బీజేపీ వర్గాలు తీవ్రంగా పరిగణించాయి. ర్యాలీకి అనుమతి కోరుతూ మద్రాసు హైకోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తమిళనాడులో ప్రధాని విస్తృతంగా పర్యటిస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం కన్యాకుమారి పర్యటనతో మూడు నెలల వ్యవధిలో ఐదు సార్లు రాష్ట్రంలో ఆయన పర్యటించారు. ఈనెల 18వ తేదీ ఆరోసారిగా రాష్ట్రానికి రానున్నారు. కోయంబత్తూరులో జరిగే బ్రహ్మాండ బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. మరుసటి రోజున సేలంలో జరిగే సభకు హాజరవుతారు. కోయంబత్తూరులో తమ బలం పెరగడంతో బీజేపీ మంచి జోష్ మీదున్నది. దీంతో కోయంబత్తూరులో మోదీ నేతృత్వంలో భారీ ర్యాలీకి నిర్ణయించింది. ర్యాలీకి అనుమతి కోరుతూ పోలీసులను ఆశ్రయించారు. అయితే, శాంతి భద్రతల సమస్యలను అస్త్రంగా చేసుకుని ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించారు. కోయంబత్తూరులో గతంలో చోటుచేసుకున్న పరిణామాలు, ఇటీవల కాలంగా జరుగుతున్న ఘటనలను గుర్తుచేస్తూ ర్యాలీకి అనుమతి ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ప్రధాని మోదీ ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని బీజేపీ వర్గాలు తీవ్రంగా పరిగణించాయి. దీంతో ర్యాలీకి అనుమతి కోరుతూ మద్రాసు హైకోర్టును బీజేపీ ఆశ్రయించింది. తమ పార్టీ నేతృత్వంలో జరిగే ర్యాలీకి అనుమతి ఇచ్చే విధంగా పోలీసులను ఆదేశించాలని ఆ పిటిషన్ ద్వారా విజ్ఞప్తి చేశారు. అత్యవసర పిటిషన్‌గా దీనిని విచారించేందుకు విన్నవించారు. దీంతో శనివారం పిటిషన్ విచారణకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

సీపీఎం అభ్యర్థుల జాబితా విడుదల

• మదురై సీటు మళ్లీ వెంకటేషన్‌కు



సచ్చిదానందం



వెంకటేషన్

సాక్షి, చెన్నై: లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేయనున్న సీపీఎం అభ్యర్థుల జాబితాను శుక్రవారం ఆ పార్టీ కార్యాలయం ప్రకటించింది. మదురై నుంచి సిట్టింగ్ ఎంపీ ఎస్ వెంకటేషన్ మళ్లీ పోటీ చేయనున్నారు. డీఎంకే కూటమిలో సీపీఎంకు రెండు స్థానాలను కేటాయించిన విషయం తెలిసిందే. మదురై, దిండుగల్ సీటును ఈసారి సీపీఎంకు అప్పగించారు. గతంలో మదురై, కోయంబత్తూరు సీట్లలో సీపీఎం గెలవగా, ఈసారి కోయంబత్తూరుకు బదులుగా దిండుగల్ కేటాయించారు. ఈ స్థానాలలో పోటీ చేయనున్న అభ్యర్థులను ఎంపిక చేయడం కోసం శుక్రవారం సీపీఎం రాష్ట్ర సెంట్రల్ కమిటీ సమావేశం జరిగింది. పార్టీ కార్యదర్శి బాలకృష్ణన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అభ్యర్థులను ఎంపిక చేశారు.

మదురైలో మళ్లీ వెంకటేషన్..

2019 లోక్‌సభ ఎన్నికలలో మదురై నుంచి ఎస్ వెంకటేషన్ పోటీ చేసి గెలిచారు. ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేయడంలో ముందుండే వెంకటేషన్, పార్లమెంట్‌లో ఎయిమ్స్ వ్యవహారంపై కేంద్రాన్ని ఢీకొట్టే విధంగా దూసుకెళ్లారు. మంచి వాక్ చాతుర్యం కలిగిన ఈ కార్మిక నేతకు మరోమారు మదురై నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారు. దిండుగల్ లోక్‌సభ సీటును ఆ పార్టీ నేత కామ్రేడ్ ఆర్ సచ్చిదానందంకు కేటాయించారు. బీఎస్సీ గ్రాడ్యుయేట్‌గా, 37 ఏళ్ల సీపీఎం ద్వారా ప్రజాసేవలో ఉన్న సచ్చిదానందం రాష్ట్ర పార్టీ ఉప కార్యదర్శిగా వ్యవహరిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆయనకు లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేసే అవకాశం దక్కింది. ఇదిలాఉండగా సీపీఐకి తిరుప్పూర్, నాగపట్నం లోక్‌సభ స్థానాలను డీఎంకే కేటాయించిన విషయం తెలిసిందే. ఈ రెండు ఆ పార్టీ సిట్టింగ్ స్థానాలే కావడంతో కొత్త అభ్యర్థులను ప్రకటించేనా లేదా సిట్టింగ్‌లకు మళ్లీ అవకాశం కల్పించేనా అన్నది తేలాల్సి ఉంది. ఇందులో భాగంగా అభ్యర్థి ఎంపిక నిమిత్తం సోమవారం సీపీఐ రాష్ట్ర కమిటీ భేటీ కానుంది.

మరో నాలుగు కొత్త కార్పొరేషన్లు

- ప్రభుత్వం ఉత్తర్వులు
- 25కు చేరిన సంఖ్య



సచివాలయం

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో మరో నాలుగు కొత్త కార్పొరేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో పుదుకోట్టై, నామక్కల్, తిరువణ్ణామలై, కారైక్కుడి ఉన్నాయి. ఈ కొత్త ప్రకటనతో రాష్ట్రంలో కార్పొరేషన్ల సంఖ్య 25కు చేరింది. రాష్ట్రంలో చెన్నై, తాంబరం, ఆవడి, తిరుచ్చి, మదురై, తూత్తుకుడి, తిరునల్వేలి, కన్యాకుమారి, దిండుగల్, కోయంబత్తూరు, సేలం సహా 21 కార్పొరేషన్లు ఉన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సంఖ్యను 25కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పుదుకోట్టై, నామక్కల్, తిరువణ్ణామలై, కారైక్కుడి మున్సిపాలిటీ పరిసరాల్లోని పట్టణ పంచాయతీ, యూనియన్ పంచాయతీలను ఏకం చేస్తూ కొత్తగా నాలుగు కార్పొరేషన్ల ఏర్పాటుకు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి శుక్రవారం సీఎం స్టాలిన్ ఉత్తర్వులను జారీ చేశారు. 2011 జనాభా ప్రకారం ఈ కొత్త కార్పొరేషన్ల ఏర్పాటుకు నిర్ణయించారు. ప్రజలకు ప్రభుత్వ పాలన, సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, అన్ని రకాల మెరుగైన వసతుల కల్పన కోసం ఈ నాలుగు మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించినట్టు వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 28 కొత్త మున్సిపాలిటీలు, తాంబరం, కాంచీపురం, కడలూరు, కుంభకోణం, కరూర్, ఆవడి, శివకాశిలను మున్సిపల్ కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ చేశామని, తాజాగా ఈ జాబితాలో మరో నాలుగు చేర్చినట్టు సీఎం తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కొత్త కార్పొరేషన్లలో పుదుకోట్టై, నామక్కల్, తిరువణ్ణామలై జిల్లా కేంద్రాలు కాగా, కారైక్కుడి శివగంగై జిల్లా పరిధిలో ప్రధాన పట్టణంగా ఉంది.

రూ.8 కోట్ల జరిమానా వసూలు

అన్నానగర్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని ఉల్లంఘించిన వారి నుంచి రూ.8 కోట్ల జరిమానా వసూలు చేసినట్లు తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది. తీర ప్రాంతాల్లో ఒక్కసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ వస్తువులను డంపింగ్ చేయడంపై పర్యవేక్షణ, నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం గత ఏడాది బీచ్ పొల్యూషన్ అవేర్‌నెస్ స్టేషన్‌ను బీసెంట్‌నగర్ బీచ్‌లో ప్రారంభించారు. స్టేషన్‌లో వెండింగ్ మెషిన్, ప్లాస్టిక్ కప్పులను అణిచివేసే యంత్రం, అలాగే నిషేధించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్, వాటి పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. వివరణాత్మక వీడియోలు, ప్రింటెడ్ మెటీరియల్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం నీలాంగరై బీచ్‌లో రెండో బీచ్ పొల్యూషన్ అవేర్‌నెస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీన్నిని మంత్రులు ఎం. సుబ్రమణియన్, మెయ్యనాథన్ ప్రారంభించారు. కార్యక్రమానికి వాతావరణ మార్పులు, అటవీ శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ సుప్రియ చాగు అధ్యక్షత వహించారు. భారతదేశంలోనే 'మీండుం మంజ పయి' ప్రచారాన్ని ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా తమిళనాడు నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షలకు పైగా తనిఖీలు నిర్వహించి 670 టన్నుల నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లను స్వాధీనం చేసుకున్నారు. రూ.8.3 కోట్లకు పైగా ఉల్లంఘించిన వారిపై జరిమానా విధించి వసూలు చేశామని పేర్కొన్నారు.

ముస్లింలకు సహాయకాల పంపిణీ

కొరుక్కుపేట: చెన్నై తూర్పు జిల్లా హార్బర్ ఏరియా డీఎంకే ఆధ్వర్యంలో రంజాన్ పండుగ సందర్భంగా బ్రాడ్‌వే డాన్ బాస్కో పాఠశాలలో సంక్షేమ సహాయం, ప్రోత్సాహక కార్యక్రమం జరిగింది. హిందూ ధార్మిక సంక్షేమ శాఖ మంత్రి శేఖర్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ పాల్గొని 3వేల మంది ముస్లింలకు 25 కిలోల బియ్యం బస్తాలు, దుస్తులు అందజేశారు. ఎంపీ దయానిధి మారన్, మేయర్ ప్రియ, ఎమ్మెల్యేలు థాయగం కవి, జోసెఫ్ శామ్యూల్, వెట్రి అగ్లా, ఏరియా కార్యదర్శులు మురళి, రాజశేఖర్, హార్బర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి ప్రభు, జిల్లా యూత్ ఆర్గనైజర్ లోకేష్ పాల్గొన్నారు.

కపాలీశ్వర పంగుని ఉత్సవాలు

• 18 నుంచి 25వ తేదీ వరకు ట్రాఫిక్‌లో మార్పులు

కొరుక్కుపేట: కపాలీశ్వర ఆలయ పంగుని పండుగను దృష్టిలో ఉంచుకుని చెన్నైలోని మైలాపూర్‌లో ట్రాఫిక్ మార్పులు చేసినట్లు ట్రాఫిక్ పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 నుంచి 20 వరకు కపాలీశ్వర ఆలయంలో వార్షిక పంగుని ఉత్సవం కారణంగా, ప్రజల సౌకర్యార్థం ట్రాఫిక్ మార్పులు చేస్తున్నారు. ప్రధానంగా ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు ట్రాఫిక్ మార్పులు ఉంటాయని వెల్లడించారు. మైలాపూర్ దేవాది వీధి నుంచి నడుత్రు, చిత్రకుళం ఉత్తరవీధి వైపు వాహనాలను అనుమతించారు. మధుత్తేరు, సుందరేశ్వర్ రోడ్, ఉత్తర సిద్ధాకులం నుంచి తూర్పు మాత్తురు వెస్ట్ చిత్రకులం రోడ్, డీఎస్‌వీ కోవిల్ స్ట్రీట్, ఆడమ్స్ స్ట్రీట్ సౌత్ మాతా స్ట్రీట్ వరకు వాహనాల రాకపోకలకు అనుమతి లేదు. సుందరేశ్వరరోడ్డులోని రసిక రంజని సభా ప్రాంగణంలో పోలీసు వాహనాలు పార్కింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేశారని ప్రకటించారు.

క్లుప్తంగా

ముగిసిన అంతర్జాతీయ సదస్సు



సుధాకర్‌కు జీవిత సాఫల్య అవార్డు అందజేస్తున్న అతిథులు

కొరుక్కుపేట: యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ ఆంత్రోపాలజీ విభాగం, వనమా ఆర్ట్, ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కల్చర్ ఆన్ క్రాస్ రోడ్స్ అనే అంశంపై రెండు రోజులు పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో అఖిలభారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సీఎంకే రెడ్డి మాట్లాడారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని కొనియాడారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ డా. జీ.జె. సుధాకర్‌ను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. ఆంత్రోపాలజీ విభాగం హెడ్, దామోదరన్, వనమా ట్రస్ట్ నిర్వాహకులు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రభు కుమారి వనమా పాల్గొన్నారు.

హస్తకళా ప్రదర్శన ప్రారంభం



ప్రదర్శనలో ఆకట్టుకున్న కళాకృతులు

తిరువొత్తియూరు: చెన్నై నగరంలో 'నేషనల్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఫెస్టివల్' పేరిట హస్తకళా ప్రదర్శన శుక్రవారం ఏర్పాటైంది. స్థానిక ఆళ్వారుపేట, టీటీకే రోడ్డులోని శ్రీ శంకర హాల్ వేదికగా ప్రారంభమైన ఈ ప్రదర్శనలో దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన చేనేత, హస్త కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారు. ఇందులో వివిధ రకాల మహిళలకు చెందిన దుస్తులు ఉన్నాయి. అంతేకాకుండా హ్యాండ్‌మేడ్ జ్యుయలరీ, కార్పెట్స్, మార్బుల్ క్రాఫ్ట్స్, రాజస్థాన్, ఒరిస్సా, తంజావూరు పెయింటింగ్స్, ఇత్తడి కళారూపాలు, సహరాన్పూర్ కొయ్య సామగ్రి, చెన్నపట్నం, ఏటికొప్పాక ఆట వస్తువులు, ఫ్యాన్సీ జ్యుయలరీ ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఇందులో హస్తకళా వస్తువులు, చేనేత వస్త్రాలపై రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకు కొనసాగనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

తాగునీటి పథకం పనుల ప్రారంభం



పళ్లిపట్టు: ప్రహరీగోడ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్



తిరుత్తణి: ఎస్‌వీజీ పురంలో తాగునీటి పథకం పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి: గ్రామీణుల తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు కుశస్థలినది నుంచి రూ. 40 కోట్ల వ్యయంతో తాగునీటి పథకం పనులను ఎమ్మెల్యే చంద్రన్ శుక్రవారం ప్రారంభించారు. తిరుత్తణి, ఆర్కేపేట మండలాల్లో నీటి సమస్యలు పరిష్కరించేందుకు వాటర్ బోర్డు ద్వారా పళ్లిపట్టు సమీపంలోని కుశస్థలి నది నుంచి రూ. 40 కోట్ల వ్యయంతో ఆర్కేపేట, తిరుత్తణి మండలాల్లోని 20 గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం నిధులు కేటాయించి పనులను ఎమ్మెల్యే చంద్రన్ ప్రారంభించారు. ఇందుకోసం ఎస్‌వీజీ.పురం, ఆర్కేపేట ప్రాంతాల్లో నిర్వహించిన పూజాకార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కుశస్థలినదిలో రాక్షస బావులు ఏర్పాటు చేసి, పైపులైన్ల ద్వారా గ్రామాలకు తాగునీరు సరఫరా చేయనున్నారు. ఏడాది వ్యవధిలో పైపులైన్లు పనులు పూర్తి చేసి గ్రామీణులకు తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఆర్కేపేట మండల చైర్‌పర్సన్ రంజిత, ఎస్‌వీజీ.పురం పంచాయతీ సర్పంచ్ సత్యంరాజు, వైస్ చైర్మన్ తిలకవతి, యూనియన్ కౌన్సిలర్లు ప్రమీలా వెంకటేశన్, సెల్వి సంతోస్, ఉమాపతి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీగోడ నిర్మాణ పనులకు భూమిపూజ

పళ్లిపట్టు: ముస్లింల శ్మశానానికి ప్రహరీగోడ నిర్మాణ పనులను ఎమ్మెల్యే చంద్రన్ శుక్రవారం భూమిపూజ చేసి, ప్రారంభించారు. పళ్లిపట్టు సమీపంలోని పొదటూరుపేట టౌన్ పంచాయతీలో నివాసమున్న వందకు పైబడిన ముస్లిం కుటుంబాలకు తిరుత్తణి మార్గంలో శ్మశానం ఉంది. అయితే రోడ్డుకు సమీపంలో ఉన్నందున ప్రహరీగోడ లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించే సమయాల్లో ముస్లింలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ప్రహరీగోడ నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్న ముస్లింల డిమాండ్‌పై స్పందించిన ఎమ్మెల్యే తన నియోజకవర్గ నిధుల నుంచి రూ. 5.50 లక్షలు కేటాయించారు. పనులు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ముస్లింలు స్వాగతం పలికారు. ఇందులో పళ్లిపట్టు మండల డీఎంకే కార్యదర్శి జి.రవీంద్ర, టౌన్ కార్యదర్శి బాబు, జిల్లా విభాగం కన్వీనర్ ఉదయసూర్యన్, యువజన విభాగం ఉప కన్వీనర్ సుకుమార్, మైనారిటీ విభాగం కన్వీనర్ సిత్తీక్‌అలీ పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



దీపారాధన చేస్తున్న శివాచార్యులు

వేలూరు: జిల్లాలోని విరింజిపురంలో ఉన్న మార్గబందేశ్వరాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. తమిళ పంగుణి ఉత్తర మాసంలో ప్రతి సంవత్సరం స్వామివారి బ్రహ్మోత్సవాలు పది రోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి నరసింహమూర్తి అధ్యక్షతన శివాచార్యులు వేద మంత్రాల నడుమ ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. పుష్పాలంకరణలు, దీపారాధన పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖద్వారంలో ఉన్న వెండి ధ్వజస్తంభానికి పుష్పాలంకరణలు, పూజలు చేసి వేద మంత్రాలు, హరోంహర నామ స్మరణాల నడుమ ధ్వజారోహణం చేశారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవాలు పది రోజుల పాటు జరగనున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో స్వామివారు వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఇదిలా ఉండగా ధ్వజారోహణ పూజల్లో దేవదాయ శాఖ జిల్లా చైర్మన్ అశోక్ కుమార్, రత్నగిరి బాల మురుగన్ స్వామిజీలు ధ్వజ స్తంభానికి కర్పూర హారతులిచ్చి, పూజలు చేశారు. అనంతరం ఆలయ చరిత్రపై పుస్తకాన్ని అవిష్కరించారు.



ఆలయ చరిత్రపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బాలమురుగన్ స్వామిజీ

బ్రోచర్ ఆవిష్కరణ



సీనియర్ సిటిజన్లు, మూడో కేటగిరి వారు, పారిశుధ్య కార్మికులు, ఎస్సీ, ఓబీసీ, అట్టడుగు వర్గాల ఆర్థిక సాధికారత లక్ష్యంగా పీఎం సూరజ్ పోర్టల్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఈ పథకం బ్రోచర్‌ను ఇండియన్ బ్యాంక్ ఈడీ టి.ధనరాజ్, జీఎం ఎం.మోహన్, ఐఏఎస్ అధికారి టీఎస్ వెంకటేష్, చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ జగాడే ఆవిష్కరించారు.

– సాక్షి, చెన్నై

డీఎంకే ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు



దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందజేస్తున్న ఎంపీ కదిర్ ఆనంద్

వేలూరు: డీఎంకే ప్రభుత్వంలోనే దివ్యాంగులకు పలు సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని ఎంపీ కదిర్‌ఆనంద్ అన్నారు. వేలూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో 87 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులకు ఆదుకునేందుకు పలు సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. అందులో భాగంగానే 87 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందజేస్తున్నామన్నారు. వీటితో పాటు అర్హులైన వికలాంగులందరికీ పెన్షన్ సదుపాయం కల్పించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల్లోను ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అదే విధంగా మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 61 మంది మహిళలకు కుట్టు మిషన్‌లను అందజేశామన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, అములు, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి శరవణన్ పాల్గొన్నారు.

154 సెల్‌ఫోన్ల రికవరీ

- బాధితులకు అప్పగింత



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసపెరుమాల్

తిరువళ్లూరు: గత ఏడాది చోరీలకు గురైన 154 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. వాటిని బాధితులకు ఎస్పీ శ్రీనివాసపెరుమాల్ శుక్రవారం అందజేశారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా గత ఏడాది సెల్‌ఫోన్ చోరీలపై 300 పైగా ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు వాటిని సైబర్ క్రైమ్ టీమ్‌కు బదిలీ చేసి నిఘా ఉంచారు. ఈ క్రమంలో చోరీలకు గురైన సెల్‌ఫోన్‌లపై నిఘా ఉంచిన పోలీసులు తమిళనాడులోని వేర్వేరు జిల్లాలో 127, కేరళలో 8, కర్ణాటకలో 4, ఆంధ్రప్రదేశ్‌లో 15 సెల్‌ఫోన్లు పనిచేసినట్టు ఐఎంఈఐ నంబర్ ఆధారంగా గుర్తించి వాటిని రికవరీ చేశారు. వీటి విలువ 23.10 లక్షలు. కాగా రికవరీ చేసిన సెల్‌ఫోన్‌లను 154 మందికి ఎస్పీ శ్రీనివాసపెరుమాల్ శుక్రవారం అందజేశారు. అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ సెల్‌ఫోన్ చోరీ వ్యవహారంలో ఇప్పటికే 80 శాతం కేసులను ఛేదించామని, మిగిలిన వాటిని సైతం త్వరలోనే రికవరీ చేసి బాధితులకు అప్పగిస్తామన్నారు. జిల్లాకు సరిహద్దు ప్రాంతాల్లో ఎర్రచందనం, గంజాయి, మాదకద్రవ్యాలు, రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలించడానికి వీలులేని విధంగా ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి నిఘా ఉంచినట్టు తెలిపారు. జిల్లాలోని పోలీసు స్టేషన్, జనసంచార ప్రాంతాల్లో 4వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, వీటిలో కొన్ని పని చేయకపోవడంతో చోరీ కేసుల్లో నిందితులను పట్టుకోవడం కష్టంగా మారిందన్నారు. మరమ్మతులకు గురైన సీసీ కెమెరాలను వెంటనే సరి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు ఎస్పీ మీనాక్షి, రవికుమార్ పాల్గొన్నారు.

ఏనుగు దాడిలో యువకుడి మృతి

అన్నానగర్: ఏనుగుల దాడిలో ఓ యువకుడు మృతిచెందాడు. కూడలూరు సమీపంలో ఉన్న ఓవేలి మున్సిపాలిటీ పరిధిలోని పెరియ చూండి ప్రాంతానికి చెందిన ప్రశాంత్ (21). ఇతను శుక్రవారం తెల్లవారుజామున పెరియచూండి ప్రాంతం గుండా వెళుతుండగా ఆ ప్రాంతంలో వచ్చిన ఏనుగు ప్రశాంత్‌పై దాడి చేసింది. దాడిలో తీవ్రంగా గాయపడిన అతను సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టమార్టానికి తరలించారు.

కోలీవుడ్ టాక్స్

కల్వన్ విడుదల తేదీ ఖరారు



కల్వన్ చిత్రంలో జీవీ, ఇవానా

తమిళసినిమా: సంగీత దర్శకుడిగా, కథానాయకుడిగా రెండు పడవలపైనా సక్సెస్‌ఫుల్‌గా పయనిస్తున్న నటుడు జీవీ.ప్రకాశ్‌కుమార్. సంగీత దర్శకుడిగా భారీ చిత్రాలకు పనిచేస్తున్న ఈయన కథానాయకుడిగా మంచి కథలను ఎంచుకుని నటిస్తున్నారు. అలా ఈయన నటిస్తున్న రెండు చిత్రాలు విడుదలకు ముస్తాబవుతున్నాయి. అందులో ఒకటి రెబల్. మమితా బైజూ నాయకిగా నటించారు. నిర్మాణ కార్యక్రమాలను పూర్తిచేసుకున్న ఇది మంచి అంచనాల మధ్య ఈ నెల 22న తెరపైకి రానుంది. జీవీ నటిస్తున్న మరో చిత్రం కల్వన్. ఈ చిత్రం ద్వారా ఛాయాగ్రాహకుడు పీవీ. శంకర్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. యాక్సెస్ ఫిలిం ఫ్యాక్టరీ పతాకంపై ఢిల్లీబాబు నిర్మించారు. ఈయన ఇంతకుముందు జీవీ.ప్రకాశ్‌కుమార్ హీరోగా నిర్మించిన బ్యాచిలర్ చిత్రం మంచి విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. దీంతో కల్వన్ చిత్రంపైనా మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇందులో ఇవానా నాయకిగా నటించారు. 2017లో జీవీ.ప్రకాశ్‌కుమార్, ఇవానా జంటగా నటించిన నాచ్చియార్ చిత్రం మంచి విజయాన్ని సాధించింది. ఏడేళ్ల తరువాత మళ్లీ ఈ జంట కలిసి నటించిన చిత్రం కల్వన్. దర్శకుడు భారతీరాజా ముఖ్యపాత్రను పోషించిన దీనికి అయ్యప్పన్, శంకర్ కథను రాశారు. దర్శకుడు పీవీ. శంకర్‌నే ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రానికి జీవీ సంగీతాన్ని అందించారు. ఈ చిత్రం ఏప్రిల్ 4న తెరపైకి రానుంది.

ఆమెతో కితకితలకు ప్రయత్నించా!

తమిళసినిమా: సంగీత దర్శకుడు, నటుడు విజయ్‌ఆంటోని కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం రోమియో. మీరా విజయ్ ఆంటోని సమర్పణలో విజయ్ ఆంటోని ఫిలిం కార్పొరేషన్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం ద్వారా వినాయక్ వైద్యనాథన్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నటి మృణాళిని రవి నాయకిగా నటించిన ఇందులో యోగిబాబు, వీటీవీ.గణేశ్, తలైవాసల్ విజయ్, ఇళవరసు, సుధా, శీజా ముఖ్య పాత్రలు పోషించారు. నిర్మాణ కార్యక్రమాలను పూర్తిచేసుకున్న ఈ చిత్రం రంజాన్ సందర్భంగా వచ్చే నెలలో తెరపైకి రావడానికి సిద్ధం అవుతోంది. రోమియో చిత్రాన్ని తమిళనాడు వ్యాప్తంగా రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం చిత్ర యూనిట్ చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో చిత్ర దర్శకుడు వినాయక్ వైద్యనాథన్ మాట్లాడుతూ ఒక స్త్రీ తన భర్తను ఎలా ప్రేమగా చూసుకోవాలి అన్నదే ఈ చిత్ర ప్రధానాంశం అని పేర్కొన్నారు. ఈ కథకు స్ఫూర్తి తన తల్లి అని అన్నారు. తాను ఒక షార్ట్ ఫిలిం చేసి అవకాశం కోసం ఎదురుచూస్తున్న సమయంలో విజయ్‌ఆంటోని నుంచి ఫోన్‌కాల్ వచ్చిందన్నారు. తాను చేసిన షార్ట్ ఫిలిం గురించి ఎంతో డిటైల్‌గా వివరించి మంచి కథ ఉంటే చెప్పండి అని ఆయన అన్నారన్నారు. దీంతో ఆయన హీరోగా ఒక లవ్‌స్టోరీని చేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. అందుకు కథను రెడీ చేయడానికి ఏడాది గడువు అడిగినట్లు చెప్పారు. అలా మొదలైంది రోమియో చిత్రం అని చెప్పారు. విజయ్‌ఆంటోని మాట్లాడుతూ మృణాళిని ఆత్మవిశ్వాసం కలిగిన మంచి అమ్మాయి అని పేర్కొన్నారు. రోమియో చిత్ర ప్రచారం కోసం తమ గురించి కితకితలు పెట్టాలని ప్రయత్నించామని, అయితే అవేవి వర్కౌట్ కాలేదన్నారు. తాను తొలిసారిగా ఒక ప్రేమ కథా చిత్రంలో నటించినట్లు చెప్పారు. ఒక స్త్రీ మగవాడిని హింసిస్తుందీ, అతను దాన్ని ఎలా భరిస్తాడు? అన్న ఇతి వృత్తంతో రూపొందించిన చిత్రం రోమియో అని చెప్పారు. ఇది కచ్చితంగా అందరికీ నచ్చుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.



రోమియో చిత్ర యూనిట్



నిత్యామీనన్

ఫాంటసీ చిత్రంలో

నిత్యామీనన్

తమిళసినిమా: దక్షిణాది భాషా నటీమణుల్లో తనకంటూ ప్రత్యేకత కలిగిన నటి నిత్యామీనన్. ఈమె ఏ చిత్రంలో ఎలాంటి పాత్రను పోషించినా అందులో తన ముద్ర ఉండేలా చూసుకుంటారు. అలా తమిళం, తెలుగు, మలయాళం, హిందీ భాషల్లో నటిస్తూ బహుభాషా నటిగా రాణిస్తున్న నిత్యామీనన్ ఇటీవల తమిళంలో నటించిన చిత్రం తిరుచిత్రంఫలం. ధనుష్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం మంచి విజయాన్ని సాధించింది. ఇందులో నిత్యామీనన్ తన నటనకుగానూ విమర్శకుల ప్రశంసలను అందుకున్నారు. ఇకపోతే నిత్యామీనన్‌ను తాజాగా మరో హీరోయిన్ ఓరియెంటెడ్ కథా చిత్రంలో నటించే అవకాశం వరించింది. వినోదంతో కూడిన ఫాంటసీ కథా చిత్రంగా రూపొందనున్న ఈ చిత్రాన్ని బాస్క్ టైమ్ థియేటర్స్, పాప్టర్ మీడియా సంస్థ సంయుక్తంగా నిర్మించనున్నారు. ఇందులో వినయ్‌రాయ్, నవదీప్, ప్రతీక్ బబ్బర్, దీపక్ పరంబోల్ ముఖ్యపాత్రలు పోషించనున్నారు. ఈ చిత్రం ద్వారా కామిని దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ఆమె దర్శకుడు విష్ణువర్ధన్ శిష్యురాలు కావడం గమనార్హం. త్వరలో సెట్‌పైకి వెళ్లనున్న ఈ చిత్రానికి ప్రీతా జయరామన్ ఛాయాగ్రహణం, కళా దర్శకత్వం బాధ్యతలను షణ్ముగరాజా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నట్లు నిర్మాతలు శుక్రవారం మీడియాకు విడుదల చేసిన మీడియా ప్రకటనలో పేర్కొన్నారు.

ఇది పద్ధతి కాదు

- జియో స్టూడియోస్ సంస్థపై అసంతృప్తి



వసంత్ రవి

తమిళసినిమా: కండనాళ్ ముదల్, కణ్ణా మూచ్చి ఏనడా చిత్రాల ఫేమ్ ప్రియ దర్శకత్వం వహించిన తాజాచిత్రం పొన్ ఒంద్రు కండేన్. నటుడు అశోక్‌సెల్వన్, వసంత రవి, ఐశ్వర్య లక్ష్మి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని సంగీత దర్శకుడు యువన్ శంకర్‌రాజాకు చెందిన వైఎస్సార్ ఫిలిమ్స్, జియో స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఈ చిత్రాన్ని కలర్స్ తమిళ్ టీవీ చానల్‌లో విడుదల చేస్తున్నట్లు ప్రోమోను జియో స్టూడియోస్ సంస్థ తన ఎక్స్ మీడియాలో పేర్కొంది. ఇది ఇప్పుడు వివాదాస్పదంగా మారుతోంది. దీన్ని ఆ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించిన వసంత్‌రవి తీవ్రంగా ఖండించారు. ఈయన ఈ వ్యవహారంపై తన ఎక్స్ మీడియా ద్వారా స్పందిస్తూ ఈ విషయం తనను ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. జియో స్టూడియోస్ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థ ఇలాంటి ప్రకటన చేయడమా అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. పొన్ ఒంద్రు కండేన్ చిత్రాన్ని నేరుగా చానల్‌లో విడుదల చేసే విషయం గురించి ఇందులో నటించిన తనతో పాటు అశోక్‌సెల్వన్, ఐశ్వర్యలక్ష్మి, నిర్మాత యువన్‌శంకర్‌రాజా, దర్శకురాలు ప్రియ అనుమతి తీసుకోకుండా ఇలాంటి ప్రకటన చేయడం బాధ కలిగిస్తోందన్నారు. తాము ఈ చిత్రం కోసం కఠినంగా శ్రమించినట్లు పేర్కొన్నారు. అలాంటిది చిత్రాన్ని ఛానల్‌లో విడుదల చేయబోతున్నట్లు చేసిన ప్రకటన గురించి తమకెవరికీ తెలియదన్నారు. అలాంటి ప్రకటనను ఎక్స్ మీడియా ద్వారా ప్రకటించి తమకు మర్యాద నిచ్చినందుకు జియో స్టూడియోస్ సంస్థకు చాలా ధన్యవాదాలు అని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా తమను కలిసి ప్రకటన చేయడం సరికాదని వసంత్‌రవి తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

ఆ ముగ్గురు కాంబోలో ఇనిమేల్



శ్రుతిహాసన్

తమిళసినిమా: ఇక్కడ చాలా ఇంట్రెస్టింగ్ కాంబినేషన్‌లో ఒక ప్రాజెక్ట్ రాబోతోంది. కమలహాసన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ఇక ఆయన వారసురాలు శ్రుతిహాసన్ గురించి చెప్పనక్కర్లేదు. అదేవిధంగా ప్రస్తుతం టాప్ మోస్ట్ డైరెక్టర్‌గా వెలిగిపోతున్న లోకేశ్ కనకరాజ్ క్రేజ్ ఏమిటన్నది అందరికీ తెలిసిందే. ఈ ముగ్గురు కలిస్తే ఆ ప్రాజెక్ట్ మజానే వేరు కథా. అవును కమలహాసన్ దర్శకుడు లోకేశ్ కనకరాజ్‌ను నటింప జేశారు. అయితే ఇది చిత్రంలో కాదు. ఒక స్పెషల్ మ్యూజికల్ ఆల్బమ్‌లో. ఈ ఆల్బమ్‌ను కమలహాసన్ రూపొందించడంతో పాటు, అందులోని పాటను రాయడం విశేషం. ఇక మరో విశేషం ఏమిటంటే ఈ పాటను శ్రుతి హాసన్ పాడడంతో పాటు సంగీతాన్ని అందించడం. ఈ ఆల్బమ్‌కు ఇనిమేల్ అనే టైటిల్‌ను నిర్ణయించారు. దీనికి ద్వారకేశ్ ప్రభాకర్ దర్శకత్వం వహించారు. భువన్‌గౌడ ఛాయాగ్రహణం అందించారు. ఆల్బమ్‌ను త్వరలో విడుదల చేయనున్నట్లు శుక్రవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో యూనిట్ వర్గాలు పేర్కొన్నారు. కాగా శ్రుతిహాసన్‌కు మ్యూజిక్ ఆల్బమ్‌లు రూపొందించడం కొత్తేమి కాదు. ఇంతకు ముందు ఎడ్జ్, షీస్ ఏ హీరో, మాస్టర్ మోషన్ పేర్లతో రూపొందించిన మ్యూజికల్ ఆల్బమ్స్ సంగీత ప్రియులను విశేషంగా అలరించాయి. దీంతో తాజాగా క్రేజీ కాంబినేషన్‌లో రూపొందిన ఇనిమేల్ వీడియో ఆల్బమ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తుండడం అతిశయోక్తి కాదుగా.

క్లుప్తంగా

జారి కిందపడి వృద్ధురాలి మృతి

తిరువళ్లూరు: కాలుజారి కిందపడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే.. తిరువళ్లూరు జిల్లా మప్పేడు కొత్త కాలనీకి చెందిన గోవిందరాజ్ భార్య కుముద(71) ఈ నెల 13వ తేదీన ఇంట్లో కాలు జారి కిందపడడంతో గాయపడింది. వెంటనే ఆమెను వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స అందించిన తరువాత గురువారం ఇంటికి తీసుకొచ్చారు. ఇంట్లో విశ్రాంత తీసుకుంటున్న కుముద రాత్రి నిద్రలోనే మృతి చెందారు. మృతురాలి కుమారుడు వెంకటేషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మప్పేడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కార్మికుడు అనుమానాస్పద మృతి

తిరువళ్లూరు: స్నేహితుడి రూమ్‌లో అద్దెకు ఉంటూ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్న కార్మికుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. తిరువణ్ణామలై జిల్లా అరసంబట్టు ప్రాంతానికి చెందిన దురైకన్ను కుమారుడు మనోహరన్. ఇతడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్ధల కారణంగా భార్య ఇద్దరు కుమార్తెలు వేరుగా నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో మనోహరన్ తన స్నేహితుడి రూమ్‌లో ఉంటూ గుమ్మిడిపూండిలోని సిప్‌కాట్ ఓపీజీ పవర్ ప్లాంటులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గత 14న కంపెనీకి వెళ్లిన మనోహరన్ రూమ్‌లో నిద్రించాడు. అయితే ఉదయం నిద్ర లేవకపోవడంతో అనుమానంతో స్నేహితులు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై మృతుడి సోదరుడు పళణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిప్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, విచారణ చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో లాయర్ మృతి

అన్నానగర్: అనుమానాస్పదస్థితిలో ఓ లాయర్ మృతి చెందాడు. తిరుచ్చి జిల్లా తురైయూరు సమీపం కళింగ ముదయన్‌పట్టి గ్రామానికి చెందిన దామోదరన్ (46), తురైయూర్ కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. ఇతని భార్య కళాదేవి (40). వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. శుక్రవారం ఉదయం దామోదరన్ ఇంట్లో స్పృతప్పి పడి ఉన్నాడు. షాక్‌కు గురైన భార్య దామోదరన్‌ను తురైయూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


బావిలో మునిగి యువకుడి..

అన్నానగర్: బావిలో మునిగి ఓ యువకుడు మరణించిన సంఘటన కాట్టాంకొళత్తూరులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చెంగల్‌పట్టు జిల్లా కాట్టాంకొళత్తూరు తిరువల్లువర్ వీధికి చెందిన ముఖేష్ (26) శుక్రవారం తన స్నేహితులతో కలిసి గుడువాంచేరి సమీపంలోని కీరప్పాక్కం గ్రామానికి కారులో వెళ్లారు. కీరప్పాక్కం పంచాయతీ కౌన్సిల్ కార్యాలయం ఎదురుగా ఉన్న పాడుపడిన బావిలో తన స్నేహితులతో కలిసి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. నీట మునిగిన ముఖేష్‌ను చూసి, అతడి స్నేహితులు షాక్‌కు గురయ్యారు. వెంటనే కేఆర్ పోలీస్ స్టేషన్‌తోపాటు అగ్నిమాపకశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని ముఖేష్ మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం చెంగల్పట్టు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, అతడి స్నేహితులను పలు కోణాల్లో విచారిస్తున్నారు.

నలుగురు పట్టభద్రుల అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై ఎంజీఆర్ నగర్‌లో ఆన్‌లైన్ డెలివరీ బాయ్స్‌లా నటిస్తూ గంజాయి విక్రయిస్తున్న నలుగురు పట్టభద్రులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. చెన్నై ఎంజీఆర్ నగర్ అన్నామెయిన్ రోడ్డులో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసన్ నేతృత్వంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో ఆ మార్గంలో మోటార్ సైకిల్‌పై ప్రముఖ ఆన్‌లైన్ వస్తువుల డెలివరీ ఉద్యోగులు మాదిరిగా వచ్చిన నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. వారి వద్ద గంజాయి పొట్లాలు ఉండడంతో వారిని పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 27 కిలోల గంజాయి, 3 మోటార్‌సైకిళ్లు, రూ.12,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారు రామాపురానికి చెందిన రవీంద్రన్, నెసపాక్కం ప్రాంతానికి చెందిన రమేష్, సాలిగ్రామం ప్రాంతానికి చెందిన యుగేంద్రన్, కేకే నగర్‌కు చెందిన బాలభారతి అని తెలిసింది.

జ్యోతి ప్రజ్వలన..



కృష్ణగిరి జిల్లా హోసూరు ముకుంద పల్లిలో సాయిసిల్క్స్ కళా మందిర్ కాంచీపురం వరమహాలక్ష్మి స్టోర్ ఏర్పాటైంది. దీనిని హెచ్‌హెచ్ శ్రీ సెందాలనర్గ సెన్నగ మన్నార్ సంపత్ కుమార రామానుజ జియ్యర్ స్వామి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సంస్థ ఎండీ ప్రసాద్ చలవాడి పాల్గొన్నారు. - సాక్షి, చెన్నై

ఎలిఫెంట్ గేట్ వంతెన ప్రారంభం

• ఎంపీ దయానిధి మారన్ ఆవిష్కరణ



రిబ్బన్ కత్తిరించి వంతెను ప్రారంభిస్తున్న ఎంపీ దయానిధి మారన్, పక్కన మంత్రి శేఖర్ బాబు, మేయర్ ప్రియ

సాక్షి, చెన్నై: ఎలిఫెంట్ గేట్ ప్రాంతంలో నిర్మించిన కొత్త వంతెనలో ఒక భాగాన్ని కేంద్ర మంత్రి దయానిధి మారన్ శుక్రవారం ప్రారంభించారు. చెన్నై కార్పొరేషన్ హార్బర్ నియోజకవర్గ పరిధిలోని రాయపురం మండలం, 57వ వార్డులో ఉన్న ఎలిఫెంట్ గేట్ ప్రాంతంలో రూ.71.26 కోట్లతో చేపట్టిన రైల్వే వంతెన పనులు ముగిశాయి. ఈ వంతెనను శుక్రవారం కేంద్ర మంత్రి దయానిధిమారన్ ప్రారంభించారు. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్, బెసిన్‌బ్రిడ్జ్ రైల్వేస్టేషన్‌లకు మధ్య నిర్మించిన ఈ వంతెన వాల్టాక్స్ రోడ్డు, రాజా ముత్తయ్య సాలైను కలుపుతుంది. ఇక్కడి పాతవంతెన అతిపురాతనమైనది కావడంతో శిథిలావస్థకు చేరుకోవడం వలన వంతెను కూల్చి ఇదేచోట కొత్త వంతన నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఇక్కడ 156.12 మీటర్ల దూరం (రైల్వే ట్రాక్‌పై) రైల్వే శాఖ ద్వారా వంతెన నిర్మించడానికి, వంతెన రెండు వైపులా 364.23 మీటర్ల మేరకు రోడ్డును చెన్నై కార్పొరేషన్ నిర్మించే విధంగా పథకం రూపొందించారు. ఆ మేరకు వాటాక్స్ రోడ్డు వైపు 165.24 మీటర్లు, రాజాముత్తయ్యా సాలై వైపు 198.99 మీటర్ల పొడవు రోడ్డు కార్పొరేషన్ తరపురూ. 30.78 కోట్లతోను, రైల్వే శాఖ ద్వారా రూ.40.48 కోట్లతో రైల్వే వంతెన నిర్మించారు. ఇందులో వాల్టాక్స్ రోడ్డు నుంచి రాజా ముత్తయ్యా సాలైకు చేరుకునే ఒక వైపు మార్గం నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఈ మార్గాన్ని మాత్రం శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి దయానిధి మారన్ పాల్గొని రిబ్బన్ కత్తిరించి వంతెనను ప్రారంభించారు. ఇందులో మంత్రి శేఖర్ బాబు, మేయర్ ప్రియ పాల్గొన్నారు. కేంద్ర మంత్రి దయానిధి మారన్ మాట్లాడుతూ వంతెన రెండో వైపు రైల్వే నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని కోరారు. ఈ వంతెన ద్వారా చెన్నైలో ప్రధాన ప్రాంతాలైన పురసైవాక్కం, ఎగ్మూర్ ప్రాంతాలకు ట్రాఫిక్ రద్దీ లేకుండా వాహనాలు వెళ్లవచ్చన్నారు.

రూ.1300 కోట్లతో ప్లాంట్ విస్తరణకు ప్రణాళిక

సాక్షి, చెన్నై : దేశంలో తమ ఉత్పత్తులను విస్తరించడంతోపాటుగా ప్లాంట్‌ను రూ.1300 కోట్లతో విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని సోనాలికా ట్రాక్టర్స్ వైస్ చైర్మన్ డాక్టర్ అమృత్ సాగర్ మిట్టల్, డైరెక్టర్ అక్షయ్ సంగ్వాన్ ప్రకటించారు. పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌లోనే అతి పెద్ద ఇంటిగ్రేటెడ్ ట్రాక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ ఉందని, ఇందులో తాము చేపట్టి, చేపట్టనున్న వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల గురించి శుక్రవారం స్థానికంగా వివరించారు. రూ.1300 కోట్లతో విస్తరణ ప్రణాళికలో భాగంగా తమ ప్లాంట్‌ను పంజాబ్ సీఎం భగవంత్ మాన్ సందర్శించి, పనులకు ఇటీవల శంకు స్థాపన చేశారని గుర్తు చేశారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగంలో కీలక మైలురాయిని చేరుకునేలా కొత్త ప్లాంట్ ఒక లక్ష మెట్రిక్ టన్నులకు పైగా కరిగే సామర్థ్యం ఉన్న యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. ట్రాక్టర్ల ఉత్పత్తిలో నాణ్యత పెంపు, అసమానమైన సామర్థ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా ముందుకెళ్లనున్నామన్నారు.

రూ.50 లక్షల మోసంపై దర్యాప్తు

అన్నానగర్: తిరుచ్చి సమీపంలో సీబీఐ అధికారి అని చెప్పి, విశ్రాంత బ్యాంక్ అధికారి నుంచి రూ. 50 లక్షలు మోసం చేసిన ముఠాపై తిరుచ్చి సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తిరుచ్చి తిల్లానగర్ ప్రాంతానికి చెందిన సూర్యనారాయణన్ (76)బ్యాంక్ అధికారిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. ఇతనికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒక కొడుకు అమెరికాలో, కూతురు ముంబైలో, ఇంకొక కూతురు కోల్‌కతాలో ఉన్నారు. తిరుచిరాపల్లిలో నివసించే సూర్యనారాయణన్ తన కొడుకు, కూతుళ్లతో స్కైప్ ద్వారా తరచూ మాట్లాడుతుంటాడు. ఘటన జరిగిన రోజు ఇంట్లో ఉండగా సెల్‌ఫోన్‌కు కాల్స్ వచ్చాయి. అందులో ఎదురుగా మాట్లాడిన వారు ట్రాయ్ అధికారి, ముంబయి పోలీసులు, సీబీఐ అధికారి అని బెదిరించారు. అనంతరం స్కైప్ ద్వారా వారిని సంప్రదించగా.. మీరు రూ.2 కోట్లు ఎగ్గొట్టినట్లు ఫిర్యాదు అందింది. మిమ్మల్ని విచారించాలని చెప్పారు. ఆ తర్వాత మీ బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును ఆర్‌బీఐ ఖాతాకు పంపాలని, ఆ ఖాతాను వెరిఫై చేసి, డబ్బును వెనక్కి పంపిస్తామని చెప్పారు. దీన్ని నమ్మిన ఆయన తన బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.50 లక్షలను వారి బ్యాంకు ఖాతాకు పంపించాడు. ఆ తర్వాత ఇచ్చిన మాట ప్రకారం డబ్బులు వెనక్కి పంపలేదు. సెల్‌ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేశారు. మోసపోయానని గ్రహించి తిరుచ్చి సైబర్ క్రైమ్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఇంటింటా ప్రచారానికి శ్రీకారం



సీఆర్.పట్టెడలో ప్రచారం చేస్తున్న మీసై వెంకటేశన్

పళ్లిపట్టు: డీఎంకే ప్రభుత్వ పథకాలు ఇంటింటా ప్రచారానికి వీలుగా డీఎంకేకు చెందిన మీసై వెంకటేశన్ గురువారం సాయంత్రం తన ప్రచారాన్ని ప్రారంభించారు. పళ్లిపట్టు సమీపంలోని రామచంద్రాపురం పంచాయతీలోని సీఆర్.పట్టడ గ్రామానికి చెందిన మీసై వెంకటేశన్ డీఎంకేలో గ్రామకార్యదర్శిగా ఉంటూ ప్రభుత్వ పతకాలపై ప్రచారంలో ఆసక్తిగా వ్యవహరిస్తుంటారు. ఇందుకోసం వివిధ ప్రాంతాలకు వెళ్లి ప్రచారం చేపట్టారు. లోక్‌సభ ఎన్నికలు సందర్భంగా అరక్కోణం లోక్‌సభ పరిధిలోని ఆరు సెగ్మెంట్లలో ఇంటింటికీ వెళ్లి, ప్రజలను కలిసి, ప్రభుత్వం చేసిన మంచి పనులు వివరించి, డీఎంకే, కాంగ్రెస్ కూటమి గెలుపునకు ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. మరోసారి కూడా ఎంపీ జగద్రక్షగన్ భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని, ఇందుకోసం తనవంతుగా ప్రచారానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

అన్నానగర్: రైతు హత్య చేసిన కేసులో తండ్రీకొడుకులు సహా ఐదుగురికి జీవిత ఖైదు విధిస్తూ నాగర్‌కోయిల్ కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. కన్యాకుమారి సమీపం లీపురానికి చెందిన ముత్తురాజ్ (70) రైతు. ఇతని సోదరుడు వేదనాయకుని కుమారుడు అరుల్ వీరదాస్. తన ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్నాడు. 2012 డిసెంబర్ 24న విద్యుత్ బోర్డు ఉద్యోగులు ఇంటికి వచ్చి పరిశీలించి విద్యుత్ కనెక్షన్ ఇచ్చే పనులు ప్రారంభించారు. ఆ సమయంలో అదే ప్రాంతానికి చెందిన రైతులు సుందర్‌రాజ్ (67), అతని కుమారుడు గోల్డన్ తంబి (35), జాకబ్ పాల్ (67), అతని కుమారుడు అరుల్ దేవదాస్ (35), జయరాజ్ (43) విద్యుత్ కనెక్షన్ ఇవ్వకూడదని అడ్డుకున్నారు. వెంటనే అదే ప్రాంతానికి చెందిన ముత్తురాజ్, అరుళ్ వీరదాస్, క్రిస్టోఫర్ సహా ఐదుగురు కలిసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా అడ్డుకోవద్దని హెచ్చరించారు. దీంతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. దీంతో కోపోద్రిక్తులైన గోల్డెన్ తంబి, అరుళ్ దేవదాస్, సుందర్‌రాజ్, మరో ఐదుగురు ముత్తురాజ్, అతని మద్దతుదారులపై కర్రలతో దాడి చేశారు. ముత్తురాజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. కన్యాకుమారి పోలీసులు నిందితులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చారు. ఈ కేసు నాగర్‌కోయిల్‌లోని జిల్లా అదనపు సెషన్స్ కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి జోసెఫ్ జాయ్ శుక్రవారం తీర్పును ప్రకటించారు. అందులో గోల్డెన్ తంబి, అరుల్ దేవదాస్, సుందర్‌రాజ్, జాకబ్‌పాల్, జయరాజ్‌లను దోషులుగా ప్రకటించి జీవిత ఖైదు విధించారు.

పంగుణి ఉత్సవాలకు అంకురార్పణ

తిరువొత్తియూరు: తిరుప్పరకుండ్ర సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో పంగుని ఉత్సవాలకు శుక్రవారం ఉదయం అంకురార్పణ చేశారు. ఈనెల 28వ తేదీ తిరుకల్యాణం జరగనుంది. మదురై తిరుప్పరకుండ్రంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి మురుగప్ప పెరుమాళ్ ఆరు పడై వీడుగల్‌లో మొదటిది. ఈ ఆలయంలో ప్రతి ఏడాది పంగుని ఉత్సవాలు ప్రత్యేకంగా జరుపుతారు. ఈ ఏడాది పంగుని ఉత్సవాలు శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ముందుగా సుబ్రహ్మణ్య స్వామి, దేవసేన అమ్మ వారికి, ధ్వజస్తంభానికి ప్రత్యేక అభిషేకానికి, పూజలు నిర్వహించారు. ఉత్సవాలు మార్చి 30వ తేదీ వరకు జరుగనున్నాయి.

స్నేహితులు విడిపోయారని ఆత్మహత్య

అన్నానగర్: స్నేహితులు విడిపోయారని ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. తిరువారూర్ యూనియన్ వైపూర్‌లోని మారియమ్మన్ కోవిల్ వీధికి చెందిన కన్నదాసన్. చెన్నైలో కారు డ్రైవర్. ఇతని భార్య ముత్తులక్ష్మి. వీరి కుమార్తె విజయ శ్రీ (13). వైపూర్‌లోని పంచాయతీ యూనియన్ మిడిల్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతోంది. ప్రస్తుతం పాఠశాలల్లో వచ్చే ఏడాది విద్యార్థుల అడ్మిషన్లు జరుగుతున్నాయి. దీంతో విజయశ్రీని తిరువారూరులోని బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చేర్పించాలని భావించి తల్లి ముత్తులక్ష్మి గురువారం ఆమెని పాఠశాలకు తీసుకెళ్లింది. కానీ జయశ్రీ మాత్రం స్థానిక పాఠశాలలో స్నేహితులతో కలిసి చదువుకోవడానికే ఇష్టపడింది. ఈ స్థితిలో తిరువారూర్‌లోని బాలిక ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ ఫారమ్‌పై సంతకం చేసింది. అనంతరం ఊరికి తిరిగి వచ్చారు. ఇంట్లో విజయశ్రీని ఒంటరిగా వదిలిన ముత్తులక్ష్మి బయటకు వెళ్లింది. స్నేహితులను వదిలి మరో పాఠశాలకు వెళుతున్నానని మనస్తాపం చెంది విజయశ్రీ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాక్స్ కలెక్టర్ అరెస్టు

అన్నానగర్: ఓ వ్యక్తి వద్ద రూ.10వేలు లంచం తీసుకుంటుండగా ట్యాక్స్ కలెక్టర్ అరెస్టు ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. చెన్నైలోని తరమణి ఎంజీఆర్ నగర్ రాజీవ్ గాంధీ వీధికి చెందిన దీప తన లాగ్‌హౌస్‌ను కాంక్రీట్ హౌస్‌గా మార్చారు. అనంతరం ఆ ఇంటికి ఆస్తిపన్ను నిర్ణయించాలని తరమణిలోని మున్సిపల్ కార్పొరేషన్ వార్డు కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తును పరిశీలించి చర్యలు తీసుకోవడానికి ట్యాక్స్ కలెక్టర్ శరవణన్ రూ.10 వేలు లంచం అడిగారు. అయితే లంచం ఇవ్వడానికి ఇష్టపడని దీప ఆలందూరులోని అవినీతి నిరోధక శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. శరవణన్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవాలని నిర్ణయించుకున్న అవినీతి నిరోధక శాఖ పోలీసులు, దీపకు కెమికల్ పౌడర్ పూసిన కొన్ని కరెన్సీ నోట్లను ఇచ్చి, వాటిని శరవణన్‌కు లంచంగా ఇవ్వాలని సూచించారు. దీంతో శుక్రవారం దీప ఆ నగదును టాక్స్ కలెక్టర్ శరవణన్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు అతడిని అరెస్టు చేశారు.

9 టన్నుల గుట్కా ధ్వంసం



అన్నానగర్: ఉత్తర చెన్నై ప్రాంతంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి తమిళనాడు ప్రభుత్వం నిషేధించిన హాన్స్, గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు పులియాంతోపు పోలీస్ డిప్యూటీ కమిషనర్ ఈశ్వర్, కొడుంగైయూర్ సీఐ శరవణన్‌ఆధ్వర్యంలో ఆహార సంరక్షణ విభాగం అధికారులు, పోలీసులు వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 9 టన్నులకు పైగా గుట్కాను ధ్వంసం చేసి. పూడ్చివేశారు.

పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు

సాక్షి, చెన్నై : పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటును అందించే విధంగా ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తులపై దృష్టి పెట్టామని ఎంజీ మోటార్ ఇండియా ఎండీ గౌరవ్ గుప్తా తెలిపారు. కోయంబత్తూరులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఇక్కడి తమ సేవల విస్తరణతో పాటుగ కొత్త వాహనాల ఉత్పత్తి, ఎలక్ట్రిక్ వాహన కొత్త పోర్ట్ పోలియోలుగా ది కార్ మేకర్ ఎక్సైట్ ప్రో, డ్యూయల్ ఎంజీ జెడ్ ఎస్ ఆవిష్కరించారు.

ఆలయంలో రూ.12లక్షల చోరీ

అన్నానగర్: మదురై సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున రూ.12 లక్షలు ఉన్న ఇనుప లాకర్‌ను దుండగులు చోరీ చేసి తీసుకెళ్లారు. మదురై జిల్లాలోని తిరుమంగళం సమీపం పెరియవాగైకుళం గ్రామంలో వినాయకుడి ఆలయం ఉంది. ఆలయంలో 100 సంవత్సరాల నాటి ఇనుప లాకర్ ఉంది. ఇందులో భక్తులు సమర్పించిన నగదు రూ.12 లక్షలు ఉన్నట్లు తెలిసింది. ఈ స్థితిలో గురువారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఐదుగురు యువకులు ఆలయంలోకి ప్రవేశించి ఇనుప లాకర్‌ను ఎత్తుకెళ్లారు. ఇది చూసిన ఓ మహిళ పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేశారు. ఊరికి దూరంగా ఉన్న ఇనుప లాకర్‌ను స్వాధీనం చేసుకుని చూడగా అందులో నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులు దుండగుల కోసం గాలిస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

అన్నానగర్: తండయార్‌పేటలో షేర్ మార్కెట్‌లో డబ్బులు పోగొట్టుకున్న మనస్తాపంతో ఓ ప్రభుత్వ అధికారి భర్త శుక్రవారం తెల్లవారుజామున ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. తండయారుపేట కార్పొరేషన్ కాలనీ 2వ వీధికి చెందిన దివ్య(35) హైకోర్టులో అసిస్టెంట్ అధికారిగా పని చేస్తోంది. ఈమెకు లక్ష్మణన్ (37)తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి మూడేళ్ల కుమార్తె ఉంది. ఈక్రమంలో శుక్రవారం తెల్లవారుజామున దివ్య ఇంట్లో వంట గదిలోకి రాగా అక్కడ లక్ష్మణన్ ఉరివేసుకుని వేలాడడం చూసి షాక్‌కు గురైంది. విషయం తెలిసి పోలీసులు లక్ష్మణన్‌ను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సదస్సును ప్రారంభిస్తున్న డిప్యూటీ పోలీసు కమిషనర్ ఐమాన్ జమాల్

కొరుక్కుపేట: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని, ఉన్నత చదువులు చదువుకుని సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆవడి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఐమాన్ జమాల్ సూచించారు. ఎస్ఆర్ఎమ్ వాడపల్లి క్యాంపస్‌లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం (సీఎస్ఈ), వైట్ హ్యాట్ హ్యాకర్స్ క్లబ్ (డబ్ల్యూహెచ్‌హెచ్‌సీ) సంయుక్తంగా ఆధ్వర్యంలో 7వ ఎడిషన్ టెక్నోజారే -24 పేరిట జాతీయస్థాయి సాంకేతిక సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సదస్సులో టెక్నికల్, నాన్-టెక్నికల్, గేమింగ్ ఈవెంట్‌లతో పాటు వర్క్‌షాప్‌లు, వెబ్‌నార్లతో ఆహ్లాదకరంగా సాగింది. ఈ సదస్సును ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐమాన్ జమాల్ జ్యోతి ప్రజ్వలన చేసి, ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తతతో ఉండాలని సూచించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న కొమోడో గ్రూప్ డైరెక్టర్ సౌరిరాజన్ సారనాథన్ తన ప్రారంభ ప్రసంగంలో సైబర్ భద్రత ప్రాముఖ్యతను, డిజిటల్ ప్రపంచాన్ని రక్షించడంలో అది పోషిస్తున్న పాత్రను వివరించారు. ముందుగా సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ డా.ఎస్.ప్రసన్నదేవి ముఖ్య అతిథికి స్వాగతం పలికారు. సీఈటీ డీన్ సి.వి.జయకుమార్, వైస్ ప్రిన్సిపల్ (అకడమిక్) డా. సి.గోమతి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ వైట్ హ్యాట్ హ్యాకర్స్ క్లబ్ గోల్డా దిలీప్‌లు కలిసి అతిథులను ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం



ప్రభుత్వ పథకాలపై సాంస్కృతిక ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

తిరువళ్లూరు: ప్రభుత్వ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్ సూచించారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ఫొటో ఎగ్జిబిషన్, విద్యార్థుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలను కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు వేర్వేరు పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ పథకాలపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో దళారులను ఆశ్రయించి, మోసపోతున్నారని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి సులభంగా అర్థమయ్యేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. దీంతో పాటు ప్రభుత్వ పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వచ్చే అర్హులను తరచూ కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా వారికి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు ప్రజలు పాల్గొన్నారు. కాగా విద్యార్థు ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అక్రమ మద్యం, లాటరీ టికెట్ల విక్రయాలపై ఫిర్యాదు

తిరువొత్తియూరు: ఈరోడ్ జిల్లా, అదియమాన్ నగర్‌లో మద్యం, లాటరీ టికెట్లు విక్రయించడంపై స్థానిక ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో వరుసగా మద్యం, లాటరీ టికెట్ల విక్రయం జరుగుతుండడంతో ఆగ్రహించిన ప్రజలు శుక్రవారం ఉదయం హఠాత్తుగా ఈరోడ్, భవాని ప్రధాన రోడ్డుపై ఆందోళన చేపట్టారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఉదయం సమయం కావడంతో పాఠశాలలకు, ప్రభుత్వ ఉద్యోగాలకు, కళాశాలకు వెళ్లే వారు ఇబ్బంది పడ్డారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని లాటరీ టికెట్లు విక్రయించే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వైద్యుడి ఆత్మహత్య

అన్నానగర్: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఎగుమతి చేసిన దోసకాయల డబ్బులు రాకపోవడంతో కంబంలో శుక్రవారం డాక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే.. తేని జిల్లా కంబం సుక్కనగల్‌పట్టి వీధికి చెందిన నాట్టుదురై. ఇతని కుమారుడు నటరాజ్ కుమార్ (44). ఇతను 22 సంవత్సరాల వయస్సులో మెడిసిన్ చదవడానికి రష్యా వెళ్లాడు. అక్కడ చదువుతున్న సమయంలో నటరాజ్ ఆ దేశానికి చెందిన మారియాను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వైద్యవిద్య పూర్తి చేసిన నటరాజ్‌కుమార్ రష్యా రాజధాని మాస్కోలో క్లినిక్ నడుపుతూ తన భార్యతో కలిసి నివాసముంటున్నాడు. వీరికి ఐదుగురు పిల్లలు. 7 ఏళ్ల క్రితం నటరాజ్‌కుమార్ తన భార్యతో కలిసి కంబం వచ్చి, ఇక్కడే నివసిస్తున్నాడు. ఇంతలో, కంబం ప్రాంతంలో పెరిగిన గెర్కిన్(దోసకాయ) రష్యా, ఉక్రెయిన్, ఈజిప్టుకు డబ్బు పంపేవాడు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం కారణంగా ఎగుమతి పరిశ్రమ ప్రభావితమైంది. కొత్తగా ఎగుమతి చేసిన దోసకాయలకు కూడా డబ్బు రాలేదు. వాటిని సరఫరా చేసిన రైతులు డబ్బులు డిమాండ్ చేసి, నటరాజ్ కుమార్‌పై ఒత్తిడి తెచ్చారు. ఇందుకోసం ప్రైవేటు ఆర్థిక సంస్థ నుంచి డబ్బులు తీసుకున్నాడు. అయితే ఎగుమతి డబ్బులు రాకపోవడంతో నటరాజ్‌కుమార్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ప్రైవేట్‌ఆర్థిక సంస్థలో అప్పు కట్టలేకపోయాడని తెలుస్తుంది. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లోని ఓ గదిలోకి వెళ్లిన నటరాజ్‌కుమార్ ఎంతసేపటికీ బయటకు రాలేదు. దీంతో అనుమానం వచ్చి, భార్య లోపలికి వెళ్లి చూడగా నటరాజ్ కుమార్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. ఇది చూసిన మరియా కేకలు వేసింది. శబ్దం విన్న స్థానికులు పరుగున వచ్చి నటరాజ్‌కుమార్‌ను రక్షించి కంభం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు నటరాజ్ కుమార్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టచ్ స్క్రీన్ టెక్నాలజీలో పురోగతి



డాక్టర్ ఎం.మణివణ్ణన్

సాక్షి, చెన్నై : టచ్ స్క్రీన్ టెక్నాలజీలో అద్భుతమైన పురోగతిని మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం మణివణ్ణన్ సాధించారు. అద్భుత ఫీచర్ల వివరాలను ఆయన హిస్టరీ చానల్ ముందు ప్రదర్శించారు. ఐఐటీ మద్రాసులో పరిశోధకులుగా ఉన్న డాక్టర్ మణివణ్ణన్ టచ్ స్క్రీన్ టెక్నాలజీ గురించి, ఇంటరాక్టివ్ అనుభవాలలో కొత్త శకానికి నాంది పలికారు. ఈ వినూత్న సాంకేతికత ఆధారంగా స్క్రీన్‌పై ప్రదర్శించే చిత్రాల ఆకృతులను చూడడమే కాకుండా కొత్త అనుభూతిని కలిగించే విధంగా డిజిటల్, భౌతిక ప్రపంచాల మధ్య సంబంధాన్ని మరింత పెంచే రీతిలో కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ విషయంగా శుక్రవారం డాక్టర్ మణివణ్ణన్ పేర్కొంటూ, ఈ ఆవిష్కరణ ఒక పెద్ద సాంకేతిక విప్లవంలో ముందంజ అని వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో డిజిటల్ పరికరాలతో పరస్పర చర్యల విధానాన్ని మార్చడానికి కొత్త వేదికగా మారిందన్నారు. ఇంటరాక్టివ్ టచ్ యాక్టివ్ డిస్‌ప్లేగా (ఐటీఏడీ) ఈ టెక్నాలజికి నామకరణం చేశామన్నారు. ఇందులోని పూర్తి సమాచారంతో వివరాలను ఈనెల 18వ తేదీ రాత్రి 8 గంటలకు హిస్టరీ 18 చానల్ ఓఎంజీ యే మేరా ఇండియా కార్యక్రమం ద్వారా ప్రేక్షకుల ముంగిటకు తీసుకురాబోతోందన్నారు.

బెయిల్ నిరాకరణ

తిరువొత్తియూరు: లంచం కేసులో అరెస్ట్ అయిన అంకిత్ తివారి బెయిల్ దరఖాస్తును మదురై హైకోర్టు తిరస్కరించింది. దిండుక్కల్ ప్రభుత్వ డాక్టర్ సురేష్ బాబు వద్ద రూ. 45 లక్షలు తీసుకుని అరెస్ట్ అయిన, మదురై అవినీతి నిరోధక శాఖ అధికారి అంకిత్ తివారిని మదురై సెంట్రల్ జైలులో ఉంచారు. దీనికి సంబంధించి విచారణ దిండుకల్ ప్రధాన క్రైమ్ జ్యుడిషియల్ కోర్టులో జరుగుతోంది. ఈ క్రమంలో తనకు బెయిల్ కోరుతూ దిండుకల్ కోర్టులో హైకోర్టు మదురై శాఖలో దాఖలు చేసిన బెయిల్ దరఖాస్తులు ఇప్పటికే తిరస్కరించారు. మరో మారు బెయిల్ కోరుతూ అంకిత్ తివారి హైకోర్టు మదురై శాఖలో దరఖాస్తు చేశాడు. ఈ దరఖాస్తును పరిశీలించిన న్యాయమూర్తి వివేక కుమార్ ఈ దరఖాస్తు విచారించేందుకు ఇష్టం లేదని విచారణకు మరో న్యాయమూర్తి ముందు సమర్పించాలని అతను కోరుతూ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఈ దరఖాస్తు న్యాయమూర్తి దండపాణి ముందు శుక్రవారం విచారణకు వచ్చింది. ఆ సమయంలో దరఖాస్తును పరిశీలించిన న్యాయమూర్తి పిటిషన్‌దారులు తరపున ఇంత వరకు నివేదిక దాఖలు చేయలేదని, కావున అంకిత్ తివారికి బెయిల్ ఇవ్వడానికి వీలు కాదని దరఖాస్తు తిరస్కరించారు.

క్రీడోత్సవం



వేళచ్చేరిలోని గురునానక్ కళాశాలలో రాష్ట్ర స్థాయి క్రీడలు జరిగాయి. ఇందులో 47 కళాశాలలకు చెందిన 347 మంది విజేతలకు శుక్రవారం బహుమతులను అందజేశారు. రాష్ట్ర శాంతి భద్రతల విభాగం డీజీపీ శంకర్ జివ్వాల్, హోంగార్డ్ డీజీపీ కె వన్నియ పెరుమాల్, కమాండెంట్ జనరల్ మంజిత్ సింగ్ నాయర్, నిర్వాహకులు టీకే అవ్వై కొతారి, పి బాలాజ బహుమతులను అందజేసినానంతరం క్రీడోత్సవ పుస్తకాన్ని ఆవిష్కరించారు. - సాక్షి, చెన్నై

తొలగిన పచ్చ ముసుగు

వివేకా వర్ధంతి సాక్షిగా బట్టబయలైన రాజకీయ కుట్ర

సౌభాగ్యమ్మ, సునీత, షర్మిల...అంతా పచ్చ తానులో ముక్కలే

చంద్రబాబు స్క్రిప్ట్ చదువుతూ ప్రజల్ని తప్పుదారి పట్టించే యత్నం

ఎన్నికల షెడ్యూల్ విడుదల వేళ పచ్చ ముసుగులు తొలిగాయి! వైఎస్ వివేకా సతీమణి సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత తమ రాజకీయ ఆకాంక్షలను బయట పెట్టుకున్నారు. తమకు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని, కొంతకాలంగా తాము చదువుతోంది చంద్రబాబు స్క్రిప్టేనని చాటుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా సాగుతున్న పచ్చ కుట్రలో తాము భాగస్వాములమని తేల్చేశారు. టీడీపీ తరపునో, ఆ పార్టీ మద్దతుతోనో ఎన్నికల్లో పోటీ చేయడమే తమ ఆంతర్యమని కుండబద్దలు కొట్టారు. ఇక షర్మిల కూడా తానూ ఆ పచ్చతానులో ముక్కనేనని విస్పష్టంగా ప్రకటించారు. వైఎస్ వివేకా ఐదో వర్ధంతి కార్యక్రమం సందర్భంగా సౌభాగ్యమ్మ, సునీత, షర్మిల ఒకే లయ, ఒకే తాళంతో చంద్రబాబు ఐదేళ్లుగా పాడుతున్న పాచిపాటనే మళ్లీ పాడారు.

-సాక్షి, అమరావతి



సునీత... షర్మిల... సౌభాగ్యమ్మ

బాబు కుట్రలో పాత్రధారుల ప్రవేశం ఇలా...

వైఎస్ వివేకా 2019 మార్చి 15న హత్యకు గురైన వెంటనే వైఎస్ జగన్ లక్ష్యంగా చంద్రబాబు ప్రచారంలోకి తెచ్చిన కట్టుకథను ప్రజలు ఎన్నికల్లో తిప్పికొట్టారు. దాంతో ఎన్నికల తరువాత చంద్రబాబు రూటు మార్చారు. తాము చేసిన నిరాధార ఆరోపణలనే వివేకా కుటుంబ సభ్యులతో పలికించే కుయుక్తులకు తెరతీశారు. ముందుగా వివేకా కుమార్తె నర్రెడ్డి సునీతను రంగంలోకి దించారు. ఆ డ్రామా దాదాపు మూడేళ్లకుపైగా కొనసాగిన తరువాత చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారమే షర్మిల రాజకీయ తెరపైకి వచ్చారు. సునీత నిరాధార ఆరోపణలనే ఆమె కూడా వినిపిస్తున్నారు. ఈ నాటకం రక్తి కట్టక పోవడంతో చివరి పాత్రధారిగా వివేకా సతీమణి సౌభాగ్యమ్మను చంద్రబాబు తెరపైకి తెచ్చారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు ఆమె పాత్రను ప్రవేశపెట్టడం చంద్రబాబు టైమింగ్‌కు నిదర్శనం. ఎన్నికల వేళ సౌభాగ్యమ్మ, సునీత తమలో గూడు కట్టుకున్న రాజకీయ ఆకాంక్షను బయటపెట్టారు. వీరిద్దరూ కొద్ది రోజుల క్రితం సీఎం రమేశ్ ద్వారా చంద్రబాబుతో హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. కడప ఎంపీగా పోటీ చేయాలనే తమ ఆకాంక్షను గుర్తు చేశారు. నాలుగేళ్లుగా ఈ డ్రామా నడుపుతున్న చంద్రబాబు అందుకు సరే అన్నారు. వారం క్రితమే నర్రెడ్డి సునీత తానుగానీ తన తల్లి గానీ ఎన్నికల్లో పోటీ చేస్తామనే సంకేతాలు ఇచ్చారు. వైఎస్సార్‌సీపీని ఓడించాలన్నారు. పచ్చ సీరియల్‌లో తరువాత ఎపిసోడ్ వివేకా వర్ధంతి కార్యక్రమాన్ని పులివెందులలో పక్కా స్క్రిప్ట్‌తో నిర్వహించారు. అందులో సౌభాగ్యమ్మ, సునీత, షర్మిల ప్రసంగాలు ఒకే రాజకీయ లక్ష్యంతో సాగడం గమనార్హం. టీడీపీ తరపున పోటీ చేసేందుకు ఇప్పటికే రంగం సిద్ధం చేసుకున్న సౌభాగ్యమ్మ కడప ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు.

రాజకీయ వారసత్వం

రెండో వివాహంతో రగడ



రెండో భార్య షమీమ్, కుమారుడితో వివేకానందరెడ్డి

వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో విభేదాలు తలెత్తాయి. తాను రెండో వివాహం చేసుకున్న షమీమ్ అనే మహిళకు ఆస్తిలో వాటా ఇవ్వడంతోపాటు ఆమె ద్వారా జన్మించిన కుమారుడిని తన రాజకీయ వారసుడిగా ప్రకటించాలని వివేకా భావించారు. దీన్ని సౌభాగ్యమ్మ, సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. వైఎస్ వివేకా ఆస్తితోపాటు రాజకీయ వారసత్వం తమకే దక్కాలని పంతం పట్టారు. వివేకా హత్య తరువాత ఆయన పేరిట ఉన్న భూములు, ఇతర ఆస్తులను సునీత హడావుడిగా తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆస్తులు హస్తగతమయ్యాక రాజకీయ వారసత్వంపై సౌభాగ్యమ్మ, సునీత కన్నేశారు. వివేకా జీవితాంతం రాజకీయంగా విభేదించిన చంద్రబాబుతో చేతులు కలిపారు. 2017లో వైఎస్సార్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ ఆ పార్టీ అభ్యర్థిగా ఉన్న వివేకాను అప్పటి సీఎం చంద్రబాబు, టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణ రెడ్డి కుట్రపూరితంగా ఓడించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులను ప్రలోభాలకు గురిచేసి పులివెందులకే చెందిన టీడీపీ అభ్యర్థి బీటెక్ రవిని గెలిపించారు. వివేకాను కుట్రతో ఓడించిన చంద్రబాబు, ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవిలపట్ల నాలుగేళ్లుగా సౌభాగ్యమ్మ, సునీత సన్నిహితంగా ఉంటున్నారు.

హత్య అనంతరం...

ఆద్యంతం సందేహాస్పదం



నర్రెడ్డి రాజశేఖరరెడ్డి



నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి



ఆదినారాయణ రెడ్డి

వైఎస్ వివేకా హత్య అనంతరం సౌభాగ్యమ్మ, సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావ మరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి వ్యవహరించిన తీరు సందేహాస్పదంగా ఉంది. వివేకా గుండెపోటుతో చనిపోయారనే ప్రచారం వెనుక ఆయన కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి ప్రధాన పాత్ర పోషించారు. 2019, మార్చి 15న ఉదయం వివేకా తలపై తీవ్ర గాయాలతో మృతిచెందారని ఆయన పీఏ పీఏ కృష్ణారెడ్డి మొదటగా గుర్తించారు. ఆ వెంటనే వివేకా సతీమణి, కుమార్తె, అల్లుడులకు సమాచారం ఇచ్చారు. రక్తపు మడుగులో పడి ఉన్న వివేకా మృతదేహం ఫొటోలు తీసి వాట్సాప్ చేశారు. అయినప్పటికీ ఆయన పెద్ద బావమరిది శివప్రకాశ్‌రెడ్డి అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రి ఆదినారాయణరెడ్డికి ఫోన్ చేసి వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించారని చెప్పారు. అదే విషయాన్ని ఆదినారాయణరెడ్డి మీడియాకు వెల్లడించారు. దాంతో వివేకా గుండెపోటుతో మరణించారనే అసత్య సమాచారం బయటకు వచ్చింది. టీవీ చానళ్లలో ప్రసారమైంది. ఇక వివేకా రాసిన లేఖను బయటపెట్టవద్దని పీఏ కృష్ణారెడ్డిని ఆదేశించడం ద్వారా గుండెపోటుతో మరణించారన్న ప్రచారాన్ని ఆయన కుమార్తె, అల్లుడు కొనసాగించారు. ఆ లేఖను వెంటనే పోలీసులకు అప్పగించమని వారు చెప్పి ఉంటే వివేకాని హత్య చేశారన్న విషయం వెంటనే అందరికీ తెలిసిపోయేది. కానీ ఆ లేఖను ఉద్దేశపూర్వకంగానే గోప్యంగా ఉంచారు. ఆ రోజు మధ్యాహ్నం దాదాపు 1 గంట సమయంలో పులివెందుల చేరుకున్న సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డికి ఆ లేఖను, సెల్‌ఫోన్‌ను కృష్ణారెడ్డి ఇచ్చారు. వారు ఆ లేఖను చదివిన వెంటనే దాన్ని పోలీసులకు అప్పగించలేదు. సునీత ఆదేశాలతో సాయంత్రం 5 గంటలకు కృష్ణారెడ్డి ఆ లేఖ, సెల్‌ఫోన్‌ను పోలీసులకు అందచేశారు. లేఖను సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డి ఎందుకు గోప్యంగా ఉంచారన్నది ఈ కేసులో కీలక అంశం. వివేకా గుండెపోటుతో మరణించారని ప్రచారం చేసే ఉద్దేశంతోనే ఆ లేఖను బయట పెట్టకూడదని వారు నిర్ణయించారా? అన్నది ఇక్కడ అందరికీ కలిగే సందేహం. ప్రత్యక్ష సాక్షి వాచ్‌మేన్ రంగయ్య చెప్పిన వివరాల ప్రకారం 2019, మార్చి 14 అర్ధరాత్రి వివేకాను హత్య చేసిన తరువాత హంతకులు ఆ నివాసంలో ఆస్తి పత్రాలు, రౌండ్ సీల్ కోసం వెతికారు. దీంతో వివేకా తన రెండో భార్యకు రాసిచ్చిన ఆస్తి పత్రాలను ఆ ఇంటి నుంచి తీసుకువెళ్లారన్నది స్పష్టమైంది. వివేకా ఆస్తి కోసం, రాజకీయ వారసత్వం కోసమే ఆయన సొంత కుటుంబ సభ్యులే ఈ హత్యకు పన్నాగం పన్ని ఉంటారన్నది స్పష్టమవుతోంది.


బద్ధశత్రువులతో

ఒకే వేదికపై

పులివెందులలో శుక్రవారం నిర్వహించిన వివేకా వర్ధంతి కార్యక్రమంలో సౌభాగ్యమ్మ, సునీతతోపాటు ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి ఒకే వేదికపై ఆశీనులయ్యారు. వివేకాకు జీవితాంతం బీటెక్ రవి ప్రత్యర్థిగానే ఉన్నారు. 2017 ఎన్నికల్లో అక్రమంగా ఓడించారు. ఆ రాజకీయ కుట్రను ఆదినారాయణరెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. 2019లో వివేకాను హత్య చేసివారికి వీరిద్దరూ పూర్తి అండదండలు అందిస్తున్నారు. అటువంటి వారు సౌభాగ్యమ్మ, సునీతకు అత్యంత ఆప్తులయ్యారు. వారిద్దరినీ ఆహ్వానించి వివేకా వర్ధంతి వేడుకలను నిర్వహించడం విభ్రాంతికరమే కాదు రాజకీయాలంటేనే జుగుప్స కలిగిస్తున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఒంటరిని చేసి..

పస్తులు ఉంచి..



వివేకా జీవించి ఉండగా ఆయన్ని పట్టించుకోని కుటుంబ సభ్యులు ప్రస్తుతం రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారు. హత్యకు గురి కావడానికి చాలా ఏళ్ల ముందు నుంచే వివేకాను ఆయన సతీమణి, కుమార్తె, అల్లుడు విస్మరించారు. వివేకా షమీమ్‌ను రెండో వివాహం చేసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన సౌభాగ్యమ్మ, సునీత ఆయన్ని చాలా ఏళ్లుగా పులివెందులలో ఒంటరిగా వదిలేశారు. సౌభాగ్యమ్మ చాలా ఏళ్లుగా హైదరాబాద్‌లో తన కుమార్తె నివాసంలో ఉంటున్నారు. వివేకా చెక్ పవర్‌ను కూడా రద్దు చేసి ఆయన రోజువారీ ఖర్చుల కోసం ఇబ్బంది పడే పరిస్థితి కల్పించారు. వివేకాకు ఇంట్లో వండి పెట్టేవారే లేని దుస్థితి కల్పించారు. చివరికి రెండు చపాతీలు కూడా ఇచ్చేవారు లేక ఆయన పనివాళ్ల మీద ఆధారపడాల్సి వచ్చేది. తిండి లేకుండానే నిద్రపోయిన రోజులూ ఉన్నాయి. ఈ విషయాలేవీ ఎవరికీ తెలియవన్నట్టుగా సౌభాగ్యమ్మ, సునీత వ్యవహరించి నిజాలకు పాతరేసేందుకు యత్నించారు.

'బీటెక్'..

సాగని ఆటలు



పులివెందుల నియోజకవర్గంలో కొద్దోగొప్పో పట్టు సాధించాలన్నది టీడీపీ నేత బీటెక్ రవి లక్ష్యం. టీడీపీ అధికారంలో ఉండటంతో 2019 ఎన్నికల్లో యథేచ్ఛగా అక్రమాలు సాగించవచ్చని పథకం వేశారు. కానీ నాడు వివేకా వైఎస్సార్‌సీపీకి పెద్దదిక్కుగా నిలబడటంతో బీటెక్ రవి ఆటలు సాగలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను దొంగదెబ్బ తీసిన బీటెక్ రవికి పులివెందుల అసెంబ్లీ ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కకుండా చేయాలని వివేకా పంతం పట్టారు. ఈ నేపథ్యంలోనే ఆయన హత్యకు గురయ్యారు. హత్యకు ముందు రోజు కొమ్మారెడ్డి పరమేశ్వర రెడ్డి (ఈయనతో వివేకాకు ఆర్థిక విభేదాలు తలెత్తాయి)తో బీటెక్ రవి రెండుసార్లు సమావేశమయ్యారు. ఈ భేటీలో పాల్గొన్న శ్రీనివాసరెడ్డి తర్వాత కొద్ది రోజులకే అనుమానాస్పద రీతిలో మృతి చెందారు. నార్కో పరీక్ష నిర్వహించాలని సిట్ దర్యాప్తులో నిర్ణయించినా పరమేశ్వరరెడ్డి మొండికేయడం సందేహాస్పదమే.

దస్తగిరి..

హంతకుడి హైడ్రామా



వివేకాను ఎంత పాశవికంగా హత్య చేశాడో పూసగుచ్చి చెప్పిన దస్తగిరితో వివేకా కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి అత్యంత సన్నిహితంగా ఉండటం ఎవరికైనా విభ్రాంతి కలిగించకమానదు. వివేకాను హత్య చేసిన నలుగురిలో దస్తగిరి ఉన్నాడన్నది నిర్ధారణ అయ్యింది. అదే దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కరరెడ్డిపై నిరాధారణ ఆరోపణలు చేయిస్తున్నారంటే... దీని వెనుక ఎవరున్నారన్నది కీలకం. చంద్రబాబు, ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి, సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి...ఇలా అందరూ దస్తగిరికి బహిరంగంగానే సహకరిస్తున్నారు. వివేకా హత్యకు ముందు రూ.500 కోసం కూడా అప్పులు చేసిన దస్తగిరి ప్రస్తుతం ఓ కాన్వాయ్‌తో కూడిన బొలేరో కొనుగోలు చేసి దర్జాగా తిరుగుతున్నాడు. దస్తగిరి దుష్ప్రచారాన్ని పదే పదే టీడీపీ అనుకూల మీడియా ప్రసారం చేస్తోంది. మరి దస్తగిరి కట్టుకథలు, అసత్య ఆరోపణల వెనుక చంద్రబాబు ముఠా, సునీత కుటుంబమే ఉందన్నది స్పష్టమవుతోంది కదా!

మీ ధ్యాసంతా భ్రమరావతేనా?

భ్రమలు తొలగి పోయాయని అక్కసు

- రాజధాని పేరిట భూసేకరణలో చంద్రబాబు అక్రమాలు
- అవసరానికి మించి బలవంతంగా భూసేకరణ
- రైతుల ఆక్రందనకు విలువ ఇవ్వని ఈనాడు
- అన్నదాతల సమస్యలకు జగన్ ప్రభుత్వం పరిష్కారం
- 625.25 ఎకరాల భూములు రైతులకు వాపస్
- అది తప్పంటూ రామోజీ కుట్రపూరిత రాతలు


అమరావతిపై ఇంకా కసి తీరలేదా..?

చంద్రబాబును సీఎం కుర్చీలో కూర్చోబెట్టాలన్న తాపత్రయంతో రామోజీకి చెత్త రాతల ఉన్మాదం రోజురోజుకూ పెరుగుతోంది. అందుకే రోజుకో తప్పుడు కథనంతో ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఎవరికీ పనికి రాని చంద్రబాబు కలల రాజధాని భ్రమరావతిపై ఇంకా మోజు తీరక.. అక్కడేదో జరగరానిది జరిగిపోతున్నట్లు కల కంటున్నారు. అక్కడి ప్రజల కోరిక మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వివిధ గ్రామాల్లోని 625.25 ఎకరాలను భూసేకరణ పరిధి నుంచి తప్పిస్తూ గెజిట్ జారీ చేస్తే.. అదంతా కుట్ర పూరితమంటూ వక్ర రాతలు రాశారు. చంద్రబాబు రైతులను వంచించి, అవసరానికి మించి భూములు లాక్కున్నప్పుడు మీరేం చేశారు రామోజీ?

సాక్షి ప్రతినిధి, గుంటూరు : రాజధాని పేరుతో తమ నుంచి బలవంతంగా భూములు సేకరించారని రైతులు పలుమార్లు మొరపెట్టుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలోనూ వారు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు హామీ ఇచ్చారు. బలవంతంగా సేకరించిన భూమిని వెనక్కి ఇస్తామని చెప్పారు. ఈ హామీకి అనుగుణంగా న్యాయ అడ్డంకులను దాటి వారికి భూమిని వాపస్ చేయడానికి ఇటీవల గెజిట్ జారీ చేశారు. అంతే.. అమరావతిపై మరో విచ్ఛిన్నకర కుట్ర అంటూ ఈనాడు రామోజీ శోకాలు పెట్టారు. రాజధాని నిర్మాణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి గుట్టుగా గెజిట్ విడుదల చేశారంటూ గగ్గోలు పెట్టారు. వాస్తవానికి గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు తమ అనుమతి లేకుండానే రాజధాని పేరిట తమ భూములను బలవంతంగా తీసుకున్నారని పలువురు రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. వారి ప్రమేయం లేకుండానే తీసుకుని మాస్టర్ ప్లాన్‌లో పెట్టి రోడ్లకు కేటాయించేశారు. ఈ చర్యను వ్యతిరేకిస్తూ ఆ రైతులందరూ సీఆర్‌డీఏ చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. బలవంతపు భూసేకరణ వల్ల ఇబ్బంది పడ్డ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి నేతృత్వంలోని సీఆర్‌డీఏ సమావేశంలో వారి భూములను భూసేకరణ పరిధి నుంచి తప్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈ ఏడాది జనవరి 11న తీర్మానం చేశారు. కృష్ణాయపాలెం, నవులూరు, కురగల్లు, అబ్బరాజుపాలెం, బోరుపాలెం, దొండపాడు, పిచ్చికల పాలెం, ఐనవోలు, రాయపూడి, కొండమారాజుపాలెం, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, మల్కాపురం, నెక్కల్లు, నేలపాడు, శాఖమూరు, తుళ్లూరు, వెలగపూడి, వెంకటపాలెం, అనంతవరం గ్రామాల్లోని 625.25 ఎకరాలను భూసేకరణ పరిధి నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిణామం రామోజీకి ఆగ్రహం తెప్పించడంతో ఓ తప్పుడు కథనం వండిపడేశారు. అందులో నిజానిజాలు ఇలా ఉన్నాయి.

ఆరోపణ : గుట్టుగా గెజిట్ జారీ చేశారు

వాస్తవం రాజధాని నిర్మాణం పేరిట తెలుగుదేశం ప్రభుత్వం 34,281 ఎకరాలను సేకరించింది. రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడానికి ముందుకు రానిచోట్ల భూసేకరణకు నోటీసులు ఇచ్చింది. అలా 1,317.90 ఎకరాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి 274.86 ఎకరాలు పూలింగ్‌లో ఇచ్చేందుకు రైతులు ముందుకు రాగా, మిగిలిన భూమిని బలవంతంగా తీసుకున్నారు. అందులో 217.76 ఎకరాలు రోడ్లకు కేటాయించారు. కొన్ని చోట్ల రైతులకు తెలియకుండానే వారి స్థలాల్లో రోడ్లు వేయడమే కాకుండా రిటర్నబుల్ ప్లాట్ల కింద కొంత మందికి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ నేపథ్యంలో మిగిలిన 625.25 ఎకరాల భూమిపై ప్రస్తుత జగన్ ప్రభుత్వం పూర్తి స్థాయి కసరత్తు చేసింది. సీఆర్‌డీఏకు చెందిన డిప్యూటీ కలెక్టర్లతో పలుమార్లు సమావేశమై రైతులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. సీఆర్‌డీఏ ఇచ్చిన ప్రతిపాదనల మేరకు గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి భూసేకరణ ప్రకటనను ఉపసంహరిస్తూ గెజిట్ జారీ చేశారు. ఆయా రైతులకు ఈ మేరకు సమాచారం అందించారు. ఆయా గ్రామాల సచివాలయాల్లో గెజిట్‌ను అందుబాటులో ఉంచారు. గెజిట్‌కు పత్రికా ప్రకటన ఇవ్వాల్సిన అవసరం లేకపోవడంతో దాన్ని ఇవ్వలేదు.

ఆరోపణ : భూసేకరణ ఉపసంహరణ గెజిట్‌లను విడుదల చేసే ముందు రిటర్నబుల్ ప్లాట్లను రద్దు చేయాలి

వాస్తవం ఇప్పుడు గెజిట్ జారీ చేసిన ప్రాంతాల్లో ప్రభుత్వం రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించలేదు. అందువల్ల అసలు ప్రత్యామ్నాయ ప్లాట్ల కేటాయింపుల ప్రసక్తే రాదు. ఉండవల్లి గ్రామంలో 113.60 ఎకరాలు, పెనుమాక గ్రామంలో 458.45 ఎకరాలను భూసేకరణ నుంచి మినహాయించింది. ఈ రెండు గ్రామాల్లో మాస్టర్‌ప్లాన్ కింద 117.18 ఎకరాలు కవర్ అయింది. ఇదిపోగా మిగిలిన 572.05 ఎకరాలను మాత్రమే మినహాయించింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను రైతులు ఉపసంహరించుకుని, భవిష్యత్తులో ఎలాంటి నష్టపరిహారం అడగబోమన్న హామీ కింద మాత్రమే ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం పట్ల 21 గ్రామాల్లోని రైతులతో పాటు, ఉండవల్లి, పెనుమాక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గెజిట్ జారీ చేయడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఇది తట్టుకోలేని ఈనాడు కడుపుబ్బరంతో దిగజారి ప్రభుత్వంపై బురద జల్లే పనికి పూనుకుంది.

ఆరోపణ: భూసేకరణ పరిధి నుంచి ఈ గ్రామాలను తప్పిస్తే మాస్టర్ ప్లాన్‌కు ఇబ్బందులు వస్తాయి

వాస్తవం ఈ అంశంపై అధికారులు భారీ కసరత్తు చేశారు. బాధిత రైతుల నుంచి కన్సెంట్ తీసుకున్నారు. మాస్టర్ ప్లాన్‌లో వారి భూముల్లో నుంచి రోడ్లు వెళ్తుంటే వాటిని మినహాయించి మిగిలిన భూమికి మాత్రమే మినహాయింపు ఇచ్చారు. ఆ స్థలాల్లో దేనికైనా కేటాయింపులు జరిగి ఉంటే ఆ భూముల జోలికి వెళ్లలేదు. దేనికీ కేటాయించని భూములను మాత్రమే భూసేకరణ పరిధి నుంచి మినహాయించారు.

జీవితంలో చెడు రోజులను ఎదుర్కోవడం ఎంతో కష్టంగా అనిపిస్తుంది. కానీ, మనలో దాగి ఉన్న ప్రతిభ, సామర్థ్యం, ధైర్యం గురించి మనల్ని మనం తెలుసుకునే సమయం ఇదే' అంటుంది భారతీ సుమారియా. జీవించాలనే ఆశను కోల్పోయి అత్తవారింటి నుంచి ఖాళీ చేతులతో బయటకు వచ్చేసిన ఆమె నేడు ఏడాదికి నాలుగు కోట్ల బిజినెస్ టర్నోవర్‌కి చేరుకునేంతగా ఎదిగింది. ముంబైలో పదేళ్ల క్రితం టూత్‌బ్రష్, టిఫిన్‌బాక్స్, వాటర్ బాటిల్ .. వంటి చిన్న చిన్న నిత్యావసర వస్తువులను ఉత్పత్తి చేసే పనిని ప్రారంభించి, ఒంటరి పోరాటంతో ఎదిగిన భారతీ సుమారియా ధైర్యం ప్రతి ఒక్కరికీ పాఠం అవుతుంది.


భారతీ సుమారియా

చేదు అనుభవాలే తీపి విజయాలకు మెట్లు

చేదు అనుభవాలే మనకు విజయవంతమైన మార్గానికి దారులు వేస్తాయి. దీనిని భారతీ సుమారియా చేసి చూపెట్టింది. సమస్యను సవాల్‌గా తీసుకొని ఎదిగిన వనితగా తనను తాను నిరూపించుకుంది. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

''నేను ముంబైలోని భివాండి ప్రాంతంలో పుట్టాను. కొన్నేళ్లకు ములుండ్‌కి వెళ్లాం. మా కుటుంబం సాధారణ మధ్యతరగతికి చెందినదే. ఆడపిల్లలకు ఎన్నో ఆంక్షలు. పదో తరగతి వరకు మాత్రమే చదవగలిగాను. పెళ్లయ్యాక వంటింటిని నడపాలి కానీ, ఆడపిల్లను చదివించి ఏం లాభం అనే మనస్తత్వం ఉన్న కుటుంబంలో పెరిగాను. అలా నా ప్రపంచం కూడా కుటుంబానికే పరిమితం అయ్యింది. నాకేమీ చేయాలనే కోరిక ఉండేది కాదు. నా ప్రపంచంలో నేను సంతోషంగానే ఉన్నాను. సక్సెస్ సాధించిన స్త్రీని చూసినా, అలాంటి వారి గురించి విన్నా, చదివినా నేను ఏదైనా చేయగలనా అనే ఆలోచన నా మదిలో మెదిలేది. కానీ, నా మనసులోని భావాలను కుటుంబ సభ్యులకు చెప్పుకునే ధైర్యం ఉండేది కాదు.

మహిళలకు మద్దతు లభించాలి

కష్టాల్లో ఉన్నప్పుడు ఎవరూ ఆదుకోకపోవడమే ఆడవాళ్లకున్న పెద్ద సమస్య. వాళ్ల అమ్మ ఇల్లు గానీ, అత్తమామల ఇల్లు గానీ తమ సొంతమని భావించరు. తల్లిదండ్రుల నుంచి ఆదరణ లభించక చాలా మంది మహిళలు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఆసరా దొరికితే ఎంతోమంది ఆడపిల్లల ప్రాణాలు తీసుకోకుండా జీవించగలుగుతారు. ఈ విషయంలో నేను అదృష్టవంతురాలిని. నా పరిస్థితి చూసి మా తల్లిదండ్రులు నన్ను సొంతంగా వ్యాపారం చేయమని ప్రోత్సహించారు. నాన్న 3వ తరగతి వరకు మాత్రమే చదివారు. ముంబైలో బట్టల షాప్ పెట్టుకొని, మమ్మల్ని పోషించారు. మేం నలుగురం అక్కచెల్లెళ్లం. మా పెంపకం బాధ్యత అమ్మ తీసుకుంది. ఇంటిని చూసుకోవడంతో పాటు చుట్టుపక్కలవారితో ఎప్పుడూ కలుపుకోలుగా ఉండేది. ఇప్పుడు కూడా మా చుట్టుపక్కల వాళ్లకు సహాయం చేయడానికి అమ్మ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది.

పెళ్లితో మారిన జీవితం..

ఆడపిల్లలకు పెళ్లే జీవిత లక్ష్యంగా ఉన్న రోజుల్లో 20ఏళ్ల వయసులో నాకు వివాహం చేశారు. మా అమ్మనాన్నలు చెప్పినట్టుగా నా భర్త సలహాలను అనుసరించాను. అత్తమామల బాధ్యతలను నెరవేర్చడంలో తీరిక లేకుండా గడిపాను. అత్తింటిలో అడుగుపెట్టినప్పుడు అదే నా ప్రపంచం అయ్యింది. అయితే, నా భర్త ఏ పనీ చేసేవాడు కాదు. నేను ఆర్థికంగా స్వతంత్రురాలిని కాదు. నాకు ఏం చేయాలో అర్థం కాలేదు. నాకు, నా పిల్లలకు నోటిలో నాలుగు వేళ్లు పోక కనీసావసరాలు తీరక నా భర్త నాపై తన కోపాన్ని, చిరాకును ప్రదర్శించటం మొదలుపెట్టాడు. అప్పుడప్పుడూ చేయి కూడా చేసుకునేవాడు. ఇది నన్ను బాగా ప్రభావితం చేసింది. దీంతో నాకు ఆ ఇంట్లో ఉండటం కష్టంగా మారింది. మామగారు పనిచేసేవారు. కానీ, నా భర్త అస్సలు పనిచేసేవాడు కాదు. పిల్లల ఖర్చులు కూడా మామగారే భరించేవారు. 20 ఏళ్లు నా కోసం నేను ఎలాంటి షాపింగ్ చేయలేదు. మా అక్క బట్టలు నాకు ఇచ్చేది. వాటిని సంతోషంగా తీసుకునేదాన్ని. అత్తింట్లో రోజు రోజుకీ నా పరిస్థితి దిగజారడం మొదలయ్యింది. అమ్మ నా పరిస్థితి గమనించి పుట్టింటికి తీసుకు వచ్చింది. ఆ సమయంలో నేను చాలా నిస్సహాయంగా ఉన్నాను. జీవించాలనే కోరికను కూడా కోల్పోయాను. డిప్రెషన్‌కు గురయ్యాను. ఏం చేయాలో అర్థం కాక గంటల తరబడి మౌనంగా కూర్చునేదాన్ని. పిల్లల భవిష్యత్తు ఏమవుతుందో కూడా నాకు తెలియదు.

ఆరు లక్షల రూపాయలతో..

దీపావళికి, పుట్టిన రోజుకి నాన్న డబ్బులు ఇస్తుండేవారు. ఆ డబ్బు కూడా మా అత్తింట్లో ఖర్చయిపోయేది. దీంతో నాకు డబ్బు ఇవ్వకుండా డిపాజిట్ చేయమని, భవిష్యత్తులో ఉపయోగపడుతుందని చెప్పాను. అత్తింటి నుంచి బయటకు వచ్చాక ఏం చేయలేని పరిస్థితిలో నాన్న నాకోసం డిపాజిట్ చేసిన డబ్బు ఆరు లక్షలకు పెరిగిందని తెలిసింది. 2005లో ఆ ఆరు లక్షల రూపాయలతో 300 అడుగల విస్తీర్ణంలో ఉన్న ఓ ప్లేస్ అద్దెకు తీసుకొని టూత్‌బ్రష్, టిఫిన్‌బాక్స్, వాటర్‌బాటిల్ వంటి చిన్న చిన్న నిత్యావసర వస్తువులను తయారుచేసే పనిని ప్రారంభించాను. నా వ్యాపారాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు పగలు రాత్రి కష్టపడ్డాను. త్వరలోనే సిప్లా, బిస్లరీ వంటి పెద్ద బ్రాండ్‌ల నుండి ఆర్డర్లను పొందడం ప్రారంభించాను. ఈ రోజు నా ఫ్యాక్టరీ లక్షా ఇరవై వేల అడుగుల విస్తీర్ణంలో విస్తరించింది.

భయం బలంగా మారింది

ఎప్పుడూ పని కోసం ఇల్లు వదిలి వెళ్లలేదు. కానీ నాకు పని తప్ప వేరే మార్గం కనిపించలేదు. నా పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని భావించి, రాత్రింబగళ్లు కష్టపడి పనిచేయడం మొదలుపెట్టాను. చెడు సమయాలు నన్ను నేను తెలుసుకునేలా చేశాయి. నా సామర్థ్యాలను తెలుసుకునే అవకాశం కల్పించింది. ఈ రోజు వెనక్కి తిరిగి చూసుకుంటే ఇదంతా ఎలా చేయగలిగాను అనే ఆశ్చర్యం కలుగుతుంది. ఎంతగా సహించానో అంతగా కష్టాలు పెరిగాయి. నాకు దేవుడి మీద అపారమైన నమ్మకం ఉంది. భగవంతుడు నా బలాన్ని గ్రహించి విజయపథంలో ముందుకు తీసుకెళ్లేందుకు చుట్టూ అలాంటి వాతావరణం సృష్టించాడని అనిపించింది. నా పురోభివృద్ధికి నా భర్త కోపం, తగాదాలే కారణమయ్యాయి. దాని వల్లనే నేను ఇదంతా చేయగలిగాను.

పిల్లలే నా ప్రపంచం

భార్యగా దృఢంగా ఉండలేకపోయినా పిల్లల కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ అలిసిపోవడానికి, వదులుకోవడానికి సిద్ధంగా లేనని నన్ను నేను బలంగా తయారుచేసుకున్నాను. జీవించాలనే కోరిక కూడా కోల్పోయిన ఆ భారతి ఈమేనా అని అందరూ ఆశ్చర్యపోయారు. నా పిల్లల మంచి భవిష్యత్తు కోసం నేను కృషి చేయాల్సిందే అని గట్టిగా అనుకున్నాను. నేను నా పని మొదలుపెట్టినప్పుడు పిల్లలు నాకు పూర్తిగా మద్దతు ఇచ్చారు. అప్పట్లో నా కూతురు ఎనిమిదో తరగతి, కొడుకులిద్దరూ ఐదో తరగతి చదువుతున్నారు. నా కూతురు తన చదువుతో పాటు తన తమ్ముళ్లనూ చూసుకుంటుంది. నేను ఇంటికి వెళ్లడం లేట్ అయితే ఆమే స్వయంగా వంట చేసి, తమ్ముళ్లకు పెట్టి, తినిపించి, నిద్రపుచ్చేది.

పిల్లలను తండ్రి నుంచి దూరం చేయలేదు

ఎప్పుడూ పిల్లలను వారి తండ్రి నుంచి కానీ, వారి కుటుంబం నుంచి కానీ దూరం చేయలేదు. పిల్లలు తల్లిదండ్రులిద్దరి ప్రేమను పొందాలని నమ్ముతాను. భార్యాభర్తల మధ్య తగాదాల వల్ల పిల్లలు బాధపడకూడదు. పెళ్లయిన పాతికేళ్ల తర్వాత నా పిల్లలు వారి పూర్వీకుల ఇంట్లో ఉండకూడదని నిర్ణయించుకున్నారు. అక్కడ నుంచి మా ఇంటికి మారిపోయాం. నా పోరాటం నా పిల్లలను కూడా బలపరిచినందుకు సంతోషంగా ఉంది'' అని వివరిస్తుంది భారతీ సుమారియా.

కిచెన్ టిప్స్



- తోడు వేయడానికి తగిన మజ్జిగ లేక పెరుగు అందుబాటులో లేకపోతే పాలను గోరువెచ్చగా చేసి అందులో రెండు పచ్చి మిర్చి వేసి మూత పెట్టి.. ఆరేడు గంటలపాటు కదపకుండా పక్కన పెడితే పెరుగు గట్టిగా తోడుకుంటుంది.



- నిమ్మరసం చేసేటప్పుడు రసంతో పాటు నిమ్మ చెక్కలను కూడా అందులోనే వేసి కాసేపు ఉంచడం వల్ల.. మంచి ఫ్లేవర్, రుచితో పాటు పోషకాలు కూడా ఎక్కువగా అందుతాయి.



- సాధారణంగా అల్లం పేస్ట్‌ను ఎప్పటికప్పుడు తాజాగా చేయడంతో పాటు కొంత స్టోర్ చేసి కూడా పెట్టుకుంటూ ఉంటాం. ఇది పాడవకుండా ఉండేందుకు అందులో చెంచా ఆవాల నూనె వేయాలి. ఇలా చేయడం వల్ల అల్లం పేస్ట్ పాడవకుండా ఉంటుంది.

మల్టీ టాలెంట్

మంజు వారియర్....పేరులోనే కాదు ఆమె వేసే ప్రతి అడుగులో సాహసం ఉంటుంది. కళకు సామాజిక స్పృహ జోడించి ముందుకు వెళుతోంది. యాక్టర్, రైటర్, డ్యాన్సర్, బ్రాండ్ అంబాసిడర్, ప్రొడ్యూసర్, సోషల్ యాక్టివిస్ట్‌గా బహుముఖ ప్రజ్ఞను సొంతం చేసుకుంది...

నారి వారియర్

కేరళలోని తిరువనంతపురం కల్యాక అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లోని మహిళా సభ్యులు సొంతంగా కూరగాయలు పండించడం ప్రారంభించారు. అందరూ ఆశ్చర్యపోయేలా పెద్ద వెజిటెబుల్ గార్డెన్‌ను సృష్టించారు. 'కల్యాక క్వీన్స్'గా పేరు గాంచారు. వెజిటెబుల్ గార్డెన్ సృష్టించడానికి కల్యాక క్వీన్స్‌కు 'హౌ వోల్డ్ ఆర్ యూ' అనే సినిమా స్ఫూర్తి ఇచ్చింది.

సమాజాన్ని సినిమా ప్రభావితం చేస్తుందా? సినిమాను సమాజం ప్రభావితం చేస్తుందా?... అనే చర్చ మాట ఎలా ఉన్నా సమాజంపై సినిమా చూపే ప్రభావం తక్కువేమీ కాదు. మంచి లక్ష్యానికి మంచి సినిమా వెన్నుదన్నుగా నిలుస్తుంది. మంజు వారియర్ రీఎంట్రీ మూవీ 'హౌ వోల్డ్ ఆర్ యూ' ఈ కోవకు చెందిన సినిమానే. మంజు వారియర్ ఈ సినిమాలో నిరూపమ రాజీవ్ అనే పాత్ర పోషించింది. నిరూపమ రాజీవ్ అనే వివాహిత టెర్రస్ ఫార్మింగ్‌కు సంబంధించిన ప్రయాణం సినిమా మూల కథ.

'స్త్రీలు తమలో ఉన్న శక్తి సామర్థ్యాలపై దృష్టి సారించి వెలికి తీస్తే ఎన్నో అద్భుతాలు సాధించవచ్చు అని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి' అంటుంది వారియర్.

'హౌ వోల్డ్ ఆర్ యూ' సినిమా విడుదలైన తరువాత మంజు వారియర్ ఎక్కడికి వెళ్లినా మహిళలు దగ్గరికి వచ్చి 'మీ సినిమా స్ఫూర్తితో టెర్రస్ ఫార్మింగ్ మొదలు పెట్టాం' అని చెప్పేవాళ్లు.

ఆర్గానిక్ ఫార్మింగ్ ప్రాజెక్ట్ 'కుటుంబశ్రీ'కి బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంతో మంది మహిళలను ఆర్గానిక్ ఫార్మింగ్ వైపు నడిపిస్తోంది మంజు వారియర్.

పదిహేడు సంవత్సరాల వయసులో 'సాక్ష్యం' సినిమాతో మలయాళ చిత్రసీమలోకి అడుగు పెట్టిన వారియర్ 'తూవల్' 'కొట్టరం' 'సల్లాపం'...మొదలైన సినిమాలతో నటిగా మంచి పేరు తెచ్చుకుంది. చిత్రసీమలోకి రావడానికి ముందు దూరదర్శన్ సీరియల్స్‌లో నటించింది.

జెండర్–ఈక్వాలిటీని దృష్టిలో పెట్టుకొని కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'జెండర్ పార్క్' ప్లాట్‌ఫామ్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న వారియర్ క్యాన్సర్ పేషెంట్‌ల కోసం హెయిర్ డొనేషన్ డ్రైవ్‌లను నిర్వహిస్తుంటుంది.

'చతుర్ముఖం' అనే మలయాళం సినిమాతో నిర్మాతగా తొలి అడుగు వేసింది మంజు. అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ఈ చిత్రానికి అద్భుతమైన స్పందన వచ్చింది. 'సినిమా నిర్మాణంలో రిస్కులు, బాధ్యతలు ఉంటాయి. నా చుట్టుపక్కల వాళ్ల సహకారంతో నిర్మాతగా ఎలాంటి సవాళ్లు, ఒత్తిడి ఎదుర్కోలేదు. 'కాయట్టం' సినిమాకు సహనిర్మాతగా ఉన్నప్పుడు చిత్ర నిర్మాణం గురించి సీరియస్‌గా ఆలోచించడం మొదలు పెట్టాను. నా జీవితంలో ఏది ప్లాన్ చేసుకోలేదు. ఆ సమయానికి ఏది ఆసక్తిగా ఉంటే అది చేస్తూ పోయాను. సినిమా నిర్మాణాన్ని నా జీవితంలో కొత్త ప్రయోగంగా భావిస్తాను' అంటుంది మంజు వారియర్.

క్లాసికల్ డ్యాన్సర్‌గా మంజు వారియర్ తెచ్చుకున్న పేరు తక్కువేమీ కాదు.

స్కూల్లో చదువుకుంటున్న రోజుల నుంచి వారియర్ నాట్యప్రతిభ గురించి ప్రముఖ నాట్యకారుడు ఎన్వీ క్రిష్ణన్‌కు తెలుసు. 'మంజు గిఫ్టెడ్ డ్యాన్సర్. మన దేశంలోని అద్భుతమైన భరతనాట్య కళాకారులలో ఆమె ఒకరు' అంటాడు క్రిష్ణన్.

భరతనాట్యంలో పేరు తెచ్చుకున్న మంజు వారియర్ తన కూతురు మీనాక్షి డ్యాన్స్ టీచర్ గీతా పద్మకుమారన్ నుంచి కూచిపూడి నాట్యం నేర్చుకుంది. 'వారియర్‌కు కూచిపూడి నేర్పడం ఒక అద్భుత అనుభవం. తక్కువ సమయంలోనే డ్యాన్స్ నేర్చుకుంది. అద్భుతమై ఎక్స్‌ప్రెషన్స్ ఆమె సొంతం' అంటుంది గీత.

'సల్లాపం' అనే పుస్తకంతో రైటర్‌గా కూడా తన ప్రతిభ చాటుకుంది వారియర్. 'సల్లాపం' తన జ్ఞాపకాల సమాహారం. వీణ వాయించడం నేర్చుకున్న వారియర్ ఎన్నో వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. మంజు వారియర్ బహుముఖ ప్రతిభకు మరోసారి ఫిదా అయ్యారు అభిమానులు.


నృత్యం


సంగీతం


నటన


ఆర్గానిక్ ఫార్మింగ్ బ్రాండ్ అంబాసిడర్

సంతోషమే నా బలం

ప్రాజెక్ట్ సక్సెస్ అయినా ఫెయిల్ అయినా... ఫలితంతో సంబంధం లేకుండా ఎప్పుడూ సంతోషంగా ఉండడానికే ప్రయత్నిస్తాను. సంతోషమే నా బలం. నా జీవితంలో ఎప్పుడూ ఏది ప్లాన్ చేసుకోలేదు. అయితే మంచి విషయాలు నా దారిలో ముందుకు వచ్చి కనిపిస్తాయి. వాటితో కలిసి ప్రయాణిస్తాను. సాహిత్య కార్యక్రమాల్లో మాట్లాడడానికి ముందు నేను ఎక్కడికి వెళ్తున్నానో, ఏం చెప్పబోతున్నానో, ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో... ఇలా రకరకాలుగా ఆలోచిస్తుంటాను.

– మంజు వారియర్

రైతుబడి మాస్టారు!

దేశరాజధాని నగరం న్యూఢిల్లీలోని ట్రిపుల్‌ఐటీ సంస్థ. ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వేదిక మీద దేశవిదేశీ ప్రముఖుల సమక్షంలో ప్రసంగించవలసిందిగా ఆహ్వానం అందుకున్నాడు మన తెలుగు యువకుడు. నేడు జరగనున్న ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్-2024లో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలలో యువతకున్న వ్యాపార అవకాశాల గురించి ప్రసంగించే అవకాశాన్నందుకున్న జూలకంటి రాజేందర్‌రెడ్డి ఈ సందర్భంగా 'సాక్షి'తో తన ప్రస్థానాన్ని పంచుకున్నారు.


జూలకంటి రాజేందర్ రెడ్డి

''న్యూఢిల్లీ వేదికగా అది కూడా అత్యున్నత స్థాయి విద్యాసంస్థలో ప్రసంగించే అవకాశం నన్ను వెతుక్కుంటూ వచ్చింది. అంతకుముందు జాతీయ స్థాయిలో 'ద నేషనల్ క్రియేటర్స్ అవార్డు'కు సంబంధించిన 'మోస్ట్ ఇంపాక్ట్‌ఫుల్ అగ్రి క్రియేటర్' కేటగిరీలో 36 శాతానికి పైగా ఓట్లు సాధించి రైతుబడి చానెల్ ప్రథమస్థానంలో నిలిచింది. ఇందుకు అసలైన కార్యక్షేత్రం మా నల్గొండ జిల్లా, మాడ్గుల పల్లి మండలంలోని మాచనపల్లి గ్రామం. నా ఎదుగుదల మూలాలు మా ఊరిలోనే ఉన్నాయి. మాది వ్యవసాయ కుటుంబం. కానీ నేనెప్పుడూ పొలం పని చేయలేదు. నన్ను బాగా చదివించి మంచి ఉద్యోగం చేస్తుంటే చూడాలని కలలు కన్నారు అమ్మానాన్న. పనుల ఒత్తిడి ఉంటే సీజన్‌లో కూడా నాకు పొలం పనులు కాదు కదా, పశువుల దగ్గర సహాయానికి కూడా రానిచ్చేవారు కాదు. అలాంటిది ఇప్పుడు నా కెరీర్ వ్యవసాయ భూమిలోనే వేళ్లూనుకుపోయింది.

పలక... పేపర్!

అమ్మానాన్న కోరుకున్నట్లే చదువుకున్నాను. బీఈడీ చేసిన తర్వాత స్కూల్లో పలక మీద పిల్లలకు అక్షరాలు దిద్దించాల్సిన వాడిని, అనుకోకుండా కొత్తదారిలో అడుగుపెట్టాను. రోజూ పేపర్ చదివే అలవాటు ఉండడంతో ఓ రోజు జర్నలిజం కోర్సు ప్రవేశ పరీక్ష ప్రకటన నా కంటపడింది. ఉత్సాహం కొద్దీ పరీక్ష రాశాను. సెలెక్ట్ అయ్యాను. కానీ అక్కడ శిక్షణ పూర్తి చేయలేదు. కానీ 2008లో ఓ ప్రైవేట్ టీవీ చానెల్‌తో జర్నలిస్టుగా నా ప్రయాణం మొదలైంది. టీవీ చానెల్స్ మారుతూ కొంతకాలం హైదరాబాద్‌లో, మరికొంత కాలం జిల్లాల్లో ఉద్యోగం చేశాను. వార్తలకే పరిమితం కాకుండా ఫీచర్ స్టోరీల కోసం అన్వేషించేవాడిని. నా అన్వేషణలో కెమెరా కంటికి చిక్కిన ఓ వాస్తవం ఎంత ఆసక్తికరమైందో ఊహించగలరా!? కాకతీయుల వారసులు ఇప్పటికీ ఉన్నారు. ఎక్కడ ఉన్నారంటే... ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, జగదల్‌పూర్‌లో. 'కమల్ చంద్ర భంజ్ దేవ్ కాకతీయ' అక్కడ రాజు హోదాలో ఉన్నారు. వివరాలు సేకరిస్తూ వాళ్లను వెతుక్కుంటూ వెళ్లి షూట్ చేయడంలో కలిగిన జాబ్ శాటిస్‌ఫాక్షన్ ఇంత అని చెప్పలేను. ఇలా ఆరేళ్లు గడిచింది, అనుకోకుండా ఎలక్ట్రానిక్ మీడియా నుంచి ప్రింట్ మీడియాకి మారాను. అక్కడ ఆరేళ్లు పని చేశాను. ఉద్యోగం చేస్తున్నాను కానీ సంతృప్తి స్థాయి క్రమంగా తగ్గిపోసాగింది. ఎన్నాళ్లో... ఎన్నేళ్లో ఉద్యోగిగా నీ పయనం... అని నా ఆవేదనను ఫేస్‌బుక్‌లో రాసుకునేవాడిని.

నా విజయగాథ నేనే రాసుకున్నాను!

నాలో ఎడతెగని ఆలోచన మొదలైంది. ఎంతోమంది సక్సెస్ స్టోరీలు రాశాను. నా సక్సెస్ స్టోరీని నేను రాసుకోలేనా అనిపించింది. నాలుగు సంస్థల్లో పని చేశాను. సంస్థ పేరు నా ఇంటిపేరుగా నా పేరుకు ముందు చేరుతోంది. కానీ నా పేరే సంస్థ పేరు కాలేదా? ఆ మథనంలో నుంచి పుట్టుకొచ్చిందే రైతుబడి. రైతుబడి అనే అమృతం పుట్టడానికి ముందు నా మదిమథనంలో అనేక గరళాలు కూడా కోరలు సాచాయి. సూపర్‌మార్కెట్, 'రైతు పంట' పేరుతో రైతుల ఉత్పత్తుల విక్రయం, ఇన్ షాట్ తరహాలో 'లోకల్ న్యూస్ యాప్' పేరుతో ఓ న్యూస్ యాప్, అదే పేరుతో ఓ యూట్యూబ్ చానెల్... వీటిలో కొన్ని భారీ వైఫల్యాలు, మరికొన్ని పాక్షిక విజయాలనిచ్చాయి. ఆ తర్వాత మరో నాలుగు యూ ట్యూబ్ చానెళ్లు కూడా పెట్టాను. అవి విజయవంతం కాలేదు, కానీ నన్ను విజయపథంలో నడిపించే మార్గదర్శకాలయ్యాయి.

– జూలకంటి రాజేందర్ రెడ్డి,
సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్,
రైతుబడి యూట్యూబ్ చానెల్



కరోనా వచ్చింది... లాక్‌డౌన్ తెచ్చింది!

అది 2020, ప్రపంచానికి గుర్తొచ్చేది కరోనా, లాక్‌డౌన్. నాకు గుర్తొచ్చే అపురూపమైన ఘట్టం రైతుబడి ఆవిర్భావం. ఆ ఏడాది జనవరిలోనే రైతుబడి మొదలుపెట్టేశాను. ఉద్యోగం మానేయాలనే నిర్ణయానికి వచ్చాను. మేలో మానేశాను. ఆశ్చర్యం ఏమిటంటే... ఉద్యోగంలో అందుకున్న జీతానికి సమానమైన రాబడిని జూన్‌లోనే చూశాను. రైతులకు ఉపయోగపడే అంశాల మీదనే ఉంటాయి నా వీడియోలన్నీ. ఒకే పంట వేస్తున్న రైతులకు రకరకాల పంటలు వేయమని మాటలతో చెప్పడం వల్ల ప్రభావితం చేయలేం. ఏకకాలంలో రకరకాల పంటలు పండిస్తున్న రైతు అనుభవాలను వారి మాటల్లో వింటే సాటి రైతులు త్వరగా ప్రభావితమవుతారు. ఇదే నా సక్సెస్ ఫార్ములా. వ్యవసాయరంగ పరిశోధకులు, అధికారుల ద్వారా కూడా కొన్ని విషయాలు చెప్పించాను. కానీ రైతులు చెప్పిన విషయాలనే సాటి రైతులు గుర్తు పెట్టుకుంటున్నారు, ఆచరణలో పెడుతున్నారు. రైతులు కొందరు వ్యవసాయ పరికరాలను సొంతంగా తయారు చేసుకుంటారు, ఉన్న పరికరాలను తమ అవసరాలకు అనుగుణంగా మలుచుకుంటూ ఉంటారు. అలాంటి వాటిని కూడా బాగా చూపించేవాడిని. పంటలను, రైతులను వెతుక్కుంటూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్రల్లో పర్యటించాను. లక్షకు పైగా కిలోమీటర్లు ప్రయాణించాను. పదమూడు వందలకు పైగా వీడియోలు చేశాను. నా రైతుబడికి పదమూడు లక్షలకు పైగా సబ్‌స్క్రైబర్‌లున్నారు. ఇప్పటి వరకు వన్ మ్యాన్ ఆర్మీలాగ నేనొక్కడినే పొలాలకు వెళ్లి కెమెరా ఆన్ చేసి రైతుతో మాట్లాడేవాడిని. ఆ ఫుటేజ్‌ని మా మంజుల (భార్య) ఇంట్లో ఎడిట్ చేసిచ్చేది. ఈ మధ్యనే ఒక టీమ్‌ను తయారు చేసుకున్నాను.

గుర్తు పడుతున్నారు!

'నాకు గుర్తింపు వచ్చింది' అనే పెద్ద మాట చెప్పను. కానీ ఇప్పుడు ఏ ఊరికి వెళ్లినా నన్ను గుర్తు పడుతున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో వ్యవసాయం కోసం పని చేస్తున్న చానెళ్లలో రైతుబడి పెద్దది. ఇప్పుడు ఢిల్లీలో ప్రసంగించడానికి ట్రిపుల్ ఐటీ నుంచి ఆహ్వానం రావడానికి కారణం ఈ యూ ట్యూబ్ చానెలే. నేననుకున్నట్లే నా సంస్థపేరు నా పేరు కలిసి 'రైతుబడి రాజేందర్'నయ్యాను. ఇది కాకుండా నేను చేరాల్సిన లక్ష్యాలు రెండున్నాయి. ఒకటి... వ్యవసాయంలో అనుభవాలు పంచుతున్న రైతుబడి తరహాలోనే మరో వేదిక ద్వారా వ్యాపార అనుభవాలను యువతకు చేర్చడం, కొత్త ఎంటర్‌ప్రెన్యూర్‌లను తయారు చేయడం. ఇప్పటికే బిజినెస్ బుక్ పేరుతో ఆ ప్రయత్నం మొదలైంది. మరొకటి వ్యవసాయ భూమిని కొనుక్కోవడం. నేను డిగ్రీలో ఉన్నప్పుడు నాన్న పోయారు. అనివార్యమైన పరిస్థితుల్లో మా పొలాన్ని అమ్ముకున్నాం. కొద్దిగానైనా వ్యవసాయభూమిని కొని మా అమ్మకు బహుమతిగా ఇవ్వాలి. రైతు కుటుంబంలో పుట్టిన వాళ్లం భూమితో బంధాన్ని తెంచుకోలేం'' అన్నారు రాజేందర్‌రెడ్డి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

అలర్జీ



వదిలించుకుందాం ఇలా...

ఒక్కోసారి మనం బాస్‌తో, సహోద్యోగులతో, స్నేహితులతోనో మాట్లాడే సమయంలో లేదా ఏమయినా ముఖ్యమైన పనులలో ఉన్నప్పుడు తల దురద పెడుతుంటుంది. ఆ సమయంలో కలిగే ఇబ్బంది ఇంతా అంతా కాదు. తల దురదకు కేవలం పేలు లేదా చుండ్రు వంటివి మాత్రమే కాదు, అలర్జీ కూడా కారణం కావచ్చు. అలర్జీ అనేది కేవలం శరీరంపై దద్దుర్ల రూపేణా మాత్రమే వస్తుందనుకోవడానికి వీలు లేదు. తలలో కూడా వస్తుంది. ముందుగా ఈ దురద ఎందుకు వచ్చిందో తెలుసుకుంటే దాన్ని నివారించడం సులభమవుతుంది.

కొన్ని రకాల క్రిముల వల్ల, కొంతమందికి సాధారణంగానే అరచేతులు, అరికాళ్లలో ఎక్కువ చెమట పడుతుంది. ఎప్పటికప్పుడు చెమటను తుడుచుకుంటూ పొడిగా ఉండేలా చూసుకోవాలి. లేకపోతే ఇన్ఫెక్షన్స్‌కు దారి తీస్తుంది. కొంతమంది ఎక్కువగా నీటిలో నానుతూ పనిచేస్తుంటారు. నీటిలో అదేపనిగా నానడం కూడా అలర్జీకి కారణమవుతుంది. కొన్ని సార్లు డిటర్జెంట్‌లు కూడా కొంతమందిలో అలర్జీకి కారణమవుతాయి. అదేవిధంగా కొన్ని రకాలైన నూనెలు, ఎరువులు, ఇంధనాలతో కూడా ఈ సమస్య వస్తుంది.

పరిష్కారాలు: ఇలా ఇబ్బంది పెట్టే తల దురద నుంచి తప్పించుకోవటానికి మిరియాలు బాగా ఉపయోగపడుతాయి. అర స్పూన్ మిరియాలు, అర స్పూన్ పాలతో కలిపి బాగా నూరాలి. తర్వాత కొద్దిగా నీళ్లలో ఉడికించి పేస్టు మాదిరిగా చేసి దాన్ని అరబెట్టి కొద్దిగా వేడి ఉండగానే తలకు రుద్దాలి. అరగంట తర్వాత శీకాయ పొడితో తలస్నానం చేయాలి. ఈవిధంగా వారానికి మూడు, నాలుగు సార్లు చేస్తే తల దురద పూర్తిగా పోతుంది.

ఆహారం ద్వారా: ఉప్పు, పులుపు, కారం తక్కువగా ఉండే, బలమైన ఆహారాన్ని తీసుకోవాలి. విటమిన్లు అధికంగా ఉండే తాజా పళ్ళు, గ్రీన్ సలాడ్‌లను తీసుకోవడం మంచిది. మంచినీరు బాగా తాగడం, తగినంత వ్యాయామం, ధ్యానం చేయడం ద్వారా కూడా దురదలను తగ్గించుకోవచ్చు.

దురద, దద్దుర్లు నిరోధించేందుకు మరికొన్ని జాగ్రత్తలు: దురద సమస్య ఎక్కువగా ఉంటే ముందు జాగ్రత్తగా తీపి పదార్థాలను తినటం తగ్గించాలి.

శరీరాన్ని ఎప్పుడూ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి: మనం వంటికి రుద్దుకునే సబ్బు లేదా తలకు రాసుకునే నూనె, మనం వాడే స్ప్రే లేదా కొత్త మోడల్ దుస్తులకు ఉపయోగించే మెటీరియల్ కూడా మన చర్మానికి సరిపడకపోవచ్చు. అందువల్ల ఉన్నట్టుండి దురదలు వస్తుంటే, మన అలవాట్లలో కొత్తగా వచ్చిన మార్పేమిటో తెలుసుకుని దాని నుంచి దూరంగా ఉండటం ఉత్తమం.

కొంతమంది ఎప్పుడూ ఉసూరుమంటూ ఉంటారు. టార్చి లైటు వేసి చూసినా, వారి ముఖంలో ఉత్సాహం కనిపించదు. ఇంకొందరేమో ఉత్సాహానికి మారుపేరులా... ఎప్పుడూ నవ్వుతూ తుళ్లుతూ ఉంటారు. మనం తీసుకునే ఆహారం మన ప్రవర్తనపైన, పనితీరుపైనా ప్రభావం చూపుతుందనడానికి అదొక తార్కాణం. కొన్ని రకాల ఆహార పదార్థాలను నిత్యం తింటుండటం వల్ల ఉత్సాహంగా... ఉల్లాసంగా ఉండడంతోపాటు మెరుపులీనే చర్మం, మంచి ఆరోగ్యం మన సొంతం అవుతాయి. అవేమిటో చూద్దామా...



తినండి... ఉల్లాసంగా... ఉత్సాహంగా

ఉత్సాహంగా ఉంచే ఆహారం అనగానే అదేదో ఖరీదైన తిండేమో అని అనుకోనక్కరలేదు. ఇంకా చెప్పాలంటే మిగిలిన వాటితో పోల్చితే అవి కాస్తంత చవగ్గానే దొరుకుతాయి.



టొమాటో: దీనిలోని లైకోపిన్ కాన్సర్ నిరోధకంగా పనిచేస్తుంది. గుండె, రక్తనాళాలకి సంబంధించిన అనారోగ్యాన్ని కూడా నిరోధిస్తుంది. మన చర్మానికి ఎండ తాలూకు ప్రభావాలనుండి రక్షించడంలో మిగతా పోషకాలతో పాటు టమాటోల పాత్ర చెప్పుకోదగినదే.

నట్స్: ముఖ్యంగా వాల్‌నట్స్‌లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ప్లాంట్ స్టెరోల్స్ సమృద్ధిగా ఉంటాయి. కొలెస్టరాల్ లెవల్ తగ్గించడంలో వీటి పాత్ర అమోఘం. వాల్నట్స్‌లో పీచుపదార్థం అధికం. మెగ్నీషియం, కాపర్, ఫోలేట్, విటమిన్-ఇ, ఉండి శక్తిమంతమైన యాంటి ఆక్సిడెంట్స్‌ని అందిస్తాయి. బ్లడ్ ప్రెషర్‌ను తగ్గిస్తుంది. ఆస్టియోపొరోసిస్ రాకుండా ఆపుతుంది. గుండె ఆరోగ్యాన్ని, చర్మానికి ఎండనుండి కలిగే హానినుండి కాపాడుతుంది. ఆల్మండ్స్ చర్మకాంతికి తోడ్పడతాయి. రోజూ గుప్పెడు నట్స్ తింటూ ఉంటే ఉత్సాహం ఉరకలు వేస్తుంది.

గ్రీన్ టీ: ఇది ఓ సూపర్ డ్రింక్. రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. చర్మాన్ని అంత త్వరగా ముడతలు పడనివ్వదు. కళ్ళకు మెరుపు అందిస్తుంది. కేటరాక్ట్ ముదరటాన్నీ నెమ్మదింపచేస్తుంది. కప్పు గ్రీన్ టీ తీసుకోగానే కొత్త ఉత్సాహం పరవళ్లు తొక్కుతున్నట్లనిపిస్తుంది.



యోగర్ట్ లేదా పెరుగు: మనం కర్డ్ లేదా పెరుగు అంటాం కానీ, విదేశాలలో దీనినే యోగర్ట్ అంటారు. అయితే మన పెరుగుకూ దానికీ ఉన్న తేడా ఏమిటంటే... పెరుగు కాస్త పలచగా ఉంటుంది. యోగర్ట్ గట్టిగా ఉంటుంది. పెరుగు కాస్తంత పుల్లదనాన్ని కలిగి ఉంటుంది. యోగర్ట్‌లో ఏమాత్రం పులుపు ఉండదు. కస్టర్డ్ పౌడర్ కలిపినట్టుగా గడ్డగా... కొద్దిపాటి తియ్యగా ఉంటుంది. ఈ రెండూ కూడా ప్రోటీన్, కాల్షియం, విటమిన్-బి లను కలిగి ఉంటాయి. ఇవన్నీ కలిసి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ఇన్ఫెక్షన్ కలగకుండా పోరాడతాయి. యోగర్ట్ మన శరీర ఆరోగ్యానికి, జీర్ణ వ్యవస్థకు, నాడీ వ్యవస్థకు మేలుచేస్తుంది. క్యాన్సర్, ఎలర్జీలు, అధిక రక్తపోటు, హై-కొలెస్టరాల్ బారిన పడకుండా కాపాడుతుంది.

బీన్స్: ప్రోటీన్స్, పీచుపదార్థం, విటమిన్లు, మినరల్స్, ఫైటోన్యూట్రియెంట్స్. ఇవన్నీ బీన్స్‌లో సమృద్ధిగా ఉంటాయి. అలాగే కొవ్వుకు సంబంధించిన చెడు లక్షణాలు ఉండవు. బీన్స్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. షుగర్ లెవల్స్ సమతుల్యంగా ఉండేటట్లు చూస్తూనే సురక్షితమైన, నిలకడ అయిన నెమ్మదిగా ఖర్చయ్యే శక్తిని అందిస్తుంది. కొలెస్టరాల్ లెవెల్స్‌ని కొంతమేరకు తగ్గిస్తాయి. బీన్స్‌తో చేసిన కూరలు తిన్నప్పుడు కడుపు నిండినట్లు అనిపిస్తుంది. అయితే ఇందులో అధిక క్యాలరీలు లేకపోవడం వలన బరువు పెరిగే సమస్యే ఉండదు.

బెర్రీస్: ముఖ్యంగా నేరేడు పండ్లు: వృద్ధాప్యం త్వరగా రాకుండా చేస్తాయి. వృద్ధులవుతున్న కొద్దీ మెదడు నెమ్మదించే అవకాశం ఉంది. అలాంటి అనారోగ్యాల నుంచి బెర్రీస్ కాపాడుతాయి. వీటిలో యాంటీ ఆక్సిడెంట్స్, క్యాన్సర్ నిరోధకాలు ఉంటాయి.



ఆకుకూరలు: ఆకుకూరలు చాలా రకాల క్యాన్సర్‌ల నుండి కాపాడుతాయి. వీటిలో విటమిన్ బి, సి, ఇ, ఫోలేట్, పొటాషియం, పీచుపదార్థం సమృద్ధిగా ఉంటాయి. ఎముకల ఆరోగ్యానికి మంచిది. కాల్షియంని శరీరం ఇముడ్చుకోవటానికి తోడ్పతాయి. కేటరాక్ట్‌ను నిరోధించడంలో పాలకూర తోడ్పడుతుంది.

వీలయినంత వరకూ వీటిలో కొన్నింటిని అయినా రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకుంటే ఉత్సాహంగా ఉండవచ్చు.





ఇంట్లో నుంచి కాలు బయట పెట్టినప్పటి నుంచి తిరిగి ఇంటికి వచ్చేవరకు మన పాదాలను అంటిపెట్టుకుని ఉండి, జాగ్రత్తగా కాపాడేది పాదరక్షలే కాబట్టి ఎలాంటి పాదరక్షలను, ఎప్పుడు ఎంచుకోవాలి అనే విషయాలపై అవగాహన అవసరం. చెప్పుకోవడానికి ఇది చాలా సిల్లీగా కనిపిస్తుంది కానీ చెప్పుకోకపోతే తిప్పలు తప్పవు. అందుకే కొన్ని సంగతులు చెప్పుకుందాం.

చెప్పుకుందాం..!

దుస్తులు మాత్రం అందరూ సరయిన కొలతల్లోనే ఉండేలా చూసుకుంటారు కానీ, చెప్పుల విషయంలో అంతగా పట్టించుకోరు. నిజానికి దుస్తులకు ఎంత ప్రాధాన్యత ఇస్తామో, పాదరక్షలకు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలి.

పాదరక్షలు సౌకర్యంగా లేకపోతే ఎవరికైనా ఇబ్బందే కానీ ముఖ్యంగా ఆర్థోపెడిక్, డయాబెటిస్ రోగులు, ఆపరేషన్లు చేయించుకున్న వాళ్లె మరిన్ని ఇబ్బందులు పడతారు.

చిన్నసైజు వద్దు...

పాదం పరిమాణం కంటే చిన్నగానూ, బిగుతుగానూ ఉండే చెప్పులు ధరిస్తే అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకున్నట్లే. సరైన చెప్పులు వేసుకోకపోతే పాదాలకు పగుళ్లు, ఇన్ఫెక్షన్లూ తప్పవు. బిగుతైన బూట్లు ధరించడం వల్ల గోళ్ల పెరుగుదల నిలిచిపోవడమే కాక గోటి చివర్లు వేళ్లలోనికి గుచ్చుకుని ఇన్ఫెక్షన్ల బారిన పడాల్సి వస్తుంది. షుగర్ రోగులకు ఇలాంటివి తీవ్రంగా మారే ప్రమాదం ఉంది. అలాగని పెద్ద సైజు చెప్పులు, బూట్లు వేసుకోవడమూ ఏమంత మంచిది కాదు. మడమల సమస్యలు ఎదురవుతాయి. వీటి మూలంగా కాళ్లు బెణకడం, నడకలో తేడా రావడం తప్పవని నిపుణుల హెచ్చరిక.

సాయంత్రాలే సరి

గుండె సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు, బీపీ, డయాబెటిస్ వంటి లైఫ్‌స్టైల్ సంబంధిత రోగులకు సహజంగానే కాళ్ల వాపులుంటాయి. అలాగే ఎక్కువసేపు కుర్చీలో కూర్చొని పనిచేసే వాళ్లకు సైతం పాదాల వాపు సర్వసాధారణం. ఇది ఎక్కువగా సాయంత్రం సమయంలో ఉంటుంది. ఈ సమయంలో చెప్పులు కొనుగోలు చేస్తే సాధారణ సైజు కంటే కొంచెం పెద్దవి తీసుకునే అవకాశం ఉంటుంది. పనివేళలో సరైన సైజ్ చెప్పులు, బూట్లు వేసుకోవడం వల్ల సౌకర్యంగా ఉండటంతోపాటు పాదాలు కూడా పదిలంగా ఉంటాయి.

ఒక కాలితో ట్రయల్ వద్దే వద్దు...

పాదరక్షలు కొనుగోలు చేసేటప్పుడు ఒక కాలికి మాత్రమే ట్రయల్ వేసి సరిపోయిందని సంతృప్తి పడవద్దు. మొహమాటం లేకుండా రెండు కాళ్లకూ వేసుకుని నాలుగడుగులు అటూ ఇటూ నడిచి, అవి సౌకర్యంగా అనిపిస్తేనే కొనుగోలు చేయాలి. అదేవిధంగా బూట్లు కొనేటప్పుడు సాక్స్ తొడుక్కోకుండా ట్రయల్ చేయడం సరి కాదు. బూట్లకు ముందు కనీసం అర అంగుళం ఖాళీగా ఉండేలా చూసుకోవాలి. లేకుంటే కాలిగోర్ల పెరుగుదల నిలిచిపోవడం, తద్వారా ఇన్ఫెక్షన్ల సమస్య తలెత్తే అవకాశం ఉంటుంది. అదే విధంగా పాదరక్షలు ఎప్పుడూ శుభ్రంగా ఉండేలా చూసుకోవడం కూడా ఎంతో అవసరం.

మంచి రంగు కూడా ముఖ్యమే!

చెప్పుల రంగు మామూలుగా ఉందో లేదో గమనించండి. సాధారణంగా మంచి నాణ్యత గల చెప్పుల రంగు ముదురుగా ఉండదు. అదే చవక రకం చెప్పుల రంగు చాలా ప్రకాశవంతంగా ఉంటుంది, ఈ రంగులలో ఎక్కువగా కాడ్మియం, సీసం, ఇతర హెవీ మెటల్ అంశాలు ఉంటాయి, ఇది పిల్లల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

గట్టి చెప్పులు

కొంతమంది తల్లిదండ్రులు మెత్తటి చెప్పులయితే నడక సరిగా ఉండదనే అపోహతో పిల్లలకు బిగుతుగా ఉండే గట్టి చెప్పులు కొంటారు. నిజానికి, బిగుతైన చెప్పులు ధరించిన పిల్లలు పాదాల, కాలి వేళ్ల పెరుగుదలకు ఆటంకం కలిగించినట్లే. స్లిప్పర్ లోపల ఉన్న పొడవు పిల్లల పాదం పొడవు కంటే కనీసం ఒక సెంటీమీటరు పొడవుగా ఉండాలని నిపుణుల సలహా.

భారంగా వద్దు

మీరు కొనాలనుకుంటున్న చెప్పులను ఒకసారి చేతితో పట్టుకుని చూడండి. బరువు తక్కువగా ఉండి, చేతుల్లో భారమైన అనుభూతి లేనట్లయితే, అది కొత్త మెటీరియల్‌తో తయారయిందని చెప్పవచ్చు. బరువుగా అనిపిస్తే వాటిని కొనుగోలు చేయవద్దు.

చివరగా ఒక మాట... చెప్పులే కదా అని చులకనగా చూడొద్దు. వీటి గురించి చెప్పుకోవాలంటే బోలెడన్ని సంగతులున్నాయి.

సినిమా

ఎప్పటికీ కృతజ్ఞతగా...



అమితాబ్ బచ్చన్

అమితాబ్ బచ్చన్ ఆస్పత్రిలో చేరారనే వార్త గుప్పుమనడంతో అభిమానులు ఆందోళన పడ్డారు. అయితే ఆ తర్వాత కంగారు పడాల్సిందేమీ లేదనే వార్త కూడా రావడంతో కూల్ అయ్యారు. ఇంతకీ విషయం ఏంటంటే... శుక్రవారం తెల్లవారుజాము అమితాబ్ శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిపడటంతో కుటుంబ సభ్యులు ఆయన్ను ఆస్పత్రిలో చేర్పించారట. అమితాబ్‌కి యాంజియోప్లాస్టీ సర్జరీ చేశారని సమాచారం. కాలికి ఒకచోట రక్తం గడ్డ కట్టడంతో యాంజియోప్లాస్టీ చేశారట. ఇక శుక్రవారం మధ్యాహ్నమే అమితాబ్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆ తర్వాతే 'ఇన్ గ్రాటిట్యూడ్ ఎవర్' (ఎప్పటికీ కృతజ్ఞతగా..) అని ఎక్స్‌లో పోస్ట్ చేసినట్లున్నారు అమితాబ్. అంటే... ఆరోగ్యంగా బయటపడినందుకు ఆయన ఇలా పోస్ట్ చేసి ఉంటారని ఊహించవచ్చు. ఇక ఇటీవల ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ', రజనీకాంత్ 'వేట్టయాన్' చిత్రాల షూటింగ్స్‌లో అమితాబ్ పాల్గొన్న సంగతి తెలిసిందే.



మధుబాల

'ప్యార్ కియా తో డర్నా క్యా..' అంటూ 'మొఘల్ ఎ అజం' (1960) చిత్రంలో వెండితెరపై అనార్కలిగా ప్రేమ కురిపించిన మధుబాలను నాటి తరం అంత సులువుగా మర్చిపోదు. ఈ తరం ప్రేక్షకుల కోసం ఆమె జీవితం వెండితెరకు రానుంది. 'ఇండియన్ సినిమా సౌందర్య దేవత'గా కితాబులందుకున్న మధుబాల తన ఇరవయ్యేళ్ల కెరీర్‌లో అరవైకి పైగా చిత్రాల్లో నటించారు. 'మిస్టర్ అండ్ మిసెస్ 55, హాఫ్ టికెట్, మహల్, బాదల్'.. ఇలా పలు చిత్రాల్లో తన అందం, అభినయంతో ఆకట్టుకున్నారు మధుబాల. 1933లో జన్మించిన మధుబాల అతి చిన్న వయసు (36)లోనే కన్ను మూశారు. ఈ 36 ఏళ్ల జీవితంలో మధుబాల సినీ, వ్యక్తిగత జీవితం గురించి

మధుభాల బయోపిక్ షురూ

తెలియని చాలా విషయాలను బయోపిక్‌లో చూపించనున్నారు. ప్రముఖ నటుడు దిలీప్‌కుమార్‌తో అనుబంధం, ప్రముఖ గాయకుడు, నటుడు కిశోర్‌కుమార్‌తో వివాహం వంటి విషయాలూ ఈ చిత్రంలో ఉంటాయట. ఆలియా భట్‌తో 'డార్లింగ్స్' చిత్రాన్ని తెరకెక్కించిన జస్మీత్ కె రీన్ మధుబాల బయోపిక్‌కి దర్శకురాలు. ఈ చిత్రాన్ని మధుబాల వెంచర్స్ పతాకంపై మధుబాల సోదరి మధుర్ బ్రిజ్ భూషణ్ నిర్మించనున్నారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, బ్రూయింగ్ థాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా నిర్మాణ భాగస్వాములుగా ఉంటాయి. ''ఈ చిత్రంతో ఎవరి మనోభావాలనూ దెబ్బ తీయాలనే ఆలోచన లేదు. మధుబాల జీవితం గురించి ఉన్న కొన్ని అపోహలను ఈ చిత్రం తొలగిస్తుంది. సినిమా కోసం కొంత స్వేచ్ఛ తీసుకున్నప్పటికీ నిజాయితీగానే రూపొందిస్తాం'' అని మధుర్ పేర్కొన్నారు. ఇంకా కథానాయిక ఖరారు కాలేదు. కాగా శుక్రవారం ఈ బయోపిక్ ప్రకటన వచ్చినప్పట్నుంచి మధుబాలగా నటించే చాన్స్ ఏ కథానాయికకు దక్కుతుందనే చర్చ మొదలైంది.

రామ్‌చరణ్ పెద్ది?



రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సన దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తారు. కాగా ఈ నెల 20న హైదరాబాద్‌లో ఈ చిత్రం ప్రారంభోత్సవం జరగనుందని తెలిసింది. ఈ సినిమాకు 'పెద్ది' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని, ఈ నెల 27న రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌పై స్పష్టత వచ్చే చాన్స్ ఉందని భోగట్టా. అలాగే ఈ సినిమాలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ ఓ కీలక పాత్రలో కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. కాగా ప్రస్తుతం వైజాగ్‌లో జరుగుతున్న 'గేమ్‌చేంజర్' చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు.


భీమాని హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్ - గోపీచంద్



మారుతి, గోపీచంద్, సంపత్ నంది

''భీమా' సినిమా బాగుంది. యాక్షన్, కామెడీ అద్భుతంగా ఉంటాయి. ఈ సినిమాలో రెండు క్యారెక్టర్స్‌లో మంచి వేరియేషన్స్ చూపించారని మంచి అప్లాజ్ వస్తోంది. ఇంత మంచి విజయాన్నిచ్చిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అని గోపీచంద్ అన్నారు. గోపీచంద్ హీరోగా కన్నడ దర్శకుడు ఎ. హర్ష దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మించిన చిత్రం 'భీమా'. ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మ హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం ఈ నెల 8న విడుదలైంది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన థ్యాంక్స్ మీట్‌లో దర్శకులు మారుతి, సంపత్ నంది అతిథులుగా పాల్గొని, ఈ సినిమా విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గోపీచంద్ మాట్లాడుతూ– ''భీమా' వంటి సినిమాను తెలుగు ప్రేక్షకులకు ఇచ్చిన దర్శకుడు హర్షకు, నిర్మాత రాధామోహన్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు. ''భీమా'కు ఆడియన్స్ నుంచి లభిస్తోన్న స్పందన సంతోషాన్నిస్తోంది'' అన్నారు హర్ష. ''రోజు రోజుకీ మా సినిమా వసూళ్లు పెరుగుతున్నాయి. విద్యార్థుల పరీక్షలు పూర్తయ్యాయి. చూడనివారు మా సినిమాను చూడండి'' అన్నారు రాధామోహన్. మాళవికా శర్మ మాట్లాడారు.

యూత్‌ఫుల్ డ్యూయెట్



'డ్యూయెట్'లో ఆనంద్ దేవరకొండ

'డ్యూయెట్' పాడుతున్నారు మదన్. ఆనంద్ దేవరకొండ, రితికా నాయక్ జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్ 'డ్యూయెట్'. మిథున్ వరదరాజ కృష్ణన్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ కేఈ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఓ డిఫరెంట్ లవ్‌స్టోరీగా తెరకెక్కుతున్న ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ జరుపుకుంటోంది. శుక్రవారం ఆనంద్ దేవరకొండ బర్త్ డే. ఈ సందర్భంగా 'డ్యూయెట్‌లో మదన్ క్యారెక్టర్‌లో ఆనంద్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్, సహనిర్మాత: మధుర శ్రీధర్ రెడ్డి. మరోవైపు ఆనంద్ దేవరకొండ నటిస్తున్న యాక్షన్ ఫిల్మ్ 'గం..గం..గణేశా'. ఉదయ్ శెట్టి దర్శకత్వంలో కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా కొత్త పోస్టర్ కూడా విడుదలైంది.

అర్జునుడి గీతోపదేశంలో...



వరలక్ష్మీ శరత్‌కుమార్

వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించనున్న సినిమాకు 'అర్జునుడి గీతోపదేశం' టైటిల్‌ను ఖరారు చేశారు. అఖిల్ రాజ్, దివిజా ప్రభాకర్, రాజీవ్, ఆదిత్యా శశికుమార్ కీలక పాత్రల్లో నటించనున్న ఈ సినిమాతో సతీష్ గోగాడ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. త్రిలోక్‌నాథ్. కె, ప్రదీప్ రెడ్డి .వి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. తొలి సన్నివేశానికి మల్లాల సీతారామరాజు కెమెరా స్విచ్చాన్ చేయగా, కె. అమ్మిరాజు క్లాప్ ఇచ్చారు. లక్కంశెట్టి వేణుగోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం సతీష్ గోగాడ మాట్లాడుతూ– ''దర్శకుడిగా నా తొలి చిత్రం ఇది. మొదటి షెడ్యూల్‌ను మార్చి 20న అమలాపురంలో మొదలుపెడుతున్నాం. ఆ తర్వాత వైజాగ్, హైదరాబాద్, చెన్నై లొకేషన్స్‌లో చిత్రీకరణ ప్లాన్ చేశాం'' అన్నారు. ''ఈ సినిమా ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది'' అన్నారు నిర్మాతలు. రాజీవ్, దివిజ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్.

ఫిఫ్టీ ప్లస్‌లో ఫస్ట్ చాన్స్!



కే హుయ్ క్వాన్

ఐదు పదుల వయసు దాటిన తర్వాత హీరో అవుతున్నారు ఆస్కార్ విన్నింగ్ హాలీవుడ్ యాక్టర్ కే హుయ్ క్వాన్. 'ది అవెంజర్స్', 'జాన్ విక్', 'డెడ్‌పూల్ 2' వంటి సినిమాల్లోని యాక్షన్ సీక్వెన్స్‌లకు స్టంట్ కో ఆర్డినేటర్‌గా చేసిన జోనాథన్ యుసేబియా 'విత్ లవ్' అనే ఓ యాక్షన్ ఫిల్మ్‌తో దర్శకునిగా తొలిసారి మెగాఫోన్ పట్టారు. ఈ చిత్రంలోనే కే హుయ్ క్వాన్ మెయిన్ లీడ్ రోల్ చేస్తున్నారు. నటుడిగా దాదాపు నాలుగు దశాబ్దాల కెరీర్ ఉన్న కే హుయ్ క్వాన్‌కు హీరోగా ఇదే తొలి చిత్రమని హాలీవుడ్ సమాచారం. అలాగే ఫిఫ్టీ ప్లస్ ఏజ్‌లో ఉన్న జోనాథన్ యుసేబియా దర్శకత్వం వహిస్తున్న తొలి సినిమా ఇదే కావడం విశేషం. ఇక ప్రస్తుతం 'విత్ లవ్' సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమాను 2025 ఫిబ్రవరి 7న విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' సినిమాలో ఓ కీలక పాత్రలో నటించారు క్వాన్. ఈ సినిమాకు గాను ఆయన ఉత్తమ సహాయ నటుడు విభాగంలో 2023లో జరిగిన 95వ ఆస్కార్ అవార్డ్స్‌లో అవార్డు అందుకున్నారు.

నవ్వులే నవ్వులు



శ్రీహర్ష, శ్రీవిష్ణు

''ప్రేక్షకులను నవ్వించాలనే ఉద్దేశంతోనే 'ఓం భీమ్ బుష్' సినిమా చేశాం. రెండు వందల శాతం ఆడియన్స్ పిచ్చి పిచ్చిగా నవ్వుతారు. ప్రేక్షకుల నవ్వులతో థియేటర్స్ బద్దలైపోతాయి'' అని హీరో శ్రీవిష్ణు అన్నారు. శ్రీవిష్ణు, ప్రీతీ ముకుందన్ జంటగా, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ, అయేషా ఖాన్, ప్రియా వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ ముఖ్య పాత్రల్లో నటించిన ఈ సినిమాకు శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వం వహించారు. యూవీ క్రియేషన్స్, వీ సెల్యూలాయిడ్ పతాకాలపై సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో శ్రీవిష్ణు మాట్లాడుతూ– ''దర్శకుడు హర్ష ఈ సినిమాను హిలేరియస్‌గా తీశాడు. అవకాశం ఇచ్చిన యూవీ వంశీ అన్న, సునీల్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు. ''ట్రైలర్‌లో ఉన్న ఎనర్జీ కంటే సినిమాలో వంద రెట్లు ఎనర్జీ ఉంది'' అన్నారు శ్రీహర్ష. ''ఈ సినిమాతో డబుల్ డోస్ ఎంటర్‌టైన్మెంట్ ఇస్తామని ప్రామిస్ చేస్తున్నాం'' అన్నారు ప్రియదర్శి. ''ఓం భీమ్ బుష్' ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు సునీల్.

సాక్షి బిజినెస్
శనివారం
16-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
454	123
72,643	22,024

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	15,956	▽ 172
డోజోన్స్	38,672	▽ 234
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,727	▽ 16
డాక్స్	17,937	▽ 5
షాంఘై	3,054	△ 16
నికాయ్	38,705	△ 100

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	64,550
బంగారం (22 క్యారట్)	61,480
వెండి (కేజీ)	80,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	రూపాయలకు	81.19	84.48
£	బ్రిటన్ పౌండ్	రూపాయలకు	103.88	108.12
€	యూరో	రూపాయలకు	88.12	91.90
¥	జపాన్ ఎన్ (100)	రూపాయలకు	47.00	64.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	రూపాయలకు	52.07	56.58
S$	సింగపూర్ డాలర్	రూపాయలకు	60.13	64.88
SAR	సౌదీ రియాల్	రూపాయలకు	21.21	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	రూపాయలకు	21.65	23.43
¥	చైనా యువాన్	రూపాయలకు	10.28	12.29

దక్షిణాదిపై యస్ బ్యాంక్ మరింత దృష్టి

- మైక్రోఫైనాన్స్ కార్యకలాపాలపైనా కసరత్తు
- యస్ బ్యాంక్ ఎండీ ప్రశాంత్ కుమార్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ దక్షిణాదిలో కార్యకలాపాలపై మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోను శాఖలను విస్తరిస్తోంది. ప్రస్తుతం 25గా ఉన్న బ్రాంచీల సంఖ్యను మార్చి ఆఖరు నాటికి 29కి పెంచుకోనున్నట్లు, తదుపరి మరో రెండు కొత్త శాఖలను ప్రారంభించనున్నట్లు బ్యాంక్ ఎండీ ప్రశాంత్ కుమార్ శుక్రవారమిక్కడ మీడియాకు తెలిపారు. దేశవ్యాప్తంగా తమకు 1,200 పైచిలుకు శాఖలు ఉండగా.. దక్షిణాదిలో 216 ఉన్నాయన్నారు. మైక్రోఫైనాన్స్ విభాగంలోకి ప్రవేశించడంపైనా కసరత్తు చేస్తున్నామని ఆయన చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కుదిరితే ఏదైనా సూక్ష్మ రుణాల సంస్థను కొనుగోలు చేస్తామని లేదా సొంతంగానైనా కార్యకలాపాలు ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. పేటీఎం పరిణామాలపై స్పందిస్తూ దానికి సంబంధించి నాలుగు బ్యాంకులకు వచ్చే వ్యాపారంలో తమకు పాతిక శాతం వాటా రాగలదని ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. మరోవైపు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విభాగంపైనా (ఎంఎస్‌ఎంఈ) దృష్టి పెడుతున్నామన్నారు. ప్రస్తుతం తమ పోర్ట్‌ఫోలియోలో దీని వాటా 30 శాతంగా ఉండగా వచ్చే రెండు, మూడేళ్లలో 35 శాతం వరకు పెంచుకోనున్నట్లు ప్రశాంత్ కుమార్ చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో డిపాజిట్లలో 18 శాతం, రుణాల్లో 15 శాతం వరకు వృద్ధిని అంచనా వేస్తున్నట్లు వివరించారు.

హైదరాబాద్ మార్కెట్‌పై స్పందిస్తూ డిపాజిట్లు వార్షిక ప్రాతిపదికన 16.6 శాతం వృద్ధి చెంది రూ. 8,887 కోట్లకు చేరాయని, స్థూల రుణాలు 24 శాతం వృద్ధితో రూ. 11,157 కోట్లకు పెరిగాయని ప్రశాంత్ కుమార్ చెప్పారు. కొత్త కాసా (కరెంట్ అకౌంటు, సేవింగ్స్ అకౌంటు) అకౌంట్లు 14 శాతం వృద్ధి చెందాయన్నారు. దక్షిణాదిలో తమ కాసా డిపాజిట్లలో నగరానికి 14 శాతం వాటా ఉందని పేర్కొన్నారు.

కొత్త ఈవీ పాలసీ



కేంద్రం ఆమోదం • కనీస పెట్టుబడి విలువ రూ. 4,150 కోట్లు
• దిగుమతులపై సుంకాలపరమైన మినహాయింపులు
• టెస్లా తదితర సంస్థల ఎంట్రీకి మార్గం సుగమం ..

న్యూఢిల్లీ: టెస్లా వంటి అంతర్జాతీయ విద్యుత్ వాహనాల దిగ్గజాల నుంచి పెట్టుబడులను ఆకర్షించే దిశగా కేంద్ర ప్రభుత్వం కొత్త ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) పాలసీకి ఆమోదముద్ర వేసింది. దీని ప్రకారం దేశీయంగా తయారీ యూనిట్లపై కనీసం 500 మిలియన్ డాలర్లు (రూ. 4,150 కోట్లు) ఇన్వెస్ట్ చేసే సంస్థలకు సుంకాలపరమైన ప్రోత్సాహకాలు ఇవ్వనుంది. అధికారిక ప్రకటన ప్రకారం ఈవీ ప్యాసింజర్ కార్లను ఏర్పాటు చేసే కంపెనీలు 35,000 డాలర్లకు పైబడి విలువ చేసే వాహనాలపై 15 శాతం సుంకాలతో పరిమిత సంఖ్యలో కార్లను దిగుమతి చేసుకునేందుకు వీలుంటుంది.

ప్రభుత్వం అనుమతి లేఖ ఇచ్చిన తేదీ నుంచి అయిదేళ్ల వ్యవధికి ఇది వర్తిస్తుంది. ప్రస్తుతం పూర్తి స్థాయి కారును (సీబీయూ)ని దిగుమతి చేసుకుంటే.. ఇంజిన్ పరిమాణం, ఖరీదు, బీమా, రవాణా (సీఐఎఫ్) మొదలైనవి కలిపి విలువను బట్టి 70 శాతం నుంచి 100 శాతం దాకా కస్టమ్స్ సుంకాలు ఉంటున్నాయి. దీనికి 40,000 డాలర్ల విలువను ప్రామాణికంగా పరిగణిస్తున్నారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి భారత్‌ను గమ్యస్థానంగా మార్చేందుకు, పేరొందిన అంతర్జాతీయ ఈవీల తయారీ సంస్థల నుంచి పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ పాలసీ ఉపయోగపడగలదని కేంద్రం పేర్కొంది. భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ పెరుగుతుండటం, అమెరికాకు చెందిన టెస్లా, వియత్నాం సంస్థ విన్‌ఫాస్ట్ మొదలైనవి ఇక్కడ ఇన్వెస్ట్ చేయడంపై ఆసక్తిగా ఉన్న నేపథ్యంలో కొత్త విధానం ప్రాధాన్యం సంతరించుకుంది.

స్కీముకి సంబంధించి మరిన్ని వివరాలు..

- ఆమోదం పొందిన దరఖాస్తుదారులు ఎలక్ట్రిక్ 4 వీలర్ల ఉత్పత్తి కోసం భారత్‌లో కనీసం రూ. 4,150 కోట్ల (500 మిలియన్ డాలర్ల) పెట్టుబడితో తయారీ ప్లాంటు నెలకొల్పాలి.
- కేంద్ర భారీ పరిశ్రమల శాఖ అనుమతి మంజూరు చేసిన తేదీ నుంచి 3 సంవత్సరాల్లోగా ప్లాంటును ఏర్పాటు చేయాలి. ప్రాథమికంగా దేశీయంగా కనీసం 25 శాతం విలువను (డీవీఏ) జోడించాలి. అయిదేళ్లలో దీన్ని 50 శాతానికి పెంచాలి. డీవీఏని 50 శాతానికి పెంచి, కనీసం రూ. 4,150 కోట్లు ఇన్వెస్ట్ చేయడం పూర్తయిన తర్వాతే బ్యాంక్ గ్యారంటీలను ప్రభుత్వం వాపసు చేస్తుంది.
- తక్కువ సుంకాలతో గరిష్ఠంగా ఏడాదికి 8,000 ఎలక్ట్రిక్ ఫోర్ వీలర్లను దిగుమతి చేసుకోవచ్చు. వార్షిక పరిమితి కన్నా తక్కువగా దిగుమతి చేసుకుంటే మిగతాది తర్వాత ఏడాదికి క్యారీఫార్వార్డ్ చేసుకునేందుకు వీలుంటుంది.
- స్కీమును నోటిఫై చేసిన సుమారు 120 రోజుల్లో దరఖాస్తులను ఆహ్వానిస్తారు. కంపెనీలు దరఖాస్తు చేసుకున్న 120 రోజుల్లోగా వాటిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.

తెలుగు రాష్ట్రాల్లో ముత్తూట్ మైక్రోఫిన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైక్రోఫైనాన్స్ రంగంలో ఉన్న ముత్తూట్ మైక్రోఫిన్ తెలంగాణలో అడుగుపెడుతోంది. భువనగిరి, జనగాం, హన్మకొండ, పరకాలలో శాఖలను ఈ నెలలో తెరుస్తున్నట్టు శుక్రవారం ప్రకటించింది. జూన్‌లోగా ఆంధ్రప్రదేశ్‌కు సేవలను విస్తరిస్తామని ముత్తూట్ మైక్రోఫిన్ సీఈవో సదాఫ్ సయీద్ వెల్లడించారు. కొచ్చి కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ముత్తూట్ మైక్రోఫిన్ 18 రాష్ట్రాలకు విస్తరించింది. 1,424 శాఖలతో సేవలు అందిస్తోంది. సుమారు 33 లక్షల మంది కస్టమర్లు ఉన్నారు.

లాభాలు ఒకరోజుకే పరిమితం

- సెన్సెక్స్ 454 డౌన్
- నిఫ్టీకి 123 పాయింట్లు నష్టం
- ఆయిల్ అండ్ గ్యాస్, ఐటీ, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు



ముంబై: స్టాక్ మార్కెట్ లాభాలు ఒక రోజుకే పరిమితమయ్యాయి. అమెరికా వడ్డీరేట్ల తగ్గింపు వాయిదా ఆందోళనలతో ఫైనాన్షియల్, ఆటో, ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. స్మాల్, మిడ్ క్యాప్ ఫండ్ల నిర్వహణ సామర్థ్యాలను పరీక్షించేందుకు స్ట్రెస్ టెస్ట్ నిర్వహించాలని సెబీ ఆదేశాలు జారీ చేసింది. ఆ ఫలితాలూ ట్రేడింగ్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. ఫలితంగా సెన్సెక్స్ 454 పాయింట్లు పతనమై 72,643 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 123 పాయింట్లు నష్టపోయి 22,024 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 612 పాయింట్లు క్షీణించి 72,485 వద్ద, నిఫ్టీ 215 పాయింట్లు పతనమై 21,932 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.849 కోట్ల షేర్లను విక్రయించారు. ఆయిల్ అండ్ గ్యాస్, ఇంధన, క్యాపిటల్ గూడ్స్, వినిమయ షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.682 కోట్ల షేర్లు అమ్మేశారు. వారం మొత్తంగా సెన్సెక్స్, నిఫ్టీ 2% చొప్పున నష్టపోయాయి. బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ 6%, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 4% క్షీణించాయి.

క్రిప్టోలను కరెన్సీగా గుర్తించం..

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: క్రిప్టో కరెన్సీలపై భారత్ విధానం మారబోదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. కరెన్సీలను ప్రభుత్వం లేదా సెంట్రల్ బ్యాంకులే జారీ చేయాలే తప్ప క్రిప్టోలను కరెన్సీగా గుర్తించే ప్రసక్తే లేదన్నారు. ఇటువంటి అసెట్స్‌ను నియంత్రించే దిశగా సమగ్రమైన ఫ్రేమ్‌వర్క్ రూపొందించే అంశాన్ని జీ20 కూటమి పరిశీలిస్తోందని మంత్రి పేర్కొన్నారు. మరోవైపు, ప్రపంచ మార్కెట్లు అనేక ఒడిదుడుకులకు లోనవుతున్నా దేశీయంగా స్టాక్ మార్కెట్ స్థిరంగానే వ్యవహరిస్తోందని ఆమె పేర్కొన్నారు. కాబట్టి మార్కెట్‌ను దాని మానాన వదిలేయాలని అభిప్రాయపడ్డారు. స్మాల్, మిడ్ క్యాప్ స్టాక్స్‌లో బబుల్ తరహా పరిస్థితులు ఉన్నాయని, వాటిపై చర్యాపత్రాన్ని తెచ్చే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి ఇటీవల తెలిపిన నేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-3-2024	
విశాఖ	425-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	420-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	72.00
15-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	395-00
వరంగల్	397-00
రిటైల్ ధర	4.55

ఎగుమతులు రికార్డ్



న్యూఢిల్లీ: భారత్ వస్తు ఎగుమతులు ఫిబ్రవరిలో రికార్డు సృష్టించాయి. 11 నెలల గరిష్ఠ స్థాయిలో 41.40 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. 2023 ఏప్రిల్‌తో ప్రారంభమైన ఆర్థిక సంవత్సరంలో ఈ స్థాయిలో ఎగుమతుల వృద్ధి నమోదుకావడం ఇదే తొలిసారి. ఇంజనీరింగ్ గూడ్స్, ఎలక్ట్రానిక్, ఫార్మా ఎగుమతులు పెరగడం మొత్తం సానుకూల గణాంకాలకు దారితీసింది. ఇక ఇదే కాలంలో దిగుమతులు 12.16 శాతం పెరిగి 60.11 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వెరసి ఎగుమతులు-దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం వాణిజ్యలోటు 18.70 బిలియన్ డాలర్లు.

- పసిడి దిగుమతులు ఫిబ్రవరిలో గణనీయంగా 133.82% పెరిగి, 6.15 బిలియన్ డాలర్లకు చేరాయి. ఆర్థిక సంవత్సరం 11 నెలల్లో 39% పెరిగి 44 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- ఇంజనీరింగ్ గూడ్స్ ఎగుమతులు ఫిబ్రవరిలో 15.9 శాతం పెరిగి 9.94 బిలియన్ డాలర్లకు చేరాయి. ఎలక్ట్రానిక్ గూడ్స్ ఎగుమతులు 55 శాతం ఎగసి 3 బిలియన్ డాలర్లకు ఎగశాయి.
- 2023 ఏప్రిల్ నుంచి 2024 ఫిబ్రవరి వరకూ ఎగుమతుల (వస్తువులు, సేవలు) విలువ 0.83 శాతం వృద్ధితో 709.81 బిలియన్ డాలర్లు. ఇదే కాలంలో దిగుమతుల విలువ 782.05 బిలియన్ డాలర్లు.
- 2021-22లో ఎగుమతుల విలువ 422 బిలియన్ డాలర్లయితే, దిగుమతుల విలువ 613 బిలియన్ డాలర్లు. 2022-23లో వస్తు ఎగుమతులు 450 బిలియన్ డాలర్లు, దిగుమతులు 714 బిలియన్ డాలర్లు.



సాక్షి స్పోర్ట్స్



సెమీస్‌లో అల్‌కరాజ్

ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్) సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. కాలిఫోర్నియాలో జరిగిన క్వార్టర్ ఫైనల్లో రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ 6-3, 6-1తో ఆరో ర్యాంకర్ జ్వెరెవ్ (జర్మనీ)పై గెలిచాడు. మరో క్వార్టర్ ఫైనల్లో ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత సినెర్ (ఇటలీ) 6-3, 6-3తో లెహెస్కా (చెక్ రిపబ్లిక్)పై నెగ్గి అల్‌కరాజ్‌తో సెమీఫైనల్ పోరుకు సిద్ధమయ్యాడు.

ఫస్ట్ క్లాస్ క్రికెట్‌కు మాథ్యూ వేడ్ గుడ్‌బై



పరిమిత ఓవర్ల ఫార్మాట్‌పై మరింత దృష్టి సారించేందుకు.... ఫస్ట్ క్లాస్ (మూడు లేదా అంతకంటే ఎక్కువ రోజుల మ్యాచ్‌లు) క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకుంటున్నట్లు ఆస్ట్రేలియా జట్టు వికెట్ కీపర్ మాథ్యూ వేడ్ ప్రకటించాడు. 2012లో ఆస్ట్రేలియా తరఫున అరంగేట్రం చేసిన 36 ఏళ్ల వేడ్ 36 టెస్టులు ఆడి నాలుగు సెంచరీలతో కలిపి 1613 పరుగులు సాధించాడు.

భళా బెంగళూరు

- ఆఖర్లో అనూహ్య విజయంతో ఫైనల్‌కు అర్హత
- పరుగుల వేటలో ముంబై ఇండియన్స్ బోల్తా
- రాణించిన ఎలీస్ పెరీ, శ్రేయాంక, ఆశ
- రేపు జరిగే ఫైనల్లో ఢిల్లీతో ఆర్‌సీబీ అమీతుమీ

న్యూఢిల్లీ: గెలుపు వాకిట ముంబై ఇండియన్స్ బోల్తా పడింది. ఉత్కంఠ రేపిన ఆఖరి ఓవర్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) 5 పరుగుల తేడాతో గట్టెక్కింది. తద్వారా మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో స్మృతి మంధాన నాయకత్వంలోని బెంగళూరు జట్టు ఫైనల్ చేరింది. డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్ సులువుగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఎలిమినేట్ అయ్యింది. ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 6 వికెట్లకు 135 పరుగులు చేసింది. అనంతరం ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 130 పరుగులకే పరిమితమై ఓడిపోయింది. ఆదివారం జరిగే ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో బెంగళూరు తలపడుతుంది.

మలుపు తిప్పిన శ్రేయాంక...

శుక్రవారం జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం 17వ ఓవర్ ముగిసేవరకు గెలిచే స్థితిలోనే ఉంది. 18 బంతుల్లో 20 పరుగులు సులువైన సమీకరణం కాగా... 18వ ఓవర్ వేసిన శ్రేయాంక పాటిల్ 4 పరుగులిచ్చి కీలకమైన హర్మన్‌ప్రీత్ వికెట్‌ను పడగొట్టింది. దాంతో ముంబై విజయసమీకరణం 12 బంతుల్లో 16 పరుగులుగా మారింది. 19వ ఓవర్ వేసిన సోఫీ మోలినెక్స్ నాలుగే పరుగులిచ్చి సజన (1) వికెట్‌ను తీసింది. ఇక చివర్లో 6 బంతుల్లో 12 పరుగులు చేయడం కూడా ముంబై జట్టుకు కష్టం కాదు. కానీ లెగ్ స్పిన్నర్ ఆశ శోభన మాయాజాలం చేసింది. తొలి 3 బంతులకు 4 పరుగులే ఇచ్చింది. ఆశ వేసిన నాలుగో బంతికి పూజ వస్త్రకర్ ముందుకొచ్చి ఆడి (4) స్టంపౌట్ అయ్యింది. దాంతో ముంబై నెగ్గాలంటే 2 బంతుల్లో 8 పరుగులు చేయాలి. కొత్త బ్యాటర్ అమన్‌జ్యోత్ ఐదో బంతికి ఒక పరుగు తీసింది. చివరి బంతికి ముంబై 7 పరుగులు చేయాలి. క్రీజులో అమెలియా కెర్ ఉంది. సిక్స్ కొడితే స్కోర్లు సమమై 'సూపర్ ఓవర్'కు దారి తీస్తుందా అని ఉత్కంఠ కలిగింది. కానీ ఆశ వేసిన ఆఖరి బంతికి అమెలియా ఒక్క పరుగు మాత్రమే తీయగలిగింది.



హర్మన్‌ప్రీత్



శ్రేయాంక, ఆశ



ఎలీస్ పెరీ

దాంతో ఓడిపోతుందనుకున్న మ్యాచ్‌లో బెంగళూరు 5 పరుగులతో గెలిచి తొలిసారి డబ్ల్యూపీఎల్ ఫైనల్‌కు దూసుకెళ్లింది.

ఆదుకున్న పెరీ...

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. ఓపెనర్లు స్మృతి (10), సోఫీ డివైన్ (10), దిశ (0), హిట్టర్లు రిచా ఘోష్ (14), సోఫీ మోలినెక్స్ (11) అంతా నిరాశపరిచారు. 15 ఓవర్లలో ఆర్‌సీబీ స్కోరు 84/5! కనీసం వంద కూడా చేయలేదు. ఈ దశలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఎలీస్ పెరీ (50 బంతుల్లో 66; 8 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటం చేసింది. ఆఖర్లో జార్జియా వేర్‌హమ్ (10 బంతుల్లో 18 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) బ్యాట్ ఝుళిపించింది. హేలీ మాథ్యూస్, నటాలీ సీవర్ బ్రంట్, సైకా ఇషాక్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం సునాయాసమైన లక్ష్యాన్ని ఛేదించలేక ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 130 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (30 బంతుల్లో 33; 4 ఫోర్) టాప్ స్కోరర్ కాగా.. అమెలియా కెర్ (25 బంతుల్లో 27 నాటౌట్; 2 ఫోర్లు), నటాలీ సీవర్ బ్రంట్ (17 బంతుల్లో 23; 4 ఫోర్లు) 20 పైచిలుకు పరుగులు చేశారంతే! శ్రేయాంక (4-0-16-2) జట్టుకు అవసరమైన స్పెల్ వేయగా, పెరీ, సోఫీ, వేర్‌హమ్, ఆశ తలా ఒక వికెట్ తీశారు.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: స్మృతి (సి) ఇస్మాయిల్ (బి) సీవర్ 10; సోఫీ డివైన్ (బి) హేలీ 10; పెరీ (సి) సీవర్ (బి) సైకా 66; దిశ (సి) పూజ (బి) సైకా 0; రిచా ఘోష్ (సి) సీవర్ (బి) హేలీ 14; సోఫీ మోలినెక్స్ (బి) సీవర్ 11; వేర్‌హమ్ (నాటౌట్) 18; శ్రేయాంక (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 135. వికెట్ల పతనం:** 1-20, 2-20, 3-23, 4-49, 5-84, 6-126. **బౌలింగ్:** షబ్నిమ్ 4-1-30-0, హేలీ మాథ్యూస్ 4-0-18-2, నటాలీ సీవర్ బ్రంట్ 4-0-18-2, సైకా ఇషాక్ 3-0-27-2, పూజ వస్త్రకర్ 3-0-21-0, అమెలియా కెర్ 2-0-18-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: యస్తిక (బి) పెరీ 19; హేలీ (సి) వేర్‌హమ్ (బి) శ్రేయాంక 15; నటాలీ సీవర్ (బి) వేర్‌హమ్ 23; హర్మన్‌ప్రీత్ (సి) డివైన్ (బి) శ్రేయాంక 33; అమెలియా కెర్ (నాటౌట్) 27; సజన (స్టంప్డ్) రిచా ఘోష్ (బి) సోఫీ మోలినెక్స్ 1; పూజ (స్టంప్డ్) రిచా ఘోష్ (బి) ఆశ శోభన 4; అమన్‌జోత్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 130. వికెట్ల పతనం:** 1-27, 2-50, 3-68, 4-120, 5-123, 6-128. **బౌలింగ్:** రేణుక 1-0-6-0, శ్రేయాంక పాటిల్ 4-0-16-2, సోఫీ డివైన్ 1-0-9-0, ఎలీస్ పెరీ 4-0-29-1, సోఫీ మోలినెక్స్ 4-0-16-1, వేర్‌హమ్ 4-0-37-1, ఆశ శోభన 2-0-13-1.

రఫ్ఫాడించిన రష్మిక

ప్రపంచ 249వ ర్యాంకర్‌పై 6-0, 6-0తో విజయం



ఇండోర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నమెంట్‌లో హైదరాబాద్ ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక కళ్లు చెదిరే ప్రదర్శన చేసింది. సింగిల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లిన రష్మిక... డబుల్స్ విభాగంలో తన భాగస్వామి వైదేహి చౌదరీతో కలిసి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 486వ ర్యాంకర్ రష్మిక 6-0, 6-0తో ప్రపంచ 249వ ర్యాంకర్ జస్టినా మికుల్‌స్కయిటీ (లిథువేనియా)పై జయభేరి మోగించింది. 48 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఏకంగా 'డబుల్ బేగల్' నమోదు చేయడం విశేషం. మ్యాచ్‌లో ప్రత్యర్థికి ఒక్క గేమ్ ఇవ్వకుండా సెట్‌ను 6-0తో గెలిస్తే టెన్నిస్ పరిభాషలో దానిని 'బేగల్'గా అభివర్ణిస్తారు. ఈ మ్యాచ్‌లో రష్మిక రెండు సెట్‌లలోనూ ప్రత్యర్థికి ఒక్క గేమ్ కూడా కోల్పోకపోవడం విశేషం. జస్టినా సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసిన రష్మిక తన సర్వీస్‌లో మూడుసార్లు గేమ్ పాయింట్లను కాపాడుకుంది. మరోవైపు డబుల్స్ సెమీఫైనల్లో రష్మిక-వైదేహి జోడీ 6-1, 7-6 (8/6)తో హైదరాబాద్‌కు చెందిన సహజ యామలపల్లి-జీల్ దేశాయ్ (భారత్) జంటపై గెలిచి ఫైనల్లోకి అడుగు పెట్టింది. 93 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ద్వయం మూడు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. నేడు జరిగే ఫైనల్లో నాలుగో సీడ్ యా సువాన్ లీ (చైనీస్ తైపీ)-షోయున్ పార్క్ (దక్షిణ కొరియా) జోడీతో రష్మిక-వైదేహి జంట తలపడుతుంది. సింగిల్స్ సెమీఫైనల్లో ఏడో సీడ్ పొలీనా లాచెంకో (రష్యా)తో రష్మిక ఆడుతుంది.

శరత్ కమల్ ఓటమి

సింగపూర్: సంచలన విజయాలతో సింగపూర్ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (టీటీ) టోర్నీలో అదరగొట్టిన భారత స్టార్ ఆచంట శరత్ కమల్ జోరుకు బ్రేక్ పడింది. క్వాలిఫయింగ్ ద్వారా మెయిన్ 'డ్రా'లో అడుగుపెట్టిన ప్రపంచ 88వ ర్యాంకర్ శరత్ కమల్ క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో శరత్ కమల్ 9-11, 2-11, 7-11, 11-9, 8-11తో ప్రపంచ 6వ ర్యాంకర్ ఫెలిక్స్ లెబ్రున్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయాడు. 32 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శరత్ మొత్తం 37 పాయింట్లు సాధించాడు. ఇందులో 24 పాయింట్లు తన సర్వీస్‌లో నెగ్గగా... తన సర్వీస్‌లో మరో 22 పాయింట్లు ప్రత్యర్థికి కోల్పోయాడు. క్వార్టర్ ఫైనల్లో ఓడిన శరత్ కమల్‌కు 14,000 డాలర్ల (రూ. 11 లక్షల 60 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 350 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.





సాత్విక్-చిరాగ్ జోడీకి షాక్

బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీకి చుక్కెదురైంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ సాత్విక్-చిరాగ్ ద్వయం 16-21, 15-21తో 2022 డబుల్స్ చాంపియన్ షోహిబుల్ ఫిక్రీ-మౌలానా బగస్ (ఇండోనేసియా) జంట చేతిలో ఓడింది. గతంలో ఫిక్రీ-మౌలానా ద్వయంపై నాలుగుసార్లు గెలిచిన సాత్విక్-చిరాగ్ ఈసారి ఒత్తిడికి లోనై అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నారు.

క్వార్టర్ ఫైనల్లో తరుణ్

వాటరింజెన్ (నెదర్లాండ్స్): డచ్ ఇంటర్నేషనల్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నెపల్లి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. క్వాలిఫయర్‌గా అడుగుపెట్టిన తరుణ్ సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 21-16, 23-21తో భారత్‌కే చెందిన శుభాంకర్ డేపై గెలుపొందాడు. తొలి రౌండ్‌లో తరుణ్ 18-21, 21-10, 23-21తో ఆరో సీడ్ మథియాస్ కిక్లిట్జ్ (జర్మనీ)పై సంచలన విజయం సాధించాడు.

వన్డే, టి20ల్లో 'స్టాప్ క్లాక్'

దుబాయ్: పురుషుల జట్లు బ్యాటింగ్‌లో ఎడాపెడా దంచేసినా, చుక్కలు చూపించినా పర్లేదు. కానీ బౌలింగ్ సమయంలో మాత్రం జాగ్రత్త పడాలి. ఓవర్‌కు ఓవర్‌కు మధ్య నిక్కచ్చిగా 60 సెకన్ల సమయాన్ని మాత్రమే తీసుకోవాలి. నింపాదిగా బౌలింగ్ చేస్తానంటే ఇకపై అస్సలు కుదరదు. దుబాయ్‌లో సమావేశమైన అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 'స్టాప్ క్లాక్' నిబంధనను ఈ ఏడాది జూన్‌లో వెస్టిండీస్-అమెరికాలలో జరిగే టి20 ప్రపంచకప్ నుంచి అమలు చేయాలని నిర్ణయించింది. దాంతోపాటు టి20 ప్రపంచకప్‌లో నాకౌట్ దశ మ్యాచ్‌లన్నింటికీ రిజర్వ్ డేలను ఖరారు చేసింది. రెండు ఓవర్ల మధ్య విరామ సమయాన్ని తగ్గించడమే 'స్టాప్ క్లాక్'. ఒక బౌలర్ ఓవర్ ముగించిన వెంటనే మరో బౌలర్ 60 సెకన్లలోపే బౌలింగ్ చేయాలి. బౌలింగ్ జట్టు 60 సెకన్లలోపే ఓవర్ వేయకపోతే అంపైర్లు మూడుసార్లు హెచ్చరికలతో సరిపెడతారు. ఆ తర్వాత పునరావృతమైతే పెనాల్టీ విధిస్తారు.

ఆ లావాదేవీల జాబితా ఇవ్వండి..

అనుమానాస్పద, అధిక మొత్తం లావాదేవీల వివరాలు ఎప్పటికప్పుడు అందజేయండి

- అక్టోబరు నుంచి రోజులో రూ.10 లక్షలు దాటిన..
- 30 రోజుల్లో రూ.50 లక్షలు మించి చేసిన లావాదేవీల వివరాలివ్వండి
- బ్యాంకర్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశం



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈసీ ముకేష్ కుమార్ మీనా

సాక్షి, అమరావతి: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బ్యాంకు ఖాతాల ద్వారా రాష్ట్రంలో అనుమానాస్పద, అధిక మొత్తంలో జరిగే లావాదేవీల వివరాలు ఎప్పటికప్పుడు ఆదాయపు పన్ను శాఖకు, ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (ఎస్ఈసీ) ముకేశ్‌కుమార్ మీనా బ్యాంకర్లను ఆదేశించారు. గత ఏడాది అక్టోబరు 1 నుండి రోజుకి రూ.10 లక్షలకు మించి.. గత 30 రోజుల కాలవ్యవధిలో రూ.50 లక్షలకు మించి లావాదేవీలు జరిగిన బ్యాంకు ఖాతాల వివరాలను సమర్పించాలని అన్ని బ్యాంకుల నోడల్ అధికారులను ఆయన కోరారు. ఎన్నికల వ్యయ పర్యవేక్షణ, ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈసీఎంసీ) అమలు అంశాలను సమీక్షించేందుకు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఎస్ఈసీ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల్లో పోటీచేసే ప్రతీ లోక్‌సభ అభ్యర్థి రూ.95 లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షల మేర వ్యయం చేసేందుకు అనుమతి ఉందన్నారు. అయితే, అంతకుమించి జరిగే వ్యయంపై పటిష్టమైన నిఘా ఉంటుందని, ఈ విషయంలో బ్యాంకర్లు కీలకపాత్ర పోషించి గుర్తించాలన్నారు. రాజకీయ పార్టీలు, వారి అభ్యర్థుల బ్యాంకు ఖాతాల నుండి జరిగే లావాదేవీల వివరాలను ఎప్పటికప్పుడు ఐటి శాఖతోపాటు ఎన్నికల సంఘానికి అందజేయాలని ఆయన చెప్పారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన తర్వాత అభ్యర్థులు, వారి సంబంధీకులు లేదా రాజకీయ పార్టీల బ్యాంకు అకౌంట్ల నుంచి రూ.లక్షకు మించి జరిపే లావాదేవీల వివరాలను కూడా అందజేయాలని ఎస్ఈసీ కోరారు.

ప్రలోభాలపై నిఘా..

ఇక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో అధిక మొత్తంలో నగదు, లిక్కరు, ఓటర్లను ప్రలోభపరిచే సామాగ్రి అక్రమ తరలింపుపై కూడా పూర్తిస్థాయిలో నిఘా ఉంటుందని ముకేశ్‌కుమార్ చెప్పారు. అలా తరలించే సమయంలో సీజ్ చేయబడిన వివరాలను రియల్ టైమ్ బేసిస్‌లో నివేదించేందుకు ఈసీఎంసీ విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం అమల్లోకి తెచ్చిందన్నారు. ఈ అంశానికి సంబంధించి ఐటి, జీఎస్టీ, పోలీస్, ఎక్సైజ్ తదితర 22 ఎన్‌ఫోర్సుమెంట్ ఏజెన్సీలు నిరంతరం పనిచేస్తున్నాయని, వీరు సీజ్‌చేసే నగదు, వస్తువుల వివరాలను ఈ యాప్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తామన్నారు. అన్ని బ్యాంకుల ప్రతినిధులు ఈ యాప్‌ను పటిష్టంగా వినియోగించుకునేందుకు వీలుగా అందులోకి లాగిన్ కావాలని ఆయన సూచించారు. మరోవైపు.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు బ్యాంకులు తరలించే సొమ్మును అకారణంగా జప్తు చేయకుండా ఉండేందుకు ఈఎస్ఎంఎస్ యాప్‌ను వినియోగించుకోవచ్చన్నారు. ఈ యాప్ ద్వారా నగదు తరలింపునకు బ్యాంకులు అనుమతులు, రశీదు పొందవచ్చని, క్యూఆర్ కోడ్ ద్వారా అధికారులు ధ్రువీకరణ చేసుకునే వీలుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ కన్వీనర్ రవీంద్రబాబు, అన్ని బ్యాంకుల ప్రతినిధులు మరియు డిప్యూటీ సీఈఓ కె. విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెయిడ్ ఆర్టికల్స్‌పై కన్ను..

ఆయా మాధ్యమాల్లో ప్రచురితం, ప్రసారమయ్యే పెయిడ్ ఆర్టికల్స్‌పై గట్టి నిఘా ఉంటుందని, ఈ విషయంలో వాటి ప్రతినిధులు అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనా కోరారు. ఎన్నికల సమయంలో ప్రసార మాధ్యమాలు అనుసరించాల్సిన విధి విధానాలపై కేంద్ర ఎన్నికల సంఘం జారీచేసిన తాజా మార్గదర్శకాలు, చట్టాలు.. సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాలకు అనుగుణంగా మీడియా యూనిట్లు ప్రవర్తించాలన్నారు. ఈ విషయమై మీనా అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన మీడియా వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించే విషయంలో మీడియా పాత్ర ఎంతో కీలకమన్నారు. అందుకు అన్ని మాధ్యమాల ప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు. అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసినప్పటి నుండి పెయిడ్ న్యూస్ అంశాన్ని జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉండే మీడియా సర్టిఫికేషన్, మీడియా మానిటరింగ్ (ఎంసీ అండ్ ఎంసీ) కమిటీలు ఎంతో అప్రమత్తంగా పర్యవేక్షిస్తుంటాయన్నారు. నిర్దేశించిన రేట్ కార్డు ప్రకారం పెయిడ్ న్యూస్‌ను గణించి, ఆ వ్యయాన్ని సంబంధిత అభ్యర్థి ఖాతాలో వేస్తామన్నారు. ఇక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు సంబంధించి కూడా అనుమతి పొందాల్సి ఉంటుందని, ఆ అర్డరు కాపీ నెంబరును ప్రకటనపై ముద్రించాల్సి ఉంటుందన్నారు.

వికేంద్రీకరణతోనే బహుజనులకు న్యాయం

1,265వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: పాలనా వికేంద్రీకరణ ద్వారానే బహుజనులకు న్యాయం జరుగుతుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. రాజధాని ప్రాంతంలో 54 వేల ఇళ్ల పట్టాలు, పేదలకు ఇంగ్లిష్ మీడియం విద్య, మూడు రాజధానుల సాధనే తమ లక్ష్యమని తేల్చి చెప్పారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,265వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. పేదలు రాష్ట్రంలో ఆర్థికంగా, సామాజికంగా ఎదగకుండా ఉండాలనే ఏకైక ఉద్దేశంతో బాబు చేస్తున్న కుటిల యత్నాలు తిప్పికొట్టి తమ సత్తా చాటుతామన్నారు. అభివృద్ధి , సంక్షేమాన్ని పేదవాడికి చేరువ చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 175 సీట్లలో గెలిపించి రుణం తీర్చుకుంటామని చెప్పారు. అమరావతి ముసుగులో కొనసాగుతున్న ఉద్యమం బాబును ముఖ్యమంత్రిగా చేసుకోవడం, ఆయన చేసిన రూ.లక్షల కోట్ల అవినీతిని కాపాడుకునేందుకేనన్నారు. మాదిగాని గురునాథం, పులిదాసు, ఈపూరి ఆదాం, కుమ్మరవల్లి కిశోర్ బాబు, బోదాల సలోమీ, బోదాల సౌమ్య, పల్లె బాబు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఏపీలో రహదారి భద్రత భేష్

సుప్రీంకోర్టు కమిటీ చైర్మన్ జస్టిస్ అభయ్ మనోహర్ సాప్రే

సాక్షి, అమరావతి: ఏపీలో రహదారి భద్రతకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న చర్యలపై రహదారి భద్రత కమిటీ చైర్మన్ జస్టిస్ అభయ్ మనోహర్ సాప్రే సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల అనంతరం రహదారి భద్రతా చర్యల పరిశీలనకు ఏపీలో పర్యటిస్తానని చెప్పారు. శుక్రవారం ఢిల్లీ నుంచి ఆయన సీఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి సహా సంబంధిత శాఖల అధికారులతో రహదారి భద్రత ఆడిట్ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జస్టిస్ సాప్రే మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా స్థాయిలో రహదారి భద్రత కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. సీఎస్ మాట్లాడుతూ..రాష్ట్రంలో రూ.50 కోట్లతో రహదారి భద్రతా నిధిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో పోలీస్, రవాణా తదితర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు పలు అపరాధ రుసుముల రూపంలో వసూలు చేసే మొత్తంలో 30% నిధులు ఈ రహదారి భద్రతా నిధికి జమయ్యేలా చూస్తామన్నారు. రహదారి భద్రతకు సంబంధించిన అన్ని అంశాలను పర్యవేక్షించేందుకు వీలుగా రాష్ట్ర రోడ్డు సేఫ్టీ లీడ్ ఏజెన్సీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రహదారి భద్రతకు సంబంధించి రాష్ట్ర రహదారి భద్రత పాలసీ–2024ని జారీ చేసినట్లు చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, రహదారులు–భవనాల శాఖ కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న తదితరులు మాట్లాడారు.

వేసవిలో 'ఉపాధి' కూలీలు ఇబ్బంది పడకూడదు

- పనిచేసే చోట తాగునీరు, నీడ సౌకర్యాలు
- గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కె. కన్నబాబు ఆదేశాలు

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం పనులకు హాజరయ్యే కూలీలు వేసవిలో ఎండల కారణంగా ఇబ్బంది పడకుండా పనులు జరిగే చోట ప్రభుత్వం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నది. పనులకు వెళ్లే ప్రతిచోటా సురక్షిత తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు పని మధ్యలో అవసరమైన మేర విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా నీడ సౌకర్యం ఏర్పాటు, ఇతర ప్రథమ చికిత్స సదుపాయాలు అందుబాటులో ఉంచాలంటూ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కె. కన్నబాబు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో అమలుకు అన్ని జిల్లాల కలెక్టర్లతో పాటు డ్వామా పీడీలు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

22న భారత్ జీఐ మహోత్సవ్

సాక్షి, అమరావతి: స్థానిక ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్ కల్పించే లక్ష్యంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న భారత్ జీఐ మహోత్సవ్‌కు విజయవాడ వేదిక కానుంది. స్థానిక ఉత్పత్తుల ప్రచారంలో భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఐడెంటిటీ) విలువను తెలియజేసేలా దేశవ్యాప్తంగా 10 జీఐ మహోత్సవాలను నిర్వహిస్తోంది. దీన్లో భాగంగా కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ, కేఎల్ యూనివర్సిటీ, ఏపీ చాంబర్స్ కలిసి మార్చి 22 నుంచి 24 వరకు కేఎల్ యూనివర్సిటీలో భారత్ జీఐ మహోత్సవ్ నిర్వహిస్తున్నట్లు ఏపీ చాంబర్స్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కరరావు తెలిపారు. శుక్రవారం ఏపీ చాంబర్స్ కార్యాలయంలో భారత్ జీఐ మహోత్సవ్ పోస్టర్‌ను విడుదల చేశారు.

ఐటీ పాలసీ కాలపరిమితి పొడిగింపు

సాక్షి, అమరావతి: ఏపీలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగాన్ని ప్రోత్సహించే విధంగా తీసుకువచ్చిన ఐటీ పాలసీ 2021–24 కాలపరిమితిని మరో 6 నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. ఐటీ పాలసీకి సంబంధించి గతంలో విడుదల చేసిన జీవో ఎంఎస్ నంబర్ 5,6లను సెప్టెంబర్ 20, 2024 లేదా కొత్త పాలసీ వచ్చే వరకు పొడిగిస్తూ రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అన్ని పోలింగ్ కేంద్రాలకు నెట్‌వర్క్ సౌకర్యాన్ని కల్పించండి

సర్వీస్ ప్రొవైడర్లకు అదనపు సీఈవో హరేంధిరప్రసాద్ ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాలకు నెట్‌వర్క్ సౌకర్యాన్ని కల్పించాలని టెలికాం సర్వీస్ ప్రొవైడర్లను అదనపు ప్రధాన ఎన్నికల అధికారి హరేంధిరప్రసాద్ ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టెలీకం సర్వీస్ ప్రొవైడర్లతో ఆయన శుక్రవారం సమావేశమై నెట్‌వర్క్ సౌకర్యాన్ని పెంచే అంశంపై సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా 46,165 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వాటిలో 50 శాతం పోలింగ్ స్టేషన్లల్లో జరిగే పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ చేయనున్నట్లు తెలిపారు. యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ నిధులను వినియోగిస్తూ షాడో ఏరియాలోని 689 పోలింగ్ స్టేషన్లకు టవర్ల సౌకర్యాన్ని కల్పించే పనులను వేగవంతం చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు బల్క్ ఎస్ఎంఎస్ ద్వారా చేయనున్న ప్రచారానికి ఎంసీఎంసీ నుండి ముందస్తు అనుమతిని తప్పనిసరిగా పొందాల్సి ఉందన్నారు. పోలింగ్ అనంతరం కౌంటింగ్ కేంద్రాల వద్ద కౌంటింగ్ కు ముందు రోజు, కౌంటింగ్ నిర్వహించే రోజు నిరంతరాయంగా నెట్‌వర్క్ సేవలు అందించాలన్నారు.

ప్రభుత్వ ఆదాయానికి
గండికొట్టే సంస్థలపైన చర్యలొద్దా?

- అందుకే గెజిటెడ్ అధికారులను అధీకృత అధికారులుగా నియమించాలని ఐజీ కోరారు
- ఇది కేవలం ప్రతిపాదన మాత్రమే.. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది
- దీనివల్ల నారా లోకేశ్‌కు వచ్చిన నష్టం ఏంటి?
- హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం
- తదుపరి విచారణ 19కి వాయిదా



సాక్షి, అమరావతి: పలు సంస్థలు, కంపెనీలు ప్రభుత్వ ఆదాయానికి భారీ స్థాయిలో గండి కొడుతున్నాయని, ఇలాంటి వాటి విషయంలో తగిన చర్యలు తీసుకునేందుకు చర్యలు చేపట్టామని, అందులో భాగంగానే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే వారిపై చర్యలు ఉంటాయంటే.. లోకేశ్‌కు వచ్చిన నష్టం ఏంటని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులు.. వేలూరి మహేశ్వరరెడ్డి, చింతల సుమన్ ప్రశ్నించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేసే గెజిటెడ్ అధికారులను అధీకృత అధికారులుగా నియమించాలని విజిలెన్స్ ఐజీ కొల్లి రఘురామిరెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖ వల్ల తాను విధంగా ప్రభావితమవుతున్నారో లోకేశ్ చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాపారవేత్తల పేరు చెప్పి లోకేశ్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌కు విచారణార్హత లేదని తెలిపారు. రఘురామిరెడ్డి లేఖ వల్ల ప్రభావితమయ్యే వ్యాపారవేత్తలు ఉంటే వారు కోర్టును ఆశ్రయించవచ్చన్నారు. రాజకీయ పార్టీ ఎలా పిటిషన్ దాఖలు చేస్తుందని ప్రశ్నించారు. రఘురామిరెడ్డి లేఖ కేవలం ప్రతిపాదన మాత్రమేనన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఎన్నికల సందర్భంగా తమపై కక్ష సాధించేందుకే కొల్లి రఘురామిరెడ్డి లేఖ రాశారని లోకేశ్ ఆరోపిస్తున్నారని తెలిపారు. వాస్తవానికి ఎన్నికల సమయంలో విధాన నిర్ణయాలు తీసుకోవడానికి వీల్లేదని గుర్తు చేశారు. ఈ విషయం తెలుసుకోకుండానే లోకేశ్ వాదనలు వినిపిస్తున్నారన్నారు. ప్రభుత్వ న్యాయవాదుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. ఆ లేఖ వల్ల లోకేశ్ ఏ విధంగా ప్రభావితమవుతున్నారని ప్రశ్నించింది. ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వ న్యాయవాదులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిధుల దుర్వినియోగం, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడం, నిధుల వృథా, ప్రభుత్వ సంపదకు, సహజ వనరులకు నష్టం కలిగించడం వంటి విషయాల్లో ఏ సంస్థల్లోకైనా వెళ్లేందుకు, సోదాలు చేసేందుకు, సమాచారం సేకరించేందుకు, రికార్డులను పరిశీలించేందుకు, జప్తు చేసేందుకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేసేలా గెజిటెడ్ అధికారులందరినీ అధీకృత అధికారులుగా నియమించాలని కోరుతూ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ హోదాలో కొల్లి రఘురామిరెడ్డి గత నెల 5న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసిన సంగతి తెలిసిందే.

పోలీసు యూనిఫామ్‌లో మార్పులు



క్యాంప్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఏపీ పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు

- చెల్లించాల్సిన బిల్లులన్నీ మార్చి 31లోగా ఖాతాల్లోకి..
- ప్రభుత్వ చర్యలపై పోలీసు అధికారుల సంఘం హర్షం
- సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు

సాక్షి, అమరావతి: పోలీసుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకోవడంతోపాటు బ్రిటీష్ కాలంలో ప్రవేశపెట్టిన ఏఆర్, ఏపీఎస్పీ పోలీస్ సిబ్బంది యూనిఫామ్‌లో సరికొత్త మార్పులు చేయడం ద్వారా తమ ఆత్మగౌరవాన్ని పెంచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. పోలీసు సిబ్బందికి చెల్లించాల్సిన ఎస్ఎల్ఆర్, ఏఎస్ఎల్ఎస్ బిల్లులను మార్చి 31వ తేదీలోపు వారి ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించడంతోపాటు పోలీసుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపింది. రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు అధికారుల సంఘం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లిన దీర్ఘకాలిక డిమాండ్లపై ఆయన సానుకూలంగా స్పందించారు. అసాంఘికశక్తుల చేతిలో అశువులుబాసిన పోలీసు అమరవీరుల కుటుంబాల్లోని పిల్లలకు ఇంజినీరింగ్, మెడిసిన్ సీట్లలో రెండు శాతం రిజర్వేషన్ కల్పించడం, విధి నిర్వహణలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే పోలీసులకు ఉచిత పాస్‌లు జారీ, నూతన జిల్లాల్లో పోలీసు ఆస్పత్రుల ఏర్పాటు, వైద్య అధికారుల నియామకం, పెండింగ్‌లో ఉన్న అలవెన్సుల మంజూరు, ఏపీఎస్పీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ల మంజూరు, పోలీసుల సమస్యల పరిష్కారానికి డీజీపీ, జిల్లా ఎస్పీ కార్యాలయాల్లో గ్రీవెన్స్ సెల్స్ ఏర్పాటు, మహిళా పోలీసు సిబ్బందికి అదనంగా 5 రోజుల క్యాజువల్ లీవులు మంజూరు, చైల్డ్ కేర్ లీవులు 180రోజులకు పెంపు, పోలీసు సిబ్బందికి ఎల్‌టీసీ సౌకర్యాన్ని పునరుద్ధరించడం మొదలైన డిమాండ్లపై సీఎం జగన్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్‌ను కలిసినవారిలో రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు రఘురామ్, కోశాధికారి సోమశేఖర్‌రెడ్డి, సభ్యులు సోమయ్య, పెద్దయ్య, అక్కిరాజు, నాగేశ్వరరావు, భవానీ, రామకృష్ణరాజు, కామరాజు తదితరులు ఉన్నారు.

కడప-హైదరాబాద్ విమాన చార్జీలు
మరో ఏడాది చౌక

- సీమ ప్రజలకు అద్భుత అవకాశం
- 'వీజీఎఫ్'కింద విమాన సర్వీసులు నడిపేందుకు 'ఇండిగో' అంగీకారం
- రాష్ట్ర పరిశ్రమల శాఖ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ ప్రజలకు మరో ఏడాదిపాటు చౌక విమానయానం అందుబాటులోకి తీసుకొచ్చింది. కడప, కర్నూలు విమానాశ్రయాల నుంచి చౌక విమాన సర్వీసులను నడిపేలా వయబులిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) పథకాన్ని మరో ఏడాదిపాటు పొడిగిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కడప నుంచి హైదరాబాద్‌కు, కర్నూలు నుంచి బెంగళూరు, చెన్నై, విశాఖలకు వీజీఎఫ్ కింద సర్వీసులను నడపడానికి ఇండిగో ఎయిర్‌లైన్స్ ముందుకు వచ్చింది. ప్రస్తుతం ఉన్న వీజీఎఫ్ పథకం స్కీం గడువు ముగియనుండటంతో దీన్ని మార్చి, 2025 వరకు పొడిగిస్తూ రాష్ట్ర మౌలిక వసతులు, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. కడప-హైదరాబాద్-కడప మార్గంలో సర్వీసు ప్రారంభించినప్పటి నుంచి ఏడాదిపాటు వీజీఎఫ్ పథకం అమల్లో ఉంటుందని, దీనికి రూ.12 కోట్లు వ్యయం కానున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కడప-హైదరాబాద్ సర్వీసుకు డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ సర్వీసును పునరుద్ధరిస్తూ చర్యలు తీసుకున్నట్లు ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఏడీసీఎల్) ఎండీ వీఎన్ భరత్ రెడ్డి తెలిపారు. అదే విధంగా వారానికి మూడు సర్వీసులు చొప్పున కర్నూలు–బెంగళూరు–కర్నూలు, కర్నూలు–చెన్నై–కర్నూలు, కర్నూలు–విశాఖ–కర్నూలు సర్వీసులను మరో ఏడాదిపాటు నిర్వహించడానికి ఇండిగో ఎయిర్‌లైన్స్ ముందుకు వచ్చిందన్నారు. కర్నూలు నుంచి మూడు నగరాలకు సర్వీసులు నడపటానికి వీజీఎఫ్ కింద రూ.33 కోట్లు చెల్లించడానికి ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

నెల్లూరును గ్రీన్‌సిటీగా అభివృద్ధి చేస్తా

- సీఎం వైఎస్ జగన్ సహకారంతో అగ్రస్థానంలో నిలుపుతా
- పుట్టినగడ్డకు సేవ చేసుకునే భాగ్యం కలిగింది
- భారీ మెజారిటీతో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయం
- నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త విజయసాయిరెడ్డి



నెల్లూరులో ఓటర్లకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి తదితరులు

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట): సీఎం వైఎస్ జగన్ సహకారంతో వచ్చే ఐదేళ్లలో నెల్లూరును అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలబెడతానని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త విజయసాయిరెడ్డి తెలిపారు. బెంగళూరు మాదిరిగా నెల్లూరును కూడా గ్రీన్ సిటీగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. నెల్లూరు 14వ డివిజన్‌లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ నెల్లూరును ఒక శాస్త్రీయ విధానంలో అభివృద్ధి చేస్తానన్నారు. నెల్లూరులో పుట్టి, పెరిగి, విద్యాభ్యాసం చేసిన తనకు ఈ గడ్డకు సేవ చేసుకునే భాగ్యం కలిగినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. ఈ అవకాశమిచ్చిన నగర ప్రజలకు, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. రాజ్యసభ సభ్యుడిగా పదేళ్ల రాష్ట్రాభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులకు కేంద్రం ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించేలా చేశానని చెప్పారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ కృషితో 14వ డివిజన్‌లో బ్రాహ్మణుల కర్మకృతుల భవనం పూర్తయిందన్నారు. అలాగే పద్మావతినగర్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణం పూర్తి కావస్తోందని తెలిపారు. నెల్లూరు నగరం, గ్రామీణం పరిధిలో అనేక పార్కులు అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని చెప్పారు. వ్యాపార వర్గాల్లో అభద్రతా భావం కలిగించే విధంగా ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని.. వాటిని విశ్వసించవద్దన్నారు. ఎంపీ అభ్యర్థిగా తనకు, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఖలీల్ అహ్మద్‌కు ప్రజలు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు.

బాబు పాలనంతా కరువు కాటకాలే..

14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నప్పుడు ప్రజలంతా కరువుకాటకాలతో, ఆకలితో అలమటించి పోయారని విజయసాయిరెడ్డి గుర్తు చేశారు. గతం కన్నా ఎక్కువ మెజారిటీతో వైఎస్సార్‌సీపీకి అధికారం కట్టబెట్టేందుకు, వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ విజయసాయిరెడ్డి రాకతో నెల్లూరు ప్రజల్లో, పార్టీ నేతలు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు
రెండు డీఏలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. వారికి రెండు డీఏలను మంజూరు చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది జనవరి 1 నుంచి ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇవ్వాల్సిన డీఏ 3.64 శాతం, అలాగే గతేడాది జూలై 1 నుంచి ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇవ్వాల్సిన మరో డీఏ 3.64 శాతం మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. గతేడాది జనవరి 1 నుంచి ఇవ్వాల్సిన డీఏను ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వేతనాలతో నగదు రూపంలో చెల్లించనున్నారు. అలాగే గతేడాది జూలై 1 నుంచి ఇవ్వాల్సిన డీఏను ఈ ఏడాది జూలై నుంచి వేతనాలతో నగదు రూపంలో చెల్లిస్తారు. డీఏ బకాయిలను సమాన వాయిదాల్లో జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్)కు జమ చేయనున్నారు. డీఏ పెంపు గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, జిల్లా గ్రంథాలయ సమితి, సవరించిన రెగ్యులర్ స్కేళ్లు పొందుతున్న వర్క్ చార్జ్‌డ్ ఉద్యోగులకు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో తెలిపారు. సవరించిన రెగ్యులర్ స్కేళ్లు పొందుతున్న ఎయిడెడ్ ఇన్‌స్టిట్యూషన్స్ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, ఎయిడెడ్ పాలిటెక్నిక్, యూనివర్సిటీ సిబ్బంది, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి డీఏ పెంపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీఎం జగన్‌కు ఉద్యోగ సంఘాల కృతజ్ఞతలు

చెప్పిన మాట మేరకు ఉద్యోగులకు రెండు డీఏలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య తరఫున చైర్మన్ కె.వెంకట్రామిరెడ్డి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పలు ఉద్యోగ సంఘాల నాయకులు సైతం సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం

- కేసుల ఎత్తివేత.. సమ్మెకాలానికి వేతనాలు వర్తింపు
- ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని రుజువు చేశారు. వేతనాల పెంపు తదితర డిమాండ్లపై ఆందోళన బాట పట్టిన ఉద్యోగులు, వర్కర్లు, హెల్పర్ల పట్ల సానుకూలంగా వ్యవహరించిన విషయం తెల్సిందే. వారి డిమాండ్లను సానుకూల దృక్పథంతో పరిష్కరించి ప్రభుత్వం తాజాగా వారి సమ్మె కాలానికి కూడా వేతనం వర్తింపజేయడంతోపాటు అప్పట్లో నమోదైన కేసులను ఎత్తివేస్తూ వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పలు డిమాండ్లపై మున్సిపల్ కార్మికులు విధులను బహిష్కరించి సమ్మె చేశారు. గతేడాది డిసెంబరు 26 నుంచి ఈ ఏడాది జనవరి 11 తేదీ వరకు నిర్వహించిన సమ్మె కాలంలో వారిపై పలు కేసులు నమోదయ్యాయి. కేసుల ఉపసంహరణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో.. రాష్ట్ర హోంశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

అంగన్‌వాడీలకు సమ్మె కాలానికి వేతనం

అంగన్‌వాడీలకు సమ్మె కాలానికి కూడా వేతనం వర్తింపజేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు గతేడాది డిసెంబర్ 12 నుంచి ఈ ఏడాది జనవరి 22 తేదీ వరకు వరకు 42 రోజులపాటు సమ్మె చేసిన విషయం తెల్సిందే. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల అన్ని డిమాండ్లను సానుకూల దృక్పథంతో ప్రభుత్వం పరిష్కరించడంతో వారు సమ్మె విరమించారు. సమ్మె కాలానికి కూడా వేతనం ఇవ్వాలన్న వారి విజ్ఞాపన మేరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ ప్రతిపాదనను పరిశీలించి సమ్మె కాలానికి వేతనం వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

మోడల్ స్కూళ్ల సిబ్బందికి ప్రభుత్వం శుభవార్త

- పాఠశాల విద్యాశాఖలోకి రెగ్యులర్ టీచింగ్ స్టాఫ్ విలీనం
- ఇకపై '010' పద్దు ద్వారా వేతనాలు చెల్లింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న రెగ్యులర్ టీచింగ్ సిబ్బంది కోరికను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చింది. వారిని పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసింది. ఈ మేరకు శుక్రవారం పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న రెగ్యులర్ టీచింగ్ స్టాఫ్‌కు '010' పద్దు ద్వారా ట్రెజరీ నుంచి వేతనాలు చెల్లించనున్నారు. 2009లో ఏర్పాటైన మోడల్ స్కూల్స్ సొసైటీ కింద 164 స్కూళ్లు పనిచేస్తున్నాయి. వీటిలో 3,260 మంది ప్రిన్సిపల్స్, పీజీటీ, టీజీటీలుగా సేవలు అందిస్తున్నారు. ఇన్నాళ్లూ వీరికి వివిధ పద్దుల కింద వేతనాలు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో తమకు కూడా విద్యాశాఖలోని ఉపాధ్యాయులతో సమానంగా ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని వారు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజా ఉత్తర్వుల ద్వారా వారి పదేళ్ల కోరికను నెరవేర్చింది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943